SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

పాంచకోరిదేవకవి

రహస్యవిప్లవము

కాకినాడ, 1923

Pāñcakoridēvakavi

Rahasyaviplavamu

Kākināḍa, 1923

Record no. 634

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

పాంచకోరిదేవకవి.

రహస్యవిప్లవము / పాంచకోరిదేవకవిచే రచియింపఁబడినది.- కాకినాడ : స్కేప్ అండ్ కో. ముద్రాక్షరశాల, 1923.

2, 2, 274 p., (1) leaf of plates : ill. ; 21 cm.

Record no. 634

Pāñcakoridēvakavi.

Rahasyaviplavamu / Pāñcakoridēvakavicē raciyimpam̐baḍinadi.- Kākināḍa : Skēp aṃḍ kō. Mudrākṣaraśāla, 1923.

2, 2, 274 p., (1) leaf of plates : ill. ; 21 cm.

Record no. 634

35 mm microfilm

Image placement: IA IIA IB IIB   Date filming began: 22 January, 2006

రాజపోషకులు.

మ. రా. రా. శ్రీ శ్రీరాజా వత్సవాయి వేంకట సుభద్రయ్యమ్మ
జగపతి బహద్దరు జమీందారిణీవారు, తుని.

పోషకులు.

3.12.44

మ. రా. రా. శ్రీ దివాన్ బహదూర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణ
మూర్తి నాయఁడుగారు, కాకినాడ.

,, ... వాడ్రేవు వేంకటరత్నముపంతులుగారు, పిఠాపురం.

,, ... ద్వారంపూడి రామారెడ్డిగారు, అనపర్తి.

,, ... ద్రోణంరాజు వేంకటరమణారావుపంతులుగారు.
మొఖాసాదారు, తణుకు.

,, ... సారంగు సోమసుందరరావుపంతులుగారు. బి. ఏ.
ప్లీడరు, నరసాపురము.

,, ... మల్లెల శివరామకృష్ణయ్యగారు, ప్రొప్రయిటరు.
రాయపూడి.

[illegible] నారాయణగారు, బి. [illegible] యల్. టి.
[illegible]లు.

పోషకులు.

మ. రా. రా. శ్రీ. పండ్రాజు వీర్రాజుగారు, కాకినాడ.
... కొవ్వూరి వేంకటరెడ్డిసోదరులు, పిట్టలవేమవరము.
... కర్రి పల్లారెడ్డిగారు, మారుటేరు.
... తేతల గంగిరెడ్డిసోదరులు, పెనుగొండ.
... అర్జి వెంటయ్యగారు, నరసాపురము.
... టి. యల్. నరసింహారావుగారు, మారుటేరు.
... రామదేవు ఆదినారాయణగారు, రంగూన్.
... చిర్ల అమ్మిరెడ్డిగారు, రంగూన్.
... సి. హెచ్. వి. సుబ్బారెడ్డిగారు. మారుటేరు.
... పులగం వెంకన్నగారు, మారుటేరు.

సహాయులు.

మ. రా. శ్రా. శ్రీ. శ్రీ ఉదయరాజు వేంకటరంగారావుపంతులుగారు
దేశముఖ, సర్దేశపాండ్యా మత్తేవాడ,
ఒరంగల్లు. (దక్కన్)
... నేరెళ్ళ నరసింహారాజుగారు. కలపవర్తకులు,
ఒరంగల్లు. (దక్కన్)
... యాదగిరీశ అండు కంపెనీవారు. పుస్తకముల
వర్తకులు, ఒరంగల్లు. (దక్కన్)
... గుండా పుల్లయ్యగారు. వర్తకులు,
ఒరంగల్లు. (దక్కన్)

స్వవిషయము

ఈరహస్యవిప్లవమువంటిదే యాంధ్రప్రచారిణీగ్రంథనిలయమున కీనడుమ నొకరహస్యవిప్లవము తటస్థించినది. మేమీవిషయమునుగూర్చి చూచాయగ నెన్నివిధములఁ బ్రకటించినను మాచందాదారు లింకను బొరపాటు పడి యుత్తరములను వ్రాయుచునేయున్నారు. అందువలన నింతవఱకును మూసియుంచిన ప్రధాన రహస్యమును దప్పక వెల్లడించుటకు మేము బాధ్యులము కావలసి వచ్చినది.

శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామిగా రీగ్రంథనిలయమును గొంతకాలము పెట్టుబడిపెట్టి నడపించినారు. ప్రతిమాసమును నూఱురూపాయలు మాకిచ్చినట్లు వారు ప్రకటించినసొమ్ముకూడ నీపెట్టుబడిసొమ్ములోనిదే. తుదకు వారు నూటికి రు 1—0—0 చొ॥ వడ్డితోఁగూడఁ దమపెట్టుబడిసొమ్ము మావల్ల రొక్కముగాఁ బుచ్చుకొన్నతరువాత మమ్మును మాగ్రంథనిలయమును, నప్పటినుండి తొలఁగించినట్లు ప్రకటించినను గొంతకాల మీగ్రంథనిలయము నుద్ధరించినయలవాటునుబట్టి భాషాపోషణాభిమానము వదలక తాము స్వయముగ మఱియొకగ్రంథమండలిని నెలకొలిపి పరిచయమునుబట్టియో, ప్రాగల్భ్యమునుబట్టియో యనుమతి లేకుండ మానవలాప్రకటనమును గొలఁదిమార్పులతోఁ దాముప్రకటించుకొనుటయే కాక మాచందాదారులకుఁ గూడఁ దమపుస్తకములను వి. పి. గాఁ బంపుట కారంభించిరి. ఇదియే మాచందాదారులను భ్రమపెట్టుచున్న పరమరహస్యము.

1. మాపేరు వారికెట్లు తెలిసినదని కొందఱును, 2 వారిపుస్తకమే మీపుస్తక మని పొరపాటునఁ బుచ్చుకొంటి మని కొందఱును 3 దానికిది శాఖయా, దీని కది శాఖయా యని కొందఱును. 4 నడుమఁ గొంతకాలము మానివైచినను నెప్పటివలెనే వారిగ్రంథనిలయమును వారు కొనసాగించుచున్నారు! మీది కొత్తగ్రంథనిలయము

కాఁబోలు నని కొందఱును నీవిధముగా మాచందాదారులలోఁ జాల మంది వ్రాయుచున్నారు.

వారు మానవలాప్రకటనమునే (నోటీసు) యించుక మార్పుతోఁ బ్రకటించుటచేతను, అందుఁగూడ "అధ్యక్షుఁడు" అని ప్రకటించుటచేతను, మాచందాదారులకుఁగూడఁ దమగ్రంథములు వి. పి. లు పంపుటచేతను వారు కొంతకాలము మాగ్రంథనిలయము నుద్ధరించి మాచందాదారులపరిచయము కలిగించుకొనుటచేతను మాచందాదారుల కిట్టిపొరపాటు కలుగుటకుఁ గారణ మైనది. కావున నిప్పటికైన మాచందాదారు లీరహస్యమును గ్రహించి వారికిమాకు నెట్టిసంబంధమును లేదనియు, మాగ్రంథములు కాకినాడ నుండియే వచ్చుచుండు ననియు గ్రహింపవలయు నని కోరుచున్నాము. మఱియు వారు తమనామమును మారాజపోషకులపట్టికనుండి తొలఁగింపవలయు నని ది 29-7-23 తేదిని మాకు జాబు వ్రాసి యున్నారు. వారికోరిక ననుసరించి మేమట్లు తొలఁగింపవలసివచ్చి నందులకుఁ జింతిల్లుచున్నాము.

భాషావిషయమున ననేకవిధములఁ గొఱఁతవడియున్న మనఆంధ్రదేశమునం దెన్నియో గ్రంథప్రకటనాలయములు బయలుదేరవలసి యున్నది. ఎంతమందియో యుదారహృదయములతో భాషాసేవచేయవలసి యున్నది. విజ్ఞానచంద్రికాగ్రంథమండలి, ఆంధ్రభాషాభివర్ధనీసంఘము మొదలగునుత్కృష్టగ్రంథప్రకటనాలయములకుఁ దోడఁబుట్టువై, పదుమూఁడేండ్లనుండి కష్టనష్టములకోర్చి భాషాసేవ చేయుచున్నయీయాంధ్రప్రచారిణీగ్రంథనిలయ మాంధ్రలోకమునకుఁ గ్రొత్తది కాదు. ఇది యాంధ్రులయభిమానముమీఁదనే నిలువఁబడి యున్నది. ఆంధ్రప్రభువులపోషణమువలననే యలరారుచున్నది. దేశభాషాభిమాను లగుమాచందాదారులయాదరమున్నచో నవాంతరాయము లేవియు దీనిని జలింపఁజేయఁజాలవు. ఆంధ్రభాషాభిమాను లగు మాచందాదారు లెల్లరు నితోధికాదరాభిమానములతో నీగ్రంథనిలయమును వెలయింపఁజేయుదు రని నమ్ముచున్నాము.

పీఠిక

ఈరహస్యవిప్లవము వంగభాషయం దపరాధపరిశోధకాఖ్యాయికారచనమున సుప్రసిద్ధుఁ డగుపాంచకొరిదేవకవిచే రచియింపఁబడినది. దీనిని మేమాంధ్రీకరించితిమి.

ఇది కేవలమును రహస్యాపరాధపరిశోధకమగునవలయే గాక వివిధప్రకృతులస్వరూపస్వభావములను, నాచారవ్యవహారములను, నాహారవిహారములను యథారూపమున ననువదించుటచే సంఘసంబంధమగునవల యనికూడఁ జెప్పవచ్చును. ఇది పారసీసంఘసంబంధమగునవల. సాధారణముగా సామాజికనియమములలో నుత్తమములుగాఁ బరిగణింపఁబడునియమములే కొన్ని దురాచారములకుఁగూడ నెడమిచ్చుచున్నవి. లోకమునందలి యన్నిసంఘములయందును నేవియో కొన్ని యిట్టిలోపములు గానవచ్చుచునే యున్నవి. సంఘనియమము మానవబుద్ధికల్పితమైనది. కావుననే వివిధప్రకృతులతోఁ గూడినసంఘములయందిట్టిలోపములు కలుగుట తటస్థించుచున్నది.

దుర్దమనీయం బగునవయౌవనవిలాసలాలసత్వమున స్థూలదృష్టిచేఁ గావింపఁబడినస్వల్పాపచారములుగూడ దోషైకదృష్టు లగుదుష్టులదుష్ప్రయత్నములచే దుర్విపాకములం గాంచి దురంతోపద్రవంబులకుఁ గారణంబు లగు ననియుఁ, గొలదియో గొప్పయో యెఱిఁగియో యెఱుఁగకయో చేసినపాపమునకు ఫల మెప్పటికైనఁ దప్పక యనుభవించి తీరవలయు ననియుఁ, బాపపు ధనలోభముచేఁ బరితపించుచుండుకౄరచిత్తులు పరమసాధువులను వంచించుచు నెంతలేసిదారుణకృత్యములనైనఁ జేయుటకు వెనుదీయ రనియు, నత్యాచారు లగునృశంసుల యపరాధచేష్టితములచే నొకానొకప్పుడ

కారణముగ లోకమునందు సాధువులు బాధింపఁబడుచుందు రనియు, నెంతటినిగూఢముగ నొనరించినను నంతమునకుఁ బాపము బ్రద్దలు కాక మానదనియు నిరూపించుటయే యీనవలయందలి పరమార్థము.


ఇందుఁ దెర తెరలుగ నల్లమబ్బులవలె నెల్లయెడల నల్లుకొనియున్న రహస్యములను భేదించుటకుఁ గవి కీర్తికరుఁడై తనయసాధారణ ప్రతిభను బ్రకటించి యతినిపుణముగఁ బ్రయత్నించి గూఢతంత్రముల నున్మూలించి యున్నాఁడు. ప్రమాదజనితం బగుపాపంబునకుఁ బశ్చాత్తాపమే నిష్కృతిగఁ జేసి భాగ్యవంత మగు నొకగొప్పకుటుంబమును బరిభవకళంకమునకుఁ బాలుగాకుండఁ జేయుటలో నౌచిత్యమును బాటించి కవి యిందుఁ దనయసాధారణప్రజ్ఞను వెల్లడించి యున్నాఁడు. ఇందలియుపక్రమోపసంహారములు కవిప్రతిభను వేయినోళ్ళఁ జాటుచున్నవి. శ్రీపాంచకౌరీదేవు వ్రాసినడిటెక్టివునవలలలో నిది యగ్రస్థానము నలంకరించుటకుఁ దగినదని మాయాశయము.

ఒరంగల్లులో సుప్రసిద్ధ వర్తకులును, శ్రీమంతులును, నుదారహృదయులును, దేశభాషాభిమానులు నగు శ్రీ ఆకారపు వేంకన్నగారును, శ్రీ ఆకారపు చన్నయ్యగారును మాయుద్యమము నాదరించి నిలయమున రాజపోషకులుగఁ జేరి మాకుఁ బ్రోత్సాహముం గూర్చినందులకీ సోదరులకు మాకృతజ్ఞతాభి వందనములందించుచుఁ బరమేశ్వరుఁడు వీరికిఁ జిరాయురారోగ్యభాగ్యసంపదలఁ గూర్చుగావుత మని యాశీర్వదించుచున్నారము. ఇందు నూతనముగ సహాయులుగఁ జేరినయుదారులకు మాకృతజ్ఞతను దెలుపుచున్నారము—

వేంకటపార్వతీశ్వరకవులు.

N. B. ఈనవలను మేము ప్రకటించుచున్న సంగతి యెఱిఁగి యుండియు, మావలన వినియుండియు శ్రీలక్ష్మణస్వామిగారు తాము గూడ దీనిని బ్రకటించునట్లు పత్రికలో వెల్లడించి యున్నారు. కారణము—చింత్యము.

రహస్యవిప్లవము.



“అయ్యో! నా బిడ్డ చచ్చిపోవుచున్నది.”

(పుట. 270.)

శ్రీరామచంద్రాయనమః

రహస్యవిప్లవము

ప్రథమఖండము—హత్య, చౌర్యము.

మొదటి ప్రకరణము.

గృహత్యాగము.

హారమసజీ బొంబాయినగరమునఁ బ్రధానధనవంతుఁడు. ఎల్ఫిన్‌స్టోన్ సర్కిలులో నాతనిభవనమున్నది. ఆమేడమూడవయంతస్తుపై నాతఁడు సపరివారముగ నివసించి యుండెను. క్రిందియంతస్తులలో నాతనివ్యవహారములుజరుపునుద్యోగులు పనిచేయుచుందురు. హారమసజీ యనేకవిధములగు వ్యాపారములను గావించుచుండును. వడ్డీల కప్పు లిచ్చుచుండును. తాకట్లు, హుండీలు మొదలగువ్యాపారములు విశేషముగఁ జేయుచుండును.

ఆతనిజన్మస్థానము సూరాటనగరము. ఆతఁడు భాగ్యవంతుల కుటుంబములోనివాఁడు కాఁడు. ఆతనికిఁ జిన్నతనమునందే తల్లిదండ్రులు మరణించిరి. ఇప్పు డాతనిభాగ్య మంతయును స్వార్జితమే. ఆతఁడు మొదట వట్టిచేతులతో బొంబాయికి వచ్చెను, స్వప్రయత్నముచేఁ బాటుపడి యిప్పటికాతఁడు పార్సీసంఘమునం దధికధనవంతుఁడుగాఁ బరిగణింపఁబడుచుండెను.

ఆతఁడు ధనము సంపాదించునంతవఱకును బెండ్లియాడ నని నిశ్చయించుకొనియెను. అందుచే నాతనికిఁ బిన్నతనమునఁ బెండ్లి కాలేదు; నలువదిమూడవయేఁట నాతఁడు రాజాబాయిని బెండ్లియాడెను. పెండ్లినాఁటికి రాజాబాయివయసిరువదియేండ్లు. పెండ్లియైనరెండేండ్లకామె కొకకుమార్తె కలిగెను. ఆకుమార్తె పేరు కమలాబాయి. ఆబాలిక యిప్పుడు పదియాఱేండ్ల యౌవనవతియైయుండెను. పార్సీరమణీమణులలోఁ గమలాబాయివంటి సుందరీమణు లెందఱో లేరు. కమలాబాయి రూపవతి యగుటయేకాక విద్యావతియు, గుణవతియు నైయుండెను. ఆమెరూపగుణంబుల కెల్లరును ముగ్ధు లగుచుండిరి.

హారమసజీకి మఱియెట్టిసంతానమును లేదు. కాని యాతనిపరివారమునం దొకయువకుఁ డాతనియింట నివసించి యుండెను. ఆతనిపేరు రస్తమజీ. ఆతఁడు మిత్రపుత్రుఁడగుటచే హారమసజీ యా నాత్మపుత్రునిం బోలి ప్రేమించుచుండెను; మఱియు నాతనియెడల మిగుల నమ్మకము కలిగియుండెను. అందుచేతనే రస్తమజీ కిరువదియేండ్లవయసు వచ్చియు రాకుండఁగనే యాతనికిఁ దనకోశాధికారపదవి నొసంగెను. అయిదేండ్లనుండి రస్తమజీ, హార్మసజీబ్యాంకిపనులను జక్కఁగ నిర్వహించుచుండెను. ఆయింటఁ గమలాబాయియు, రస్తమజీయును నొక్కరీతినే పెంపఁబడుచుండి రనుట యత్యుక్తి కాదు. ఆయుభయులును బరస్పరప్రేమ గలవారై యుండిరి.

పెండ్లియైనయీపదునెనిమిదేండ్ల నుండియు హారమసజీ సపరివారముగ నతిసౌఖ్యముతోఁ గాలక్షేపముచేయుచుండెను. ఆతనిధనమానకీర్తులు దినదినప్రవర్ధమానము లగుచుండెను. శోకము, చింత, విషణ్ణత మొదలగువానిఛాయయైనను నాతనిపైఁ బ్రసరించుట లేదు.

ఎల్లకాలము నెవ్వరికి నొక్కరీతిగా జరుగదు. సంవత్సరము క్రిందట నెవ్వఁడో యొకఁడు వచ్చి రాజాబాయిని రహస్యముగ సందర్శించెను. హారమసజీ యాతని నెఱుంగఁడు. రాజాబాయి కొకసోదరి కలదనియు, నామెయు నామెభర్తయు రంగమున మృతినొందిరనియు, వారికొకకుమారుఁ డుండెననియు, నాతఁడు తనపినతండ్రితోఁ గలసి

పినతల్లి యగుతన్నుఁ జూడవచ్చెననియు రాజాబాయి హార్మసజీకిఁ జెప్పెను.

మఱునాఁ డాయిరువురును హారమసజీని దర్శించిరి. అందొకఁడు సుందరుఁ డగుయౌవనుఁడు. ఆతనిపేరు మాంచరజీ—ఆతఁడే రాజాబాయి చెల్లెలికొడుకు. రెండవవాఁడు నలువదియేండ్లవాఁడు. ఆతనిపేరు బర్జరజీ. ఆతఁడు కురూపి కాఁడు గాని యాతనిం గాంచినచో నాకస్మికముగ నెవ్వరికిని సన్మానింపవలయు ననుబుద్ధి కలుగదు. మాటలచే నితరులను వశపఱచుకొనుటలో నాతఁడు మిగుల నేర్పఱి. ఒకనాఁటి సంభాషణములోనే హారమసజీ యాతనికి వశుఁడై పోయెను. హారమసజీ యాయిరువురను దనయింట నుండవలయు నని బలవంతపెట్టెను గాని యందులకు వారంగీకరింపలేదు; అప్పుడప్పుడు వచ్చి దర్శనము చేయుచుందు మని యంగీకరించిరి. తరువాత నొకమాసములోపలనే బర్జరజీ యొకలక్షరూపాయలను హారమసజీబ్యాంకిలోఁ దాఁచుకొనియెను. అందువలన హారమసజీ కాతనియెడల విశ్వాసము బలపడియెను.

వీరిరాకవలన సంతుష్టినొందనివా రిరువురుమాత్రమే—కమలాబాయియు, రస్తమజీయును—కాని యాయిరువురునుగూడ వ్యతిరేకముగ నేమియును జెప్పఁజాలకుండిరి.

మఱి రెండుమాసములకుఁ దరువాత హారమసజీ రహస్యముగ రస్తమజీని బిలిచి "కమలాబాయి తరుణియైయున్నది. ఇఁక నీవెప్పటివలె మాయింటనే యుండుట మంచిది కాదు. అప్పుడే యనేకు లనేకవిధములుగా ననుకొనుచున్నారు, ఆమెపేరున కెట్టికళంకము కలిగినను నీవు నిశ్చయముగ విచారించెదవు" అనియెను.

రస్త—అవును. నేనిప్పుడే మఱియొకచో నివసించి యుండుటకుఁ బ్రయత్నించెదను.

హర—నేను నీకింతటినుండి నెలకు నూఱురూపాయలవేతనము నిచ్చెదను. మఱియొకచో నున్నచో నీకు వ్యయముకూడ వృద్ధియగును గాదా?

రస్త—మీరుండఁగా నాకు లోపమేమి యుండును?

ఆనాఁడే మఱియొక యిల్లు చూచుకొని రస్తమజీ యందుఁ బ్రవేశించెను. కాని యప్పుడు కమలాబాయిని సందర్శించి యామెతో మాటలాడుట కాతని కవకాశము కలుగలేదు. ఆనాఁడామె మఱియొకచోటికిఁ బంపఁబడియెను. రస్తమజీ యిల్లుమార్చిన కొలఁదిదినములలోనే పేస్టనజీ యనునొకధనాఢ్యయువకుఁడు బొంబాయినగరమునఁ బ్రవేశించెను. అతఁడు కమలాబాయిని బెండ్లియాడఁ గోరియున్నట్లు రస్తమజీకిఁ దెలియవచ్చెను.

పేస్టనజీ, బర్జరజీ, మాంచరజీ యనునీమువ్వురితోడను రస్తమజీకిఁ బరిచయమును స్నేహమునుగూడఁ గలిగెను. తనకెంతకష్టముగనున్నను రస్తమజీ వారెవ్వరిని ద్వేషింపకుండెను. అతఁడు తనవిచారమును మనసులోనే యడంచుకొని యుండెను.

రెండవప్రకరణము.

ఊహ్యానము.

ఇంచుమించుగ మూఁడు నెలలు గడచెను. ఈలోపల రస్తమజీ నడవడి కించుకపరివర్తనము కలిగెను. అతఁడు మునుపటిరస్తమజీ కాఁడు. కమలాబాయిని బోఁగొట్టుకొన్నవిచారమును మఱచిపోవుటకై యాతఁడు మద్యపాయియైపోయెను. పేస్టనజీయును, మాంచరజీయును, గమలాబాయిని బ్రేమించి యామెను బడయుటకై వ్యాకులపడుచున్నట్లు రస్తమజీ యెఱింగియుండెను. అయినను వారు తనతో

మైత్రిచేసి విలాసవిహారములఁ గావించుచుండిరి. అయినను రస్తమజీ వారిని దనమనంబున నిరసించుచు నీర్ష్యానలముచేఁ దనలోఁ దానే దగ్ధుఁడైపోవుచుండెను.

పేస్టనజీ మాంచరజీలుకూడ రస్తమజీని మనసులో ద్వేషించుచునేయుండిరి. మువ్వురు నుష్ణరక్తము గలనవయౌవనులు; వీరినడుమ లోకానుభవముగల బర్జరజీ లేకయున్నచో వీరిపరస్పరవిద్వేష మిదివఱకే వెల్లడియై యేదియోయొకహత్య జరగియేయుండును.

రస్తమజీకి మఱియును గోపకారణ మేమనిన—వారు ప్రతిదినమును గమలాబాయిని దర్శించి యామెతో విలాససంభాషణములఁ గావించుచుండుట—ఈవిధముగా నొకయేఁడు గడచిపోయెను. రస్తమజీ యొక్కసారియైనను గమలాబాయిని జూడఁజాలకపోయెను. ఇంతేకాక హరమసజీ "నీవు నాతనయ నిఁక నెన్నఁడును దర్శింపవలదు" అనికూడ నిషేధించియుండెను. ఒక్కసారిమాత్రమెట్లయినఁ గమలాబాయిని జూడవలయు నని రస్తమజీ మిగుల వ్యాకులపడుచుండెను. కాని యిన్నాళ్లు గడచినను నాతని కోరిక తీరుట కవకాశము కలుగలేదు. అందుచే నాతఁడు రేయుంబవలు దుస్సహయాతన ననుభవించుచుండెను. దుర్దమనీయంబులగునాశలును, వ్యాకులత్వమును నాతని హృదయమున వర్ధిల్లుచుండెను.

అట్లుండియు నాతఁడు తనహృదయజ్వాల నెవ్వరికిని బ్రకటించుట లేదు. కేవలమును బ్రాణమిత్రుఁడగు ప్రేమజీకిమాత్రము తనకష్టము నప్పుడప్పుడు చెప్పుకొనుచు నించుకయూరట నందుచుండెను. ప్రేమజీరస్తమజీలు సమవయస్కులు; ప్రాణమిత్రులు. ప్రేమజీ రస్తమజీ వలెనే హరమసజీబ్యాంకిలో "అక్కౌంటెంటు" గానుండెను. ప్రేమజీరస్తమజీ లొక్కరీతియుడుపులనే ధరించి యొక్కవిధమగుపాదరక్షలనే తొడిగి యొక్కటేపద్ధతిగలవారై పరస్పరానురాగముతో విలాసవిహారములఁ గావించుచుండిరి.

ఒకనాఁటిరాత్రి పదిగంటలవేళ రస్తమజీ వీథులవెంటఁదిరుగుచు ఎలిఫెన్‌స్టనుసర్కిలునొద్దకు వచ్చి యన్యమనస్కుఁడై యచ్చటిసుందరోద్యానమునఁ బ్రవేశించెను. అచ్చటిస్వేచ్ఛాపరిచారవాయువు లాతనిహృదయతాపమున కించుక శాంతిని గల్పించుచుండెను. ఆతఁడాయుద్యానమార్గమునఁ బోవుచు నెదుట నొకబల్లపైఁ గూర్చుండియున్న కరలగ్నకపోలయుఁ, జింతానిమగ్నయు, నేకాకినియు నగునొకసుందరీమణిని గనుంగొనియెను. ఆమె సమీపమునకుఁ బోయి రస్తమజీ స్తంభితుఁడై నిలువఁబడిపోయెను. ఆమెయే కమలాబాయి. ఆరమణీమణి యాతనిం గాంచి యులికిపడి సంభ్రమముతో లేచి నిలువఁబడియెను.

రస్త——కమలా! ఇన్నాళ్లకు నీదర్శనము లభించినది!——

కమలాబాయి యాతనిమాట కడ్డము వచ్చి "నీవు నన్ను నా తండ్రియానతి నుల్లంఘింపుమనియెదవా? ఆతఁడు నిన్నుఁ జూడవలదని నాకాజ్ఞాపించి యున్నాఁడు." అనియెను.

రస్త——కమలా! ఎన్నఁడును నీవు నీతండ్రిమాట జవదాఁటవలదు. ఇప్పుడెట్లో నీదర్శనము దొరకినది. కావున నేనొకటిరెండుమాటలు చెప్పెదను వినుము.

కమల మారుమాట చెప్పక తలవంచుకొని నిలువఁబడిపోయెను.

రస్త——నీవు పేస్తనజీని బెండ్లియాడెదవా?

కమ——నా కిష్టము లేదు.

రస్త——మాంచరజీనో?

కమ——ఊహూఁ——

రస్త——మఱియెప్పుడైన నాకు నీదర్శన మొసంగెదవా?

కమ——నన్ను మఱచిపొమ్ము.

అని చెప్పి యామె వెడలిపోవుటకుద్యమించెను.

రస్త——నానిమిత్తమై నీవు పోవుటయేల? నేనే పోయెదను.

అని రస్తమజీ యతివేగముగఁ దక్షణమే యాయుద్యానము నుండి యవ్వలికిఁ బోయెను. కమలాబాయి కంటికగపడుచున్నంతవఱ కాతని వంకనే చూచుచుండెను.

రస్తమజీ యుద్యానమును విడిచివీథిలోఁ బ్రవేశించునప్పటి కొకపిల్లవాఁడు వచ్చి యాతని కొకయుత్తరము నిచ్చెను. రస్తమజీ యాయుత్తరమును వీథిదీపస్తంభముకడకుఁ బోయి చదువుకొని యొకటిరెండడుగులు ముందఱికిఁ బోవునప్పటికి బర్జరజీ యాతని కగపడియెను. ఆయిరువురు నొకటిరెండు మాటలాడుకొని యెవరిత్రోవను వారు పోయిరి. ఇది యంతయును గమలాబాయి చూచుచునే యుండెను. రస్తమజీ యతివేగముగ నడచి పోవుచుండెను. అప్పుడు మాంచరజీ రహస్యముగ నాతని వెంబడించుచుండెను.

వారట్లు చాలదూరముపోవుటచేఁ గమలాబాయి దృష్టుల కంతర్హితులై పోయిరి.

మూడవప్రకరణము.

అద్భుతచౌర్యము.

మఱునాఁటియుదయము పదిగంటలవేళ బర్జరజీ హారమసజీ బ్యాంకికి వచ్చెను. అప్పటికి రస్తమజీగాని, హారమసజీగాని రాలేదు. ప్రేమజీయును, నితరోద్యోగులునుమాత్రము వచ్చియుండిరి. అప్పుడు బర్జరజీ ప్రేమజీని జూచి "ఏమిది! ఇంకను నెవ్వరును రాలేదు. నాకు నేఁటిపదిగంటలకు లక్షరూపాయలును గావలెనని నిన్ననే చెప్పి యున్నాను. ఇంకను హారమసజీగాని రస్తమజీగాని రాలేదు: చాలఁ జిక్కువచ్చునట్లున్నది!" అనియెను.

ప్రేమ——రస్తమజీ యిప్పుడే వచ్చును. మీకు రూపాయల నీ

యవలయునని యాతఁడు బ్యాంకినుండి సొమ్మునీసి యినుపపెట్టెలో నుంచిపోయినాఁడు. అతఁడు త్వరలోనే వచ్చును.

బర్జ—నేను నావనులన్నియు మానుకొని యిక్కడ నెంతసే పుండను? సొమ్ము మీయొద్ద నుండి యావశ్యకమైనప్పుడు వికారివలె నుండవలయునా? హారమసజీ యెక్కడనున్నాఁడు?

ప్రేమ—ఆయన యింటిలోనే యుండవచ్చును.

అని చెప్పి ప్రేమజీ లోనికిఁ బోయి యైదునిమిషములలో మరలి వచ్చి "అయ్యా! ఆయన గృహంబున లేరు. ఏదియో పనిమీఁద వెలుపలికిఁ బోయినారు" అనెను.

బర్జ—ఎంతమాట! ఇంతచిత్రమైన బ్యాంకి నేనెచ్చటను జూడలేదు.

ప్రేమ— రస్తమజీ యిప్పుడే వచ్చును. అతఁ డాలస్యము చేయఁడు.

బర్జ—సరే! ఏమైనను నేనొకగంటలోఁ దిరిగి యిచ్చటికి వచ్చెదను. నాసొమ్ము సిద్ధముచేసి యుంచవలెను.

ప్రేమ—మంచిది.

బర్జరజీ కోపముతో వెడలిపోయెను. ప్రేమజీ తనపని చూచుకొనుచుండెను. రస్తమజీ యెప్పుడును సరిగఁ బదిగంటలకే కచేరికి వచ్చుచుండును. నేఁడు పదిగంటలనఁగ యైనను నాతఁడు రాలేదు. ప్రాణమిత్రుఁ డగు ప్రేమజీ యాతనికొఱకు కెదురుచూచుచుండెను. పదునొకండుగంటల కెట్లో రస్తమజీ కచేరికి వచ్చెను. అతనిం జూడఁగా రాత్రియంతయు నిద్రలేనివాఁడుగా నగపడుచుండెను. తోడనే ప్రేమజీ యాతనిం గాంచి "బర్జరజీ సొమ్ముకొఱకు సరిగఁ బదిగంటలకు వచ్చియున్నాఁడు. నీవు రాకపోవుటచే విసిగికొనుచు వెడలిపోయినాఁడు" అని చెప్పెను.

రస్త—నేఁడు కొంచె మాలస్యమైనది. నిన్ననే యాతని సొమ్ము సిద్ధముచేసి యుంచితిని.

ప్రేమ—నేనీసంగతి యాతనితోఁ జెప్పియున్నాను.

రస్త—మరల నాతఁ డెప్పుడు వచ్చును?

ప్రేమ—[illegible]

రస్త—అట్లయినచో నేను ముందుగనే యాతనిసొమ్ము తీసి లెక్కపెట్టి యుంచెదను. పదునొకండు గంటలు కావచ్చుచున్నది. ఇఁక నాతని కాలస్య ముండదు.

అని చెప్పి రస్తమజీ కోశాగారమునఁ బ్రవేశించెను. అందలి యినుపపెట్టె యాతనికిని హారమసజీకిని దక్క నితరుల కెవ్వరికినిఁ దెఱచుటకు సాధ్యము కాదు. దానితాళములలో నొకటి యాతనియొద్దను రెండవది హారమసజీయొద్దను నుండును. తాళములు చేతికిచ్చినను నితరులెవ్వరు నాపెట్టెను దీయఁజాలరు. ఆతాళము లంత నేర్పుతోడను జేయఁబడినవి. ఆచిక్కులా యుభయులకు మాత్రమే తెలియును.

రస్తమజీ చటాలున లోపలినుండి యీవలకు వచ్చి "కొంప మునిఁగినది!" అని స్తంభితుఁడై పోయెను. ఉద్యోగులందఱు నొక్కపెట్టున లేచి విస్మితులైపోయిరి.

ప్రేమజీ తత్తరముతో "ఏమైనది?" అని ప్రశ్నించెను.

రస్త—సర్వనాశనమైనది. సొమ్మంతయును దొంగిలింపఁబడిపోయినది!

అందఱు నొక్కుమ్మడిగా "ఎట్లపహరింపఁబడినది?" అని యాశ్చర్యముతోఁ బ్రశ్నించిరి.

రస్త—ఏమో! యెట్లు చెప్పఁగలను? ఇనుపపెట్టెలో నొక్క పైసయైనను లేదు.

అందఱును స్తంభితులైపోయిరి. అప్పు డొకవృద్ధోద్యోగి "రస్తమజీ! నీ వధైర్యపడవలదు. ఏదేనొకయావశ్యకకార్యమునకై రాత్రి హారమసజీ యాసొమ్ము తీసియుండును" అనియెను.

ఇట్లు వారందఱును వ్యాకులపడుచుండఁగా హారమసజీ యచ్చటకు నచ్చి "ఏమిది?" అని యడిగెను. మొట్టమొదట నెవ్వరును బదులుచెప్పఁజాలకపోయిరి. అతఁడు మరల నట్లే ప్రశ్నించెను:

అప్పుడు రస్తమజీ "ఈదినమున బర్జరజీకి సొమ్మియ్యవలయునని నేను బ్యాంకినుండి లక్షరూపాయలను దెచ్చి యినుపపెట్టెలో నుంచినసంగతి మీకుఁ దెలిసియేయున్నది" అనియెను.

హార—ఔను; ఇప్పు డేమిజరగినది?

రస్త—ఆసొమ్ము పెట్టెలో నగపడుటలేదు.

హార—ఏమైనది?

రస్త—అందొక్క పైసయైనను లేదు.

హార—లేదా? దొంగతనమే! ఇంతవఱకును పోలీసువారికిఁ దెలియఁజేయలేదేమి? తత్క్షణ మెవరినైనఁ బంపి సమాచారము తెలియఁజేయవలయును.

తోడనే యొకసేవకుఁడు ఠాణాకుఁ బంపఁబడియెను. ఇంతలో బర్జరజీ యచటికి వచ్చుటయు హారమసజీ యాతనిం గాంచి "కారణాంతరముచే నీకిప్పుడు రొక్కముగ సొమ్మియ్యఁజాలకపోయినందులకు క్షమింపవలయును. బొంబాయి బ్యాంకికి చెక్కు నిచ్చెదను" అనిచెప్పి తనకచేరికిఁ బోయి యొకచెక్కువ్రాసి యాతని కిచ్చెను. అతఁడు వెడలిపోయినతరువాత హారమసజీ రస్తమజీని బిలిచి యాతఁడు లోపలకు వచ్చినతోడనే "తలుపుమూసివేయుము" అనియెను.

నాలుగవప్రకరణము

అనుయోగము

హారమసజీ కొంతసేపటివఱకు నిశ్శబ్దముగా నుండి పిమ్మట గంభీరభావముతో "ఆపెట్టె నితరు లెవ్వరు తీయుదురు?" అని ప్రశ్నించెను.

రస్తమజీ విషణ్ణభావముతో "నేనెట్లు చెప్పఁగలను?" అనియెను.

హార—ఆతాళపుఁజెక్కులు మనయిరువురికంటె నితరు లెవ్వరికిని దెలియవు. మనయిద్దఱికంటె నితరులెవ్వరికి నాపెట్టెను దెఱచుట సాధ్యము కాదుగదా!

రస్త—నేనుగాక మఱియెవ్వరు నాసొమ్మును దీయఁజాలరు.

హార—అట్లయినచో నీవే తీసినట్లంగీకరించుచుంటివా?

రస్త—నాకీసంగతి యేమియుఁ దెలియ దని భగవానునియెదుటఁ బ్రమాణముచేసి చెప్పుచున్నాను. నిన్నటిదిన మా పెట్టెలో సొమ్ముంచితిని. నేడు మరలఁ దెఱచి చూచుకొంటిని. సొమ్ము లేదు.

హారమసజీ క్రుద్ధస్వరముతో "నిర్భాగ్యుఁడా! అట్లయినచో సొమ్ము నెవ్వరు తీయుదురు?" అనియెను.

రస్తమజీ నిరుత్తరుఁడై తలవంచుకొని యూరకుండెను. హారమసజీ చాలసేపూరకుండి తీవ్రదృష్టులతో నాతనిం గాంచుచు "నిన్ను నేను తనయునికంటె నధికముగఁ బ్రేమించి పెంచుచుంటిని. నాసర్వస్వమును నమ్మకముతో నీచేతి కొప్పగించితిని. ఇంతవఱకు నీయెడల నాకెట్టియవిశ్వాసమును గలుగలేదు. నాబిడ్డవలె నిన్ను నాయింట నుంచుకొంటిని. నీవు నాయొద్ద నసత్యము చెప్పవలదు" అనియెను.

రస్తమజీ యప్పటికిని నిరుత్తరుఁడై యుండుటం గాంచి హారమసజీ "తప్పుచేసినను దనయుఁడు తండ్రియెదుటఁ దనదోషము నం

గీకరించుట కర్తవ్యము. నేను నీకుఁ బితృతుల్యుఁడను. కావున నీవు నీ దోషము నంగీకరింపుము" అనియెను.

రస్త—ఏమని యంగీకరింతును? అంగీకరించుటకు నాదోష మేదియు నగపడుటలేదు.

హార—నీవు నాయెదుట నీతప్పు నొప్పుకొన్నచో నేను నిన్ను క్షమియించెదను. అంతేకాక జరగినదంతయును మఱచిపోయెదను. అందుచే నీసంగతి యితరుల కెవ్వరికిని దెలియకుండ నుండును.

రస్త—నన్నేమని చెప్పుమందురు? ఏమిచేసితి నని నేనొప్పు కొందును?

హార—సత్యము చెప్పుచున్నాను. ఎంతమంచివాఁడైనను సమయసందర్భములనుబట్టి యొకప్పుడు తనజీవితమునం దొకటిరెండు తప్పులు చేసి యుండవచ్చును. అంతమాత్రమున వగవంబనిలేదు. నేను నిన్ను క్షమించెదను. సత్యము చెప్పినచో నెప్పటివలెనే నిన్నుఁ బ్రేమించుచుండెదను.

రస్త—నేను సత్యమే చెప్పుచున్నాను. ఆసొమ్ము నేను తీయలేదు.

రస్తమజీ సంక్షిప్తప్రత్యుత్తరములకు హారమసజీక్రోధము క్రమక్రమముగ వర్ధిల్లుచుండెను. అతఁడిఁక సహింపఁజాలక కఠినభావముతో "బుద్ధిహీనుఁడా! నీసంగతి నాకుఁ దెలియదనుకొంటివా? నీచరిత్రమును దెలిసికొనఁజాలనంతటి యవివేకుఁడ ననుకొంటివా? నీనడవడి యంతయును నాచెవిని బడుచునే యున్నది. నాయిల్లువిడిచినది మొదలుగ నీదుర్దశయంతయును నాకుఁ దెలిసినది. నీవు త్రాగుబోతువై దుష్కార్యములఁ బ్రవేశించి యెంతయోధనమును వెచ్చించుచున్న సంగతి నాకుఁ దెలియకపోలేదు" అని గద్దించెను.

రస్తమజీ మారు మాటాడలేదు. హారమసజీయును గొంతసే పూరకుండి మరల మృదుస్వరముతో "రస్తమ్! జరగినదానికి నేను విచారించుట లేదు. నీవు మఱియొకసారి పెట్టెలో బాగుగఁ బరిశీలించి చూడుము. ఈసాయంకాలమువఱకు నేనీవిషయము నెవ్వరితోడను జెప్పకుండ నుండెదను. పోయి బాగుగా వెదకి చూడుము. సరిగా నంతసొమ్మును లేకయున్నను జాలవఱకు దొరకవచ్చును" అనియెను.

రస్త—అయ్యో! నేనాసొమ్ములో నొక్కదమ్మిడియైనను దీసికొనలేదు.

హారమసజీ క్రోధముతో "అట్లయినచో ధనమంతయు నేను తీసికొంటిననియెదవా యేమి?" అనియెను.

రస్తమజీ మాటలాడలేదు.

హార—ఇప్పుడైన నిజము చెప్పుము. ఈపాటికి పోలీసువారు వచ్చియుందురు. నాచేయి దాఁటినతరువాత నేను చేయున దేమియు నుండదు. నిన్ను రక్షించుటకు నాకిప్పుడే కొంచె మవకాశ మున్నది

రస్త—నేను సత్యమునే చెప్పితిని.

హార—సరే; ఆసొమ్ము నీవపహరించితివో నేనపహరించితినో విచారణలోనే తెలియవలసి యున్నది. ఇఁక నీ గొడవ యంతయు నెందులకు? లెమ్ము; నాతోఁగూడరమ్ము!

ఇరువురును వెలుపలకు వచ్చిరి. అప్పటి కిద్దఱు పోలీసు కర్మచారులు వచ్చియుండిరి. హారమసజీ వారిం గాంచి "మిమ్ముఁ బిలిపించినసంగతి మీకుఁ దెలిసియే యుండును" అనియెను.

ఇన్‌స్పెక్టరు—మీయింటఁ జౌర్యము జరగినదని తెలిసినది.

హార—గతరాత్రి నాపెట్టెలోనిలక్షరూపాయలు దొంగిలింపఁబడినవి. ఆపెట్టెతాళములలో నొకటి నాయొద్దను, రెండవది నాకోశాధికారి రస్తమజీయొద్దను నుండును.

ఇన్——వెలుపలనుండి యెవ్వరైన మీధనాగారమునఁ బ్రవేశించుట కవకాశ మున్నదా?

హార——ఎంతమాత్రము నవకాశము లేదు. ఎప్పుడును ద్వారరక్షకుఁ డొకఁ డచ్చటఁ గాచుకొని యుండును.

ఇన్——నిన్నటిరాత్రి ద్వారరక్షకుఁ డెవ్వఁడు?

హారమసజీ యాతని బిలిపించెను. ఆ ద్వారపాలకుఁడు వచ్చి "అయ్యా! నేను రాత్రియంతయు మేల్కొనియుంటిని. కేవలము హారమసజీ యొక్కఁడే లోపలిద్వారమునుండి ధనాగారమునఁ బ్రవేశించుట కవకాశమున్నది. కాని రాత్రి యాతఁడుగూడ వచ్చినజాడ యగపడలేదు.

ఇన్——ఈసంగతి నీవు నిశ్చయముగాఁ జెప్పఁగలవా?

ద్వార——నిశ్చయమే.

ఇన్——మంచిది. ఆ యిల్లంతయు బాగుగఁ బరిశీలింపవలసియున్నది. దాదాభాస్కరా! జాగ్రత్తగఁ బరీక్షింపుము.

దాదాభాస్కరుఁ డపరాధపరిశోధకుఁడు. ఆతఁడును, ఇన్‌స్పెక్టరునుగలసి హారమసజీగృహమును బరీక్షింపఁదొడంగిరి. కాని, దాదాభాస్కరుఁ డొక్కనిమిషమైనను రస్తమజీభావచేష్టితములను బరీక్షించుట కేమరియుండలేదు. అందఱును గలసి మఱియొకగదిలోఁ బ్రవేశించిరి. రస్తమజీమాత్రము విషణ్ణభావముతో నచ్చటనే నిలిచి యుండెను. ఆకస్మికముగఁ బార్శ్వద్వారము తెఱవఁబడియెను. రస్తమజీ యులికిపడి తలయెత్తి చూచెను. ఎట్టయెదుటఁ గమలాబాయి నిలువఁబడి యుండెను.

కమలాబాయి యించుకసేపట్లే స్తంభితయై నిలువఁబడియుండి మృదుస్వరముతో "నీవా? నాయనగా రెచ్చట నున్నారు? అమ్మకుఁ జాల జబ్బుగా నున్నది. అందుచేతనే నేను తండ్రిగారిని బిలువవచ్చితిని" అనియెను.

రస్తమజీ వ్యాకులస్వరముతో "ఔను. నేను నీబాల్యసఖుఁడనగు రస్తమజీని—ఇప్పుడు దొంగను—కారాగృహమునకుఁ బోయెదను. నీతండ్రిగారు పోలీసువారితోఁ గలసి మఱియొకగదిలో నున్నారు" అనియెను.

కమల విస్మితయై "అది యేమి?" అని ప్రశ్నించెను.

రస్త——సర్వమును నీకే తెలియఁగలదు. ఇఁక వెడలిపొమ్ము! దయ యుంచి నాకు మఱింత కష్టమును గలిగింపవలదు.

అని చెప్పి రస్తమజీ యామె నావలకుఁ బంపి తలుపు మూసివైచెను.

దాదాభాస్కరుఁడు చాటున నుండి రస్తమజీముఖభావములను బాగుగఁ బరిశీలించుచుండెను. కావున నాతఁడు కమలాబాయి వచ్చుటను గూడఁ జూచి యుండెను. అప్పు డాతఁడు తనలో "సంగతి తెలిసినది. ఈ రస్తమజీ హారమసజీతనయను బ్రేమించియున్నాఁడు. ఆమెకూడ నాతని బ్రేమించినది. హారమసజీ తనకుమార్తె నీతని కిచ్చుట కిష్టపడలేదు. కావుననే హారమసజీ యీసొమ్ము తానే తీసికొని యీతని గారాగృహబద్ధునిం గావించుటకుఁ దగినయుపాయమూలోచించి యుండును." అని భావించుకొనియెను.

అయిదవప్రకరణము.

పరిశీలనము.

ఇంతలో హారమసజీసహితముగ ఇన్‌స్పెక్టరచ్చటికి వచ్చి "దాదాభాస్కరా! రమ్ము! ఇఁక ధనాగారము పరీక్షింపవలసియున్నది" అనియెను.

నలువురును గోశాగారమునఁ బ్రవేశించిరి. ఇన్‌స్పెక్టరు నలు

వంకలం బరిశీలించి "ఇతరు లెవ్వరును లోపలం బ్రవేశించుట కవకాశము లేదు" అనియెను.

దాదాభాస్కరుం డినుపపెట్టెను బాగుగం బరీక్షించి "ఈపెట్టెను బలవంతముగం దెఱచినలక్షణము లేవియు నగపడుట లేదు. ఈతాళపుంజెవ్వుల నన్నిటిని దెలిసినవారే తాళముతో దీనిని దెఱచియుండవలయును. తాళము తెఱచుచోట రంగుతోం దాళపుంజేతిముద్రి కొంచెము చెదరి ముద్రితమై యున్నది. దీనినిబట్టిచూడంగాం దొందరగాం దీసినట్లు తోంచుచున్నది. కానిచోం దాళపుంజేతి యొత్తిడిచేంగలిగినముద్రి యీరేకుపైం బడియుండదు. ఆ గుర్తు మఱియొకసారి చూడుండు.

ఇన్—ఔను. స్పష్టముగా నగపడుచున్నది. ఇట్టిస్థితిలో నేను నాకర్తవ్యమును దీర్పవలసియున్నది. రస్తుమజీ! నేను నిన్నిప్పుడు చౌర్యాపరాధమునకై నిర్బంధించుచున్నాను!

రస్తు—నే నీవిషయమునం గేవలము నిరపరాధి నని ప్రమాణము చేసి చెప్పుచున్నాను.

ఇన్—అట్లయినచో నిశ్చయముగ విడుదల యగును. హారమసజీ! నిన్నొకటిరెండుమాట లడుగవలసియున్నది.

హార—రండు! కచేరిగదిలోంగూర్చుండి మాటాడుదము.

ఇన్—దాదా! నీవు రస్తుమజీయొద్దనుండుము!

అనిచెప్పి యిరువురును వెడలిపోయిరి. దాదాభాస్కరుం డొకకుర్చీపైం గూరుచుండి నిదురమత్తుచేం దూలుచున్నట్లభినయించుచుం గన్నులు మూసికొని యాలోచించుచుండెను. కాని యాతనియఱమోడ్పుగన్నులదృష్టి రస్తుమజీమీందనే ప్రసరించుచుండెను. అప్పుడు రస్తుమజీ మఱియొకకుర్చీపైం గూర్చుండి తత్తరముతో నొకయుత్తరమును వ్రాసి యతివేగముగ ముగించెను. ఇంతలో ప్రేమజీ యచ్చటికి వచ్చి "రస్తుమజీ! దొంగతనము చేసినవా రెవ్వరో తెలిసినదా?" అనియెను.

రస్తు—సోదరా! ఏమని చెప్పుదును?

అని చెప్పి రస్తుమజీ రహస్యముగా దాను వ్రాసినయుత్తరము నాతనిచేతి కిచ్చెను. ప్రేమజీ మెల్లమెల్లగ నటనుండి తనచోటికిం బోయెను.

ఇదియంతయుం జూచుచున్న దాదాభాస్కరుండు "ఓహో! ఈవిషయమునం జాలరహస్యవ్యాపారము లున్నవి" అని భావించుకొనియెను.

ఇంతలో ఇన్స్పెక్టరు తిరిగి వచ్చి రస్తుమజీ నుద్దేశించి "మీరు కేమైనం జెప్పవలెనని యున్నచో విచారణస్థానమునం జెప్పవచ్చును. ఇక లెండు! నడువుండు!" అనియెను.

రస్తుమజీ చటాలున లేచి యొకసారి హారమసజీవంకం జూచి "అయ్యా! ఇదిగో మీతాళము! మీలెక్కలపుస్తకము లన్నియును మీరు తీసికొనుండు! నేను కొంచెము హెచ్చుగా వాడుకొనుటవలన నిలవసొమ్ములోం గొంచెము తగ్గియుండవచ్చును" అనియెను.

ఇన్—ఓహో! దొంగతనమే కాక మరల నిదియొకటియా!

రస్తుమజీ యామాటను లక్ష్యముచేయకయే "నేను నామాసవేతనముకంటె హెచ్చుగ వాడుకొని యుందును. నీయుద్యోగులలోం జాలమంది యట్లు వాడుకొనుట కలదు. అట్లే నేనును జేసితిని. నేనొకసారి తమబ్యాంకిలో నైదువేలరూపాయలు దాంచుకొని యున్నాను. నేను వాడుకొన్నసొమ్మును మీరు దానిలోనుండి తీసికొనవచ్చును." అనియెను.

హారమసజీ యేమియుం బ్రత్యుత్తర మీయలేదు. రస్తుమజీని వెంటంబెట్టుకొని పోలీసువారు వెడలిపోయిరి. ఆ కచేరిలో రస్తుమజీ

నందులును ... పేరులుచుండిరి. కొందఱు బిగ్గఱగనే యేడ్చిరి. పేరుమజీ యొక్కయు నప్పటికి వచ్చి "అయ్యో! ఎంతపని జరిగినది! రస్తుమజీ నోగితములు చేయలేదని నేను ప్రమాణము చేసి చెప్పగలను." అనియెను.

"వారెవరు?" అని హారుమసజీ యావంకఁ జూచెను.

పేరుమ—అయ్యా! నేను నిశ్చయముగఁ జెప్పుచున్నాను. రస్తుమజీ యెంతమాత్రము నిట్టిదొంగతనము చేయువాఁడు కాఁడు!

"భగవంతుఁడట్లే యనుగ్రహించుఁగాక!" అని హారుమసజీ సత్వరముగఁ దనగదిలోనికిఁ బోయెను. ఆతఁ డిప్పటికిని రస్తుమజీని ప్రేమించుచునే యుండెను. ఆదినమున నింక వ్యాపకమును లేవియును జరగలేదు.

వెలుపలికి వచ్చి దాదాభాస్కరుఁడు ఇన్‌స్పెక్టరును జూచి "నాకుఁ గొంచెము పనియున్నది. నీవీతని దీసికొని పొమ్ము. నేను తరువాత వచ్చెదను" అనియెను.

ఇన్‌స్పెక్టరు మారుమాట చెప్పక రస్తుమజీని వెంటఁ బెట్టుకొని పోయెను. దాదాభాస్కరుఁడు దాసనిూపమునందలి యొకయంగడి యరుగుమీఁద గూర్చుండి "రస్తుమజీ వ్రాసిన లేఖయందేమున్నదో చూడవలెను. ... నీరహస్యవ్యాపారమునందుఁ గొంతభాగమైనను దెల్పియుండవలెను. ఎట్లయినను రస్తుమజీ వ్రాసిన యుత్తరమును జూచి తీరవలయును. పేరుమజీ యావాటిక్కాచీటి దీసికొని యిప్పించవలసినవారికి యందింపకుండుటకు బంధువులు చేరియుందురు. తప్పకుండ నాయుత్తరమునందు ఏదియో గూఢవిషయ ముండి యుండును", అని యాలోచించుకొనుచుండెను.

ఆఱవపరిచ్ఛేదము.

[illegible]హత్య.

విశేషముగాఁ జెప్పవలసిన దేమున్నది? ఆశ్చర్యకరమగునీదొంగతనముగూర్చి బొంబాయినగరమునందంతటను తర్కవితర్కములు జరుగుచుండెను. ఎచ్చటఁ జూచినను నీమాటలే. జనులందఱు నీసంగతియే చెప్పుకొనుచుండిరి. ఇట్టిసమయమున నతిభయంకర మగు నొకహత్య జరిగి పట్టణవాస్తవ్యులను మఱింతకలవరపెట్టెను. దొంగతనమునకు సంబంధించిన యామాత్రమునుగూర్చి యిప్పటికి గుజరాతీపత్రికయం దిట్లు ప్రకటింపఁబడియెను.

"కడచినమంగళవారము నాఁటిరాత్రి రెండుగంటలకు నొక భయంకరకృత్యము జరిగినది. బొంబాయినగరమున దినదినమును నిట్టిహత్య యెన్నఁడును జరుగలేదు.

మంగళవారము నాఁటిరాత్రి యొంటిగంటవేళ గిరిగాము వీథిలో నొకబండివాఁడు రక్షకభటునిఁగూర్చి కేకలు వైచెను. రక్షకభటుఁడు వచ్చి చూడఁగా బండిలోఁ బెద్దమనుష్యుఁడగు నొక పార్శీయువకుని మృతకళేబర మగపడియెను. వెంటనే యాతఁ డాబండిని శవముతోఁ ఠాణాకుఁ దీసికొనిపోయెను. శవపరీక్ష చేసి క్లోరోఫారము విశేషముగ నుపయోగించుటచే నతఁడు మరణించెనని డాక్టరు నిశ్చయించెను. క్లోరోఫారముతోఁ దడిపిన యొకఱుమాలు శవముపైఁ బడియుండెను. ఆఱుమాలున కంచుచివర "పేరుమజీ" అను నక్షరములుండెను.

బండివాఁడిట్లు చెప్పియున్నాఁడు. "గ్రాంటురోడ్డునందొక పార్శీ ధనికుఁడు నన్నుఁ బిలిచి 'ఈ పెద్దమనుష్యుఁడు మద్యపానము చేసి మత్తెక్కియున్నాఁడు. ఈతని నెల్లియున నింటికిఁ దీసికొనిపొమ్ము! గిరి

గాను పోయినంతనే యీతఁడు తనయిల్లుచూపఁగలఁడు" అని చెప్పి యొకతాఁగుబోతును నాబండిపై నెక్కించి తానొకసందునఁ బ్రవేశించి పోయెను. అంతలో నాతఁడు మరల వచ్చి "నేనుగూడ వచ్చి యీతని నిల్లు చేర్చెదను." అని నాబండిపైఁ గూర్చుండెను. కొంతదవ్వేగినపిమ్మట బండి గిరిగాము వచ్చుటయు నాతఁడుబండి నిలుపుమని తానుదిగి "ఇచ్చటనే యీతని యిల్లు!" అని చెప్పి యతివేగముగ నెచ్చటికో పాఱిపోయెను.

"పోలీసువారింకను విచారణ చేయఁగా రాత్రియొంటిగంటవేళనే యాస్థానమునందే యాపెద్దమనుష్యుఁ డింకొక బండి చేసికొని కలబాదేవీరోడ్డునకుఁ బోయినట్లింకొక బండివానివలనఁ దెలియవచ్చెను. ఆమృతవ్యక్తి యెవ్వరో మొట్టమొదట పోలీసువారు గ్రహింపఁజాలకపోయిరి. ఇప్పుడతని పేరు పేష్టనజీ యనియు నాతఁడు కలకత్తా యందలి యొకసౌదాగరుతనయుఁ డనియు, నెలదినములక్రిందట బొంబాయి వచ్చెననియు, నాతఁడు నిరంతరమును హోరముసజీయింటికి వచ్చుచుఁబోవుచుండుటయేగాక యాతనికుమార్తెను బెండ్లియాడుటకు మాటలాడుచుండె ననియుఁ దెలియవచ్చెను.

"ఆరాత్రి పండ్రెండుగంటలవేళ మృతవ్యక్తియగు పేష్టనజీ హోరముసజీ కోశాధికారి యగు రుస్తుముజీతో మాటలాడుచుండఁగా నింటికిఁ బోవుచుఁ దాను చూచితి" నని హోరముసజీయొక్క దలుసుమారుఁడగుమాంచరజీ పోలీసువారికిఁ దెలిపి యుండెను.

"ఆరాత్రియే పండ్రెండుగంటలవేళ రుస్తుముజీ ఎల్ఫిన్స్టోనుసర్కిలుయొద్ద దగఁ గనుపడె ననియు, నాతఁ డతివ్యాకులుఁడై గ్రాంటురోడ్డువంకకుఁ బోవుచుండె ననియు హోరముసజీబంధుఁ డగుబర్జరంజి పోలీసువారికిఁ దెలియఁజేసి యున్నాఁడు.

"పోలీసువారింకను బ్రయత్నింపఁగా హోరముసజీయొద్దనున్న సహాయకోశాధికారి యగుపేరిమజీ యానాఁడు పాత్రిజీకంపెనీవారియొద్ద నొకక్లోరోఫారముసీసా కొనియున్నట్లును, మృతుని శిరమును మొగమునకు క్లోరోఫారమునఁ గట్టఁబడియున్న రుమాలుపై నాతనిపేరే లిఖింపఁబడి యున్నట్లును దెలియవచ్చెను.

"ఆరాత్రి బండిపై కలబాదేవీరోడ్డునకు వచ్చి దిగినవాఁడు పేరిమజీయే యనియు, నేనాతనికి సలాము చేసితి ననియు నచ్చటిరక్షకభటుఁడు ప్రమాణము చేసి చెప్పుచున్నాఁడు.

"నేనారాత్రి బొంబాయినగరమునఁ నే లేననియు, నెచ్చటనుంటినో చెప్పుటకు నాకిష్టము లేదనియు, నామిత్రుఁడగు నొకపారసుగూర్జి డాక్టరునకు నేనానాఁ డొకక్లోరోఫారముసీసా కొనియుంటిననియు, ఆసీసా నారుమాలుతోఁగూడ జేబులోఁ బెట్టుకొంటి ననియు, నవి రెండునుగూడ నెవ్వరో తనయింటికి వచ్చి యెత్తికొని పోయిరనియు పేరిమజీ చెప్పుచున్నాఁడు.

"ఆశ్చర్యకరమగు నీహత్యాకాండ యీవిధముగా నున్నది. ఇంతవఱకు పోలీసువారెవ్వరిని నిర్బంధింపలేదు. ఆరాత్రియే హోరముసజీ బ్యాంకిలో లక్షరూపాయలు పోయినవి. ఆనేరమునకు పోలీసువారు రుస్తుమజీని బట్టుకొని కారాగృహమునం దుంచిరి. ఈచౌర్యమునకును, హత్యకును బరస్పరసంబంధ మేమైన నున్నదో లేదో మేము నిశ్చయముగాఁ దెలుపఁజాలము. మాబొంబాయినగరరక్షకులు జగత్ప్రసిద్ధులగుసమర్థులు వారెట్టియినరహస్యము నచిరకాలములో భేదింపక మానరు.

"ఇంతకంటె మేమిప్పు డీవిషయమున నేమియుఁ జెప్పఁజాలము. అపరాధికిఁ దగిన శిక్ష యగును. ఇంతమంది రక్షకభటులు గలయీనగరమునం దిట్టిఘోరకృత్యములు జరుగుచుండఁగా నిఁక నీపట్టణమున సంసారులు నిర్భయముగా నుండఁగలుగుదురు?"

ఏడవప్రకరణము.

దాదా భాస్కరుడు ప్రేమజీకొఱకు నిరీక్షించుచుండెను. ఇంతలో ప్రేమజీ బయలుదేరి వడివడిగ నావీథినిబడి పోవుచుండెను. దాదా భాస్కరుడతివేగముగ నాతని సమీపించి "అయ్యా! కొంచెము నిలువుడు!" అనియెను. ప్రేమజీ యులిక్కిపడి తిరిగిచూచెను. అప్పుడు దాదాభాస్కరుడు "అయ్యా! మీవలన నొకసంగతి నవశ్యముగ దెలిసికొనవలసి యున్నది!" అనియెను.

ప్రేమ—నావలననా?

దాదా—ఔను.

ప్రేమ—నీవెవ్వరో నేనెఱుగను.

దాదా—మీకు జ్ఞాపకశక్తి తక్కువయని తోచుచున్నది. ఇప్పుడేగదా మీరు నన్నుజూచితిరి.

ప్రేమజీ యప్పుడానవాలుపట్టెను. పోలీసుకర్మచారి తన్నట్లు ప్రశ్నించుటచే తొందరపడి యుద్విగ్నహృదయుడై "మీరు తెలిసికొనవలసిన సంగతి యేమో చెప్పుడు." అనియెను.

దాదా—రతనమజీ మీకొక యుత్తరము నిచ్చెనా?

ప్రేమ—మీరు పొరబడుచున్నారు. అతడు నాకెట్టియుత్తరము నియ్యలేదు.

దాదా—నేనెన్నడును బొంకుపాటనుమాటయే యెఱుగను. [illegible]మైన నేమి! నేను కఠినచర్య నవలంబింపకమునుపే మీరు మాట దక్కించుకొందురని నమ్ముచున్నాను.

ప్రేమ—ఔను. రతనమజీ నాకొకయుత్తరము నిచ్చెను; కాని నేను దాని నప్పుడే చించి పాఱవైచితిని.

దాదా—[illegible] నీవు [illegible] యుత్తరము [illegible]? [illegible] మీకే [illegible]. ఆయుత్తరము [illegible] మీ [illegible] యున్నది. [illegible] దాని [illegible] బయలు [illegible] నాకీను [illegible] మీ [illegible] వదలుకొనవలసిన[illegible]! [illegible] యుత్తరము [illegible] నచ్చెదరా?

ప్రేమ—[illegible]

దాదా—ఎంతమాట! [illegible]! లేకున్నచో నిదే గ్యాసుకాంతియందు మీకు [illegible] బడును. బాగుగ [illegible] తత్తరపడక నాయుత్తరమును [illegible] దీయుడు!

ప్రే—ఎంతమాత్రమును నేనియ్యజాలను.

దాదా—అట్లయినచో నేనిరువురుపోలీసుభటులను బిలువవలసి వచ్చును. వారు వచ్చి మిమ్ములను రెండుచేతులను బట్టుకొని ఠాణాకుం దీసికొనిపోవుదురు. అచ్చట వారు బలవంతముగ మీజేబును బరిశీలించి యుత్తరమును దీసికొందురు. అప్పుడు మాటలవలనను, జేతవలనను గూడ మీకవమానముకలిగినం గలుగవచ్చును. చెప్పుడు! అదియే మీకు సమంజసముగం దోచుచున్నదా?

ప్రేమజీ యించుకసేపాలోచించి "అట్లయినచో నిదిగో! ఈ యుత్తరమును దీసికొనుడు! దీనితో మీకెట్టిప్రయోజనము నుండదు" అని యుత్తరము నిచ్చెను.

దాదాభాస్కరుడా యుత్తరము నందుకొని చదివెను. అందిట్లున్నది:—

"రత్నా!

నీకు నాయందు దించుకంతయైనను ప్రేమ యున్నచో నీయుత్తరమును జూచినంతోడనే మారుమాట చెప్పక నీయింటనున్న సకలపదా

ర్థములను దీసికొని యెట్లైనను బాఱిపొమ్ము! నిన్నెవ్వరును బట్టుకొనకుండ దాఁగి యుండుము. నేను దొంగతనపు నేరమునకై నిర్బంధింపఁబడితిని. నేను చెప్పవలసినది చెప్పితిని. ఇఁక నీయిష్టము. నాజీవితమును మరణమును దీనిమీఁదనే యాధారపడి యుండెను. నీనూత్ననివాసము ప్రేమజీకిమాత్రము తెలుపుము. ఆతనివలన నేను తెలిసికొందును.

రస్తమజీ"

దాదాభాస్కరుఁ డాయుత్తరమును జదివి లలాటమును గుంజించి "ఔను. నాకీయుత్తరముతో నంతగాఁ బ్రయోజనము లేదు. కాని నీకింతకష్ట మోఁగలకు? దీనిని దీసికొనిపోయి నేనామెకిచ్చెదను. రస్తమజీ కామె బంధువురాలై యుండును. ఆమెనివాస మెక్కడ?" అని ప్రశ్నించెను.

ప్రేమ—నేను చెప్పను.

దాదా—నేను తెలిసికొనఁగలను. తలఁచుకొన్నచో నీచేతనే చెప్పింపఁగలను. లేదా, రస్తమజీసేవకుల నడిగినచో నంతయుఁ దెలియఁగలదు. కాని, నీవు చెప్పినచో నీకు లాభముండును. లేదా నీవీ నేరమునఁ దగుల్కొనవలసి యుందువు.

ప్రేమజీ యించుకసేపాలోచించుకొని వాసస్థానము నాతనికిఁ దెలియఁజేసెను.

దాదా—ఆబంధువు స్త్రీయా, పురుషుఁడా? సరిగఁ జెప్పినచో నీకే యుపకార మగును.

ప్రే—స్త్రీయే.

దాదా—సరే. అట్లయినచో నొకయువతికూడ నీవ్యవహారమునం దున్నది! ఎంతవెఱ్ఱిపడుచున్నాను! ఆఁడుది లేకున్నచో నింతపని యెట్లు జరుగును? అది లేకున్న నేపనియును జరుగదు.

ప్రేమ—రస్తమజీ యీ దొంగతనము నించుకంతయు నెఱుంగఁడు.

దాదా—మంచిది. కాని నీకొకమాట చెప్పుచున్నాను. నీవీవిషయమున నేమియుఁ జేయిచేసికొనవలదు. అట్లయినచో నీవును గష్టములపా లయ్యెదవు.

అని చెప్పి యాతఁ డటనుండి వెడలిపోయెను. కొలఁదిసేపటిలో దాదాభాస్కరుఁడు రత్నాబాయియింటిగుమ్మమునొద్దకుఁ బోయి చూచెను. ఆయిల్లు చిన్నదైనను మిగులసుందరముగా నుండెను. ఆగృహంబునకు నలుదెసలను బుష్పోద్యాన ముండెను. ఆయింటిగుమ్మముకడ నొకసేవకుఁడు నిలిచి యుండెను. దాదాభాస్కరుఁ డాభృత్యునకా యుత్తరమును జూపి "రస్తమజీ దీనిని రత్నాబాయి కిమ్మని పంపినాఁడు. ఆమె యెక్కడ నున్నది." అని యడిగెను.

సేవ—ఆచీటిని నాకిమ్ము!

దాదా—ఇచ్చుట కుత్తరువు లేదు. ఆమె కీయుత్తరమును నేనే యీయవలయును.

సేవ—అట్లయినచో నిట నుండుము. నేనామెతోఁ జెప్పి వచ్చెదను.

అని చెప్పి యాతఁడు లోనికిఁ బోయి కొలఁదిసేపటిలోఁ దిరిగి వచ్చి "నీవు లోనికిఁ బోవచ్చును" అనియెను. దాదాభాస్కరుఁడు లోపలఁ బ్రవేశించెను. ఆమందిర మంతయుఁ జక్కఁగ నలంకరింపఁబడి యుండెను. విలువగలసోఫాలును, నిలువుటద్దములును, సుందరచిత్రపటంబులును, రత్నకంబళములును నెచ్చటకుఁ దగినయట్లచ్చట నలంకరింపఁబడి యుండెను. అంతయుం దిలకించి యాతఁడు "రస్తమజీ విలాసపురుషుఁడే" అనియనుకొనియెను.

ఇంతలోఁ బార్శ్వద్వారము తెఱవఁబడియెను. పదునెనిమిదేండ్ల సుందరీశిరోమణి యాతనికన్నులఁబడియెను. ఆతఁడు విస్మితుఁడును, విముగ్ధుఁడు నై పోయెను. అంతటియందకత్తె నాతఁ డిదివఱ కెన్నఁడును

జూచియుండలేదు. ఆరమణి రమణీయము లగుగుజరాతీవస్త్రములను దా
ల్చి యుండెను. ఆవస్త్రములలోనుండి యామెసుందరశరీర కాంతులు ప్రతి
ఫలించుచుండెను. ఆసుందరివినీలకుటిలకుంతలదామము స్కంధప్రదే
శమునను, కటిప్రదేశమునను గుచ్ఛగుచ్ఛములుగఁ గలయుఁగొని యుండె
ను. ఆయువతీలలామ సముజ్జ్వల విశాలతరళనయనములనుండి చంచల
కటాక్షములు మెఱపుల మెఱయించుచుండెను.

దాదాభాస్కరుఁడు విస్మయవిహ్వలహృదయుఁడై యాసుందరీ
మణి సౌందర్యామృతమును దననయనద్వయమున కానొత గావించు
చు నించుకసేపు నిలిచి యుండెను.

ఎనిమిదవ ప్రకరణము.

రత్నాబాయి

రత్నాబాయి మృదుకంఠస్వరముతో "మీరు వచ్చినపని
యేమి?" అని ప్రశ్నించెను. దాదాభాస్కరుఁడు రస్తుమజీ వ్రాసిన
యుత్తర మామెచేతి కిచ్చెను. ఆమె యాయుత్తరమును జదివికొని
వ్యాకులహృదయముతో స్తంభితురాలైపోయెను. ఆమెసర్వాంగకము
లును గంపించిపోవుచుండెను; సుందరవదనకాంతి పాండురమైపోయెను.
ఇంచుకసేపటిలో నామె ప్రకృతిస్థయై వీణాసదృశస్వరంబున "ఏమిది!
చోరుఁడుగనే పట్టువడియెనా?" అనియెను.

దాదా—హరమసజీ బ్యాంకిపెట్టెలోనుండి లక్షరూపాయలు
పోయినవి. దానితాళము లాతనియొద్దను, హరమసజీయొద్దను మాత్ర
మేయుండును. ఆతాళముం దెఱచుకిటుకు వారిరువురికే తెలియును. అ
ట్టిచో సొమ్మితరు లెట్లపహరింపఁగలరు?

రత్నా—అసత్యాపవాదము. రస్తుమజీ యెన్నటికిని సొమ్ము
నపహరించువాఁడు కాఁడు.

దాదా—ఆతఁడు కాకున్న హరమసజీ తీసికొనవలయును.
మఱియెవ్వరు తీయఁగలరు?

రత్నా—అవును. ఆతఁడే తీసి యుండును. రస్తుమజీ యిప్పు
డెచ్చట నున్నాఁడు?

దాదా—తగినచోటనే—ఠాణాలో—

రత్నాబాయి సమీపమునందున్నబీరువా నానుకొని నిలువఁ
బడి యుండెను గాని లేకున్నచో నామె క్రిందఁ బడిపోవలసినదే.
చాలసేపామె పెడమొగము పెట్టుకొని యాలోచించుకొనుచు నిలు
వఁబడి యంతలో నించుక ప్రకృతిస్థయై "నేనొకసారి యాతనినిఁ జూడ
వలసి యున్నది" అనియెను.

దాదా—అది యెట్లు? ఆతఁడు నిన్ను రహస్యముగ నుండు
మని చెప్పి యున్నాఁడు.

రత్నా—ఆతఁడు విపత్తునఁ బడియుండఁగా నేను నిశ్చింతురా
లనై యొక్కచో నుండవలసినదా?

దాదా—నీవచ్చుటకిఁ బోయి చూచినచో నాతనికి మఱింత
విపత్తు కలుగునేమో?

రత్నా—అదియేమి?

దాదా—కాకున్నచో నాతఁడు నిన్ను దాఁగియుండు మని
యేల వ్రాయును? మఱియుఁ దనజీవితమరణములు నీవు దాఁగియుండు
టమీఁదనే యాధారపడి యున్నట్లుకూడ వ్రాసి యున్నాఁడు.

రత్నా—ఆతఁ డిట్లు వ్రాయుటకుఁ గారణ మేమి?

దాదా—ఆసంగతి నీకే తెలియవలసి యున్నది. ఆతఁడు నీకొ
కెంతయో ధనమును వెచ్చించి యున్నాఁడు. ఆదాయముకంటె

నాతని కెంతయో వ్యయ మధికమైనది. ఈధన మంతయు నాతని కెట్లు వచ్చును? నీసంగతి లోకులకుఁ దెలిసినచోఁ గ్రమముగా న్యాయస్థానమునఁగూడఁ దెలియును. అందువలన నీయధికవ్యయమును బట్టి బ్యాంకిలోనిసొమ్మాతఁడే యపహరించినట్లు స్పష్టపడిపోవును. అందుచేతనే నిన్ను దాఁగియుండుమని యాతఁడు వ్రాసెను.

రత్నా—కాదు. కాదు. ఆతఁడు నాకొఱకు విశేషద్రవ్యమును వ్యయించుచున్నమాట నిజమే. కాని యాతనిసొమ్ము చాలనున్నది. ఆతఁ డితరులధనమును దీసికొనువాఁడు కాఁడు.

దాదా—కాని నిన్నుఁజూచి, మఱియు నీమందిరమును జూచి, ఆతనిరాకపోకలను దెలిసికొని—నీవిప్పుడు చెప్పినమాటలను లోకులెవ్వరు విశ్వసింతురు?

రత్నా—ఆతఁడు నన్నుఁ బ్రేమించుట లేదు. కమలాబాయిని బ్రేమించి యున్నాఁడు. దయతో నాకాశ్రయమును బ్రసాదించినాఁడు. నేనాతని బ్రేమించి యుండుటకుఁ జనవొసంగినాఁడు. నేనెఱుఁగనితనముచే నాతనిధనము నింతగా వెచ్చించితిని. నాకేల చావు రాలేదు?

అని యామె వెక్కి వెక్కి యేడువఁదొడంగెను. మఱియు నామె పయ్యెదచెఱంగున సుందరవదనమండలమును గప్పుకొని కొంతసేపేడ్చి యాకస్మికముగా "సరే! నేనాతనియాదేశమును బాలించెదను. ఎట్లయిన దాఁగియుండుటకుఁ బ్రయత్నించెదను. కాని నేనెక్కడకుఁబోయి యుండవలయునో తోఁచుట లేదు" అనియెను.

దాదా—నీవు కొన్నాళ్ళు నాభార్యకడ నుండవచ్చును. ఆమె ప్యారెలునం దున్నది. అచ్చట నున్నచో నిన్నెవ్వరును గనుఁగొనఁజాలరు.

రత్నాబాయి యాతని మొగమువంకఁ జూచెను.

దాదా—నాయందు నమ్మకము లేకున్నచో రస్తమజీ నన్ను నీయొద్ద కెట్లు పంపించును?

రత్నా—ప్రేమజీ నేల పంపలేదు?

దాదా—ఆతఁడాతనితోఁగూడ తాణాకుఁ బోయి యుండెను.

రత్నా—నేను వచ్చినచో నింటిలోనిసామగ్రి యంతయు నెవ్వరు చూచుకొందురు?

దాదా—ప్రేమజీ.

రత్నా—అట్లయినచో నిఁక నాలస్యమెందులకు! పోలీసువారు వచ్చెదరేమో?

దాదా—ఔను.

అని చెప్పి యాతఁడు సేవకు నొక బండిని దీసికొనిరమ్మని పంపెను. బండి వచ్చినతోడనే రత్నాబాయి కొన్నియుడుపులను రొక్కముగనున్న ధనమును వెంటఁదీసికొని బండిలోఁగూర్చుండి భృత్యులం గాంచి "నేను శీఘ్రకాలములోనే తిరిగివచ్చెదను" అని చెప్పి బయలుదేరెను.

అంత నాబండి విక్టోరియాస్టేషనునొద్దకుఁ బోయెను. దాదాభాస్కరుఁ డామెను రైలుపై నెక్కించి ప్యారెలునకుఁ దీసికొనిపోయి రత్నాబాయిని దనభార్యకొప్పగించి యామెకుఁ దనయుద్దేశమును దెలిపి యాతఁడు మరల బొంబాయికిఁ బోయెను. ఆతఁడు త్రోవలో "ఏమైననేమి; ఈసందర్భమున నొక్కసాక్షి నాచేతికి దొరకెను. ఇఁకముందేమి జరుగునో చూతము" అని యనుకొనియెను.

ఆతఁ డొకబండిపై నెక్కిపోయి మరలఁ బ్రేమజీని గలిసికొని యాతని నొకచోటికిఁ బిలిచి రహస్యముగా "నేనాయుత్తరమును దీసికొని పోయి రత్నాబాయి కిచ్చితిని. ఆలేఖప్రకార మామె యప్పుడే యిల్లు విడిచి పోయినది" అని చెప్పెను.

ప్రేమ—ఎక్కడకుఁ బోయినది?

దాదా—ఆసంగతి నాకామె చెప్పలేదు. మీకుత్తరము వ్రాయుదు నన్నది.

ప్రేమ—మందిరమును, మిగిలివస్తువుల నెవ్వరి కొప్పగించినది?

దాదా—అందుకొఱకే నేను నీయొద్దకు వచ్చితిని. ఆమె వచ్చునంతవఱకును నిన్నాయిల్లు చూచుకొమ్మని చెప్పినది. నీవచ్చటి కొకసారి పోయి చూడుము!

ప్రేమ—ఇప్పుడే పోయెదను.

అని చెప్పి ప్రేమజీ సెలవుగైకొని వెడలిపోయెను. దాదాభాస్కరుఁడు పోలీసుకచేరికిఁ బోయెను.

తొమ్మిదవ ప్రకరణము.

అజ్ఞాతలేఖ.

ప్రేమజీ తనప్రియమిత్రుఁడగు రస్తుమజీనిగూర్చి మిగుల విచారించుచు నుద్విగ్నహృదయముతోఁ గచేరిపనుల నతిశీఘ్రముగ ముగించుకొని రత్నాబాయియింటికిఁ బోయి చూచెను. అందామెయొక్కతెయే లేదుగాని యెక్కడవస్తువు లక్కడనే యుండెను. రత్నాబాయి లేకయాసుందరమందిరము విషాదచ్ఛాయాచ్ఛాదితమైనట్లుండెను. ప్రేమజీ యాయింటిగదులకన్నిటికిని దాళములను వైచి సేవకులను బిలిచి "అమ్మగారు రస్తుమజీకిఁ గలిగినకష్టమును దెలిసికొని యందులకుఁ బ్రతిక్రియ గావించుటకై గ్రామాంతరమునకుఁ బోయియున్నారు. మీరు మఱియొకలాగెంచక జాగ్రత్తగ నుండుడు! ఆమె త్వరలోనే రాఁగలదు" అని యాజ్ఞాపించి యాతఁడు తనయింటికిఁ దిరిగి పోవుచుండెను.

[illegible] నొకరక్షకభటుఁ డాతనికి సలాముచేసెను అప్పు డాకస్మికముగ నాతనికి గుజరాతిపత్రికలోఁ బ్రకటించిన పేష్టనజీహత్యావృత్తాంతము స్మృతికి వచ్చుటచే నాతఁ డచ్చట నాగిపోయెను. ప్రేమజీ యారక్షకభటుని బాగుగ నెఱుంగును; ఆతని కప్పుడప్పుడు పురస్కారముకూడ నొసంగుచుండుట గలదు. అప్పుడు ప్రేమజీ యారక్షకభటుని గాంచి "పేష్టనజీహత్య జరిగిననాఁటిరాత్రి నేనిచ్చట బండిపై నెక్కివచ్చి దిగినట్లు చూచితి నని నీవు చెప్పితివఁట! బాగుగ స్మృతికిఁ దెచ్చుకొని చెప్పుము! అప్పుడు నీవు నన్నే చూచితివా?" అని ప్రశ్నించెను.

రక్ష—లేదు—అప్పుడు నేను నిద్దురకన్నులతో నుంటిని. ఆతఁడు మీదుస్తులవంటిదుస్తులనే ధరించియుండెను.

ప్రేమ—సరే! ఇక్కడకు మాయిల్లగపడుచున్నది గదా! ఆతఁడు మా యింటిలోనికే పోయెనా?

రక్ష—ఇప్పుడు తలఁపునకు వచ్చుచున్నది. ఆతఁడు మీయింటఁ బ్రవేశింప లేదు. ఇంకను గొంచెముదూరము పోయి యొకసందుత్రోవను బోయినాఁడు. నాకొకయూహ తోఁచుచున్నది—

ప్రేమ—తరువాత నీవాతని జూచితివా?

రక్ష—లేదు.

ప్రేమ—బాగుగ నాలోచించి చెప్పుము! ఆతఁడు నాకంటె లావుగ నుండెనా? సన్నముగ నుండెనా?

రక్ష—మీకంటెఁ జాలలావుగా నుండెను. అప్పు డాతఁడు పొట్టికోటును దొడిగికొని యుండెను.

ప్రేమ—ఈసంగతులు నీవు మీదొరగారికిఁ జెప్పుట మఱచిపోవలదు.

అని చెప్పి ప్రేమజీ తనయింటికిఁ బోయెను. అప్పు డాతని కొకరిజస్టరుబంగీ వచ్చి యుండెను. అది యెవ్వరు పంపినదియో, యెచ్చటి

నుండి వచ్చినదియో బాగుగఁ బరిశీలించి చూచెనుగాని యేమియును దెలియలేదు. కాని యాబంగీపై "కోలాబా" పోస్టుముద్ర యుండెను.

ఆబంగీని విచ్చి చూడఁగా నందుఁ బదిరూపాయలనోట్లు నిండి యుండెను. వానిని లెక్కింపఁగా నైదువేలరూపాయల విలువగలవై యుండెను. అన్నిటికంటె పైభాగమున నొకయుత్తర ముండెను. అందీక్రింది విధమున వ్రాయఁబడియుండెను.

"ప్రేమజీ!

నీవు రస్తమజీకిఁ బ్రియమిత్రుఁడ వగుటచే నేను నీకైదువేల రూపాయలను బంపితిని. రస్తమజీ నిర్దోషి. ఆతనికిఁ దనవ్యవహారమును నడపించుకొనుటకుఁ దగినధనము లేదు. అందుచే నీసొమ్ము నీకుఁ బంపితిని. నీవీసొమ్ముతో నొకవకీలును బెట్టి యాతని నెటులైన విడిపించుటకుఁ బ్రయత్నింపుము. ఆతనిమేలు గోరియున్న నీకు విశేషముగ వ్రాయనక్కఱ లేదు.

ఇట్లు
రస్తమజీశుభాకాంక్షి"

ప్రేమజీ యాయుత్తరమును జదివికొని "ఈసొమ్ము పంపినవా రెవ్వరైయుందురు? రస్తమజీ బంధుమిత్రులలో నేనెఱుంగనివారు లేరు. కాని యీతఁడెవ్వఁడో నాకు బోధపడుట లేదు, హారమసజీ పశ్చాత్తాపపడి యీసొమ్ముపంపియుండునా? కాకున్నచో నింతసొమ్మాతనికొఱకుఁ బంపువా రింకెవ్వరున్నారు? నిర్దోషి యగురస్తమజీ యెడల జాలిపడి యాతఁడే పంపియుండును. ఏమైనను నేనీసొమ్మును ద్రిప్పివేయుట కవకాశము లేదు, ఎవ్వరికని త్రిప్పివేయుదును? నిశ్చయముగా నే నీసొమ్మును రస్తమజీకొఱకు వెచ్చపెట్టెదను, పాపాత్ముని ధనమువలనఁ బుణ్యమునకు జయ మగుఁగాక." అని యనుకొనియెను.

ఆరాత్రియే ప్రేమజీ యొకసుప్రసిద్ధుఁడగువకీలునింటికిఁ బోయి యెల్లసంగతులను దెలియఁజేసెను వకీలంతయును విని "వ్యవహారము మిగులఁ గఠినమైన దనుటకు సందియము లేదు. హారమసజీరస్తమజీలలో నెవ్వరో యొకరుతక్క నితరు లాధనము నపహరించుట కవకాశము లేదు. హారమసజీ తనసొమ్ము తాను దొంగిలించె నని చెప్పుటకు నిదర్శనములు లేవుగదా" అనియెను.

ప్రేమ—రస్తమజీ యపహరించినట్లుమాత్ర మేమినిదర్శన మున్నది?

వకీ—కావలసినన్ని యున్నవి. ఆతని కొక యుంపుడుగత్తె యున్నది. ఆతఁ డామెకొఱకు ధనము మంచినీళ్లవలె వాడుకొనుచున్నాఁడు. ఇంతేకాక జూదము—పానము—వీనికన్నిటికి నెంతధనమున్న సరిపోవును?

ప్రేమ—ఆతఁడు కంపెనీకాగితముల క్రయవిక్రయములవలనఁ జాలడబ్బుగడించినట్లు నేనెఱుంగుదును.

వకీ—నిదర్శనములు చూపవలయును. ఈవిధముగా రెండుచేతులను వ్యయపెట్టువానికి ద్రవ్యలోపము కలుగక మానదనియు, నందుచేతనే యాతఁ డిట్టిపని చేయుట కవకాశ ముండు ననియు జూరీ లభిప్రాయపడుచున్నారు. ఎట్లయినను గష్టపడి ప్రయత్నించి చూడవలెను. కేవలము లాభము లేదని చెప్పుట లేదు.

ప్రేమజీ నితాంతవిషణ్ణహృదయముతో నింటికిఁ బోయెను. ఆనాఁడు రత్నాబాయిసమాచార మేమియును దెలియలేదు.

పదియవప్రకరణము.

మఱియొక యుత్తరము.

సాయంకాల మైనతరువాత దాదాభాస్కరుఁ డింటికి వచ్చి భార్యం గాంచి "ఏమైన నీఁగడ తెలిసినదా?" అనియెను.

భార్య—లేదు.

దాదా—నీవు జాగ్రత్తగనే ప్రవర్తించితివా?

భార్య—ఆ.

దాదా—ఇప్పు డెక్కడ నున్నది?

భార్య—దినమంతయును బరితపించుచునే యున్నది. ఒక్క నిమిషమైనను స్తిమితముగా లేదు. పాప మాచిన్నది చాల దుఃఖపడుచున్నది!

దాదా—ఆతనిక్షేమముకొఱకుఁ బ్రయత్నించుచున్నప్పుడు కష్టపడకుండ నెట్లు సాగును?

భార్య—ఒక్కమాట—ఆమె యొకయుత్తరము వ్రాసి పోస్టునకుఁ బంపు మన్నది, మీకుఁ జూపించి పంపెద ననిచెప్పి తీసికొంటిని. మంచిపని చేసితినా?

దాదా—నీవు చాల బుద్ధిమంతురాలవు. ఆయుత్తర మేదీ!

భార్య యాతని కాయుత్తరమునందించెను. ఆతఁడు దానిం గైకొనిచదివెను. అందిట్లున్నది:—

"శ్రద్ధాస్పదుఁ డగుబర్జరజికి".—

రస్తమజీకి గలిగినకష్టమునుగూర్చి మీరు వినియే యుందురు. మీకిరువురకును బహిరంగముగ మైత్రి యున్నను నంతరంగమున వైరభావమున్నట్లు నేనెఱుంగుదును. ఎట్లయినను మీకు ధనమున కభావ

ము లేదు. మీరెట్లయినఁ బ్రాణపణంబుగఁ బ్రయత్నించి రస్తమజీని ప్పుడీవిపత్తునుండి యుద్ధరింపవలయు నని కోరుచున్నాను.

మీరట్లు చేయకున్నచో నాదినమున మీరును మాంచరజీయును మాటలాడుకొన్న సంగతులను నేను వెల్లడింపక మాననని నమ్మవలయును. అప్పుడు నేనాప్రక్కగదిలోనుండి మీప్రసంగ మంతయు నాలకించితిని. నేనిప్పు డెచ్చట నున్నదియు మీకుఁ దెలుపజాలను. తెలుపుటవలన మీకెట్టిప్రయోజనమును లేదు.

రత్నాబాయి."

దాదాభాస్కరుఁడాయుత్తరము నెప్పటివలె మడఁచి "ఇందు నేక వ్యాపారము లున్నట్లుగఁ గనఁబడుచున్నది. ఈవ్యవహారము నేననుకొన్నంత సామాన్యమైనది కాదు." అని యనుకొనియెను.

ఇంతలో రత్నాబాయి యొకయుత్తరమును జేతఁ బట్టుకొని యచ్చటికి వచ్చి యాతనిం గాంచి "ఎవ్వఁడో పిల్లవాఁ డీ యుత్తరమును నాచేతికిచ్చి పాఱిపోయినాఁడు" అని చెప్పెను.

దాదా—ఆయుత్తరము నేను చూడవచ్చునా?

రత్నాబాయి దాని నాతనిచేతి కిచ్చెను. ఆతఁ డిట్లుచదివెను—

"నేను రస్తమజీకిఁ బ్రాణమిత్రుఁడను. ఆతనిక్షేమముకొఱకు నేను నీతో రహస్యముగ మాటలాడవలసి యున్నది. నీవేకాంతస్థలమునకు వచ్చుటకు శంకింతు వనియెంచి నేనొకబహిరంగస్థానమును నిశ్చయించితిని. రాత్రితొమ్మిదిగంటలకు నేను ప్యారెలు స్టేషను నందుండెదను. అప్పుడు నీవక్కడకు వచ్చి నాతో మాటలాడవచ్చును."

దాదాభాస్కరుఁ డాయుత్తరమును జదివి ముగించి "నీవక్కడకుఁ బోయెదవా?" అనియెను.

రత్నా—నిశ్చయముగఁ బోయెదను.

దాదా—నీకిందువలనఁ గష్టములు గలుగవచ్చును.

రత్నా — ఇంతకంటెను గష్ట మేమి యుండును? నాకిఁక నట్టి భయము లేదు. అదిగో! అప్పుడే తొమ్మిదిగంటలు కొట్టుచున్నది.

అని చెప్పి యామె చటాలున వెలుపలికిఁ బోయెను. దాదాభాస్కరుఁడు నెక్కుయుమటున లేచి భార్యం బిలిచి "ఈచిన్నది పిచ్చిదై పోయినది—నాదుస్తులను వేగముగఁ దెమ్ము!" అని చెప్పి యాతఁడు భార్యయొసంగిన యుడుపురతో మారువేసముం దాల్చి యామె వెను వెంటనే పోయెను. కొలఁదిసేపటిలో రత్నాబాయి ప్యారెలు స్టేషనులోఁ బ్రవేశించెను. దాదాభాస్కరుఁడును నగపడకుండ నామెన నుసరించియేయుండెను.

అప్పుడొక యాజానుబాహుఁడగు పార్సీపెద్దమనుష్యుఁ డొకచో నొకబల్లపైఁ గూర్చుండియుండెను. ఆతఁడు రత్నాబాయిని జూచి నంతోడనే మెల్లగ లేచి నిలువఁబడియెను. రత్నాబాయియు మెల్లగ నాతనియొద్దకుఁ బోయెను. దాదాభాస్కరుఁ డప్పు డొక్కచోఁ జీకటిలో దూరముగ దాఁగియుండెను.

అప్పు డాపార్సీ యేమి చెప్పెనోగాని రత్నాబాయి యాతనిస మీపమున బల్లపైఁ గూర్చుండెను. దురదృష్టవశమున దూరమున నుండుటచే వారిమాటలు దాదాభాస్కరునకు వినఁ బడుట లేదు.

చాలసేపు వారిరువురును మాటలాడుకొని లేచి స్టేషను వెలుపలికిఁ బోయి యొకబండిపై నెక్కిరి. "ఈసారి సర్వవిషయములును దెలియుట కవకాశము కలిగినది." అని దాదాభాస్కరుఁ డనుకొని యెను. బండి కదిలెను. దాదాభాస్కరుఁడు నిశ్శబ్దముగ నాబండివెనుక వైపునఁ గూర్చుండి "ఇఁక నీబండి యెంతవేగముగఁ బోయినను సరియే!" అని యనుకొనియెను.

క్రమముగా బండి చాలదూరముపోయి యొకయింటిగుమ్మము నొద్ద నిలిచెను. దాదాభాస్కరుఁడు సత్వరముగ నుఱికి చీకటిలో నిక్కిఁ

బోయి దాఁగికొనియెను. తరువాత బండివాఁడు క్రిందికి దిగి పదినిమిషములవఱకును నిరీక్షించెను. కాని బండిలోపలినుండి యెవ్వరును దిగలేదు. బండివాఁడు బండిలోనికిఁ బ్రవేశించి చూచెను. ఆశ్చర్యము! అందొక్కపిట్టయైనను లేదు.

అది యంతయును జూచుచున్న దాదాభాస్కరుఁడు "వారు తన్ను గాడిదను జేసి తనకన్నులలో దుమ్ము చల్లి పాఱిపోయి"రని విచారించెను. ఆతఁడు బండివాని నొకటిరెండుమాటలనుగఁ దలంచెను గాని కోపముతో నున్నయాతఁ డెక్కడఁ దన్నుఁ దిట్టిపోయునో యని యొకటిరెండడుగులు జరగి నిలువఁబడియెను. ఇంతలో బండివాఁడు విసిగికొనుచు గుఱ్ఱమును బలవంతముగఁ గొట్టి బండిని బాణవేగమునఁ దీసికొనిపోయెను. దాదాభాస్కరుఁడు హతబుద్ధియై చాలసేపచ్చట నే యుండి యిఁక నట నుండుట వృథాప్రయాసమని యెంచి తనయింటికిఁ బోవుచు "ఇది యంతయు నిశ్చయముగఁ బ్రేమజీ చేసినపనియే" అనుకొనియెను.

దాదాభాస్కరుఁ డట్లింటికిఁ బోయి చూచెను. రత్నాబాయి రాలేదు. ఆమె తనచేతినుండి తప్పిపోయినదని యెంచి మఱి యేమి చేయుటకును దోఁచక "హారముసజీ సామాన్యుఁడు కాఁడు! ఆతఁ డెట్లయినఁ బ్రయత్నించి రత్నాబాయిని బట్టుకొనఁ గలఁడు; ఎట్లయిన నేమి! రేపీవిషయమునుగుఱించి యాలోచింపవలయును" అని నిశ్చయించుకొనియెను.

పదునొకండవ ప్రకరణము.

కీర్తికరుఁడు.

మఱునాఁటి యుదయమునఁ బోలీసుకచేరినుండి యుత్తరము వచ్చుటచే నతివేగముగ దాదాభాస్కరుఁ డచ్చటికిఁ బోయెను. ఆతఁడచ్చటికిఁబోయినతోడనే ఇన్స్పెక్టరొకఁ డాతనికగపడి "సూపరింటెండెంటుగారు నిన్నుఁ బిలుచుచున్నారు" అని చెప్పెను.

దాదాభాస్కరుఁ డతివేగముగఁ గచేరిగదిలోనికిఁ బోయెను. అందొక పెద్దబల్లపై సగము నరసినతలగల యొకమహారాష్ట్రపురుషుఁడు కూర్చుండి యుండెను. ఆతని బంగారుసులోచనములనుండి కన్నులు చుక్కలవలె మెఱయుచుండెను. ఆతఁడే సుప్రసిద్ధుఁడగు డిటెక్టివ్ సూపరెంటెండెంటు! ఆతనిపేరు కృష్ణజీ బలవంతకీర్తికరుఁడు!

దాదాభాస్కరుఁ డాతనికి సవినయముగ సలాము చేసెను. అప్పుడు కీర్తికరుఁ డాతనింగాంచి "బ్యాంకిదొంగతతమునుగుఱించి యెంతవఱకుఁ దెలిసికొంటివి? నేఁడు రిపోర్టుపంపవలయు ననుకొనుచున్నాను! మనతప్పువలన నూరక యాతఁడు కారాగారమున శ్రమపడుట యెందులకు?" అనియెను.

దాదాభాస్కరుఁడు తలగోకికొనుచు "ఇప్పుడు—అయ్యా! ఇప్పుడు—" అనియెను.

కీర్తికరుఁడు గభీరభావముతో "తెలిసినది! ఇంతవఱకు నీవించుకంతయును దెలిసికొనఁజాలకపోయితివి. ఇంతేకాక మీఁదుమిక్కిలి గొడవలోఁ బడిపోవుచున్నావు!" అనియెను.

దాదాభాస్కరుఁడు వినీతభావముతో సంశయించుచు "అయ్యా! ఇందునాతప్పంతగా నేదియును లేదు. నేను ప్రాణపణంబుగఁ బ్రయత్నించుచున్నాను. ఎట్టిసూత్రమును దొరకుట లేదు" అనియెను.

కీర్తికరుఁడు క్రోధస్వరముతో "నీవు కేవలమును మూఢుఁడవు. ప్రధానసూత్రమును నీవు ప్రథమదినమునందే కనుపెట్టితివిగాదా? బుద్ధి యున్నచో నీపాటికి దొంగను బట్టుకొనియే యుందువు!" అనియెను.

దాదా—తాము సెలవిచ్చినది యేసూత్రమునుగూర్చి?

కీర్తి—తెలియదా? హరమనజీరత్నమజీ లిరువురిలో నెవ్వరి తాళముచే నాపెట్టె తెఱవఁబడియెనో నీవించుక ప్రయత్నించినచో సులభముగఁ దెలిసికొనఁగలిగి యుందువు.

దాదా—ఎట్లు?

కీర్తి—ఆపెట్టెపై రంగుతోఁ దాళపుముద్ర పడియుండెను గదా?

దాదా—అవును

కీర్తి—అప్పుడే నీరాయిరువురితాళపుఁ జేతులను బరీక్షించినచో దేనికో యొకదానికి రంగు కనఁబడియే యుండును. కన్నులు మూసికొని పనిచేసినచో నీవేమి చేయఁగలవు?

దాదా—అవును నాపొరపాటు నాకిప్పుడు బోధపడినది.

కీర్తి—ఆయానవాలునుబట్టియే దొంగ దొరకవలయును. దానినిబట్టియే నేను దొంగను బట్టుకొందును.

దాదా—ఈవ్యవహారమున మీరును బ్రయత్నించుచుంటిరా?

కీర్తి—ఆ; కొంచెము కొంచెముగా— కాని— భారమంతయు నీమీఁద నున్నది. సరే— నీవింతవఱ కేమిచేసితివో నాకంతయును దెలుపుము!

దాదాభాస్కరుఁడు సర్వమును దెలియఁజేసెను. కాని రత్నాబాయి తనకన్నులలో మన్నుగొట్టి తప్పించుకొనిపోయిన సంగతిమాత్రము తిరస్కారభయముచేఁ జెప్పఁజాలకపోయెను.

కీర్తి—దాదా! నీవొక్కసంగతి మఱచిపోయితివి. ఆ వట్టిబండి వెనుకఁ గూర్చుండి నీవప్పు డెంతదూరము పోయితివి?

దాదాభాస్కరుఁ డాశ్చర్యాన్వితుఁడై యూరక కీర్తికరునివంక నివ్వెఱపడి చూచుచు "అయ్యా! అదియును మీకుఁ దెలిసినదా!" అనియెను.

కీర్తికరుఁడు మందహాసము చేయుచు "నాకన్నిసంగతులును దెలియునోయి! తెలియును! ఏదియును నాయొద్ద దాఁచుటకుఁ బ్రయత్నింపకుము!" అనియెను.

దాదా—ఓహో! బోధపడినది. ఆ పారసీవేషమనుష్యులు మీరే! – కాని యిప్పు డెంతలావుగ నున్నారు! నేనే మిమ్మానవాలు పట్టఁజాలకపోయితిని!

కీర్తి—నీకింతవఱకును మూఁడు వేసములసంగతియే తెలియలేదు. అందఱకును దెలియునట్లే యున్నచో నిఁక ఛద్మవేష మన నేమి?

దాదా—అట్లయినచో రత్నాబాయి సర్వమును మీకుఁ దెలిపియే యుండును.

కీర్తి— ఆ.

దాదా—ఆమె యెచ్చట నున్నది?

కీర్తి—నాయొద్దనే యున్నది. నేను చెప్పినట్లు చేయుటకు సిద్ధగా నున్నది.

దాదా—సరే–ఇఁక నేను చేయవలసినపని యేమున్నది?

కీర్తి—కావలసినంత యున్నది. అప్పుడే తేలినదా?

దాదా—దొంగ యెవ్వరో మీరు నిశ్చయించితిరా?

కీర్తి—ఇంకను నిశ్చయముగాఁ జెప్పఁజాలను. కాని హారమసజీయును రస్తమజీయును గూడ నీపని చేయలేదనిమాత్రము చెప్పఁగలను. ఇదిగో! ఈ చిత్రపటము చూడుము! ఇది యా యినుపపెట్టె ప్రతిబింబము. ఆ యానవాలిదిగో! ఇది తాళము తెఱచుచోటున కించుకక్రిందుగానున్నది. ఇది యెడమవైపునుండి కుడివైపున కించుక జరిగినట్లు చెదరియున్నది, చూడుము!

దాదా—స్పష్టముగ నట్లే యగపడుచున్నది.

కీర్తి— ఆ పెట్టెను దెఱచు సమయమునఁ దాళపుఁజేతిమూలముననే యీగుర్తు పడినది. చూడుము! ఈ యాకుపచ్చనిరంగు నీ తాళమున కద్ది దీనిపైముద్రించి చూడుము.

దాదాభాస్కరుఁడట్లు చేసి "ఈగుర్తు స్పష్టముగా నగపడుచున్నది. బలవంతముగ నొక్కినఁగాని యిట్టిగుర్తు పడుట కవకాశము లేదు" అనియెను.

కీర్తి—మంచిది. ఇట్టిగుర్తు పట్టుటకు బలవంతముగ నొక్కవలయు నని బోధపడినదిగదా? సరే! అప్పు డీగుఱు తెట్లు పడియుండునో నీవేమైన నూహించితివా?

దాదా—అయ్యో! నాకిది యంతయు నేమోగొడవగానున్నది. మీమాటలయర్థము నాకించుకంతయు బోధపడుటలేదు.

కీర్తి—బోధపఱచెదను చూడుము!

పండ్రెండవ ప్రకరణము.

విడుదల కుపాయము.

కీర్తికరుఁడు లేచి యొకతాళపుఁజేతికొనకు రంగును బూసి చేతఁబట్టుకొని తాను తాళము తెఱచుటకుఁ బ్రయత్నించుచు దాదాభాస్కరుఁడు తన్ను బలవంతముగ నడ్డగించుచున్నట్లు నటియింపఁ జేసెను. అట్లువారిరువురును బెనఁగులాడుకొనుచుండు సమయమునఁ దీవ్రబలప్రయోగముచేఁ గీర్తికరుఁడు తాళమును దెఱచుటకు ప్రక్రమించెను. అప్పుడు తాళపుఁజేయి తాళముపై బలవంతముగఁ నదుముకొనుటచే దానికొననున్న రంగుతో నొకయానవాలు పడియెను. ఆగుర్తుం గాంచి దాదాభాస్కరుఁడొక్కగంతువైచెను. అప్పు డాతనికి స్వర్గము కరగతమైనట్లుండెను.

కీర్తి—చూచితివా? ఈవిధముగనే యాపెట్టెమీఁదఁగూడఁ దాళపుగుర్తు పడినది. తెలిసినదా?

దాదా— తెలిసినది. నిజముగనిట్లే—

కీర్తి—ఇఁక నీసంగతి యంతయును బోధపడినదా?

దాదా—మూఢునకైనను దెలిసిపోవుచున్నది.

కీర్తి—నీకేమి తెలిసినది?

దాదా—తెలియ కేమి? ఆదొంగతనము చేయుచున్నప్పు డిరువు రున్నారు. ఒకఁడు తాళము తెఱచుచుండఁగా రెండవవాఁ డడ్డగించుచుండెను. ఔను; నేననుకొన్నట్లే యైనది. రస్తమజీ దొంగతనము చేయలేదు. ఇష్టమున్నచో నాతఁ డాపెట్టెలోనిసొమ్ము నెప్పుడైనను స్వయముగనే తీసికొనఁగలఁడు. ఆతని నడ్డగించుటకు మఱియొకరుండవలసినపని యేమి? కాని యీదొంగతన మొకరు చేయుచుండఁగా నింకొక రడ్డగించుచున్నట్లు తోఁచుచున్నది. ఇది యెట్లు సంభవించును?

కీర్తి—ఈప్రపంచమున నసంభవ మగునది యేదియును లేదు. ఆతనిప్రియమిత్రుఁ డగు ప్రేమజీ దొంగతనము చేయుచుండఁగా రస్తమజీ యడ్డగింపఁగూడదా?

దాదా—అట్లు జరుగవచ్చును. అట్లయినచోఁ బ్రేమజీ దొంగయై యుండునని మీరనుమానించుచున్నారా?

కీర్తి—నేనింకను నేదియు స్థిరసిద్ధాంతము చేసికొనలేదు. ఇప్పుడు నేనేదియును నిశ్చయముగఁ జెప్పఁజాలను.

దాదా—కాని, యాతాళమును దెఱచుపద్ధతి హారమసజీరస్తమజీలకుమాత్రమే తెలియును. ఆసొమ్ము రస్తమజీ తీయలేదన్నచో నిశ్చయముగ హారమసజీయే తీయవలయును.

కీర్తి—ఈవిషయమున నేకారణముచే రస్తమజీపై సందేహము లేదో యాకారణముచేతనే హారమసజీపైనిగూడ ననుమాన ముండఁగూడదు! ఆతఁడు గూడఁ దనయిష్టము వచ్చినప్పుడు సొమ్ము తీసికొనఁగలఁడు! రహస్యముగ నేల తీసికొనవలయును? ఆతనిసొమ్ము నాతఁడు తీసికొనుచున్నప్పు డాతని నిర్బంధించువా రెవ్వరుందురు?

దాదా—అదియును నిజమే—అట్లయినచో దొంగిలించినవా రెవ్వరై యుందు రని మీయభిప్రాయము?

కీర్తి—ఈయిరువురును గాక మూఁడవవా రెవ్వరో యీపని చేసి యుందురు. ఆతృతీయవ్యక్తిని గనుఁగొనుటకే యిప్పుడు మనము ప్రయత్నింపవలయును.

దాదా—ఆధనాగారమున లోపలినుండి ప్రవేశించుట కొక ద్వారమున్నది. లోపలినుండియే యెవ్వరో వచ్చి యాపని చేసియుందు రని మీరనుమానించుచున్నారా?

కీర్తి—ఒకవేళ నట్లు జరిగినను జరుగవచ్చును.

దాదా—ఎంతదారుణము! అట్లయినచో హారమసజీభార్యాపుత్రికలలో నెవ్వరిపైనైన మీకనుమాన మున్నదా?

కీర్తి—నేనిప్పు డేదియు నిశ్చయించుకొనలేదు. సంధానము చేయవలయును. నేను ప్రయత్నించి చూచెదను! తప్పక దొంగ దొరకి తీరును.

దాదా—ఇప్పు డిఁక నన్నేమి చేయుమనియెదరు?

కీర్తి—తరువాతఁ జెప్పెదను. ఇప్పుడు నీవు రిపోర్టు వ్రాసి స్వయముగాఁ బోయి కమీషనరుగారి కిచ్చి రమ్ము. అడిగినచో వారికి సర్వమును దెలుపుము! నిరపరాధి యగురస్తమజీ నింకను గారాగృహమునం దుంచుట యుచితము కాదు.

దాదా—అయినచో నేనిప్పుడే పోయెదను.

కీర్తి—కమీషనరు సాధారణముగా రస్తమజీని విడువఁడు! ఆతఁ డైదువేలరూపాయలకు జామీను కోరు నని తోఁచుచున్నది. కావున నీవు హారమసజీయొద్దకుఁ బోయి రస్తమజీకి జామీనుండు మని కోరుము. ఆతఁ డేమి చెప్పునో చూతము.

దాదా—ఆతఁ డంగీకరించునని తోఁచదు.

కీర్తి—అంగీకరించు ననియే నానమ్మకము!

దాదా—అయ్యా! నాకు మీకంటె నెక్కువగాఁ దెలియునా?

అని చెప్పి దాదాభాస్కరుఁడు సెలవుగైకొని పోయి సర్వమును రిపోర్టువ్రాసి కమీషనరును సందర్శించి యిచ్చి రస్తమజీ నిర్దోషి కాఁడని సకారణముగ నాతని కెఱింగించెను. మఱియు నిరపరాధి యగు నాతని నూరక యనుమానించి కారాగృహమునం దుంచుట యుచితము కాదనికూడఁ దెలిపెను.

కీర్తికరుఁ డూహించినట్లే జరిగెను. అయిదువేలకు జామీనిచ్చినచో రస్తమజీని విడుదల చేయవచ్చు నని కమీషనరు హుకుము వ్రాసెను. ఆయుత్తరువు నాలకించి చింతితహృదయముతో దాదాభాస్కరుఁడు హారమసజీయింటివైపునకుఁ బోయెను.

పదుమూడవ ప్రకరణము.

జాబాయి.

హారమసజీ జామీనున కంగీకరించు నని దాదాభాస్కరున కంతమాత్రము నమ్మకము లేదు. అయినను నాతఁడు తనగురుని యానతి ననుసరించి యాతనియింటికిఁ బోయెను. ఆతఁడు వచ్చుటం గాంచి ప్రేమజీ సత్వరముగ లేచి యాతని సమీపించి సగౌరవముగ సంభాషించెను.

దాదా—హారమసజీ యెక్కడ?

ప్రేమ—ఆయన యింకను గచేరికిరా లేదు. మేడమీఁదనే యున్నారు. ఎవ్వరైనఁ దమకొఱకు వచ్చినచో సమాచారము తెలుపవలయు నని యాజ్ఞాపించినారు.

దాదా—అట్లయినచో నేను వచ్చినట్లు తెలియఁజేయుము.

ప్రేమ—క్రొత్తసమాచారమేమైన నున్నదా యేమి? నేను వినవచ్చునా?

దాదా—వినవచ్చును! రస్తమజీ దొంగ కాఁడని సప్రమాణముగఁ దెలియవచ్చినది.

ప్రేమజీ యానందవికసితవదనముతో "నేను మొట్టమొదటనే చెప్పితినిగాదా?" అనియెను.

దాదాభాస్కరుఁడు తనలోఁదానే "అప్పుడే చంకలువైచుకొనకోయి" అని యనుకొనియెను.

అంతలో బ్యాంకిలోనియుద్యోగు లందఱు నాతనియొద్దకు వచ్చి "అయ్యా! ఆతనికి విడుదలయైనదా?" అని యేకగ్రీవముగ నడిగిరి.

దాదా—ఇంకను లేదు—ఉత్తరువైనది. అయిదువేలకు జామీనియ్యవలయును. హారమసజీ యిచ్చునేమోయని యడుగుటకే నేనిచ్చటికి వచ్చితిని.

ప్రేమ—ఆయన జామీనిచ్చునా?

దాదా—అడిగి చూచెదను! ఆతఁ డీయకున్నచో మఱి యెవ్వరియ్యఁగలరు?

ప్రేమ—జామీను లేకున్నచో నైదువేలరూపాయలు చెల్లించినఁ జాలదా?

దాదా—చాలును.

అప్పు డచ్చటి యుద్యోగు లందఱు నేకవాక్యముగా "మాయందఱియొద్దను నిలువయున్న సొమ్మంతయును జేర్చి చెల్లించి మేమాతనిని విడిపించుకొందుము!" అని చెప్పిరి.

దాదా—అట్లేచూతము. హారమసజీకి నావచ్చినసమాచారమును దెలుపుఁడు!

సమాచారము పంపఁబడియెను. తోడనే హారమసజీ దాదాభాస్కరుని మేడమీఁదికి రమ్మని తెలియఁజేసెను. దాదాభాస్కరుఁడు

మేడమీఁదిగదిలోనికిఁ బోయెను. హారమసజీ యాతని గూర్చుండ నియోగించి "ఇంకను నేమైనవిశేషములను దెలిసికొనవలసివచ్చితిరా?" అని యడిగెను.

దాదా—లేదు. కాని రుస్తుమజీ దోషి కాఁడని సప్రమాణముగ మాకుఁ దెలియవచ్చినది.

హార—అట్లయినచో నీదొంగతనముచేసినవారు మఱియెవ్వరు

దాదా—ఆసంగతి నేనింకను జెప్పఁ జాలను.

హార—మీ కెవ్వరిపై ననుమానమున్నది?

దాదా—ఇంతవఱ కెవ్వరిమీఁదను లేదు.

హార—దొంగ దొరకునా?

దాదా—తప్పక దొరకును.

హార—మీరు రుస్తుమజీని విడిపించితిరా?

దాదా—ఇంకను లేదు. అందుకొఱకే మీయొద్దకు వచ్చితిని

హార—ఏల?

దాదా—అయిదువేలకు జామీనిచ్చినచో నాతని విడుచు కుత్తరువైనది. అట్లాతనికి జామీ నిచ్చువా రిప్పు డెవ్వరును లేర మీరిచ్చెదరేమో తెలిసికొనవలయు నని వచ్చితిని.

హార—నేనా?

దాదా—ఏమి? ఆతఁడు మీధనము నపహరించినవాఁడు కా నప్పుడు మీరాతనికి జామీనిచ్చుట కేమియభ్యంతర ముండును?

హార—ఎన్నటికి నట్లు జరుగదు, ఆతనియెడల నాకెంతమాత్ర మును విశ్వాసము లేదు.

దాదా—ఆతఁడు దొంగ కానప్పుడు మీరిట్లు చెప్పఁగూడద

హార—మీరు నన్నిట్లు నిర్బంధించుట న్యాయము కాదు—ఇం కను నేమైన మాటలాడవలసి యున్నదా?

దాదా—లేదు.

అని యాతఁడు చటాలున లేచి నిలువఁబడియెను. అంతలోఁ భార్శ్వద్వారము తెఱవఁబడియెను. వెంటనే రాజాబాయి యచ్చటికి వచ్చి నాథునిపార్శ్వమున నిలువఁబడి వ్యాకులస్వరముతో "మీరు జామీ నియ్యవలయును" అని ప్రార్థించెను.

హారమసజీ యత్యంతవిస్మయాకులహృదయముతోఁ దనభార్య మొగమువంకఁ జూచి "ఏమియీయాశ్చర్యము! నేనా? ఎన్నటికి నట్లు జరుగదు—ఈవ్యవహార మంతయు నాఁడుదానికి నీ కేమి తెలియును?" అనియెను.

రాజాబాయి—రుస్తుమజీ యాధనము నపహరింపలే దని నేను నిశ్చయముగ మరల మరలఁ జెప్పుచున్నాను. నామాటయందు మీకు నమ్మకము లేదా? ఆతఁడు నిరపరాధి! ఇట్టిస్థితిలో నాతనికి మీరు జామీ నియ్యకున్నచో మఱియెవ్వ రిచ్చెదరు?" అనియెను.

హార—ఈ సంగతులు నీ కేమియును దెలియవు. ఆవలకుఁ బొమ్ము!

రాజా—మీరు జామీ నిచ్చుటకు సమ్మతించువఱకు నేనిట నుండి పోఁజాలను. ఏమి చేసినను బోఁజాలను.

హార—నీవు నాకుఁ గ్రోధమును గల్పింపక నామాట విని లోనికిఁబొమ్ము!

అప్పుడు రాజాబాయి యాకస్మికముగ భర్తపాదములచెంతఁ బడి మోకరించి గద్గదకంఠస్వరముతో "నేనెన్నఁడును మిమ్ముల నీవిధముగా నెవ్వరినిగుఱించియునిర్బంధించి చెప్పియుండలేదు; ఇంతబలవంతమును జేయలేదు. ఇప్పుడు నాప్రార్థన నంగీకరింప వలయును" అనియెను.

హారమసజీ దిగ్గున లేచి "నీవు కేవలమును మూఢురాలవై పోవుచున్నావు! ఇచ్చటనొక పరాయిపెద్దమనుష్యుఁ డున్నాఁడనియైన

నీకు సిగ్గుకలుగుట లేదా ? " అని పలుకుచు నాతఁడు తత్తరముతో రాజాబాయి చేయి పట్టుకొని లేవనెత్తెను. అప్పు డామెనయనద్వయము నుండియు నశ్రుధారలు ప్రవహించుచుండెను. హారమసజీ యప్పు డామెను బలవంతముగ మఱియొకగదిలోనికిఁ దీసికొనిపోయెను.

దాదాభాస్కరుఁ డప్పుడు తనలో " మాగురుమహాశయునకుఁ గూడ నింతవఱకును దెలియని యీచౌర్యరహస్య మీరమణీమణికి సంపూర్ణముగఁ దెలిసియే యుండును. ఈయూహాయే యసత్యమైనచో నిఁక నీలోకమున నావంటిమూఢుఁడు మఱి యెవ్వఁడు నుండఁబోఁడు." అని యనుకొనుచుండెను.

ఇంతలో హారమసజీ మరల నచ్చటికి వచ్చి " అయ్యా! నేనాతనికొఱకు జామీను నిచ్చెదను. నడువుఁడు ! " అనియెను.

హారమసజీబుద్ధి యిట్లాకస్మికముగఁ బరివర్తనముం గాంచినందులకు దాదాభాస్కరుఁడు విశేషాశ్చర్యాన్వితుఁడు కాలేదు. ఏమనిన, అట్లు జరుగునని యాతనిగురుండగు కీర్తికరుఁ డిదివఱకే నిశ్చయముగఁ జెప్పి యుండెను ! అప్పుడాయిరువురును మేడనుండి క్రిందికి దిగి నిశ్శబ్దముగ వెలుపలికి వచ్చిరి. ఉద్యోగులందఱు నాశ్చర్యముతోఁ జూచుచుండిరి! అప్పుడొకవృద్ధోద్యోగి "హారమసజీ రస్తమజీని మిగులఁ బ్రేమించుచుండెను; కావుననే యాతనికి జామీను నిచ్చుటకై పోవుచున్నాఁడు ! ఈసంగతిని బట్టి మీకు సర్వమును బోధపడుటలేదా?" అనియెను.

పదునాలుగవ ప్రకరణము.

విడుదల

నేఁటికి వారముదినములనుండి రస్తమజీ కారాబంధమునందే యుండెను. ఆతఁడు తనదుఃఖములోఁ దానే చచ్చిపోవుచుండెనుగాని యెవ్వరితోడను మాటలాడుట లేదు. నిరంతరమును గారాబద్ధులతోఁగలసి యుండి వారిచే నప్పు డప్పుడు పరిహసింపఁబడుచు లజ్జావమానములను భరింపఁజాలక యాతఁడు మృత్యువును గోరుకొనుచుండెను. ఈవారము దినములలో నాతఁడు ముసలివానివలె నైపోయెను.

వివిధవిచారములచే నాతనిహృదయము సర్వదా వ్యాకులపడిపోవుచుండెను. ఆతఁడప్పుడప్పుడు తనలో " ఇంతటి యవమానమును నెత్తిపైఁ బెట్టుకొని యింకను జీవించుటవలన నేమిలాభము ? ఆత్మహత్యచేసికొనఁగూడదా ? కూడదు. ఆత్మహత్య మహాపాపముగదా ! నేను నిరపరాధి నని లోకమున కెఱింగించిన తరువాతఁ జచ్చిన మంచిది కాదా ? అయ్యో ! ఇఁక నామాట లెవ్వరు విశ్వసింతురు ?—ఇట్టిస్థితిలో నన్నందఱును మఱచిపోయినారు. ప్రేమజీయును మఱచెనా ? నన్ను విడిపించుట కాతఁడైన నెట్టిప్రయత్నమును జేయఁడా?—నాకుఁ జావే మంచిది. కమలకూడ నిశ్చయముగ నన్నుఁ జోరునిగా భావించి యుండును. ఇప్పు డామె యేమనుకొనుచున్నదో! ఇఁక నేను లోకులయెదుట నామొగమును జూపించుట యెట్లు ? —అయ్యో ! రత్నాభాయి నన్ను హృదయపూర్వకముగఁ బ్రేమించి యున్నది. ఆమెమాత్రము నన్ను మఱవఁజాలదు. నానిమిత్తమై యామె మిగులఁ గష్టపడుచుండును ! నిశ్చయముగ నామె నాయుత్తరము ప్రకారము మాయింటిని విడిచిపోయి యుండును ! పాప మెక్కడకుఁబోయినదో?

ఎట్లు తెలియును ? అక్కటా ! నానిమిత్తమున నామె యెట్టికడగండ్ల ననుభవించుచున్నదోగదా ! " అని యీవిధముగ భావించుకొనుచుండెను.

ఇంతలోఁ గారాగృహము తెఱచినట్లు చప్పుడగుటచే నాతఁ డదరిపడి ద్వారమువంకఁ దిలకించెను. అప్పుడు తలుపు తెఱచుకొని రక్షకభటుఁడు వచ్చి యాతనిం గాంచి కటుస్వరముతో " సత్వరముగ రమ్ము ! దొరగారు పిలుచుచున్నారు, " అనియెను.

రస్తమజీ భయముతోఁ దనలో " పరమేశ్వరా ! ఇంకను నేమిచేయఁదలఁచితివి ! నాతలపైఁ బిడుగుపడఁగూడదా ! ఇఁక నేనీయవమానమును సహింపఁజాలను " అని యనుకొనుచు నిశ్శబ్దముగా నారక్షకభటునితోఁ గలసి దొరగారియొద్దకుఁ బోయెను. దొర యాతనిఁజూచి " ఓయీ ! నిన్ను జామీనుపైవిడుచుట కుత్తరువైనది. ఈకాగితముపై వ్రాలు చేయుము " అనియెను.

రస్తమజీ కామాటలయర్థము బాగుగ బోధపడలేదు. యంత్రప్రతిమవలె నాతఁ డాకాగితముపై వ్రాలు చేసెను. తోడనే యాదొర "ఈతనికి విడుదల యైనది " అనియెను.

రక్షకభటుఁ డాతని వెంటఁబెట్టుకొని రాజవీథిలోనికిఁ దీసికొని పోయెను. రస్తమజీ యచ్చటఁ గొంతసేపటివఱకును స్తంభితుఁడై నిలువఁబడిపోయెను. క్రమముగా నాతఁడు తెలివి తెచ్చుకొని తాను కారాగృహవిముక్తుఁడ నైతినని తెలిసికొనియెను. తన కెవ్వరు జామీ నిచ్చిరో, తన్ను జామీనుపై నాకస్మికముగ వదలుటకుఁ గారణమేమో, ద్రవ్యము నపహరించినదొంగ దొరకెనో లేదో యను నాలోచనలచే నాతనిహృదయము తత్తరపడుచుండెను. వీథిలోని జనులందఱు నాశ్చర్యముతో నాతనివంకఁ జూచుచుండిరి. అందుచే నాతఁ డచ్చట నిలువఁజాలక సత్వరముగ వెడలిపోయెను.

ఎక్కడకుఁబోవలయునో నిశ్చయించుకొనకుండఁగనే యాతఁ డన్యమనస్కుఁడై యతివేగముగఁ బోవుచుండెను. ఇంతలో నెవ్వరో వచ్చి యాతనివెన్నుపైఁ జేయివైచి నిలుపుటచే నాతఁడదరిపడి వెనుకకుఁదిరిగి చూచెను. ఆతఁడెవ్వఁడు? హరమసజీ తోడియల్లుని తనయుఁడగు మాంచరజీ! ఆతనితోఁ జాలదినములనుండి మైత్రి కలిగియుండుట వలన రస్తమజీ యప్పు డాతనిమొగము చూచుటకు సిగ్గుపడియెను; కాని తాను బయటఁబడి యొకపరిచితుని జూడఁగలిగినందులకు మిగుల నానందపడియెను.

అప్పుడు మాంచరజీ "నాకిప్పుడున్న యానందమునుగూర్చి నేను చెప్పఁజాలను. పోలీసువారూరక బుద్ధిహీనులై నిన్ను నిర్బంధించినారు. నీవిట్టినీచపుఁబనులు చేయువాఁడవు కావని మేమప్పుడే యనుకొన్నాము ! " అనియెను.

రస్త—అవును. మీకు నాయందట్టి ప్రేమయే.

మాంచ—ఇప్పు డెక్కడకుఁ బోయెదవు ? మాయింటికి రమ్ము!

రస్త—వలదు. నేనిప్పు డొకసారి ప్రేమజీని జూచి తరువాత నింటికిఁ బోవఁదలఁచితిని. బ్యాంకి కిఁకఁ బోవఁదలఁచుకొనలేదు. నీవొక పనిచేసినచో నాకుపకారముగనుండును.

మాంచ—ఏమి చేయవలయునో చెప్పుము!

రస్త—నాసంగతి ప్రేమజీకిఁ జెప్పి త్వరగా నాతని నింటికి రమ్మనుము. నే నాతనికొఱకు నిరీక్షించుచుండెదను.

మాంచ—అట్లే చేసెదను. మరల రాత్రివచ్చి నిన్నుఁ జూచెదను.

అని చెప్పి యాతఁడు వెడలిపోయెను. రస్తమజీ రత్నాబాయి యింటిమొగముగ బయలుదేరెను. త్రోవలోఁ బోవుచుండఁగా నాతని నందఱును దెల్లపోయి చూచుచున్నట్లాతనికిఁ దోఁచుచుండెను.

ఆతఁడట్లు రత్నాబాయియింటియొద్దకుఁ బోయి లోపలఁబ్రవేశించెను. అప్పుడాతనికుండె యతితీవ్రముగఁ గొట్టుకొనఁదొడంగెను.

ఆగృహంబున నెవ్వరును లేనట్లాతనికిఁ దోఁచెను. అంతట నిశ్శబ్దముగా నుండెను. ఆతఁడు కంపితహృదయముతో నామందిరమునఁ బ్రవేశించుచుండెను.

పదునేనవప్రకరణము.

మరల బందీ.

రస్తమజీ సంతోషముతో మేడమీఁది కెక్కెను. అన్నిగదులును మూయఁబడి యుండెను. తాళముల నడుగుటకు సేవకుఁ డొక్కఁడును లేఁడు. ఆనందాలాపములచే మాఱుమ్రోఁగుచుండు నాసుందరమందిర మప్పుడు నిశ్శబ్దమై యుండెను. సేవకులగృహము కూడ మూయఁబడియేయుండెను.

అప్పుడు రస్తమజీ హృదయమున దారుణమగువేదన యుదయించుటచే శీఘ్రముగ నాయిల్లు విడిచి మెల్లమెల్లగా కలబాదేవీవీధి నున్నప్రేమజీయింటికిఁ బోయెను. ఆతఁడు వచ్చునప్పటికిఁ బ్రేమజీ యాతనికొఱకు నిరీక్షించుచునే యుండెను. మాంచరజీ చెప్పినవెంటనే బయలుదేరి యాతఁ డింటికి వచ్చియుండెను. అప్పుడా ప్రాణమిత్రులసమ్మేళనమునుగూర్చి ప్రయాసపడి మేము వర్ణింపఁదలఁచుకొనలేము. ఆయిరువురి నయనములనుండియు నప్పుడొక్కసారిగా నశ్రుధారలు ప్రవహింపఁదొడంగెను.

అప్పుడు కొంతసేపటికి రస్తమజీ యించుక ప్రకృతిస్థుఁడై "నాకు జామీనిచ్చినవా రెవ్వరో నీ వెఱుఁగుదువా?" అని ప్రశ్నించెను.

ప్రేమ—హరమసజీ యైయుండును. దాదాభాస్కరుఁ డాతనిని జామీనిమ్మని కోరియుండెను. తరువాత నాయిరువురును గలసి వెడలిపోయిరి—

ఆమాట విని రస్తమజీ మఱియేమియు మాటాడలేదు.

ప్రేమ—ఆతఁడట్లు చేయుట నీకుఁ గష్టముగా నున్నట్లున్నదే!

రస్త—దానికేమి? కాని యాతఁడే యీసొమ్ముఁ దీసికొని దొంగతనము నాపై నారోపించెనేమో!

ప్రేమ—కాకున్నచో నాపెట్టెను వెదకుపద్ధతి యితరుల కెట్లు తెలియును? ఆరహస్యము నీవితరుల కెవ్వరికైన వెల్లడించితివా?

రస్త—లేదు.

అప్పుడు ప్రేమజీ తన కైదువేలరూపాయలను బంపుచు నెవ్వరోవ్రాసినయుత్తరమును రస్తమజీకిఁ జూపించి "ఈయుత్తరము సొమ్ము నపహరించినవారే వ్రాసియుందురు. కానిచో నింతసొమ్ము నూరక యేలపంపుదురు?" అనియెను.

రస్త—మిత్రమా! నాకేమియును బోధపడుట లేదు. హారమసజీ తనధనమును దానేల దొంగిలించును?—ఈసొమ్మును బంపినవా రెవ్వరైయుందురు?

ప్రేమ—కమలాబాయి పంపియుండెనేమో?

ఇరువురును గొంతసేపటివఱకును మౌనముతోఁ గూర్చుండిరి: పిమ్మట రస్తమజీ "సోదరా! ఎట్లయిననేమి? ఈయపకీర్తిని బోఁగొట్టుకొనవలయును. నేను నిరపరాధి నని లోకమునకు నిరూపింపవలయును. మనము నిశ్చయముగ పోలీసువారికి సాయపడి పని చేసినచోఁ దప్పకుండ దొంగ దొరకవచ్చును." అనియెను.

ప్రేమ—అవశ్య మట్లే చేయవలయును.

రస్తమజీ యించుకసే పూరకుండి యాకస్మికముగా "రత్న మెక్కడ నున్నది?" అని ప్రశ్నించెను.

ప్రేమ—తెలియదు—నేను నీయుత్తరము నామె కీయఁజాలక పోయితిని. ఆదినముననే దాదాభాస్కరుఁ డాయుత్తరమును బలవంతముగ నాకడనుండి లాగికొన్నాఁడు! ఆతఁడే యామె కాయుత్తరము నందించెను. తోడనే యామె యిల్లువిడిచి పోయినది.

రస్త—ఎక్కడకు?

ప్రేమ—ఆమె ప్యారెలులో దాదాభాస్కరునియింట దాఁగి యున్నట్లు విశ్వప్రయత్నము చేసి నేను తెలిసికొంటిని.

రస్త—ఇంకను నచ్చటనే యున్నదా?

ప్రేమ—లేదు. నేను దాదాభాస్కరునిభార్యను దర్శించి తెలిసికొంటిని. ఎవ్వరో జాబువ్రాయుటచే నామె యొకనాఁడు వానిని దర్శించుటకు ప్యారెలు స్టేషనునకుఁ బోయినదఁట! మఱి యింటికి రాలేదఁట! ఎక్కడకుఁ బోయినదో యెవ్వరికిని దెలియలేదని యామె నాకుఁ జెప్పినది.

రస్త—ఆమె నెవ్వరైన నెచ్చటనైన నిర్బంధించి యుఁడరుగద?

ప్రేమ—అట్లును జరుగవచ్చును. కాని యామె సాధారణముగ నితరులకు లోఁబడునది కాదు.

రస్తమజీ మ్లానహాసము చేయుచు "అవును. ఆమె యంతటి యబల కాదు. ముఖ్యముగా నిప్పు డామెయనుసంధానము గావింపవలయును. నీవొకసారి పోయి దాదాభాస్కరుని దర్శించి మాటలాడినచో నాతఁడేమైన నీకుపాయమును సూచింపఁగలఁడు!" అనియెను.

ప్రేమ—సరే. నేనిప్పుడే పోయెదను. మరల నీదర్శన మెక్కడ?

రస్త—నేనింటికిఁ బోయి యచ్చటనే నీకొఱకు నిరీక్షించుచుందును.

అంత వారిరువురును వెలుపలికి వచ్చిరి. ప్రేమజీ సత్వరముగ కోర్టుదిక్కుగాఁ బోయెను. రస్తమజీ యెక్కడకుఁ బోవుటకును దోఁచక కొంతసేపటివఱకచ్చటనే నిలిచి యుండెను.

అంతలో వెనుకనుండి యెవ్వరో వచ్చి యాతనిభుజముపైఁ జేయివైచిరి. ఆతఁడదరిపడి తిరిగిచూచెను. ఆవచ్చినవాఁడు పోలీసు ఇన్స్పెక్టరు!

ఇన్—నీపేరితో నొకవారంటు వచ్చినది. పేస్టనజీని జంపిన నేరమునకై నిన్నుఁ బట్టుకొనుచున్నాను.

రస్తమజీ స్తంభితుఁడై "పేస్టనజీ!—పేస్టనజీహత్య! ఏపేస్టనజీ? హత్య యెప్పుడు జరగినది?" అనియెను.

ఇనస్పెక్టరు హత్యావృత్తాంతమంతయును సంక్షేపముగ నాతని కెఱింగించెను. రస్తమజీ యంతయును విని "ఆతఁడు బండిలో మరణించెనా? ఆరాత్రి గిరిగామసమీపమున బండిలో నాతఁడును నేనును గలసిపోవుచున్నట్లు చూచినవారు చెప్పిరా?" అని ప్రశ్నించెను.

ఇన—నేనొక్కమాట చెప్పుచున్నాను. నీవిప్పు డేమి యడిగినను నేమిచెప్పినను దరువాత నీకే యవి విరుద్ధముగఁ బరిణమింపవచ్చును.

రస్త—అట్లయినచో నేనిప్పు డేమియు మాటాడను.

అని యాతఁడనుచుండఁగా వెనుకనుండి యెవ్వరో వచ్చి "రస్తమజీ! భయము లేదు. నేను నిన్ను విడిపించెదను" అనియెను. రస్తమజీ తిరిగి చూచెను. అట్లు చెప్పినవాఁ డొకమహారాష్ట్రవృద్ధధనికునివలె నుండెను.

రస్త—అయ్యా! నేనెన్నఁడును మీదర్శనము చేసినట్లు తోఁచుట లేదు.

వృద్ధు—నేను నీజనకునకు మిత్రుఁడను. కారాగృహమునకు వచ్చి నిన్ను దర్శించి యెల్లసంగతులను నీకుఁ దెలిపెదను.

రస్తు—దయయుంచి మీరు నామిత్రుఁడగు ప్రేమజీకి నా విపద్వార్తను దెలియఁజేయుఁడు! ఆతనియిల్లిదే!

వృద్ధు—అలాగే.

ఇనస్పెక్టరప్పు డాతని నొకబండిపై నెక్కించుకొని సత్వరముగ వెడలిపోయెను. పండ్రెండుగంటలుకొట్టకుండఁగనే మందభాగ్యుఁడగు రస్తమజీ మరలఁ గారాగారమునం దుంపఁబడియెను.



రహస్యవిప్లవము.

ద్వితీయఖండము. —హంతకుఁడెవ్వఁడు?

మొదటిప్రకరణము.

అపరాధి యెవ్వఁడు?

మఱునాఁడు రెండుగంటలకు దాదాభాస్కరుఁడు బయలుదేరి పోయి కీర్తికరుని దర్శించెను.

కీర్తి—దాదా! దొంగతనపునేరమునుగుఱించి తరువాత నేమైనను దెలియవచ్చినదా?

దాదా—ఆ. తనకెవ్వరో యైదువేలరూపాయలను బంపుచు నొకయుత్తరమును వ్రాసిరని ప్రేమజీ చెప్పియున్నాఁడు. ఆసొమ్ము రస్తమజీని విడిపించుటకుపయోగింపవలయు నని వ్రాసిరఁట! వ్రాసినవా రెవ్వరోమాత్రము తెలియుట లేదు.

కీర్తి—ఎవ్వరు వ్రాసి యుందురని నీయభిప్రాయము?

దాదా—ఎవ్వరును వ్రాయలేదు. దొంగిలించినసొత్తు నుపయోగించుకొనుటకై పన్నినతంత్ర మిది!

కీర్తి—నీవిప్పుడు మీహోరమసజీని వదలి ప్రేమజీని బట్టుకొనవలయు నని తలంచుచున్నట్లు తోఁచుచున్నదే!

దాదా—ఆసొమ్ము రస్తమజీ యపహరింపకుండుటయే సత్యమైనచో నిశ్చయముగఁ బ్రేమజీ దొంగిలించి యుండును. ఆతఁడు

రస్తమజీకిఁ బ్రియమిత్రుఁడు—కావున నాతని కెల్లరహస్యములును దెలియుట కవకాశ మున్నది.

కీర్తి—రస్తమజీ మరల బంధింపఁబడినట్లు నీకుఁ దెలిసినదా?

దాదా—(విస్మయముతో) ఏమి?

కీర్తి—ఇట్టివార్తయే తెలిసికొనఁజాలనివాఁడవు నీవెట్లు తల యెత్తుకొని పత్తేదారుపని చేయుచున్నావు? ఇంతవఱకు నీవు చేసినపని గడ్డిపరకయంతైనను లేదు.

దాదా—ఈచౌర్యవ్యాపారమునఁ బడియుండుటచే నాకితరవిషయములు తెలియుట లేదు. మరల నాతని నేల బంధించిరి?

కీర్తి—హత్యాపరాధమునకు?

దాదా—హత్యయా? ఏహత్య?

కీర్తి—నీవు కేవల మిప్పుడే యాకాశమునుండి యూడిపడినట్లున్నావే!—పేస్టనజీహత్య!—బండిలోనిహత్య!

దాదా—పాపమది రస్తమజీకేమి తెలియును? ఆహంతకుఁడు ప్రేమజీయైనట్లు స్పష్టముగాఁ దెలియవచ్చినది. ప్రేమజీ క్లోరోఫారమును గొనియెను. మఱియు శవముమొగముపై నాతనిరుమాలు కనుఁగొనఁబడియెను. హత్యజరగినతరువాతఁ గొంతసేపటికిఁ బ్రేమజీ యొకబండిపై నెక్కి వచ్చి యాప్రదేశమునందే దిగియెను. ఆరాత్రి యాతనియింటియొద్ద నొకబండి నిలిచి యుండెను. ఇంతకంటెను నిదర్శనము లేమి కావలయును?

కీర్తి—ఆతఁడు పేస్టనజీ నేల చంపి యుండును? ఆతనియుద్దేశమేమి?

దాదా—ఉద్దేశమా! ఎట్టివైరకారణమున్నదో యింకను దెలిసికొనలేదు కాని; మిత్రునికొఱకు మిత్రుఁడేమిచేసినను జేయఁగలఁడు. ఈరహస్యములన్నిటిని భేదింపుభారము లాలూభాయిపై నున్నది.

కీర్తి—ఆతఁడుకూడ నీవంటిమహాపండితుఁడే. నీవు చెప్పినట్లాతఁడు ప్రేమజీని విడిచి రస్తమజీని బట్టుకొన్నాఁడు; నాకుఁ దెలియకుండ స్వయముగా కమీషనరునకు రిపోర్టు చేసి యాతనికొఱకు వారంటు తీసికొన్నాఁడు. రస్తమజీకి విడుదలయగుటచే నాతఁడు వెంటనే యగపడకుండఁ బాఱిపోవునేమో యని యాపండితుఁడు భావించినాఁడు.

దాదా—ఆతఁడు పొరపాటు పడినాఁడు. ఈవిషయమున నను మానింపఁదగినవాఁడు ప్రేమజీగాని, రస్తమజీ కాఁడు.

కీర్తి—ఆతఁడు రస్తమజీయెడల నేల యనుమానపడియెనో తెలిసికొనవలయును. రిపోర్టుతో నాతనినొకసారి రమ్మని వార్త నంపితిని. సరే. ఆసంగతి తరువాతఁ జూచికొనవచ్చును. నీవు నీవిధాయకకృత్యమునందు మనసుంచి యుండుము. నేను హరమసజీనిగూర్చియు, నాతని మందిరమున సంబంధము గలవారింగూర్చియుఁ దెలిసికొనుటకు ప్రయత్నించెదను. ఆవిషయమున నీవు శ్రమపడనక్కఱలేదు.

దాదా—ప్రేమజీవిషయమున నేమి చేయవలయును?

కీర్తి—ఆవిషయమునఁ జేయవలసినదేమియును లేదు. హరమసజీరస్తమజీలు కాక మఱియిరువు రున్నారు. వారినిగూర్చి నీవు కేవలమును మఱచియేపోయితివి.

దాదా—ఎవరు?

కీర్తికరుఁడు రోషకషాయితాత్ముఁడై రూక్షస్వరముతో "ఏమి! ఈ మట్టితలతోడనేనా నీవు పత్తేదారీ చేయుచుంటివి? ఇఁక నీకున్నతి లాభము కలుగు ననునాశ నాకెంతమాత్రమును లేదు.

దాదా—అన్నిటికిని గురువులు మీరే యున్నారు.

కీర్తి—ఎంతటి గురువైనను గాడిదను గుఱ్ఱముగాఁ జేయఁ లేఁడా?

దాదా—అవును. ఇప్పుడు స్మృతికి వచ్చినది. బర్జరజీయును, మాంచరజీయును.

కీర్తి—వారిరువురును దఱచుగ హరమసజీయింటికి వచ్చుచుఁ బోవుచుందురుగదా! వారినిగూర్చి యేమైనఁ దెలిసికొంటివా?

దాదా—మాంచరజీ హరమసజీకి మఱఁదలికుమారుఁడు—బర్జరజీ యాతనిభార్య కాత్మీయుఁడు.

కీర్తి—ఇంతకంటె నీకేమియును దెలియదా? వారు బొంబాయివారు కారే!

దాదా—కారు. ఒకమాసముక్రిందట నిచ్చటకు వచ్చిరి.

కీర్తి—వారెవ్వరో, వారినడవడి యెట్టిదో తెలిసికొనుట యావశ్యకము కాదా?

దాదా—అవును. వారు హరమసజీకి బంధువులమని కలిగించుకొన్న పరిచయముకూడ నసత్యము కావచ్చును.

కీర్తి—సత్యము, నసత్యమునుగూడఁ గావచ్చును. మనము వీరిసకలవృత్తాంతమును దెలిసికొనవలసియున్నది.

దాదా—వారీ సొమ్మును నపహరించి యుందు రనియా మీయభిప్రాయము?

కీర్తి—నేను నీవలె నాలోచింపకుండ నూరక మాటాడువాఁడను గాను.

దాదా—నేనిప్పు డేమి చేయవలయునో యాజ్ఞాపింపుఁడు!

కీర్తి—ఇప్పుడు బర్జరజీ కొకసేవకుఁడు కావలసి యుండెను; నీవు మారువేషముతోఁ బోయి యాతనియొద్ద సేవకుఁడవై యుండి యచ్చటివిశేషముల నెప్పటికప్పుడు నాకుఁ దెలుపుచుండుము!

దాదా—రేపే యట్లు చేసెదను.

ఇంతలో రెండవపత్తేదారు లాలూభాయి యచ్చటకు వచ్చి కీర్తికాకరును దర్శించి నమస్కరించెను; కీర్తికాకరుఁడు "ఓహో! లాలూభాయియా? ఇఁక హత్యావ్యవహారము విననలయును" అనియెను.

దాదాభాస్కరుఁడు లేచెను. కీర్తికాకరుఁడు లాలూభాయిని గూర్చుండుమనియెను.

రెండవప్రకరణము.

సందేహనివారణము.

కీర్తి—లాలూభాయీ! నీవు రస్తుమజీని బుద్ధిహీనుఁడవై పట్టుకొంటివని నీమిత్రుఁడు దాదాభాస్కరుఁ డాక్షేపించుచున్నాఁడు. హంతకుఁడు పేస్తనజీ గాని రస్తుమజీ కాఁడని యాతనియభిప్రాయము!

లాలూభాయి కన్నులెఱ్ఱచేసి దాదావంకఁ జూచెను. దాదాభాస్కరుఁడు తత్తరముతో "అయ్యా! మీరన్యాయముగఁ జెప్పుచున్నారు. బుద్ధిహీనుఁ డనుమాట నేనన లేదు" అనియెను.

లాలూభాయి తల పంకించుచు "ఎవ్వఁడు మూర్ఖుఁడో యాచౌర్యవ్యవహారమునందే తెలిసిపోయినది. ఆతనికి విడుదలయై పోయినది! ఇట్టిపని నేనెన్నఁడును జేయలేదు. విస్పష్టమగు నిదర్శనము లేకుండ నేనెవ్వరిని నిర్బంధించువాఁడను గాను." అనియెను.

కీర్తికరుఁడు నవ్వుచు "ఇప్పుడు నీకుఁ దొరకిన విస్పష్టనిదర్శనము లేవియో వరుసగాఁ జెప్పుము!" అనెను.

లాలూ—మొదటిది:—ఆరాత్రి రస్తుమజీ పేస్తనజీతోఁ సంభాషించుచుండఁగాఁ జూచితినని మాంచరజీ చెప్పుచున్నాఁడు. రెండవది:—ఆయిరువురు నప్పుడొకబండి నద్దెకుఁ దీసికొనుచుండఁగా నాతఁడు చూచెను. మూడవది:—పేస్తనజీని తానాబండిపై నెక్కించినట్లు రస్తుమజీయే యంగీకరించినాఁడు. నాలుగవది.—బండివాఁడుకూడ వారిరువురును దనబండి నెక్కినట్లు చెప్పుచున్నాఁడు. అయిద

పది:—గిరిగామయొద్ద నాతఁడు దిగిపోయెను. ఆఱవది.—అప్పుడే యొకవ్యక్తి బండిచేసికొని కలబాదేవిరోడ్డునకుఁ బోయినట్లు మఱియొకబండివాఁడు చెప్పెను. ఆతఁడు చెప్పినరూపవర్ణనమంతయు రుస్తుమజీకే సరిపోయినది. మఱియుఁ గలబాదేవిరోడ్డునందలి రక్షకభటుఁడు ఆరాత్రి యచ్చట బండిదిగినవాఁడు ప్రేమజీ కాఁడనియు, నేనప్పుడు పొరపాటుగఁ జూచి చెప్పితి ననియు, నాతఁడు ప్రేమజీకంటె లావుగా నుండె ననియుఁ జెప్పుచున్నాఁడు. ఏడవది:—అంతకుఁ బూర్వదినమున సంధ్యాసమయమున నొకవ్యక్తి కోటు చేతికిఁ దగిలించుకొని పోవుచుండఁగాఁ జూచితి ననియు, నాచీఁకటిలో నాతని మొగ మగపడలేదనియు, నాతఁడు రుస్తుమజీవలెనే యుండె ననియుఁ బ్రేమజీయింటియొద్దనున్న యంగడివాఁడు చెప్పుచున్నాఁడు. ఎనిమిదవది:—ప్రేమజీయును, నాతని భృత్యుఁడును సంభాషించుకొన్న మాటలనుబట్టి క్లోరోఫారము రుస్తుమజీకొఱకే ప్రేమజీ కొన్నట్లు తెలియవచ్చినది. తొమ్మిదవది:—రుస్తుమజీయును, పేస్టనజీయునుగూడఁ గమలాబాయిని ప్రేమించి పెండ్లియాడఁగోరి యుండిరి. ఆకారణముచే వారికిఁ బరస్పరము నీర్ష్య యున్నది. ఒకప్పుడు వారిరువురును దీవ్రముగ మల్లయుద్ధముచేసి కొట్టుకొని రని రుస్తుమజీ సేవకునివలనఁ దెలిసినది. అప్పుడు రుస్తుమజీ "నీ రక్తమును జూడకున్నచో నేను రుస్తుమజీని కాను" అని ప్రతిజ్ఞ చేసెనట:—ఇంకను నెట్టినిదర్శనములు కావలయును? ఈతనికి శిక్ష చేయింపఁజాలకున్నచో నింతకాలమును నేనుచేసిన పత్తేదారుపనియంతయును నిరర్థకమే.

అని చెప్పి లాలూభాయి సగర్వముగఁ దలయెత్తి చూచుచుఁ గూరుచుండెను. కీర్తికరుఁడు మందహాసము చేయుచు "నీవు చెప్పినదంతయు నిశ్చయమే. కాని మరణించినయాతఁడప్పుడు ధరించినకోటును బరీక్షించితివా?" అని ప్రశ్నించెను.

లాలూ—లేదు. అందువలన నేమిప్రయోజనమున్నది?

కీర్తి—చూడుము. ఇదియే యాకోటు! దీనిలోపలి జేబులో రెండు కాగితపుఁదునుక లున్నవి! ఈజేబు చినిగి యున్నది. దీనినిబట్టి చూడఁగా నీజేబులోనుండి యెవ్వరో యీకాగితములను బలవంతముగ లాగికొన్నట్లు తోఁచుచున్నది. బండిలో పేస్టనజీహత్య జరిగినప్పుడే యెవ్వఁడో యీకాగితములను లాగికొని యుండును.

లాలూ—ఔను. ఇది క్రొత్తచినుగుగనే యగపడుచున్నది.

కీర్తి—అట్లు లాగికొనుచున్నప్పుడు కాగితములకొనలు కొంతవఱకుఁ జినిగి జేబులోఁబడిపోయియుండును. నేనీ విషయమును జాగరూకతతోఁ బరిశీలించి చూచితిని. ఈతునుకలనుబట్టి యాకాగితము లేమైయుండునో మీరిరువురును యోచింపుఁడు!

అప్పుడు లాలూభాయియు దాదాభాస్కరుఁడును వానిని బాగుగఁ బరిశీలించిరి. పిమ్మట లాలూభాయి "ఇందొక కాగితము వివాహపుసర్టిఫికెటు! ఈవిషయమున సందేహము లేదు" అని చెప్పెను.

దాదా—ఇందు రెండవకాగితము నిశ్చయముగా జననపుసర్టిఫికెటు!

కీర్తి—అవును. అస్పష్టముగ నగపడుచున్న వేఱువేఱుసర్కారుముద్రలనుబట్టి మీరు యోచించినసంగతి నిశ్చయమే. కాని పేస్టనజీ యీకాగితముల నింతజాగ్రత్తగా రహస్యముగ దాఁచుకొనుటకుఁ గారణ మేమైయుండును?

లాలూ—నిశ్చయముగా నాతని కీరెండుకాగితములు నత్యావశ్యకములై యుండును.

కీర్తి—ఆసంగతి తెలియుచునే యున్నది. కాని వీని నీతనియొద్దనుండి బలవంతముగ లాగికొన్న యాతనికిఁగూడ నీకాగితములతో విశేషముగఁ బని గలిగియుండును. వీనికొఱకే యాతఁడు ఫేస్టనజీకి క్లో

రోఫారము నిచ్చి తెలివి తప్పించి యుండును. అంతే కాని యాతనికి పేస్టనజీని జంపవలయునను నుద్దేశముండి యుండదు. పేస్టనజీ విశేషముగఁ ద్రాగి మత్తెక్కియుండెను. అందుచే నాతఁడు క్లోరోఫారమును భరింపఁజాలక చచ్చిపోయెను. డాక్టరుకూడ శవపరీక్షచేసి యిట్లే చెప్పియున్నాఁడు!

లాలూ—అవును.

కీర్తి—ఆ కారణమును బట్టి యీహత్య కామినీమోహముచేఁ గలిగిన యీర్ష్యవలన జరిగినది కాదని తోఁచుచున్నది. ఈకాగితముల కొఱకే యీహత్య జరిగియుండును.

లాలూ—ఇప్పుడట్లే తోఁచుచున్నది.

మూఁడవ ప్రకరణము.

భిన్నపత్రము.

అందఱును గొంతసేపటివఱకును నిశ్శబ్దముగా నుండిరి. పిమ్మట దాదాభాస్కరుఁడు "అయ్యా! ఈహత్య ప్రేమజీగాని రస్తమజీగాని చేసియుండ లేదనియా మీ యభిప్రాయము?" అని ప్రశ్నించెను.

కీర్తికరుఁడు విరక్తభావముతో "నీవు మూఢునివలె మరలమరల నిట్లే ప్రశ్నించుచున్నావు. నీవేమనుకొనుచున్నావు? నీకుఁ బ్రత్యుత్తరము చెప్పవలసినపని నాకు లేదు. ఈహత్య యీకాగితముల కొఱకు జరిగినదనిమాత్రము చెప్పుచున్నాను.

దాదా—ఆలోచింపఁగా నిప్పుడట్లే తోఁచుచున్నది. ఈవిషయమున లాలూభాయి యేమనునో!

లాలూ—నేననుకొన్నదాని కిదియంతయును వ్యతిరేకముగ నున్నది. ఎంతయాలోచించినను గాగితములకొఱకే యీహత్య జరిగినట్లు తోఁచుచున్నది. అందుకొఱకేయాతనికి క్లోరోఫారమీయఁబడియెను.

దాదా—నిశ్చయముగా?

కీర్తి—ఈసర్టిఫికెటు లెవ్వరివివాహమునుగూర్చియో తెలిసికొనుట కతిప్రయత్నముతో నన్వేషింపవలసియున్నది.

లాలూ—అట్లు చేసినచో రస్తమజీ కీహత్యతో సంబంధమున్నదో లేదో సులభముగఁ దెలిసిపోవును.

కీర్తి—ఇంకొక విషయమునుగూడ నీవు ప్రయత్నించి తెలిసికొనవలయును. ఆరాత్రి గిరిగామయొద్ద పేస్టనజీని దాను గలిసికొంటినని రస్తమజీ చెప్పియుండెనుగాదా?

లాలూ—అవును. ఇంతేకాక త్రాగి మత్తెక్కియున్న పేస్టనజీని దాను బండిపై నెక్కించి పంపించితిననికూడఁ జెప్పియున్నాఁడు. కాని యాతనితోఁ గలసిపోయినట్లుమాత్రము రస్తమజీ యొప్పుకొనుట లేదు; తానప్పుడటనుండి యెక్కడకుఁ బోయినదియుఁ జెప్పుట కిష్టపడుట లేదు.

కీర్తి—మంచిది. నేనాతని గారాగృహమునఁ గలసికొని మాటలాడెదను. ఎలిఫెన్‌స్టనుసర్కిలులో నారాత్రి యాతఁడు కమలాబాయిని దర్శించినట్లు నాకుఁ దెలిసినది. ఆతఁడప్పు డామెకడనుండి వెడలిపోవునప్పు డొకపిల్లవాఁ డాతనికొకయుత్తరము నిచ్చినట్లును, దానినాతఁడు చదివికొని పోవుచుండఁగా బర్జరజీ యాతనిఁగలిసికొని మాటలాడి యిరువురును దమతమత్రోవలను బోయినట్లును, అప్పుడు రహస్యముగా మాంచరజీ రస్తమజీని వెంబడించి పోవుచున్నట్లునుదాను చూచితినని కమలాబాయి చెప్పినది.

దాదా—అట్లయినచో మీరిప్పుడు—

కీర్తికరుఁ డాతనిమాట కడ్డమువచ్చి "ఇంకను నిట్టిప్రశ్న లేనా? నాకుఁ దొందరకలిగింపకుండ నించుక నోరు మూసికొని యుండఁగూడదా?" అనియెను.

దాదా—క్షమింపవలయును; మీమాటలనుబట్టి చూడఁగా నీవ్యవహారమునం దనేకరహస్యము లున్నట్లు తోఁచుచున్నది! చాల గందరగోళముగా నున్నది.

కీర్తి—నీకన్ని వ్యవహారములు నట్లే యగపడుచుండును.

లాలూ—కాని మాదాదాభాస్కరునకుమాత్రము తేలిక కేసే దొరకినది.

దాదా—లాలూ! మార్చుకొందమా? చౌర్యవ్యవహారమున నీవు పనిచేయుము! నీహత్యావ్యాపారమున నేనుపనిచేయుదును. అట్లు చేసినచోఁ గష్టసుఖములు తెలియఁగలవు!

కీర్తి—ఆవిషయమై నేను తరువాతఁ జెప్పెదను—నేను కమలాబాయితో మాటలాడినవిషయమునుబట్టి మీరుమాత్ర మామె నేవిధముచేనైనను గలిసికొని యెప్పుడు నామెకుఁ గోపము కలుగునట్లు ప్రవర్తింపవలదు.

దాదా—ఎన్నఁడైన మేము మీయాజ్ఞకు వ్యతిరేకముగ సంచరించితిమా?

కీర్తి—మంచిది. అయినను నేను చెప్పవలసినమాట ముందుగాఁ జెప్పియుంటిని—ఆరాత్రి యొకపిల్లవాఁడు రస్తుమజీ కిచ్చినయుత్తరమేమైయుండునని నేను రస్తుమజీయింటికి రహస్యముగఁ బోయి యాతనిచిత్తుకాగితములను బాఱవైచుబుట్టను బరీక్షింపఁగా నందీకాగితపుముక్క దొరకినది; ఇదిగో! చూడుము!

అని యాగితపుముక్కను గీర్తికరుఁడు లాలూభాయిచేతి కిచ్చెను. అందిట్లు వ్రాయఁబడి యుండెను.

"రస్తుమజీమహాశయా,

అత్యావశ్యక మగుటచే వ్రాసితిని-స్త్రీ
మరణశయ్యపైనున్నది-ముఖ్యమైనమాట
నీకుపకారమగుటకు విశేష
నేను మందభాగ్యరాలను-నీ
నేఁడు బుధవారము నిశ్చయముగనిప్పు
ఆతఁడు నీతోఁ గలసి
కాకయున్నచో నంతయును"

లాలూభాయి యాకాగితమును జదివి బాగుగఁ బరిశీలించెను. దాదాభాస్కరుఁడును విమర్శించి చూచెను.

కీర్తి—మీ కేమితోఁచుచున్నది?

లాలూ—ఏమియు బోధపడుట లేదు.

కీర్తి—ఏమి? ఒకయువతి మరణశయ్యయం దుండి యాయుత్తరమును వ్రాసి రస్తుమజీకిఁ బంపియుండునని స్పష్టముగఁ దెలియుట లేదా? ఆవ్రాఁత యాఁడుదాని వ్రాఁతవలెనేయున్నది.

దాదా—అట్టే యగపడుచున్నది.

కీర్తి—నిశ్చయముగా రస్తుమజీ యారాత్రి యాస్త్రీయొద్దకే పోయెను. పేస్తనజీతోఁ బండి నెక్కి పోయియుండలేదు. రస్తుమజీవంటిదుస్తులనే ధరియించి మఱియెవ్వఁడో యాబండిపై నెక్కి పోయియుండును. ఈవిషయమున రస్తుమజీ చెప్పినమాట సత్యమే.

దాదా—ప్రేమజీ—

కీర్తి—తొందరపడకుము! మొదటనుండియు ననుమానములనే పెట్టుకొని మనసుపాడుచేసికొనకుము. అట్లయినచో గందరగోళమునఁ బడిపోవుదువు. మనపని దోషులను దండించుటయే గాని నిర్దోషులను శాధించుట కాదు— లాలూభాయీ! ఈయుత్తరము నెవ్వరు వ్రాసిరో తెలిసికొనుభారము నీపైఁ బెట్టితిని. ఈవిషయమున నీవు విశేషప్రయత్నము చేయవలయును.

లాలూ—అట్లే శక్తివంచనము లేకుండఁ బనిచేయుదును.

కీర్తి—నీవెంతవఱకుఁ బని చేసినదియు రెండుదినములతరువాత నాకుఁ దెలియఁజేయుము.

లాలూ—అవశ్య మట్లె చేయుదును.

కీర్తి—తొందరపడి యెవ్వరు నేపనియుఁ జేయవలదు.

అని కీర్తికరుఁ డాయిరువురను బంపివైచి కొంతసేపైనతరువాత దానొకమారువేషము దాల్చి బయలుదేరెను.

నాలుగవ ప్రకరణము.

ఇతఁడెవ్వరు?

మాటిమాటికిని గష్టములే కలుగుచుండుటచే రస్తమజీ చింతావ్యాకులహృదయుఁడై పరితపించిపోవుచుండెను. ఏమిచేయఁగలఁడు? ఈవిపత్తునం దాతని రక్షించువా రెవ్వ రున్నారు? తుదకాతఁడు నిరపరాధి యయ్యు నురిశిక్షకుఁ బాలుపడవలసివచ్చెను. ఈవిచారముచే నాతనికి మతిపోవుచుండెను; నిద్రాహారము లసహ్యములైపోవుచుండెను.

అప్పు డొకమరాటీపెద్దమనుష్యుఁ డాకస్మికముగఁ జెఱసాలలో నున్న యాతనియొద్దకు వచ్చెను. రస్తమజీ యాశ్చర్యముతో నాతనిం గాంచెను. ఆతఁ డెవ్వఁడు? హత్యాపరాధమునకై పోలీసువారు రస్తమజీని బట్టుకొన్నప్పు డాతని కభయప్రదానముంగావించిన వృద్ధమహారాష్ట్రుఁడే!

ఆవృద్ధుఁ డాతని సమీపించి "నీవు సన్నానవాలు పట్టలేవనుకొనియెదను! అవును. బహుకాల మైనది! నీజనకునకును నాకును విశేషమైత్రి యుండెడిది. నేను నీవిపద్వార్త నాలకించి నిశ్చింతతో నుండఁజాలక పోయితిని. కానిమ్ము! భయము లేదు. నిర్దోషివగునీకు భయమేలబాబూ! " అనియెను.

విపత్సమయమున లభించినమిత్రలాభ మెవ్వరి కానందము గలిగింపకుండును? రస్తమజీకి మొదట నించుకసంశయము కలిగెను. కాని యామిత్రుని ప్రేమమయభాషణములలో నాతనిసందేహ మంతర్హిత మైపోయెను.

వృద్ధు—నాపేరు కాశీనాథనాయకుఁడు; నిన్ను నేను నీచిన్నతనమునఁ జూచితిని. నీకుఁ గొంచెమైన జ్ఞప్తియుండు ననుకొనియెను.

రస్త—సరిగా స్మృతికి వచ్చుట లేదు. కాని మీరిట్టికష్టకాలమున సాయము చేయవచ్చినందులకు నాకుఁగల్గినయానందమింత యని మనవి చేయఁజాలను.

వృద్ధు—ఈవిపత్తునుండి తప్పించుకొనఁ దలఁచినచో నీవు నాకొక్కవిషయమునుగూర్చి చెప్పవలయును.

రస్త—ఏమి చెప్పవలయును? ఈవిషయమున నాకేమియును దెలియదు.

వృద్ధు—పోలీసువారు నీకు విరుద్ధముగా నెన్నియో నిదర్శనములను సంగ్రహించి యున్నారు.

రస్తమజీ దీర్ఘశ్వాసమును విడుచుచు "ఆసంగతి నేనెఱుఁగుదును. నాకిఁక రక్షణోపాయ మేదియును లేదు.

వృద్ధు—అట్లు నీవు నిరాశుఁడవు కావలదు. దొంగనేరమున మాత్రము నీకు విరుద్ధముగ నిదర్శనము లగపడలేదా? తుద కేమి జరిగినది?

రస్త—కాని యీహత్యావ్యవహారమునందుమాత్రము నాకిఁక నట్టియాశ లేదు.

వృద్ధు—ఏమి? నాకు సర్వమును స్పష్టముగాఁ దెలిపినచో నిన్ను నిశ్చయముగా విడిపించెదను.

రస్త—ఏమి చెప్పుదును? ఇంక నేను చెప్పవలసిన దేదియును లేదు.

వృద్ధు—ఆరాత్రి నీవు పేస్తనజీని బండిపై నెక్కించి పంపితివా?

రస్త—పంపితిని.

వృద్ధు—ఆతనితోఁ గలసి నీవును బోయితివా?

రస్త—లేదు.

వృద్ధు—అట్లయినచో నప్పు డాతనివెంటఁ బోయినవారెవ్వరు?

రస్త—నాకెట్లు తెలియును? దేవుఁడు చెప్పవలయును.

వృద్ధు—సరే, నీవుమాత్ర మాతనితోఁ బోలేదు! మంచిది. తరువాత నీ వెచ్చటకుఁ బోయితివో సప్రమాణముగఁ దెలియఁజేసినచో నీకు విడుదల యగును.

రస్త—కాని యాసంగతిమాత్రము నేనెవ్వరికిని దెలుపఁదలఁచుకొనలేదు. మీ రెంతటి యాప్తులైనను బ్రాణముండఁగా నేనాసంగతిని వెల్లడింపఁజాలను.

వృద్ధు—ఊరక కోరి కంఠమున నురి తెచ్చుకొనియెదవా? ఇంతటిపిచ్చితన మున్నదా? నేను నీపితృమిత్రుఁడను; నీసాహాయ్యమునకై వచ్చితిని; నాయెదుట దాఁపఱిక మేల? ఎచ్చటికిఁ బోయితివో చెప్పుము.

రస్త—క్షమింపవలయును.

వృద్ధు—వలదు. ప్రాణములమీఁదికి వచ్చినవ్యాపారమునందు క్షమాపణమా? నీమాట వినఁదలఁచుకొనలేదు. చెప్పుము!

రస్త—చెప్పను. ఎంతమాత్రమును జెప్పను.

వృద్ధు—నీకు మతిపోయినదా? నీతలపై నెంతటి దారుణవిపత్తు పడనున్నదో నీకుఁ దెలియుట లేదా? నీవు కేవలమును బసిబాలుఁడవు కావుగదా!

రస్త—ఆమాట నిజమే కాని మీ రడిగినట్లు సప్రమాణముగఁ దెలుపుట కుపాయము లేదు.

వృద్ధు—మంచిది. అట్లయినచోఁ బ్రయత్నించి నేనే తెలిసికొందును!

రస్త—ఎట్లు తెలిసికొందురు? ఆస్త్రీ యిఁక లేదు!

వృద్ధు—ఏమి! స్త్రీయా? ఆమెపేరేమి?

రస్తమజీ తొందరపడి పొరపాటున స్త్రీయని చెప్పివైచెను. ఇఁక నాతఁ డేమియుఁ జెప్పక "మహాశయా! నన్ను క్షమియింపుము! ఈవిషయమున నన్నిఁకఁ బ్రశ్నింపవలదు. నేనిఁక మాటాడను.

వృద్ధు—చెప్పకున్న నేమి చేయుదును? నేనే ప్రయత్నించి తెలిసికొనవలసి యుండును—మంచిది. నిన్నింకొకమాట యడిగెదను. చెప్పెదవా?

రస్త— చెప్పెదను.

వృద్ధు—ఈవిషయమున నీ కెవ్వనిపైనైన ననుమానమున్నదా?

రస్త—ఉన్నది. కాని నేను వెల్లడింపఁజాలను.

వృద్ధు—నీవు చెప్పకున్నను నీమనసులోనిసంగతి నేను చెప్పుదునా?

రస్త—చెప్పఁజాలరు.

వృద్ధు—ఆలాగా? మీయజమానియగు హారమసజీయే పేస్తనజీని జంపినవాఁడు!

రస్తమజీ యొక్కయుదుటున లేచి నిలువఁబడి "ఈసంగతి మీ కెవ్వరు చెప్పిరి?" అని ప్రశ్నించెను.

వృద్ధు—ఓహో! ఈసంగతి నీవును విశ్వసించితివి! అట్లయినచో హారమసజీయే హంతకుఁడు. అతఁ డెందులకు హత్యచేసెనో కూడ నీకుఁ దెలిసియుండును. కేవలమును గమలాబాయియందలిప్రే

ముచే నీవు వెల్లడించుట లేదు. ప్రేమయనునది దివ్యమగుపదార్థము. అందులకు సందేహము లేదు. కాని ప్రేమకొఱకు నిరర్థకముగఁ బ్రాణముల నర్పించుట పిచ్చితనమేగాని వేఱు గాదు.

రస్త—హారమసజీ హంతకుఁడైనట్లు నిదర్శనమేమున్నది?

వృద్ధ—కావలసినన్ని నిదర్శనములున్నవి.

రస్త—ఆతం డట్లు హత్యచేయుటకుఁ గారణమేమి?

వృద్ధకాశీనాథుఁడు రస్తమజీచెవిలో మెల్లమెల్లగ నేమేమియో చెప్పెను.

రస్తమజీ మరలనదరిపడి తత్తరముతో "ఇది యంతయు మీకెవ్వరు చెప్పిరి?" అనియెను.

అయిదవప్రకరణము

నివ్వెరపాటు

కాశీనాథుఁడు పరమాదరముతో రస్తమజీచేయిపట్టుకొని కూర్చుండఁజేసి మెల్లగ నాతనితలపైఁ జేయివైచి దువ్వుచు "స్థిరముగాఁ గూరుచుండుము! చంచలుఁడవు గావలదు! నీవు నిరపరాధివి. నేను నిన్ను రక్షింతునని ప్రతిజ్ఞచేసితిని. నీవు చెప్పకున్నను నేనెల్ల విషయములను దెలిసికొనఁగలను. ఆసామర్థ్యము నాకున్నది" అని బుజ్జగించెను,

రస్తమజీ యేమియు మాటాడక మౌనముతోఁ గూర్చుండి యుండెను.

కాశీనాథనాయకుఁడు మృదుస్వరముతో "నాకుఁ జాలసంగతులు తెలియును. హారమసజీ యీహత్యవిషయమున నించుకంతయు నెఱుఁగఁడని నీవు చెప్పుచున్నావు! అట్లయినచో నీవారాత్రి యెచ్చటికిఁ బోయితివో నాకుఁ జెప్పఁగూడదా?" అనియెను.

రస్తమజీప్రత్యుత్తరము చెప్పక తల వంచుకొని యూరకుండెను.

కాశీ—నీవారాత్రి కమలాబాయిని జూచితివా?

రస్త—మీకెట్లు తెలిసినది?

కాశీ—ఆమెయే చెప్పినది.

రస్త—అప్పుడు మీరుకూడ నామెను గలిసికొంటిరా?

కాశీ—అవును. తరువాత నీకొకబాలుఁడు మరణింపనున్న యొకస్త్రీ వ్రాసినయుత్తరమును దెచ్చి యిచ్చెనుగాదా?

రస్త—ఇది యంతయు మీకెవ్వరు చెప్పిరి ?

కాశీ—నీయింట నీపఱుపుమీఁద నే యాకాగితములోఁ గొంతభాగము నాకు దొరకినది.

రస్త—అవును. నేనాయుత్తరము నప్పుడే చించిపారవైచితిని.

కాశీ—అప్పుడు నీవాకాంతను జూచుటకుఁ బోయితివా ? చెప్పుము ! నాయొద్ద దాఁచుటవలనఁ బ్రయోజనము లేదు.

రస్త—అవును. నేను పేష్టనజీని బండిపైనెక్కించి పంపినతరువాత నాయువతిని జూచుటకుఁ బోయితిని.

కాశీ—ఆమెపేరేమి ?

రస్త—నేను చెప్పను !

కాశీ—ఆమె బ్రదికి యున్నదా ? మరణించినదా ?

రస్త—మరణించినది.

కాశీ—ఆమె నిన్నెందులకుఁ బిలిచినది ?

రస్త—ఆసంగతి నేను చెప్పను !

కాశి—అట్లయినచో నేను చెప్పుదునా ?

అని యాతఁడు రస్తమజీచెవిలో నేమేమియో చెప్పెను.

రస్త—మీరెట్లనిమానించినను సరియే—కాని నేనుమాత్ర మామెచెప్పినమాటలను వెల్లడింపఁ దలఁచుకొన లేదు,

కాశీ—నిష్కారణముగ నురిశిక్ష కానున్నను జెప్పఁజాలవా?

రస్త—చెప్పఁజాలను.

కాశీ—కమలాబాయి వచ్చి బలవంతపెట్టినను జెప్పవా?

రస్తమజీ మఱి మాటాడలేదు.

కాశీ—ఆయువతి నీకు హారమసజీనిగూర్చి యేదియో చెప్ప దలఁచి నిన్నుఁ బిలిపించినది' ఈసంగతి నిజమేనా?

రస్త—క్షమింపుఁడు! నేనేమియుఁ జెప్పఁజాలను!

కాశీ—రస్తమజీ! నేను నీపితృసఖుఁడనుగాన సహించియుంటిని గాని యిప్పటి నీప్రవర్తనమునకు మఱియొకఁ డెవ్వఁడైనను గోపము దెచ్చుకొనకమానఁడు. పిచ్చివానివలె సంచరించుచుంటివని నీకు మాత్రము తెలియుట లేదా? కాని యీపిచ్చితనమువలన నెట్టిభయంకరపరిణామ మగునో యీసంగతిమాత్రము నీవూహించుట లేదు! పోనిమ్ము!

రస్తమజీ కన్నీరు విడుచుచు "మహాశయా! కోపగించుకొనవలదు! సర్వవృత్తాంతమును దెలుపుట కవకాశమే యున్నచో నేను నిశ్చయముగ మీకు వెల్లడించియే యుందును" అనియెను.

కాశీ—సరే! నీవు చెప్పవుగాదా? పోనిమ్ము! నేనే తెలిసికొందును లెమ్ము.

అని చెప్పుచు వృద్ధుఁడగు కాశీనాథనాయకుఁడు దిగ్గున లేచి మరల రస్తమజీవంకఁ దిలకించి "కుమారా! ఇంకను నవకాశమున్నది. బాగుగనాలోచించుకొనుము వెఱ్ఱివాఁడవై యూరక స్వయముగా మృత్యువు నేల పిలిచికొందువు? నిరర్థకముగ నురికంబమునఁ దగులుకొని యేల వంశనాశనము చేసికొందువు? ఒకసారి దొంగ యను వాదు తెచ్చుకొంటివి. ఇంకను హంతకుఁ డనునపకీర్తిని గడించి పితృపితామహుల మరియాదకుఁగూడ నేల కళంకము నాపాదించెదవు? బాగుగ నాలోచించుకొనుము! నాకంతయును దెలిపినచో నీకెట్టిభయమును లేదు. నేను రెండుమూఁడుదినములలో మరల నీయొద్దకు వచ్చెదను" అని బోధించెను.

రస్తమజీ యేమియుమాటాడలేదు. కాశీనాథుఁడు మెల్లమెల్లగ నాకారాగృహమును విడిచి యవ్వలికిఁ బోయెను.

ఆఱవ ప్రకరణము.

అవకుంఠనవతి.

రాత్రి యెనిమిదిగంటలవేళఁ గాశీనాథనాయకుఁడు ఎలిఫెన్స్టన్ సర్కలులో నొకబల్లపైఁ గూర్చుండి యెవ్వరికొఱకో నిరీక్షించుచుండెను. కొంతసేపటి కొకమరాటీరమణి మేలిముసుఁగుతో నచ్చటికి వచ్చెను. చూచినమాత్రముననే యామె యొకయింటిదాసి యైయుండునని బోధ యగుచుండెను. కాశీనాథుఁ డామెను బల్లపైఁ గూర్చుండఁ జేసెను. వారిరువురును జెట్లకొమ్మలక్రీనీడను గూర్చుండి యుండుటచే వీథిదీప కాంతులు వారిపైఁ బ్రసరించుట లేదు. అందుచే దగ్గఱకుఁ బోయినఁగాని వారినానవాలుపట్టుట కవకాశము లేకుండెను. అప్పుడు కాశీనాథుఁ డామెనుద్దేశించి "క్రొత్తసంగతులేమైన నున్నవా?" అని ప్రశ్నించెను.

రమణి.—నూతనవిషయము లేవియును లేవు. కాని రాజాబాయియుఁ గమలాబాయియును బర్జరజీకొఱకు భయపడుచున్నారు. కారణమేమో యింకను దెలియుట లేదు.

కాశీ—బర్జరజీ యింకను వచ్చుచుఁ బోవుచుండెనా?

రమ—నిన్నటిదినము హారమసజీ యేదియోపనిమీఁద బెండోరాకుఁ బోయియుండెను. రాత్రి యొంటిగంటవఱకును బర్జరజీ రాజాబాయియొద్దనే యుండెను.

కాశీ—నారిసంభాషణ మేమియో తెలిసినదా?

రమ—లేదు.

కాశీ—అప్పుడు మాంచరజీ యెచ్చట నున్నాఁడు?

రమ—కమలాబాయియొద్దకుఁబోయి యామెతో మాటాడు చుండెను.

కాశీ—కమలాబాయి యేమైన మాటాడినదా?

రమ—లేదు. ఆమె యొంటిగఁ గూర్చుండి రహస్యముగ నేడ్చు చుండెను. ఆమెను జూడఁగా నామెహృదయమునం దేదియో దారుణాఘాతమైనట్లు స్పష్టపడుచుండెను. ఆమెహృదయమున దుస్సహపరితాపము వర్ధిల్లుచున్నట్లు తోఁచుచుండెను. నేనును గష్టపడుచునే యుంటినిగాని యామె నాకంటె నధికముగ బాధపడుచున్నది. నాకుఁ జిన్నతనమునుండియును గష్టములే. అయినను నేను సహించుచున్నాను. పాప మామె సహింపఁగలదా!

కాశీ—రస్తమజీ సమాచారము నీకుఁ దెలిసినదా?

రమ—సర్వమును దెలిసినది.

కాశీ—ఈవిషయమున నీయభిప్రాయ మేమి?

రమ—ఆతఁడు నిర్దోషి—కాకున్న నాతఁడు దొంగతనము చేయఁగలఁడా? హత్య చేయఁగలఁడా! మీరుమాత్ర మాతని నెఱుంగరా!

కాశీ—అవును. కాని యాతఁడు దోషి యైనట్లు నిదర్శనము లెన్నియో దొరకినవి.

రమ—అన్నియును మిథ్యలే. ప్రమాణము లున్నను నాతఁడు నిర్దోషి యని నిరూపింపవలయును. ఆతనిం గాంచి చాలదినములైనది. ఒక్కసారి చూడవలెనని యున్నది. చూచుటకేమైన నుపాయమును గల్పింపఁజాలరా?

కాశీ—ఆవిషయమున మాటాడుటకే నేనిప్పుడు వచ్చియుంటిని. ఆరాత్రి రస్తమజీ పేస్తనజీని బండిపై నెక్కించి పంపెను గాని యాతనితోఁ గలసి పోలేదు. మఱియొకఁ డెవ్వఁడో పోయి యుండెను.

రమ—ఆతఁ డెవ్వరు!

కాశీ—ఆతనికొఱకే వెదకుచుంటిని. ఆతఁడు దొరకినచో నన్నిరహస్యములును బయల్పడఁగలవు.

రమ—రస్తమజీ యేమిచెప్పెను?

కాశీ—రస్తమజీ యారాత్రి కమలాబాయిని జూచి పోవుచుండఁగా మరణోన్ముఖ యగునొక స్త్రీ యొకబాలునిచే నాతనికొక యుత్తరము నంపెను. ఆమెపేరేమో, తానామెయొద్దకుఁ బోయెనో, లేదో యేసంగతియు నాతఁడు చెప్పుట లేదు.

రమ—ఆలాగా? నాకుఁగూడ నట్టిసమాచారము వచ్చినది. కాని, నేను పోలేదు. నాకిప్పుడావిషయము బాగుగ జ్ఞప్తికి వచ్చుట లేదు.

కాశీ—ఏమి? నీకుఁగూడ నుత్తరము వచ్చినదా?

రమ—లేదు—ఆరాత్రి రస్తమజీ మాయింటికి వచ్చి యొకస్త్రీ మరణించుటకు సిద్ధమై యున్నదనియు, నామెయొద్దకుఁ బోయి చూచి వచ్చెదననియుఁ జెప్పియున్నాఁడు.

కాశీ—ఆస్త్రీ యెవ్వరో చెప్పెనా?

రమ—లేదు. అది పరిహాస మనుకొని నేనామాటను చెవిని బెట్టలేదు. అప్పు డాతఁడు నవ్వుచు నామెను జూచినచో లాభమున్నదని చెప్పినాఁడు.

కాశీ—ఎక్కడకుఁ బోవలసి యుండెనో చెప్పినాఁడా?

రమ—అప్పు డామాట లేవియు నేను వినిపించుకొననే లేదు; అస్థిరహృదయనై యుంటిని. తరువాత గలిగినయాకష్టములవలన నిప్పు డామాటలేవియును స్మృతికి వచ్చుటయే లేదు

కాశీ—రస్తుమజీ యురిశిక్షకైన నొప్పుకొనియెను గాని యామెనుగూర్చి చెప్పుట కంగీకరింపలేదు. కావున నేనే ప్రయత్నించి తెలిసికొనవలయు నని బయలుదేరితిని.

రమ—ఇప్పుడు నాకేమియును స్మృతికి వచ్చుట లేదు. తరువాత నూహించి చెప్పఁగలనేమో చూచెదను.

కాశీ—బాగుగఁ బ్రయత్నింపుము! ఆమె యెవ్వరో తెలిసికొనవలయును. తరువాత నిన్నును గమలాబాయిని నొకసారి రస్తుమజీ యొద్దకుఁ దీసికొనిపోవఁదలఁచితిని. మీరిరువురును వచ్చి బలవంతపెట్టినచో నాతఁడంతయును వెల్లడించునని నాయభిప్రాయము. నీవట్లు చేయఁగలవా?

రమ—ఆతని క్షేమముకొఱకు నన్నేమిచేయుమన్నను జేసెదను.

కాశీ—అంతయును జెప్పి కమలాబాయి నంగీకరింపఁ జేయుము!

రమ—మీయానతి ననుసరించి యట్లే చేసెదను.

కాశీ—కుమారీ! నిశ్చయముగ నీప్రేమయే దివ్యప్రేమ! నీవు నిజముగా దేవీమూర్తివి!

రమ—నేను పాపాత్మురాలను! ఆతనిపాదధూళికిఁ గూడ యోగ్యురాలను గాను!

అని యామె పైటచెఱఁగుచే వదనమండలమును గప్పుకొని సత్వరముగ నటనుండి వెడలిపోయెను. కాశీనాథుఁడును దీర్ఘాలోచనము చేయుచు మెల్లమెల్లగ మఱియొకవైపునకుఁ బోయెను.

ఏడవప్రకరణము.

కార్యప్రసంగము.

మఱునాఁటి ప్రభాతసమయమున దాదాభాస్కరుఁడు పార్సీసేవక వేషముతో వచ్చి కీర్తికరుని దర్శించెను. కీర్తికరుఁ డాతనిం గాంచి

మందహాసము చేసెను. అప్పుడు దాదాభాస్కరుఁడు "గురువర్యా నన్నిప్పు డెవ్వరైన నానవాలు పట్టఁగలరా" అనియెను.

కీర్తి—వత్సా! నీవొకప్పుడు సర్వోన్నతుఁడవు కాఁగలవు. ఈనీఛద్మవేషమున నీనైపుణ్యము విస్పష్టముగా నగపడుచున్నది.

దాదా—అయినను నన్ను మూఢుఁడనియే మీరు నిందించుచుందురు.

కీర్తి—అది ప్రేమపూర్వకమగుమాట. నీకార్యకౌశలమునెడల నాకు సంపూర్ణవిశ్వాస మున్నది. సరే! దానికేమి? విశేషము లేమో చెప్పుము!

దాదా—ఔను. ఆలస్యముచేయుటకు వలనుపడదు. ఆతఁడు నన్ను వెదకుకొనుచుండును.

కీర్తి—ఆతఁడు నిన్ననుమానించుట లేదుగద?

దాదా—లేదు.

కీర్తి.—నీవేమి తెలిసికొంటివో చెప్పుము!

దాదా—మీరూహించినట్లే యైనది. బర్జరజీమాంచరజీలు రాజాబాయి కాత్మీయులు కారు.

కీర్తి—ఎట్లు తెలిసికొంటివి!

దాదా—నిన్నటిరాత్రి యాయిరువురకును బెద్దజగడమైనది. ఆకలహములో మాంచరజీ బర్జరజీ చెప్పినట్లు చేయుచున్నట్లును, నిరువురకు నేదియో సంబంధమున్నట్లును నాకుఁ దెలియవచ్చినది. అప్పుడు బర్జరజీ క్రోధముతో "నిన్నింతకాలము వఱకును బెంచి పెద్దవానిని జేసితిని. రాజాబాయిప్రాపకము కలిగించితిని. ఇంకను నీకు ధనము కావలయునా? ఎంతయవిశ్వాసము! సరే. నేనును నీకుఁ దగినట్లే చేసెదను?" అనియెను.

కీర్తి—మాంచరజీ యేమనెను?

దాదా—"రాజాబాయి సమస్తాభరణములును నైపోయినవి. ఆమె భయముచే హారమసజీని ధనము నడుగఁజాలకున్నది. అట్లయినచో నాకు దిన మెట్లు గడచును? వస్తువులన్నియును సంపాదించినవాఁడను నేను. నీవేమి చేసితివి? ఇట్లయినచో నేను సమస్తమును వెల్లడింపక మాననను" అని మాంచరజీ తొందరపడుటచే బర్జరజీ యించుక మెత్తపడి "మాంచరజీ! ఇప్పుడు మన మిరువురమును గలహించినచోఁ గార్యమంతయును జెడిపోవును. అట్లయినచో నీకు మరల మునుపటిగతియే కలుగును. కావున నీవు కొన్నిదినము లోర్చి యుండుము. హారమసజీప్రాణము నాచేతిలోనున్నది. నీకుఁ గావలసినంతధనము లభింపనైయున్నది." అని మందలించుటయు మాంచరజీ "ఇప్పుడు నాకుఁ గడచుట యెట్లు?" అని ప్రశ్నించెను. బర్జరజీ మృదులస్వరముతో "అందుల కుపాయమున్నది. ఆవస్తువు లన్నియును గణేశమల్లుని యొద్దఁ దాకట్టుపెట్టితిమి గదా! వానినన్నిటి నిప్పుడు విక్రయించినచోఁ గావలసినంతధనము!" అని యుపాయము చెప్పెను.

కీర్తికరుఁడదరిపడి "గణేశమల్లుఁడా?" అనియెను.

దాదా—అవును. ఆతఁడెవ్వరు?

కీర్తి—నేనెఱుఁగుదును.

దాదా—అప్పుడు మాంచరజీ సంతుష్టుఁడై "అట్లయినచో నిప్పుడే విక్రయింపుము! నాచేతిలో నిప్పుడొక దమ్మిడీయైనను లేదు" అని త్వరపెట్టెను. బర్జరజీ యందులకంగీకరించెను. అందుచే వారిరువురకును సమాధానము కుదిరెను. తరువాత నాయిరువురు నటనుండి వెడలిపోయిరి.

కీర్తి—దీనినిబట్టి నీవేమి యూహించితివి?

దాదా—బర్జరజీ మోసగాఁడనియు, మాయచేసి హారమసజీ సర్వనాశనము చేయుచుండెననియు నాకుఁ దోఁచినది.

కీర్తి—కాని రాజాబాయి తనసర్వాభరణములను గూడ మాంచరజీ కిచ్చివైచినది. ఇందేదియో నిగూఢరహస్యముండునని తోఁచుచున్నది.

దాదా—స్త్రీలోకము ప్రేమకొఱకేమైనను జేయఁగలదు.

కీర్తి—కాని, మాంచరజీ రాజాబాయికంటెఁ జిన్నవాఁడు!

దాదా—స్త్రీలవిషయమున నేదియు నసంభవము లేదు.

కీర్తి—రాజాబాయియుఁ, గమలాబాయియుఁగూడ బర్జరజీయని భయపడుచుందు రని తెలిసినది. కారణ మేమో?

దాదా—ఆతఁడు తనరహస్యమును హారమసజీకిఁ దెల్పునేమోయని!

కీర్తి—కావచ్చును. కాని, కమలాబాయి భయపడుటెందులకు?

దాదా—ఒక్కటే కారణము!

కీర్తి—హారమసజీయింటిలోనివారే యీదొంగతనము చేసినట్లు నీకిప్పుడు బాగుగ బోధపడినదా?

దాదా—బోధపడినది. మాంచరజీకిఁ బ్రతిదినమును డబ్బు కావలయును! ఆభరణము లన్నియుఁ జెల్లిపోవుటచే రాజాబాయియే రహస్యముగ నాధనము నపహరించి యుండును! అప్పుడు వలదని కమలాబాయి యడ్డుకొని యుండును.

కీర్తి—ఇది సరికాదు. కాని యిట్లు జరిగినను జరుగవచ్చును. ఎట్లయినను దొంగ త్వరలో దొరకఁగలఁడు. నీవుమాత్రము బర్జరజీ మాంచరజీలపైఁ గన్నువైచి యుండుము. రేపొకసారి యెట్లో తప్పించుకొని వచ్చి నన్నుఁ గలిసికొనుము.

అట్లే చేయుదునని చెప్పి దాదాభాస్కరుఁడు వెడలిపోయెను. కీర్తికరుఁడాలోచించుకొనుచు గదిలోఁ బ్రచారము చేయుచుండెను. అనంతర మాతఁడు లాలూబాయిని దీసికొని రమ్మని యొకసేవకుని బంపించెను.

ఎనిమిదవప్రకరణము.

హత్యావిషయము.

లాలూభాయి వచ్చునంతవఱకు నాలోచించుకొనుచుఁ గీర్తికరుఁ డాగదిలోనేయుండి కొంతసేపైనతరువాత నొకయుత్తరమును వ్రాసి సేవకునిచేతి కిచ్చి "నీవీయుత్తరమును దీసికొని హారమసజీయింటివెనుక గుమ్మమునొద్దకుఁ బోయి యీలవైచినచో నొకస్త్రీ వెలుపలకు వచ్చును. ఆమెకు దీని నిచ్చిరమ్ము! ఈసంగతి యెవ్వరికిని దెలియఁగూడదు. జాగ్రత్తగ రహస్యముగ నీకార్యమును నిర్వహింపవలయును." అని చెప్పి యాతని బంపించెను.

ఇంతలో లాలూభాయి వచ్చి యాతనికి సలాము చేసెను. కీర్తికరుఁ డాతనిం గాంచి "ఎంతవఱకుఁ బనిజరిగినది? దొరగా రింక ఖూనీకేసు నిలిపియుంచుట కవకాశము లేదనుచున్నారు. ఈయవస్థలో విచారణ జరిగించినచో బంధితునకు విడుదల యైపోవును" అనియెను.

లాలూ—అవును. అట్లే తోఁచుచున్నది'

కీర్తి—రస్తమజీ హంతకుఁడు కాఁడు. ఆతని నిష్కారణముగ బంధించియుంచుట యన్యాయము.

లాలూ—ఆరాత్రి రస్తమజీకి జాబునిచ్చినబాలకుఁడు దొరకినాఁడు.

కీర్తి—ఆతఁడేమిచెప్పినాఁడు?

లాలూ—వాని నిచ్చటికే తీసికొని వచ్చితిని.

అని చెప్పి యాతఁ డాబాలకుని గీర్తికరుని యెదుటికిఁ దీసికొని వచ్చెను.

కీర్తి—ఈతని నీవెట్లు తెలిసికొంటివి?

లాలూ—ఎలిఫెన్స్టన్ సర్కలు నొద్ద నాడుకొను బాలురలోఁ బ్రయత్నించి యీతని గనుపెట్టితిని. ఈతని నడిగి సర్వమును స్వయముగా మీరే తెలిసికొనుఁడు.

కీర్తికరుఁ డాబాలునివంకఁ జూచి "నీవొకనాఁటిరాత్రి పార్శీపెద్దమనుష్యునకుఁ జీటి నిచ్చితివా"?

బాల—ఇచ్చితిని. అదియొకస్త్రీ వ్రాసి నాచేఁ బంపినది. ఆమె యెవ్వరో నేనెఱుఁగను..

కీర్తి—ఆమె పార్శీయా? మరాటీయా?

బాల—మరాటీ.

కీర్తి—ఆచీటి నామె యెక్కడ నీకిచ్చినది?

బాల—తోఁటవాఁకిలియొద్ద—

కీర్తి—తరువాత నామె యెక్కడకుఁ బోయినది?

బాల—తెలియదు.

కీర్తి—పో! ఇఁక నీతో నాకుఁ బనిలేదు.

నిమిషములో నాబాలకుఁ డంతర్హితుఁ డైపోయెను. అప్పుడు కీర్తికరుఁడు నవ్వుచు "లాలూభాయీ! ఈకుఱ్ఱవానిని వెదకుటకుఁబడిన కష్టము స్మశానముల నన్వేషించుట కుపయోగించినచో ననుకూలముగా నుండును" అనియెను.

లాలూ—ఏమి?

కీర్తి—ఇదిగో! చూడుము! నేనాహత్యజరిగినమఱునాఁటిమరణముల రిజస్టరునకు నకలు తీసికొంటిని.

లాలూ—ఆస్త్రీ మరణించినదా?

కీర్తి—ఆరాత్రియే—

లాలూ—ఈసంగతి మీకెట్లు తెలిసినది? నాకుఁ దెలిసినచో ఘట్టమున నన్వేషించియేయుందును.

కీర్తి—ఏమైననేమి! చూడుము! ఆనాఁడు మరణించినవా రేడ్గురు. అందుముగ్గురుపురుషులు—నలుగురుస్త్రీలు—అందిరువురుస్త్రీలు గొప్పయింటివారు. తక్కినయిరువురును సాధారణకుటుంబములోనివారు. అందొకతె సధవ. అందుచే నామె యపరిచితుఁడగు రస్తమజీకి జాబువ్రాసియుండదు.

లాలూ—అవును.

కీర్తి—కావునఁ దక్కినస్త్రీయే యాతనికి వ్రాసియుండును.

లాలూ—ఆమె వారవనితయై యుండవచ్చునని తోఁచుచున్నది.

కీర్తి—కావచ్చును. ఈమెవృత్తాంతమును దెలిసికొనుభారము నీయందున్నది. ఈమెనివాస మిందున్నది. వ్రాసికొనుము.

లాలూ—మంచిది. నేనిప్పుడే పోయి ప్రయత్నించెదను.

కీర్తి—నీవు పనిచేసినంతవఱకెప్పటికప్పుడు నాకుఁ దెలియఁజేయుచుండుము!

లాలూభాయి వెడలిపోయెను. కీర్తికరుఁడు స్నానాహారములకై లోపలికిఁ బోయెను.

తొమ్మిదవప్రకరణము.

ఉద్యానము.

సరిగా రెండుజాములవేళఁ గమలాబాయి తనదాసితోఁ గలసి విక్టోరియాయుద్యానమునకు వచ్చి నిరీక్షించి యుండెను. కొంతసేపటివఱకయ్యిరువురును మౌనముతో నుండిరి. పిమ్మటఁ గమలాబాయి దాసింగాంచి "ఆతఁ డింకను రాలేదేమి?" అని ప్రశ్నించెను.

దాసి—ఒంటిగంటకు వచ్చెదనని వ్రాసియున్నాఁడుగదా! ఇంకనువేళ కాలేదు.

మఱికొంతసేపటి కొకవృద్ధమహారాష్ట్రుఁ డచ్చటికి వచ్చి కమలం గాంచి "నీపేరు కమలాబాయి కాదా? నీవు ధనాఢ్యుఁడగుమానమసజీతనయవా?" అనిప్రశ్నించెను.

కమలాబాయి లజ్జతోఁ దలయూఁచెను. అప్పు డావృద్ధుఁడు "నేను రస్తమజీకిఁ బితృసఖుఁడను. నాపేరు కాశీనాథనాయకుఁడు. రస్తమజీ కష్టములఁ బడియుండుటను విని నేనాతనికి సాయముచేయుటకై వచ్చియుంటిని. నేను లోకులవలన వినియుంటిని— నీవాతని మిగుల—" అనియెను.

ఆకస్మికముగఁ గమలకపోలము లెఱ్ఱనయ్యెను. అదిచూచి వృద్ధుఁడాప్రసంగమును మార్చి "ఆనాఁటిరాత్రి రస్తమజీ పేస్టనుజీని బండిపై నెక్కించి పంపి తానెక్కడకుఁ బోయెనో యెంతయడిగినను జెప్పుటలేదు.

కమ—ఎందుచేత?

కాశీ—కారణమైనను జెప్పుట లేదు. తరువాతఁ దానెక్కడకుఁ బోయెనో సప్రమాణముగ నిరూపింపఁగలిగినచో నాతనికి విడుదల యగును. కాని యాసంగతి యించుకంతయును దెలుపుట లేదు. ఇంత వెఱ్ఱివాఁడు నీతండ్రివ్యవహారమునంతను నెట్లు నిర్వహించెడివాఁడో బోధపడుటలేదు. నీవెట్లయిన నాతని నిరోధించి చెప్పింపఁగలవని యెంచి నేను నీదాసితోఁ బరిచయము చేసికొని నిన్నిచ్చటికిఁ బిలిపించితిని.

కమ—నేనేమి చేయుదును?

కాశీ—ఆతనికిఁ దెలియనప్పుడు క్షేమోపాయమును బోధించుట మనకుఁగర్తవ్యము కాదా? అతఁడు తనవిపత్తును దెలిసికొనఁజాలకున్నాఁడు. ఉరిశిక్ష—

ఆమాట విని యారమణులిరువురును నొక్కసారిగఁ గాతరస్వరమున "అయ్యో" యని కొయ్యవడిపోయిరి.

కాశీ—నిర్దోషి యెప్పుడును జంచలుఁడు కాఁడు. నిరపరాధి యగునాతనికి భయమేముండును?

కమ—ఆతనికి విడుదలయగునా?

కాశీ—నిశ్చయముగా—ఆవిషయమున సంశయము లేదు. కాని మీరిప్పు డొక్కసారి యాతనిం గాంచి బోధింపవలయును.

కమ—చూచుట కుపాయ మేమున్నది?

కాశీ—నేనట్టి యవకాశము కల్గింపఁగలను.

కమ—ఇది మాతండ్రికిఁ దెలిసినచో నేమనునో! ఇప్పు డాతనికిఁ దెలియకుండ నిచ్చటికి వచ్చినందులకే భయపడుచున్నాను.

కాశీ—నిరపరాధి యగునొకఁడు నిష్కారణముగ మరణదండన మనుభవింప నున్నప్పుడు శక్తి కల్గియుండియు నీవాతని రక్షింపకుండుట దోషము కాదా ?

కమ—నేనాతని గారాగారమునఁ జూచినట్లెవరికైనఁ దెలిసినచో నాకుఁదలవంపుగా నుండును. నాతండ్రికిఁ దెలిసినచో నన్ను నిందింపక మానఁడు. ఆతనికిఁ దెలుపకుండ నేనేకార్యమైనను జేయవచ్చునా?

కాశీ—ఆవశ్యకమైనప్పుడు చేయక తప్పను. ఒకయుత్తముని చావుబ్రదుకులనుగూర్చినపని—బాగుగ నాలోచించుకొనుము!

ఆసమయమున దాసి కమలరెండుచేతులనుబట్టుకొని కరుణనుయకంఠస్వరముతో "నడువుము!" అనెను.

కాశీ—రండు. మీరు బలవంతముచేసి యడిగినచో నాతఁ డెల్ల సంగతులను దెలుపును. మీమాటన నాతఁడు త్రోసివైవఁజాలఁడు.

కమ—ఆతఁడు నామాటమాత్రము వినునా?

కాశీ—ఆతఁడు నిన్నుఁ బ్రాణముంబోలి ప్రేమించుచున్నాఁడు. ఎవ్వరిమాట విన్నకున్నను నీమాటమాత్రము త్రోసివైవఁజాలఁడు.

కమలకపోలము లాకస్మికముగ లజ్జచే నెఱ్ఱనయ్యెను. ఆమె తలవంచుకొని "అట్లయినచో నడువుఁడు!" అనియెను.

కాశీధాముఁడు వారిని వెంటఁబెట్టుకొని పోయి యొకబండిపై నెక్కించి వారి నెవ్వరునానవాలుపట్టకుండునట్లుతానిదివఱకే బండిలో సిద్ధముచేసి యుంచిన బురకాలను వారిచేధరింపఁజేసి కారాగృహాభిముఖముగ బండిపైనెక్కి వెడలిపోయెను.

పదియవ ప్రకరణము

కారాగృహము

బండి కారాగృహము చేరినతోడనే కాశీధాముఁడు దిగియెను. కమలాబాయిగుండెలు కొట్టుకొనుచుండెను! ఆమె సర్వాంగకములును గంపించిపోవుచుండెను. చెఱసాలయందెట్లుప్రవేశింతు నని యామె హృదయము వ్యాకులపడిపోవుచుండెను! అప్పుడామెయవస్థం గాంచి

దాసి "అమ్మా! సుస్థిరవై యుండుము! తత్తరపడియెదవేల? నీవు ధైర్యమును వహింపకున్నచో రస్తమజీని రక్షింపఁజాలవు!" అని హెచ్చరించెను.

కమ—నీ వెప్పుడైన నెవ్వరినైనఁ బ్రేమించి యున్నచో నిప్పటి నాహృదయావస్థను దెలిసికొని యుందువు.

దాసి మఱి మాటాడక పెడమొగము పెట్టుకొనియెను. అప్పు డామెహృదయాంతరమునుండి యొక్క దీర్ఘశ్వాసము వెలువడియెను. కమల యదరిపడి యామె మొగమువంకఁ జూచెను.

ఆసమయమునఁ గాశీనాథుఁడు బండియొద్దకు వచ్చి "రండు" అనియెను.

ఇరువురును బండి దిగిరి. కమల యుద్వేగకంపిత యగుచుండెను. దాసి యామెచేయి పట్టుకొని నడపించుచుండెను. అట్లు మెల్లమెల్లగా వారు బందిగమునఁ బ్రవేశించిరి. కాశీనాథుఁడు ముందుగ లోపలఁ బ్రవేశించెను. ఆయనవకుం రనవతులగు రమణు లిరువురు నొకపార్శ్వమున నిలువఁబడి యుండిరి.

అప్పుడు రస్తమజీ తలయెత్తి కాశీనాథుని గనుంగొనియెను. అంతఁ గాశీనాథుఁడు "కమలాబాయి నీదర్శనమునకు రావచ్చునా?" అనియెను.

రస్తమజీ యులికిపడి "ఎవరు?" అనియెను.

కాశీనాథుఁడు మఱిమాటాడక వెలుపలికి వచ్చి యాయువతుల నిరువురను లోపలికి రండని సంజ్ఞచేసెను. కంపితపదములతోఁ గంపితహృదయముతోఁ గమలాబాయి మెల్లమెల్లగ లోపలఁ బ్రవేశించెను. విస్మయావిష్టుఁడై రస్తమజీ చటాలున లేచి నిలువఁబడియెను. ఆతనినోటినుండి యొక్కమాటయైన వెలువడుట లేదు. ఆతనికన్నుల నీరు నిండిపోయెను. కమలాబాయి యిఁక నాఁగఁజాలక యేడ్చుచు

పైటచెఱఁగుచే మొగము గప్పుకొనియెను. మఱి దాసియో—ఆమె యును మొగమున ముసుఁగువైచుకొని గోడకుఁ జేరగిలి నిశ్చేష్టయై నిలువఁబడిపోయెను.

ఆసమయమునఁ గాశీనాథుఁడు "రస్తమజీ! నేనెంతయడిగిన నీవు రహస్యమును వెల్లడించితివి కావు. అందుచే నెంతయో ప్రయత్నించి కమలాబాయి నిచ్చటికిఁ దీసికొని వచ్చితిని. నీవు కావలయునని కోరి యిట్లు వెఱ్ఱివాఁడవై పోవుచుండఁగా మేము నిర్విచారముగ నెట్లుండఁగలము?" అనియెను.

రస్త—మీకెట్లు చెప్పుదును? నన్నేల బాధించెదరు? క్షమింపుఁడు!

కాశీ—నీపితృసఖుఁడ నగు నేను నీకష్టమును జూడఁగలనా?

రస్తమజీ మఱిమాటాడలేదు. అప్పుడు కాశీనాథుఁడు కమలం గాంచి "కుమారీ! ఈతఁడు నాకుఁ జెప్పుటలేదు. నీవైనను బలవంతపెట్టి యడుగుము!" అనియెను.

కమల మాటాడుటకుఁ బ్రయత్నమైనఁ జేయఁజాలకపోయెను. అప్పుడు కాశీనాథుఁడు దాసిం గాంచి "నీవైనను నీయజమానురాలికి బోధింపుము!" అనియెను.

అతికష్టముతో దాసి కమలచేయి పట్టుకొనియెను గాని ధైర్యము వహింపఁజాలక యేడువఁ దొడంగెను. ఆసమయమునం దామె మేలిముసుఁగించుక జాఱెను.

రస్తమజీ విస్మితుఁడై యావేగపూర్ణస్వరముతో "నీవా?" అనియెను.

దాసి తనయజాగ్రత్తను దెలిసికొనఁజాలకపోయెను. తొందరలో నామె తనమేలిముసుఁగును సవరించుకొనుమాటయే మఱచిపోయెను. అప్పుడు కమలాబాయి యదరిపడి యొకసారి రస్తమజీవంకను

మఱియొకసారి దాసివంకను దిలకించెను. ఆమె కథ యంతయు నద్భుతకథగాఁ దోఁచెను.

రస్తమజీ యించుక లజ్జితుఁడై! తనలో "నాకు మతిపోవుచున్నది కాఁబోలును! ఆమె కమలాబాయికి దాసి యగుటయెట్లుసంభవించును' కాని యాముఖమే యీముఖము ! " అని యనుకొనెను.

కాశీనాథుఁడు రస్తమ్జీని గాంచి "ఈదాసికిఁ గమలయం దెంతి ప్రేమయోగాని యామెకూడ నీకొఱకేడ్చుచున్నది. నీవొక్కమాట చెప్పినచో నన్నిగొడవలును దీరిపోవునుగదా! అట్లు చెప్పుటకు నీకు సంశయమేల? మేమందఱము నీకొఱకింతశ్రమపడుచుండఁగా నీవుకృతఘ్నునివలెఁ బ్రవర్తించుట తగునా? "అనియెను.

రస్తమజీ వినయముతో " క్షమింపుఁడు. సప్రమాణముగఁ దెలుపుటకుపాయమే యున్నచోఁ జెప్పియేయుందును!" అనియెను.

ఈసారి కమల కొంచెము ధైర్యము వహించి "చెప్పకూడదా?" అనియెను.

రస్తమజీ యావేగముతో ''కమలా! నీవు నన్నుఁ బ్రశ్నింపకుము! ఇప్పటికిని నేను నీమాటను ద్రోసివైవఁజాలను. కాని నీవు నన్నీవిషయమున ధర్మభ్రష్టునిగాఁ జేయఁజూడకుము!'' అనియెను.

కమ—నీమాటలయర్థము నాకించుకంతయు బోధపడుట లేదు.

రస్త—నీవు నన్నేమియు నడుగవలదు.

ఆకస్మికముగఁ గమల రస్తమజీపాదములపై వ్రాలి బాష్పరుద్ధకంఠస్వరముతో ''నీకు నాయందించుకంతయైనఁ బ్రేమయేయున్నచో నీవారాత్రి యెచ్చటికిఁ బోయితివో చెప్పుము! ఇతరులకొఱకు నీవు నీప్రాణములమీఁదికిఁ దెచ్చుకొనుట యెందులకు? " అని ప్రార్థించెను.

రస్తమజీ కమలను లేవనెత్తి "కమలా! నీవడుగుచున్న సంగతి యెట్టిదియో పాపము నీకుఁ దెలియదు! " అనియెను.

కమల వ్యాకులహృదయముతో "తెలిసినను తెలియకున్నను సరియే; నేను సాధారణస్త్రీలవంటిదాన ననుకొంటివి కాఁబోలును! నీవు—ఇతరులకొఱకు—" అనుచుండఁగనే మాటకడ్డమువచ్చి కాశీనాథుఁడు "ఒకసాధారణస్త్రీకొఱకు—" అనియెను.

అంతలో రస్తమజీ తొందరతో ''అవును. స్త్రీకొఱకనుమాట సత్యమే" అనియెను.

కమల యశ్రుపూరితనయనములతో రస్తమజీమొగమువంకఁ గొంతసేపుచూచి పిమ్మట నేడువఁ దొడంగెను. మందభాగ్యురాలగు దాసియును మేలిముసుఁగులోఁ గమలవలెనే దుఃఖించుచుండెను. కన్నీటిధారలచే నామెవక్షోవసనము తడిసిపోయెను.

పదునొకండవ ప్రకరణము.

అది యేభావము.

చాలసేపటివఱకు నందఱును మౌనముతో నుండిరి. తుదకుఁ గాశీనాథుఁడు "రస్తమజీ! నీవు కఠినహృదయుఁడ వని స్పష్టముగాఁ జెప్పుచున్నాను. ఈబాలిక నిన్నుఁ బ్రాణమువలెఁ బ్రేమించుచు నీపాదములపైఁ బడి ప్రార్థించుచుండఁగా నీవు పాషండునివలెఁ బ్రవర్తించుచుంటివి గాని యొక్కసారియైన నీమె మొగమువంకఁ జూచితివా?." అనియెను.

రస్తమజీ దుఃఖముతో "మహాశయా! నాహృదయము మీకును గమలకునుగూడఁ దెలియుట లేదు. కమలకొఱకే నేనామాటలను జెప్పఁజాలకున్నాను" అనియెను.

కమల యదరిపడి తలయెత్తి "నాకొఱకా?" అనియెను.

కాశీ—ఈతనికి మతిపోయినది. న్యాయస్థానమున నీతఁడు పిచ్చివాఁడని నిరూపింపవలయును. ఇంతకంటె నుపాయము లేదు.

రస్త—నేను పిచ్చివాఁడనుగాను. కమలా! నేను సత్యముగ నీకొఱకే యేమియుఁ జెప్పఁజాలకున్నాను. నేను జీవితమంతయును దుః

ఖముం గోఁ గడపఁగలను గాని నీకుమాత్ర మెట్టికష్టమును గలిగింపఁజాలను.

కమల మెల్లమెల్లగ వచ్చి రస్తమజీచేయి పట్టుకొని "నీవు నాకొఱకు విచారింపవలదు. నీరక్షణోపాయము నాలోచించుకొనుము. నేను నీకష్టమునుజూచుచు జీవింపఁజాలను. ఇందువలన నాకెట్టికష్టము కలిగినను సరియే. నేను సహింపఁగలను. చెప్పుము! చెప్పుట కిష్టము లేకున్నచో నేనిప్పుడే వెడలిపోయెదను" అనియెను.

రస్త—కమలా! ఇప్పుడు కాదు. ఎప్పుడైనఁ జెప్పెదను. న్యాయస్థానమున నాసంగతి తెలిసినచో నాకు విడుదలయగునని నేనెఱుంగుదును. కాని నేనెంతమాత్రము నట్లు చెప్పఁజాలను.

కమల యేమియు ననఁజాలక యేడువఁదొడంగెను. ఇంతవఱకు నేడ్చుచున్నదాసి యాకస్మికముగ రస్తమజీని సమీపించి యాతని చేయిపట్టుకొనఁబోయెను; కాని యంతలో మనసు కుదురుపఱుచుకొని వెనుకకొదిగెను. రస్తమజీయును నించుక వెనుకకు జరగి స్తంభితుండై నిలువఁబడి యాశ్చర్యముతో నామెవంకఁ దదేకదృష్టిని జూచుచుండెను.

కమల యించుక ప్రకృతిస్థయై మరల వచ్చి రస్తమజీచేయి పట్టుకొని కాతరస్వరముతో "ఏకారణమైన నగుఁగాక! అందుచే నాకెట్టికష్టమైన నగుఁగాక! నీవాసంగతి చెప్పక తప్పదు" అనియెను.

రస్త—కమలా! నీవిప్పుడు ప్రశ్నించుచున్నసంగతి యెట్టిదో నీకుఁ దెలియుట లేదు. నాకు మనఃకష్టము కలిగింపవలదు. నేను చెప్పఁజాలను.

కమ—నీవిష్టపడి యాత్మహత్య చేసికొనఁదలఁచితివి. ఇదియేమి? నేను నీయెడల నెట్టియపరాధమును గావించితిని?

అని పలుకుచుఁ గమల యిఁక సహింపఁజాలక నిలువునఁ గూలుచుండఁగాఁ గాశీనాథుఁ డామెంబట్టుకొని రస్తమజీవంకఁ జూచి "నీవు పేస్తనజీని జంపలేదు. కాని యాతని నెవ్వరు చంపిరో మాత్రము నీకుఁ దెలిసియుండును." అని పలుకుచు నాతఁడు కమలను నెంటఁబెట్టుకొని యవ్వలకుఁ బోయెను.

దాసి యప్పుడు మేలిముసుఁగును దీసివైచి చటాలునఁబోయి రస్తమజీచేయిపట్టుకొని "నామాటవినుము. మమ్మేల దుఃఖపెట్టెదవు?" అనియెను.

ఆకస్మికముగ భయంకరకృత్యముం గాంచినవానింబోలి యప్పుడు రస్తమజీ విస్మయవిహ్వలుండై "నీవేనా? నేను పొరపాటుపడితి ననుకొంటిని!" అనియెను.

దాసి—అవును. నేనే. నీకొఱకు నేనిప్పుడు కమలాబాయి దాసినైతిని. ఇట్లయినను నీకుఁ దయఁగలుగుట లేదా? నిష్ఠురుఁడవైపోయితివా? దయార్ద్రహృదయుఁడవును, ప్రేమమయుఁడవు నగునిన్ను నిష్ఠురునిగా నేనెట్లు భావింపఁగలను?

అని పలుకుచు నిమిషములో నామె యంతర్హిత యైపోయెను. రస్తమజీ యచ్చటనే నిలువునఁ గూలఁబడి బాలకునివలె నేడువఁదొడంగెను.

కాశీనాథుఁ డాయిరువురు రమణీమణుల నెప్పటివలె నాయుద్యానమునకుఁ దీసికొనివచ్చి "మీ రధైర్యపడవలదు. రస్తమజీ చెప్పకపోయినను నాతఁ డారాత్రి యొకస్త్రీని దర్శింపఁబోయినట్లు తెలియవచ్చినదిగదా! తక్కినసంగతి యంతయును బ్రయత్నించి నేనే తెలిసికొందును" అని చెప్పి వారి నూఱడించి యింటికిఁ బంపివైచెను.

వారును వెడలిపోయిరి. తరువాతఁ గాశీనాథుఁడు తనలో "ఆతఁడు చెప్పకుండుట కేదియో కారణముండియుండును. కాకున్నచోఁ

గోరికపడి యెవ్వఁడు కంఠమున కురి తెచ్చుకొనును? ఆరాత్రి యాతఁడొక స్త్రీయొద్దకుఁ బోయెను. ఆమె యెవ్వతెయైయుండును? ఆపతితురాలు మరణించినది. మరణకాలమున నామె రస్తమజీ నేల పిలువవలయును? హారమసజీతోడనే గాని రస్తమజీకి మఱియెవ్వరితోడను విశేషసంబంధము లేదు. ఒకయాఁడది మఱియొకపురుషు నెప్పుడుపిలిచెనో యప్పు డావిషయమున మఱియొక స్త్రీసంబంధ ముండితీరవలయును. ఆమె నిశ్చయముగాఁ గమలాబాయియే. ఆస్త్రీసంగతిచెప్పినచోఁ గమలాబాయికిఁ గష్టము కలుగునని యాతఁడు చెప్పుట కిష్టపడుట లేదు. ఎట్లయినను నేనీరహస్యమంతయును భేదించి తీరవలయును" అని యింక నేమేమియో భావించుకొనియెను.

పండ్రెండవ ప్రకరణము.

సంధానము.

లాలూభాయి యామృతస్త్రీనివాసమును గీర్టికరుఁడు సంపాదించిన కాగితమునుబట్టి తెలిసికొని యాస్థలమును బరీక్షించుటకై వెడలిపోయెను. బొంబాయినగరమున నైదాఱువందలమంది దరిద్రులద్దెకుఁ దీసికొని నివసించుట కనుకూలముగానుండు నిండ్లు కొన్నియున్నవి. అట్టియిండ్లలో వివిధజాతులవారు దరిద్రులు నివసించుచుందురు. అట్టియింటినే యొకదానినిప్పుడు లాలూభాయి పరీక్షింపవలసివచ్చెను. అట్టిస్థలములయందెవ్వరినైన నన్వేషించుట సులభసాధ్యము కాదు.

ఆతఁడాయింటికిఁ బోయి పరీక్షింపఁగా నొకయంగడివాఁ డిప్పటికిఁ బదిపండ్రెండుదినములక్రిందట నిందొకరు మరణించిరని చెప్పెను. కాని యామరణించినవ్యక్తి స్త్రీయో, పురుషుఁడో యేగదియందుండెనో యాతఁడు చెప్పఁజాలకపోయెను. తరువాత లాలూభాయి రెండవ

యంతస్తునకుఁ బోయి యడిగెను. కాని పోలీసువారి కేమిచెప్పిన నేమిచిక్కు కలుగునో యని యెల్లరును జెప్పుటకు సందేహించిరి.

ఆతఁడు మూడవయంతస్తునకుఁబోయి చూచెను. అచ్చటను విశేషములు తెలియలేదు. తరువాతనాతఁడు నాలవయంతస్తునకుఁ బోయి యొకయింటిలో నొకయామె బిడ్డకుఁ బాలిచ్చుకొనుచుండఁ జూచి "అమ్మా! పదిపండ్రెండుదినములక్రిందట నిచ్చట నొకయువతి మరణించినదఁట. ఆమె యేగదిలోనుండెడిదో చెప్పఁగలవా?" అని ప్రశ్నించెను.

స్త్రీ—పైయంతస్తునకుఁ బొమ్ము; ఆమె 152 నెంబరు గదిలోనుండెడిది.

లాలూభాయి కష్టపడి పైయంతస్తునకుఁ బోయి వెదకి చూడఁగా నాయిల్లు బీగము వేయఁబడియుండెను. ఆతఁడాప్రక్కయింటికిఁ బోయి యాయింటివారింగాంచి "ఈప్రక్కయింటిలో నెవ్వరున్నారు?" అని ప్రశ్నించెను.

అప్పుడం దొకపురుషుఁ డాతనిని సమీపించి "ఏమి? అందొక స్త్రీయుండెడిది." అని చెప్పెను.

లాలూ—ఆమె పేరేమి?

పురు—నాకుఁ దెలియదు. ఆమె పదిపండ్రెండుదినములక్రిందట మరణించినది.

లాలూ—ఆమె సామానంతయు నెవ్వరు తీసికొన్నారు?

పురు—నాకుఁ దెలియదు.

ఇఁకనాతఁడు మఱియేమియడిగినను నెఱుఁగనని చెప్పుటచే లాలూభాయి హతాశుఁడై మరలఁ గ్రిందియంతస్తునకు వచ్చి పూర్వోక్తస్త్రీయొద్దకు వచ్చి "అమ్మా! ఇప్పుడామె మరణించినదఁట! ఆమె నాయాత్మీయురాలు. జబ్బుగానున్నదని నాకుఁ జాబువ్రాయుటచే చూచిపోవలయునని వచ్చితిని. కాని చూపు దొరకినది కాదు." అనియెను.

స్త్రీ—అవును. ఆమె యెంతయో కష్టపడి మరణించినది. పాపమామెకుఁ జేతిలో నొకదమ్మిడియైనను లేకపోయినది.

లాలూ—ముందే నాకుఁ దెలిపినచో నామె కంతకష్టము లేకయే యుండును. అమ్మా! ఆమెసంగతి యంతయును జెప్పినచో నేను నీ కొకరూపాయనిచ్చెదను. ఎవ్వరి నడిగినను జెప్పుటలేదు.

రూపాయ చూచినతోడనే యాకాంత కన్నులు వికసించెను. ఆమె సంతోషముతో "మీకేమి చెప్పవలయునో యడుగుఁడు!" అనియెను.

లాలూ—ఆమె నెప్పుడైన నీవు చూచితివా?

స్త్రీ—ఆ. నేను పేదరాలను. ఏమిచేయఁ గలను. పాపమామెకుఁ దగినచికిత్స జరుగలేదు.

లాలూ—ఆమె నాకుఁ దెలియకుండ నిల్లువిడిచిపోయినది. ఇచ్చటికి వచ్చి యెన్నాళ్ళయినది?

స్త్రీ—ఇంచుమించుగ మూడుమాసములు—నెలక్రిందట నామెకు జబ్బుచేసినది. నోటినుండి రక్తము వాంతి యగుచుండెడిది.

లాలూ—అలాగా? దూరమునందుండి నేనేమిచేయఁ గలుగుదును? చచ్చిపోవునప్పు డామెయొద్ద నెవ్వరైన నున్నారా?

స్త్రీ—ఆరాత్రి యామె రస్తమజీ కిచ్చిరమ్మని యొక యుత్తరమువ్రాసి నాచేతికిచ్చిపంపించినది. నేను వెదకుకొనుచుఁ బోయి ఎలిఫెన్‌స్టను సర్కిలునందలియుద్యానమున నాతని జూచి యొకబాలునిచే నాతని కాచీటిని బంపించితిని.

లాలూ—అతని నీవెట్లెఱింగితివి?

స్త్రీ—హారమసజీ ద్వారపాలకుఁడు చెప్పినాఁడు.

లాలూ—తరువాత నాతఁడు చీటినందుకొని యిచ్చటికి వచ్చినాఁడా?

స్త్రీ—ఆ. రాత్రి పండ్రెండుగంటలకు వచ్చి రెండుగంటలవఱకు నున్నాఁడు.

లాలూ—వారేమి మాటలాడికొనిరో నీవెఱుఁగుదువా?

స్త్రీ—ఎఱుఁగను. తలుపులు మూసికొని యేమేమో మాటలాడికొనిరి. తరువాత నాతఁడు వెడలిపోయెను. అతఁడు వెడలిన గంటసేపటి కామెయు మరణించినది.

లాలూ—ఆమెకు సత్కారమెవ్వరు చేసిరి?

స్త్రీ—ఇంటివారే.

లాలూ—ఆమె సామానంతయు నెవ్వరు తీసికొనిరి?

స్త్రీ—సామానంత విశేషముగ నేదియును లేదు. అది యింటివారియొద్దనే యున్నది.

లాలూ—పాపము! నీకుఁ జాల శ్రమనిచ్చితిని.

అనిచెప్పి లాలూభాయి యొకరూపాయనామెచేతిలోఁబెట్టి యటనుండి వెడలిపోయెను.

పదుమూడవ ప్రకరణము.

సంధానఫలము.

లాలూభాయి క్రిందికి దిగి యొకయంగడివానిం గాంచి "ఈయిల్లెవరిది?" అని ప్రశ్నించెను.

అంగ—దాదాభాయిమాణిక్యజీగారిది.

లాలూభాయి యాతని దర్శించుటకుఁ బోయెను. మాణిక్యజీ ధనాఢ్యుఁడు; లాలూభాయి యాతనిం దర్శించెను. మాణిక్యజీ యాతనిం గాంచి "మీరు వచ్చినపనియేమి?" అని యడిగెను.

లాలూ—నేను పత్తేదారుఁడను. నాపేరు లాలూభాయి యందురు.

మాణి—నేను చేయవలసినపని యేమి?

లాలూ—మీతో నాకుఁ గొంచెము పనియున్నది. మీకు బీదలకద్దెకిచ్చు గృహమొకటి యున్నది కాదా?

మాణి—ఉన్నది.

లాలూ—ఈనడుమ నాయింట నెవరైన మరణించిరా?

మాణి—ఆ.

లాలూ—ఎన్నాళ్ళయినది?

మాణి—నేను సరిగాఁ జెప్పలేను. మాగుమాస్తాకుఁ దెలియును.

లాలూ—ఆవిషయ మంతప్రయోజనమైనది కాదు! పేస్టనజీ హత్యనుగూర్చి మీరు వినియుంటిరా?

మాణి—ఆ. పత్రికలలోఁ జూచితిని.

లాలూ—మేమిప్పుడు హంతకుఁడని యనుమానించి పట్టుకొన్న యాతఁడు హత్యజరిగినసమయమున సరిగా మీయింట మరణించినయామెయొద్ద నున్నట్లు తెలియవచ్చినది.

మాణి—అట్లయినచో నాతఁడు హత్యచేయలేదా?

లాలూ—లేదు.

మాణి—ఇప్పుడు మీరు నావలన నేమి తెలిసికొనవలయు నని వచ్చితిరి?

లాలూ—ఆమె సామానంతయును మీరు తీసికొనివచ్చితిరా?

మాణి—అవును; మాగుమాస్తా తెచ్చినాఁడు. అందు విలువగలవి యేవియును లేకుండుటచేఁబోలీసువారికిఁ బంపలేదు.

లాలూ—సరే. ఏవేవి యున్నవి?

మాణి—పగిలిపోయిన పెట్టెయొకటి—దానిలోఁ జినిఁగిపోయిన యొకటి రెండు గుడ్డలు నున్నవి.

లాలూ—వానిని నేనొకసారి చూడవచ్చునా?

మాణిక్యజీ యొక సేవకునిబిలిచి యాపెట్టెను దీసికొని రమ్మని పంపెను. ఆతఁడు దానిని వెదకి తీసికొని వచ్చుట కించుక యాలస్యమగుటచే మాణిక్యజీ విరక్తుఁడై తానేస్వయముగ వెదకుటకు లోనికిఁబోయెను. లాలూభాయి యచ్చటనే కూర్చుండి నిరీక్షించుచుండెను.

ఇంతలో మాణిక్యజీ యొకసేవకునిచే నాపెట్టెను తెప్పించుకొని వచ్చి "ఇదియే యాపెట్టె." అని చూపెను.

లాలూభాయి యాపెట్టెను దెఱచి యందలి ఛిన్నమలినవస్త్రఖండములను బైకిఁ దీసెను. మఱియు నాతనికందొక కాగిత మగపడియెను. మాణిక్యజీకిఁ దెలియకుండ నాతఁడా కాగితమును గరగతము చేసికొని తన జేబులో నుంచుకొని యావస్త్రఖండములను దిప్పితిప్పి చూచుచు "చాలును! ఇఁకఁ జూడవలసినదేదియును లేదు. వీనిని మీకుఁ బోలీసువారికిఁ బంపనక్కఱలేదు" అనియెను.

మాణిక్యజీ వినయముతో "అయ్యా! మీకు నావలనఁ గావలసినపని యేదైన నున్నచోఁ జేయుటకు సిద్ధముగా నున్నాను." అనియెను.

"నాకంతయును బోధపడినది" అని చెప్పి లాలూభాయి వెడలిపోయెను. అట్లాతఁడు కొంతదూరము పోయి తన జేబులోని కాగితమును బైకిఁ దీసి చదివికొని తనలో "కర్తికరుఁడు నన్ను మూఢుఁడని నిందించెను. ఈయుత్తరము చూచుకొని యిప్పు డేమనునో?" అని యనుకొనియెను.

ఆతఁ డట్లనుకొనుచుండఁగనే వెనుకనుండి యెవ్వరో తన వెన్నుపైఁ జేయివైచిన ట్లగుటయు నాతఁడు తిరిగి చూచెను. ఎవ్వరు? అతఁడు

కీర్తికరుఁడే! లాలూభాయి నవ్వుచు "అయ్యా! నీవు సర్వవ్యాపివలె నున్నావే" అనియెను.

కీర్తి—కాకున్నచో నెట్లు? సర్కారుసొమ్ము తినుచుంటిమి కాదా? సరే. ఇప్పుడు మాణిక్యజీవలనఁ గ్రొత్తసంగతు లేమైనఁ దెలిసినవా?

లాలూ—మాణిక్యజీసంగతికూడ మీకుఁ దెలిసిపోయినదే!

కీర్తి—కొలఁదియో గొప్పయో నాకన్నిసంగతులును దెలియుచునే యుండును.

లాలూభాయి సంక్షేపముగ నంతయును జెప్పి తాను సంపాదించినకాగితమును గీర్తికరున కిచ్చెను. దానిం గాంచి యాతఁడు పరమాశ్చర్యనిమగ్నుఁడగునని లాలూభాయి యాశపడియెను. కాని కీర్తికరుఁడుమాత్ర మెట్టియాశ్చర్యమును జెందక "ఈకాగితములో నిట్లుండు నని నేనిదివఱకే గ్రహించి యున్నాను" అనియెను.

లాలూ—ఆలాగా?

కీర్తి—అవును.

లాలూ—ఇప్పు డొకనిమిషమైన నాలస్యము చేయకుండ నీతనిని బట్టుకొనవలదా?

కీర్తి—కచేరికిఁ బోయి యంతయు నాలోచింతము. కాని నీవు మాత్రమొక్కపొరపాటుపని చేసితివి!

లాలూ— ఏమిచేసితిని?

కీర్తి—ఆరాత్రి యాస్త్రీమరణావస్థలోనున్నప్పుడు మాణిక్యజీ గుమాస్తా యచ్చటికి వచ్చియుండెను.

ఆతండు రస్తుమజీని బాగుగ నెఱిఁగియే యుండును. ఏమనిన--

మాణిక్యజీకి హోరమసజీ బ్యాంకిలో నిచ్చిపుచ్చుకొను వ్యాపారమున్నది!

లాలూ—అట్లయినచో నేనిప్పుడేమి చేయవలయును?

కీర్తి—ఆగుమాస్తా యెవ్వరో తెలిసికొనవలయును.

లాలూ—ఆలాగే. ఇప్పుడే పోయెదను.

తరువాత నిరువురును దఫుతరుదారిని బోయిరి.

పదునాల్గవ ప్రకరణము

కాశీనాథుని యుక్తి.

ప్రేమజీ తనయింటఁ గూరుచుండి రస్తుమజీయవస్థంగూర్చి విచారించుచుండెను. ఆసమయమునఁ గాశీనాథుఁ డచ్చటికి వచ్చి ముందుగఁదానే "అయ్యా! మీరు నన్నెఱుఁగరు. నేను రస్తుమజీతండ్రికి బాల్యస్నేహితుఁడను. ఇప్పుడు రస్తుమజీవిపద్వార్త నాలకించి సహింపఁజాలక యాతని నెట్లైన నుద్ధరింపవలయు నను పూనికతో వచ్చియుంటిని" అని చెప్పెను.

ప్రేమజీ యాతనిని సగౌరవముగఁ గూర్చుండఁజేసి "అయ్యా! ఇంతటికష్టకాలమున నీయవస్తలో రస్థమజీకి సాయము చేయఁదగిన సమర్థులెవ్వరైన నుందు రని నాకెంతమాత్రమునాశ లేదు" అనియెను.

కాశీ—మీకు నాతనికి విశేషమైత్రి కలదని నేను విని యుంటిని.

ప్రేమ—మిత్రుఁడ నైనంతమాత్రమున నేనేమి చేయఁగలను? ఈహత్యవిషయమున విశేషించి పోలీసువారికి నాయెడలఁగూడ ననుమానమున్నది!

కాశీ—అవును. ఆవ్యవహారమంతయు విని యుంటిని. అట్లనుమానించుటకుఁగూడ ననేకకారణము లున్నవి. క్లోరోఫారము కొనుట

—క్లోరోఫారము పూసిననీరుమాలు శవము మొగముపై నుండుట—హత్యజరిగినచోటనే నీవారాత్రి బండినెక్కి నీయింటిసమీపమున దిగుట—ఇట్టినిదర్శనములగుపడుచున్నమాట నిజమే.

ప్రేమ—నేనారాత్రి యీబొంబాయినగరమునందే లేను. ప్రమాణముచేసి చెప్పుచున్నాను.

కాశీ—అట్లు నీవు సప్రమాణముగా నిరూపింపఁగలిగినచో నిఁక భయమేమి? ఎట్లయినను రేపు రస్తమజీవిచారణ యారంభమగును; ఎట్లయిన నాతని రక్షింపవలయునను నుద్దేశముచేతనే నేనిప్పుడిచ్చటికి వచ్చితిని.

ప్రేమ—ఇందు నేను చేయఁజాలినపని యేమైన నున్నచోఁ జెప్పుఁడు!

కాశీ—ముందుగా నొకమంచివకీలు నేర్పఱుపవలయును. నీయొద్ద ధన మున్నది.

ప్రేమ—ఆసంగతి మీకెట్లు తెలిసినది?

కాశీ.—రస్తమజీకొఱకు నీకెవ్వరో సొమ్ము పంపినట్టు తెలినది.

ప్రేమ—నేను హరకృష్ణుఁడనునిపుణుఁడగు వకీలును సిద్ధము చేసితిని.

కాశీ—మంచిపని చేసితివి. ఆతఁడు తగినవాఁడు!

ప్రేమ—కాని యారాత్రి రస్తమజీ పేస్తనజీతోఁ గలసి బండి యెక్కి పోలేనట్లు నిదర్శనము చూపకున్నచో నెట్టిలాభమును లేదని వకీలు చెప్పుచున్నాఁడు. ఈవ్యవహారమున రస్తమజీ హంతకుఁడని చెప్పుట కనేకనిదర్శనము లున్నవఁట!

కాశీ—ఆసంగతి నాకును దెలియును. కాని యాతనిపక్షమును సమర్థించుటకుఁగూడ నేను కొన్ని నిదర్శనములను సంగ్రహించితిని.

ప్రేమ—నేనును వకీలును బోయి కారాగృహమున నున్న రస్తమజీ నడిగినప్పు డారాత్రి తాను పేస్తనజీతోఁ గలసిపోలేదని చెప్పెను. కాని యెక్కడకుఁ బోయెనో యెంతగా నడిగినను జెప్పలేదు.

కాశీ—నేను నడిగితిని. ఆసంగతి నాకును జెప్పలేదు.

ప్రేమ—పాపము! దుఃఖముచే నాతనికి మతిపోయినది.

కాశీ—ఏమైననేమి? కొంచెము కష్ట పడవలసివచ్చినది గాని ప్రయత్నించి సంపూర్ణముగ నెల్లవిషయములను నేను గ్రహింపఁగలిగితిని.

ప్రేమజీ వికసితనయనములతో "అయ్యా! అట్లయినచో రస్తమజీకి విడుదల యగునా?" అనియెను.

కాశీ—నిరపరాధికి శిక్షయగుట యెట్లు?—వినుము! నామాటలన్నియును వకీలునకుఁ జెప్పవలయును. ఆరాత్రి పదిగంటలవేళ ఎలిఫిన్‌స్టన్ సర్కిలునందలియుద్యానము నొద్ద నొకబాలకుఁడు రస్తమజీ కొకయుత్తరము నిచ్చెను. ఆయుత్తర మిదిగో! అది మరణించుచున్న యొకస్త్రీ వ్రాసినజాబు! ఆచీటిచదువుకొని రస్తమజీ యామెను జూచుటకుఁ దొందరగఁ బోవుచుఁ ద్రోవలోఁ దాగిపడిపోయియున్న పేస్తనజీని బండిపై నెక్కించి పంపి తానాకాంతను జూడఁబోయెను

ప్రేమ—ఈసంగతి యాస్త్రీ చెప్పెనా?

కాశీ—ఆమె యారాత్రియే మరణించినది. ఆయుత్తరము తెచ్చియొకబాలునిచే రస్తమజీకిఁ బంపించిన మఱియొకస్త్రీ యీసమాచారము చెప్పినది.

ప్రేమ—న్యాయస్థానమునందామెయీసంగతి చెప్పునా?

కాశీ—ఆ. రస్తమజీ యారాత్రి రెండుగంటలవఱకు నాస్త్రీయొద్ద నున్నట్లుకూడ నామెయే చెప్పినది.

ప్రేమ—ఇఁక భయ మేమున్నది? పేస్తనజీహత్యజరిగినసమయమున రస్తమజీ యాస్త్రీయొద్దనే యుండెను.

కాశీ—మఱియు నాస్త్రీ నివసించియున్నగృహము మాణిక్యజీగారిది. ఆయనగుమాస్తాకూడ నారాత్రి యచ్చటనే యున్నాఁడట. ఆగుమాస్తాకూడ రస్తమజీని బాగుగ నెఱుఁగును. అతఁడుకూడ నాయింట నప్పుడు రస్తమజీని జూచి యుండెను.

ప్రేమ—అతఁడుకూడ నిట్లు సాక్ష్యము చెప్పునా?

కాశీ— నిశ్చయముగఁ జెప్పును. సత్యము చెప్పుటకు సంశయ మేమి? ఈసంగతులు నీవు ముఖ్యముగా వకీలునకుఁ దెలుపుము. బాలకుఁడు, స్త్రీ, గుమాస్తా ఈమువ్వురను సాక్షులుగాఁ బిలిపింపవలయును. రేపేవిచారణ జరుగును. నేఁడేయంతయును సిద్ధము చేసికొనవలయును. వీలైనచో మరల నిన్నొకసారి వచ్చిచూడఁగలను.

ప్రేమ—మంచిది. నేనిప్పుడే పోయి వకీలున కంతయుఁ జెప్పెదను. మీమూలమున మారస్తమజీ బ్రదుకుచున్నాఁడు కాకున్నచో నిట్టియవస్థలో నాతని రక్షింపఁగలవా రెవ్వరున్నారు? ఆతఁడీజన్మమున మీఋణమును దీర్చికొనఁజాలఁడు!

కాశీ—ఇది నాకు విధాయకకృత్యము కాదా?

అని చెప్పి కాశీనాథుఁడు వెడలిపోయెను. ప్రేమజీ తత్క్షణమే వకీలును జూడఁబోయెను.

పదునేనవప్రకరణము

పరామర్శ

కీర్తికరుఁడు లాలూభాయి దాదాభాస్కరులకొఱకు నిరీక్షించుచుండఁగా దాదాభాస్కరుఁడు వచ్చెను.

కీర్తి—దాదా. విశేషము లేమి?

దాదా—ఆయిరువురిసంగతియు స్పష్టముగాఁ దెలిసికొంటిని. బర్జరజీ నేర్పఱి యగుమోసగాఁడు! రాజాభాయియుఁ, గమలాబాయియుఁగూడ నాతనిచేతులలోఁ బడిపోయిరి. మాంచరజీ యాతనిచేతి కీలుబొమ్మ!

కీర్తి—ఆసొమ్ము నెవ్వ రపహరించి రని నీయభిప్రాయము?

దాదా—రాజాబాయియే యని తోఁచుచున్నది.

కీర్తి—ఆపెట్టెను దెరచురహస్యమామెకుఁ దెలియునని నేననుకొనను. ఏమనిన—హోరమసజీ భార్యకైనను దనరహస్యమును జెప్పువాఁడు కాఁడు. అట్టివాఁడు కాకున్నచో నింతటిధన మార్జింపఁగలఁడా?

దాదా—రస్తమజీ తఱచుగ మాంచరజీతోఁ గలసి యుండెడివాఁడు. త్రాగి మత్తుగానున్నప్పు డాతఁడీరహస్యమును మాంచరజీకిఁ జెప్పియుండునేమో?

కీర్తి—అట్లు జరుగవచ్చును. కాని రస్తమజీ యట్లు వెల్లడించిన ట్లంగీకరించుట లేదు.

దాదా—ఎట్లయినను దొంగ త్వరలో దొరకును. నేనిఁక బర్జరజీ సేవకుఁడనై యుండనక్కఱలేదు. ఆతనియొద్దఁ బనిచేయుట సామాన్యవిషయము కాదు. ఆతనిదెబ్బలఁ దినలేక నాప్రాణము విసిఁగిపోయినది.

కీర్తి—సరే. అట్లే చేయుము.

అంతలో లాలూభాయియు నచ్చటికి వచ్చెను. దాదాభాస్కరుఁ డాతనిం గాంచి "హత్యావ్యవహారముంగూర్చి యెంతవఱకుఁ దెలిసికొంటివి?" అని ప్రశ్నించెను.

లాలూ—అంతయుఁ దెలిసికొంటిని. ఇఁకఁ దెలిసికొనవలసిన దేదియును లేదు. ఈసారి పట్టుకొన్నవానికిమాత్ర మిఁక విడుదల కాదు.

దాదా—నేనీసంగతి మొదటనే చెప్పితిని.

కీర్తి—దాదా! ఈయుత్తరమును లాలూభాయి సంపాదించినాఁడు. దీనినొకసారి చదువుము.

దాదాభాస్కరుఁ డిట్లు చదువఁదొడంగెను.

"హారమసజీ!

నీకు జాబువ్రాయుటకు నాకు మొగము చెల్లుట లేదు; కాని నాకు మరణమాసన్నమై యుండుటచే వ్రాయుచున్నాను.

నీవు నన్నుఁ బెండ్లియాడినసంగతి రహస్యముగ నుంచకయే యున్నచో నాకిట్టిగతి కలుగకయే యుండును. దురదృష్టవశమునఁ నట్లు జరిగినది కాదు. నాపాపఫలమును నేనే యనుభవించితిని. నేను తెలివితక్కువదాననై పాపమని యెంచక నీతనయను నెంటఁబెట్టుకొని నీకుఁ దెలియకుండ నిన్నుఁ బరిత్యజించి పలాయితురాలనై పోయితిని. తరువాత నాబిడ్డను మఱియొకరియొద్ద నుంచితిని గాని యింతవఱకు నేనాకుమార్తెను జూడఁజాలకయే పోయితిని. ఆమె యింకను జీవించి యున్నదనిమాత్రము విని యుంటిని. నాయవస్థయే దానికిని గలిగి యుండును.

నేను పాపాత్మురాలను గాని పాపమాబిడ్డ కెట్టిలోపమును లేదు. కావున నీవామెను వెదకి తెలిసికొనుటకుఁ బ్రయత్నింపుము. నీకిప్పుడు ధనమునకు లోపము లేదు. ఆమెను దీసికొనివచ్చి పెంచుకొనుము! శాసనమునుబట్టి నీసర్వస్వమునకు నామెయె యధికారిణి!

ఈయిరువదివత్సరములనుండియు నేనేమిచేసితినో యెట్లుంటినో, నీకుఁ దెలుపుటవలన లాభము లేదు తుట్టతుదకు పేస్టనజీ యను నొక మనుష్యునియొద్దనున్నాను. ఆతఁడు సర్వస్వమును బోఁగొట్టుకొని మరల ధనసంపాదనమునకై యీనగరమునకు వచ్చియున్నాఁడు. మనరహస్యవివాహవిషయము నాతఁడు నావలనఁ దెలిసికొని యదికారణముగా నిన్ను భయపెట్టి డబ్బులాగవలయుననునుద్దేశముతో మనవివాహపుసర్టిఫికెట్టును, మనముద్దుబిడ్డజననపుసర్టిఫికెట్టును నాకుఁ దెలియకుండ నపహరించి యాతఁడీబొంబాయి వచ్చియున్నాఁడు.

నీయందు నాకుఁ గోపమున్నది. కాని నామూలమున నీకెవ్వరిచేనైన మహాపకారము కలుగుట నాకిష్టము లేదు. అందుచేతనే

యిప్పటికి మూడుపక్షములయ్యెను—ఆతని వెదకుకొనుచు నేనిచ్చటికి వచ్చితిని! కాని నాకిచ్చట జబ్బు చేసినది. ఇఁక జీవించుట దుర్లభమని నాకు బాగుగఁ దెలిసిపోయినది. జీవించుటకు నాకుఁ గోరిక లేదు!

నేఁడు పేస్టనజీ నాకగపడినాఁడు. ఆతఁ డింకను నాసంగతి నీకుఁ జెప్పియుండలేదు. ఆరాక్షసుఁ డర్థలోభముచే నీతనయ కమలాబాయిని బెండ్లియాడుటకుఁ బ్రయత్నించుచున్నాఁడు. అట్లయినచో నీసర్వస్వము నదనయధీనమగునని యాతనిదురాశ! ఆవివాహము జరుగకుండునట్లు నాచేతనైనంతవఱకు నేను ప్రయత్నించెదను. నీవును సావధానుఁడవై యుండుము!

ఇఁక వ్రాయఁజాలను. వ్రేళ్ళు కొంకరలువోవుచున్నవి. రస్తమజీయను నొకయుత్తముఁడు నీతనయను బ్రేమించుచున్నట్లు తెలిసినది. ఆతని కెల్లవిషయములను దెలుపుచు జాబువ్రాయుదును. పేస్టనజీ దుర్మార్గుఁడు! దొంగ! నృశంసుఁడు! ఆతని కసాధ్యమగుదుష్కార్యమీజగంబునం దేదియును లేదు."

దాదాభాస్కరుఁ డాయుత్తరమును జదివి కీర్తికరునియొద్ద నుంచెను.

కీర్తి—ఈయుత్తరమును బట్టి హత్యచేసినవారెవ్వరైయుండురో మీకేమైనఁ దెలియుచున్నదా?

దాదా—తెలియకేమి? హారమసజీ తనరహస్యవివాహపుసర్టిఫికెటును, తనకుమార్తెజననపుసర్టిఫికెటును, పేస్టనజీయొద్దనున్నట్లు తెలిసికొనియెను. వానినాతఁడు వెల్లడించినచోఁ దనమర్యాదయే కాక సర్వస్వమునుగూడఁ బోవును. అందుచే రస్తమజీ మిత్రుఁడును, తనకు మాస్త్రాయు నగు ప్రేమజీమూలమున రస్తమజీ దుస్తులను సంపాదించి తాను ధరించి యారాత్రి రస్తమజీ పేస్టనజీని బండిపై నెక్కించి తనదారిని బోయినంతనే హారమసజీ యావేషముతో నాబండిలోఁగూ

ర్చుండి క్లోరోఫారముతో నాతనికి మత్తుగల్పించి యప్పుడు పేస్టనజీజేబులోనున్న యీ కాగితములను దీసికొని పోయియుండును. ఆ తొందరలో నవి చిరిగిపోవుటచే ముక్కలు జేబులోఁ బడిపోయియుండును. ప్రేమజీక్లోరోఫారము కొనుటయును, శవము మొగముపై నాతని రుమాలుండుటయుఁగూడ నాయభిప్రాయమును బలపఱచుచున్నవి. ఎట్లయినను పేస్టనజీ మరణమునకుఁ గారణము హారమసజీయే కాని మఱియెవ్వరును గారు.

లాలూ—అయ్యా! ఇఁక నొక్క నిమిషమైన నాలస్యము చేయఁగూడదు. ఇప్పుడే పోయి హారమసజీని బంధింపవలయును. దాదాభాస్కరుఁడు చెప్పినదంతయును యుక్తిసంగతముగా నున్నది.

కీర్తి—ఆసంగతి తరువాతఁ జూచుకొనవచ్చును. రుస్తుమజీవిచారణ కానిండు! రేపు విచారణ. మీరు సిద్ధముగా నుండుఁడు!

అనుటయు వారు మాఱుమాట చెప్పకుండ వెడలిపోయిరి. కీర్తికరుఁడు కాగితములను జూచుకొనుచుండెను.

రహస్యవిప్లవము.

తృతీయ ఖండము.

విచారణ, ఫలము;

మొదటిప్రకరణము.

న్యాయస్థానము.

నేఁడు రుస్తుమజీవిచారణ యారంభింపఁబడును. మేజస్ట్రీటుకచేరి యంతయు జనాకీర్ణమై యుండెను. రుస్తుమజీ హారమసజీ కోశాధ్యక్షుఁడగుటవలన నాతని నెఱింగినవారెందఱో యుండిరి. వారందఱును వచ్చిరి. ఈవింతహత్యనుగూర్చి యేమిజరగునో వినవలయు నని మఱియు ననేకులువచ్చియుండిరి. విచారణమందిరమంతయుఁ గిక్కిఱిసి యుండెను. చాలమంది వెలుపలిభాగమునఁగూడ మూఁగియుండిరి.

అతికష్టముతో రక్షకభటులుసందడి నడంచుటకుఁ బ్రయత్నించుచుండిరి గాని వారికి సాధ్యపడుట లేదు. అందఱును రుస్తుమజీని సందర్శింపవలయు నని యాతురపడుచుండిరి. చాలగందరగోళముగా నుండెను.

పదునొకండుగంటలకుఁ బూర్వమే రుస్తుమజీ విచారణాలయమునకుఁ గొనిరాఁబడి రక్షకభటపరివేష్టితుఁడై నిలిచి యుండెను. ఒకప్పుడు సకలజనులచేతను సన్మానింపఁబడినరుస్తుమజీ యిప్పుడీయవస్థలో నేఁడు జడ్జియెదుటను దీనుఁడై నిలువఁబడి యుండెను. తనకిట్టియవస్థ

కలుగునని యాశ నెన్నఁడును దలంచి యుండలేదు. రస్తుమజీ తల యెత్తి యేవంకఁ జూచుటకును సాహసింపఁజాలకుండెను.

ఈకొలఁదిదినములలోనే యాతనియాకృతి విశేషపరివర్తనము గాంచి యుండెను. ఆతనిముఖనయనములు వివర్ణములు, మలినములు నైపోయెను. తనకిఁక రక్షణోపాయము లేదని యాతఁ డెఱుంగును. సర్వవృత్తాంతమును వెల్లడించినచో నాతనికి విముదల యగును. కాని యట్లు చేయుట కాతఁ డిష్టపడుట లేదు. ఇతరులు చేసినతప్పున కాతఁడు శిక్షననుభవింపవలసివచ్చెను. ఈచిన్నవయసునందే యాతని యాశలన్నియును దీరిపోయెను. దైవదుర్విపాకముచే నాతనికి సర్వనాశన మగుచుండెను. ఇఁక రక్షణోపాయ మేదియును లేదు!

ఆతఁ డొకసారి సాహసించి నలువంకలఁ దిలకించెను. జనులు నిండియుండిరి. కాని పరిచితులెవ్వరు నాతనికంటఁ బడలేదు. మరలఁ జూడఁజాలకపోయెను. ప్రేమజీ తన్ను రక్షించుటకుఁ బ్రయత్నించునని రస్తుమజీ భావించెను. ఆతఁడు వచ్చెనేమో చూడవలయునని నలుదెసలఁ జూచెను. కాని ప్రేమజీ యాతని కగపడలేదు. అప్పుడు రస్తుమజీ యొక్క వేఁడినిట్టూర్పువిడిచి "విపత్సమయమునఁ బరమమిత్రుఁడు గూడఁ బరాయివాఁడై పోవును" అని యనుకొనియెను.

ఒకసారి యామరాఠీవృద్ధుని దలఁచుకొని "ఆతఁడు నారక్షణము కొఱకు విశ్వప్రయత్నము చేయుచున్నాఁడు. కాని నేనే సంగతియును దెలుపనప్పు డాతఁ డేమిచేయఁగలఁడు?" అని భావించుకొనియెను.

ఇంతలో మేజస్ట్రేటు కచేరికి వచ్చెను. ఆతని కందఱును దత్తరముతోఁ దోవ యిచ్చిరి. సభయంతయు నిశ్శబ్దముగా నుండెను. తరువాత మెజిస్ట్రేటు తనకాగితములు కొంతవఱకుఁ జూచుకొని యపరాధివంకఁ జూచి "ఈతనిపక్షమున నెవ్వరైన నున్నారా?" అని ప్రశ్నించెను.

ఆప్రశ్నకు రస్తుమజీ యుద్విగ్నహృదయముతో వకీళ్ళు కూర్చుండియున్న ప్రదేశమంతయును దిలకించుచుండెను. తనవకీలెవ్వరో యాతనికిఁ దెలియదు. తనకొఱకు వకీలును బెట్టువారెవ్వరున్నారని యాతఁ డనుకొనియెను. అంతలో నొకవకీలు లేచి "నేనున్నాను" అనియెను.

ఆతఁడే హరకృష్ణుఁడు! ఆతఁడును బ్రేమజీయును దన్నుఁ గారాగారమునఁ దర్శించి మాటాడినట్లు రస్తుమజీకి స్మృతికి వచ్చెను. ప్రేమజీ తన్ను మఱచిపోలేదని యాతఁడు భావించుకొనియెను. నేనే చావఁ దలఁచియుండఁగా నీవకీలు నన్నెట్లు రక్షింపఁగలఁడని యప్పుడు రస్తుమజీ మనసు కుమురుపడుచుకొనియెను.

న్యాయాధిపతి యావకీలుం గాంచి "ఈవ్యవహారము ప్రధానన్యాయస్థానమునకుఁ బంపవలసి యుండును" అనియెను.

వకీలు—అక్కఱలేదు. ఈతఁడు నిరపరాధి యనుటకుఁ గావలసినన్ని నిదర్శనములున్నవి. సప్రమాణముగ నిరపరాధియని మీకుఁ దోఁచినప్పుడిఁకఁ బ్రధానన్యాయస్థానమునకుఁ బంపుట యెందులకు?

అని యుక్తియుక్తముగఁ దెలిపి విచారణ జరిగించుటకు మేజిస్ట్రేటును సమ్మతింపఁజేసెను.

రెండవప్రకరణము.

విచారణము.

తరువాత సర్కారువకీలు లేచి యుక్తిసంగతముగ నెల్లవిషయములను దెలుపుచు, నిదర్శనములను జూపించుచు రస్తుమజీ హంతకుఁడే యని నిరూపించెను. తరువాత సాక్షివిచారణము జరిగెను. మొదటిదిన

మున బండివాండ్రిరువురును విచారింపఁబడిరి. రెండవదినమునఁ గాలబా దేవిరోడ్డునందలి రక్షకభటుఁడును, రస్తమజీసేవకుఁడును, విచారింపఁబడిరి.

తరువాత హారమసజీ వచ్చి రస్తమజీ నడవడిని గూర్చి చెప్పెను. రస్తమజీ తాఁగుబోతును, జారుఁడునై తిరుగుచున్నట్లు తానువింటిననియు, స్వయముగాఁ జూడలేదనియుఁ జెప్పెను.

మూడవనాఁడు మాంచరజీయొకమాట కొకమాట పొందకుండ సాక్ష్యమిచ్చెను. తరువాత డాక్టరు క్లోరోఫారము నెక్కువగానుపయోగించుటవలన నదివఱకే మద్యపానమత్తుఁడగు పేస్టనజీ మరణించె నని పరీక్షవలనఁ దెలిసికొన్నట్లు సాక్ష్యమిచ్చెను. పిమ్మట లాలూభాయి సాక్ష్యమయ్యెను.

అనంతరము రస్తమజీవకీలు లేచి “ఆరాత్రి రస్తమజీ పేస్టనజీని బండిపై నెక్కించి పంపెనే గాని యాతనితోఁగూడఁ బోలేదు. పేస్టనజీ బండిలో మరణించుట నిజమేగాని రస్తమజీ హత్యచేయలేదు. పేస్టనజీహత్యజరగుసమయమునకు రస్తమజీ మరణాపన్న యగు నొక కాంతయొద్దనున్నాఁడు. ఆతఁడు రాత్రి పదునొకండుగంటలు మొదలు రెండుగంటలవఱకు నచ్చటనే యున్నాఁడు. ఈసంగతి పత్త్రేదారుఁడగు లాలూభాయి చెప్పిన సంగతులనుబట్టికూడస్థిరపడుచున్నది. ఈతఁడీహత్య చేయలేదు. ఈహత్య ప్రణయసంబంధమగునీర్ష్యవలన జరగినది కాదు. హత్యచేసినయాతనికి మఱియొకయుద్దేశమేదియో యుండియుండును” అని సవిమర్శముగ న్యాయాధిపతికి విన్నవించెను.

పిమ్మట రస్తమజీపక్షమున నారాత్రి యుత్తరమిచ్చిన బాలకుఁడును, నాతనిచే నుత్తరమునుబంపినస్త్రీయును, మాణిక్యజీగుమాస్తాయును సాక్షులుగా విచారింపఁబడిరి.

రేపు తీర్పు చెప్పెద నని మేజస్ట్రేటు లేచెను. ప్రేక్షకులందఱును దమతమగృహంబులకుఁ బోయిరి. అనేకవిధములగునాలోచనలతో రస్తమజీ మరలఁ గారాగృహాభిముఖుఁడై పోయెను.

మూడవ ప్రకరణము

పర్యవసానము

ఆనాఁడు న్యాయస్థానమున జనులు పట్టఁజాలక యుండిరి. ఇదివఱకువచ్చుచున్నవారందఱును దమతమపనులను మానుకొని వచ్చిరి. వారే కాక యింకను జాలమందికూడ వచ్చిరి. పట్టణమంతయు నప్పుడొక్కచోఁ జేరియున్నట్లుండెను. ఇదివఱ కెన్నఁడు నంతమందిప్రజలచ్చట నేకీభవించి యుండలేదు. పేస్టనజీహత్య జరిగినప్పుడు రస్తమజీ స్థలాంతరమునం దున్నట్లాతని పక్షమున వకీలు సాక్షులచే నిరూపింపఁజేసెనుగదా న్యాయాధిపతి యేమని తీర్పుచెప్పునో వినవలెననుకుతూహలముతో వేలకొలఁది జనులు గుంపులుగుంపులై వచ్చియుండిరి.

రస్తమజీ స్పందితహృదయముతోఁ దలవంచుకొని నిలువఁబడియుండెను. తనరహస్యమంతయును దెలిసికొని తనపక్షమునవకీలు సప్రమాణముగ నిరూపించినందుల కాతఁడు పరమాశ్చర్యనిమగ్నుఁడై పోయెను. రాత్రియంతయునాతఁ డతివ్యాకులహృదయముతో వేగించెను. ప్రాణములపై నాశలేనివాఁ డెవ్వఁడు? స్వయముగ మరణమును దెచ్చుకొనువారెవ్వరుందురు!

ఇదివఱ కాతఁడు న్యాయస్థానమునఁ గొయ్యబొమ్మవలె నిలిచియుండెడివాఁడు. అప్పుడాతనికి జీవితాశ లేకుండుటచే హృదయముకూడ జడప్రాయమైయుండెను. ఆతఁడిదివఱకుఁ గడచినదినముల నతి

కష్టముతోడను, నుద్వేగముతోడను గడపెను. కాని నేఁడుమాత్రము చంచలుఁడై న్యాయాధిపతి యెప్పుడు వచ్చును—ఎప్పుడు తీర్పు చెప్పును—అని యాత్రపడుచుండెను. ఆతనిగుండెలు తీవ్రవేగముతోఁ జలించిపోవుచుండెను. ఆతనికిప్పుడొక నిమిషము దినమువలెఁ దోఁచుచుండెను.

పదునొకండుగంటలకు సరిగా న్యాయాధిపతివచ్చెను. జనులందఱు నిశ్శబ్దముగా నేమిచెప్పునోవినవలయు ననుకుతూహలముతో నిరీక్షించి యుండిరి. మేజిస్ట్రేటు ముందుగా హత్యాపరాధమునుగూర్చి పూర్వోత్తరసందర్భములను విమర్శించి తరువాతసాక్షులనుగుఱించి యిట్లు చెప్పెను.

“మొదటిసాక్షి బండివాఁడు త్రాగిమత్తెక్కియున్నట్లు తానే యంగీకరించెను. ఎవ్వరో పేస్టనజీని దనబండిపై నెక్కించినట్లు చెప్పెను. కాని పేస్టనజీతో నాతఁడుకూడఁ దనబండి యెక్కివచ్చినట్లు స్పష్టముగాఁ జెప్పఁజాలకపోయెను. రెండవబండివాఁ డేమియుఁ జెప్పఁజాలఁడయ్యెను. మూడవసాక్షి రక్షకభటుఁడు తాను నిద్దురకన్నులతో నుంటిననియు, నాతనిని బాగుగఁ బరికింపలేదనియు, నాతనిమొగముచూడలేదనియుఁ జెప్పియుండెను, నాలవసాక్షి రస్తమజీభృత్యుఁడు—వారిరువురు పోరాడినమాట నిజమేకాని యిప్పు డిరువురును మద్యపానముచేసి మత్తెక్కి యుండిరనియు, జగడమునకుఁ గారణ మదియే యనియుఁ జెప్పెను. అయిదవసాక్షి మాంచరజీ—ఆతఁడు రస్తమజీననుసరించిపోయినట్లు ప్రకారాంతరముననంగీకరించినాఁడు. కాని యాతనిమాట లేవియును విశ్వాసార్హములుగా లేవు. లాలూభాయిసాక్ష్యమును బట్టిచూడఁగా హత్య ప్రణయసంబంధమగునీర్ష్యచేజరిగినది కాదనియు, సర్టిఫికెటులనుగూర్చి జరిగియుండు ననియుఁ దెలియుచున్నది. మఱియు, నట్టిసర్టిఫీకెటులు పేస్టనజీయొద్ద నున్నట్లు రస్తమజీకిఁ దెలి

యుట కనకాశము లేదు. తెలిసినను వానితో నాతని కెంతమాత్రము ప్రయోజనము లేదు. ఉన్నట్లు ప్రమాణమును లేదు. ఇంతే కాక రస్తమజీ హంతకుఁడు కానట్లు నిదర్శనము లగపడుచున్నవి. అట్టినిదర్శనములు లేకపోయినను సర్టిఫికెటులతో నాతనికి సంబంధము లేకపోవుటయు, హత్య వానికొఱకే జరిగియుండుటయుఁ గారణముగా రస్తమజీ నిరపరాధి యని చెప్పవచ్చును. అయినను వకీ లాతనిపక్షమున నలువురుసాక్షులను రుజువుపఱిచెను. వారిసాక్ష్యమువిశ్వసనీయమై యుండెను. హత్యజరుగుసమయమున రస్తమజీ మఱియొకచోట నొక స్త్రీయొద్దనున్నట్లాసాక్ష్యమువలన స్పష్టపడుచున్నది. కావున నీక సీవ్యవహారము ప్రధానన్యాయస్థానమునకు విచారణకొఱకుఁ బంపుటకుఁ బ్రయోజన మగపడుటలేదు. అందుచే నేను శిక్షాస్మృతిననుసరించి రస్తమజీని విడుదల చేయుచున్నాను. ఈవ్యవహారవిషయమున నాప్రత్యేకాభిప్రాయము నీక్రిందవివరించుచున్నాను.

“బహిరంగమగు రాజమార్గమున బండిలో జరిగినహత్యనుగూర్చి యింతవఱకును నన్వేషించి తెలిసికొనఁజాలనికారణమునఁ బోలీసువారు కేవలము నసమర్థులైపోయిరని నాకుఁదోఁచుచున్నది.”

రస్తమజీకి విడుదలయైనట్లు నిమిషములోఁ బట్టణమంతయును దెలిసిపోయెను. అంతలో నొక్కసారిగా నానందధ్వనులచే భూమ్యాకాశములు నిండిపోయెను. రక్షకభటు లెంతశ్రమపడినను సందడి నడగింపఁజాలకుండిరి. రస్తమజీ జగత్పతికిని న్యాయాధిపతికిని ధన్యవాదములు చేయుచుఁ గంపితపదములతో మెల్లగ వెలుపలికి వచ్చెను. వేలకొలఁదిజనులాతనిఁజుట్టఁబెట్టుకొనుటచే నాతనిమతి చెదరిపోయెను. ఆతని కప్పుడు పట్టపగలే యంధకారబంధురమైపోయెను. ఆతఁడట్లు పడుచు లేచుచు వచ్చుచుండఁగా నెవ్వరోవచ్చి యాతనిచేయిపట్టుకొనిరి.

ఆతఁడు కొంతసేపటికిఁ దెలివి తెచ్చుకొని చూచెను. అవకుంఠనవతి యగు నొక యువతీమణి యాతనికిఁ జేయూఁత నొసఁగి నడపించుచు "రమ్ము" అని యనుచుండెను. రస్తమజీ చిత్రప్రతిమవలె నామె వెనువెంటఁ జనుచుండెను. ఆయువతిఁ గాంచి ప్రజలందఱు నామెకు ద్రోవ నొసంగిరి.

సమీపమునం దొకబండి నిలిచియుండెను. అప్పుడాయిరువురు నాబండిపై నెక్కి నిమిషములో నదృశ్యులైపోయిరి.

పాఠకులారా! ఆస్త్రీరత్న మెవ్వరు?

నాలుగవ ప్రకరణము.

ఆలోచన.

లాలూభాయియు, దాదాభాస్కరుఁడు నెదుట నొక బల్లపైఁ గూర్చుండి యుండిరి. కీర్తికరుఁడు కొన్ని కాగితములను దిరుగవైచుచు నొక్కబొత్తిగాఁ జేర్చి పట్టుకొని యనంతరము లాలూభాయి వంకఁ జూచెను. ఆతీక్ష్ణదృష్టి నాతఁ డెదురుకొనఁజాలక పోయెను. కీర్తికరుని భయంకరదృష్టుల యెదుట నెవ్వరును నిలువఁజాలరు.

కీర్తికరుఁ డట్లు లాలూభాయివంకఁ గొంతసేపు దిలకించి "లాలూ! మేజిస్ట్రీటు తనతీర్పుతుద నేమివ్రాసెనో చూచితివా?" అని ప్రశ్నించెను.

లాలూ—చూచితిని.

కీర్తి—ఆతఁడు మనల నందఱను మూఢులనుగాఁ జేసివైచినాఁడు.

దాదా—ఆతఁ డట్లు వ్రాయలేదు—

కీర్తి—నీవంటిపండితుఁడు పోలీసువారిలో నుండుటచేతనే యందఱును దిట్లు తినవలసివచ్చినది.

దాదా—అయ్యో! ఈనేరమును మనము పట్టుకొనఁజాలకున్నచో మనమసమర్థుల మని యాతనియభిప్రాయము!

కీర్తి—మంచిది. నిజమే—కాని పట్టుకొనుట కేమిచేసితిరి! మీరిరువురునింకను జీకటిలోనే బంతులాడుచున్నారు. పట్టుకొనుట కేమైన నాశయున్నదా? కమీషనరుకూడ నేమివ్రాసెనో చూడుము!

అని కీర్తికరుఁ డొక కాగితమును దాదాభాస్కరునియొద్దకు విసరిపడవైచెను. దాదాభాస్కరుఁడు చదువుకొని దానిని లాలూభాయిచేతికిచ్చెను. ఆతఁడునుజదివెను.

కీర్తి—చూచితివా?

దాదా—వ్రాఁతలెన్నియైనను వ్రాయవచ్చును. పనిచేయవలసిన బాధ్యత యాతనికి లేదుగదా!

కీర్తి—నీప్రగల్భము లింకను జూపుచుంటివా? నీవొక్కని దొంగయని పట్టుకొని రుజువుపఱుచుకొనలేక స్వయముగ వదలుకొంటివి. లాలూభాయి యాతనినే హంతకుఁడని పట్టుకొనియెను. మేజిస్ట్రీటాతనికి విడుదల యొసంగెను. ఇట్టిస్థితిలోఁ గమీషనరుదొరవారిట్లువ్రాయుట తప్పా! నిరపరాధులను బాధించుటయేనా పత్త్రేదారుపనికి లక్షణము?

దాదా—ఆతఁడొక నెల గడువిచ్చెను—తరువాతగద! ఒక నెలలోఁ జోరుఁడును, హంతకుఁడునుగూడ దొరకఁగలరు?

కీర్తి—దొరకకున్నచోఁ బేరుచెడుటయే కాక నష్టముకూడఁ గలుగును.

దాదా—దొరకియే యున్నది. కాని మీరే మాపనులకన్నిటికిని ప్రతిబంధకముగా నున్నారు.

కీర్తి—ఏమి?

దాదా—ఇప్పుడు దొంగ యెవ్వరో తెలిసియేపోయినది. మీ రంగీకరించినచో! నిప్పుడే పోయి రాజాబాయిని బట్టుకొందును

కీర్తి—ఆమె దొంగతనము చేయలేదు.

దాదా—ఇదిగో! ఇట్లే

లాలూ—హరమసజీ హత్య చేసెననువిషయమునంగూర్చి మీకు సందేహమున్నదా?

కీర్తి—లాలూభాయీ! నీవు వృద్ధుఁడవై యున్నావు. దాదావలె నోటికి వచ్చినట్లు నీవును మాటాడఁగూడదు. ఈసారిమనము పట్టుకొన్నవాని కిఁక విడుదలకాఁగూడదు. కావున ముందుగనే బాగుగ నాలోచించి పని చేయవలయును. రస్తమజీకి బితృసఖుఁడగు కాశీనాథనాయకుడనువాఁడొకఁడున్నట్లు వినియుంటిని. ఆతఁడీరహస్యమంతయును జాలవఱకు గాలించి గ్రహించియున్నాఁడు. ఆతఁడు చూపిన సందర్శనములవలననే రస్తమజీకి విడుదలయైనది. మనమింతమందియుండఁగా నాతఁడొక్కఁడు నీరహస్యమును భేదించి న్యాయస్థానమున బయల్పఱిచినచో నప్పుడది మన కెంతతలవంపుగా నుండును?

లాలూ—మనమింతవఱకుఁ జేసినపని యేమియును లేదు. ఇప్పు డేమి చేయవలయునో యాజ్ఞాపింపుఁడు! ఏమిచేయుటకును దోఁచుటలేదు.

కీర్తి—అదియే యసమర్థత!

దాదా—ఒకసారి కాశీనాథుని జూచి యాతఁ డింతవఱ కెట్టి రహస్యములను గనుఁగొనియెనో తెలిసికొని రమ్మందురా? ఇంతవఱ కాతనిపేరే మాకుఁ దెలియదు. ఇప్పుడు మీరు చెప్పితిరి!

కీర్తి—(రూక్షస్వరముతో) నీకుఁ దోఁచినయుపాయ మిదియేనా? ఇనాళ్లనుండి పత్తేదారుపని చేయుచు స్వయముగ నేమియుఁ

జేయఁజాలక యితరులపై నాధారపడి సంచరించుట గొప్పతనమని యే భావించితివా? ఈమాట విన్నచో లోకులు నిన్నే మనుకొందురు! ఇట్టిచో మేజిస్ట్రేటులువారికి నవారికభిమాన మెందులకు?

దాదా—ఇది లోకులకెట్లు తెలియును? మాయువేసము—

కీర్తి—ఇంకను బ్రయత్నించి చూడుము. అప్పటికిని దొరకకున్నచో నీకనాతనిసాహాయ్యమే శరణ్యము కాఁగలదు!

లాలూ—అట్లయినచో నిప్పుడేమిచేయు మందురు?

కీర్తి—ఆయాలోచనకొఱకే మిమ్ముఁ బిలిపించితిని.

దాదా—మీరు చెప్పినట్లు చేసెదము. మీరడ్డుకొనకున్నచో రస్తమజీకి విడుదల యగునా?

కీర్తి—దాదా! దోషియైనను గాకపోయినను మనకేమని పట్టుకొన్నవానికి శిక్ష చేయించుటయే మనపని కాదు. నీకు మాటిమాటికిని జెప్పుచున్నాను. ఇప్పుడును జెప్పుచున్నాను. దుష్టులను శిక్షించుటయును, శిష్టులను రక్షించుటయునే మనపని. ఇట్లు న్యాయమునఁ బనిచేయనిపోలీసువాఁడు కేవలమును బాషండుఁ డని చెప్పవచ్చును.

దాదా—మీయుపదేశమును మేము మఱచియుండలేదు.

కీర్తి—అట్లయినచో నిట్లేల యుంటివి?

లాలూ—దానికేమి—ఇప్పు డేమిచేయవలెనో చెప్పుఁడు!

కీర్తి—వట్టిమాటలవలన లాభము లేదు. బర్జరజీమాంచరజీల పూర్వోత్తరసందర్భముల నిప్పుడు మనము తెలిసికొనవలయును.

దాదా—అందుకొఱకే కాదా! నేను గులాముపనికూడఁ జేసి వచ్చితిని?

కీర్తి—చేసి యేమి తెలిసికొంటివి?

దాదా—ఆతఁడు దుర్మార్గుఁడనియు, మోసగాఁడనియు సిగొంటిని.

కీర్తి—అంతమాత్రమున నేమిలాభము? అందువలనఁ జౌర్యరహస్యముగాని, హత్యారహస్యముగాని యేమైనఁ దెలిసినదా?

దాదా—అట్లయినచో నీనేరములు రెండు నాతఁడే చేసెనని యామీయుద్దేశము? నిదర్శనములు దొరకవలదా?

కీర్తి—నేనింతవఱ కేదియు నిశ్చయింపలేదని యిదివఱకే రెండుసారులు చెప్పితిని. ఇప్పుడును జెప్పుచున్నాను.

దాదా—బర్జరజీవిషయమున నింతవఱ కెట్టిప్రమాణమును దొరకలేదు. కాని మాంచరజీవిషయమునమాత్రమనుమానించుట కొకకారణమున్నది.

కీర్తి—ఏమది?

దాదా—ఆతఁడా రాత్రి రస్తుమజీననుసరించి పోయెనుగాదా.

కీర్తికరుఁడు సంతోషముతో "దాదా! నీవు బుద్ధిమంతుఁడవు! కొంచెము పాటుపడినచో నీవుగొప్పవాఁడవు కాఁగలవు" అని గారవించెను.

దాదాభాస్కరుఁ డవనతవదనుఁడై "గురుదేవుని యనుగ్రహము" అనియెను.

లాలూ—ఆయిరువురిమీఁదను గన్నువైచి యుండుమని మీరాజ్ఞాపించితిరి. అట్లే చేసెదము.

కీర్తి—వారివిషయమునఁ దెలిసికొన్నంతవఱకు మీకిప్పుడు తెలియఁజేసెదను. ఇది మీరుచేయుప్రయత్నమునకుఁ గొంతసాహాయ్యకారిగానుండును.

అయిదవ ప్రకరణము.

రాజాబాయిసంబంధము.

కీర్తికరుఁడు బల్లపైనున్నకాగితములకట్టను జైకిఁ దీసి "ఇవి హరమసజీభార్య రాజాభాయినిగూర్చి సూరతుపోలీసువారు వ్రాసినకాగితములు—వీనిని జదివినచో రాజాబాయి బర్జరజీయనిన నేలభయపడుచుండెనో తెలియును.

దాదా—అప్పుడే మీరీవిషయమును దెలిసికొనుటకై సూరతుపోలీసువారికి వ్రాసితిరా?

కీర్తి—అవును. చదివెదను. వినుఁడు! "సూరతునగరమున దోసాభాయి యనునాతని కిరువురుతనయులు గలరు. అందు రాజాబాయి యొకతె. దోసాబాయి సామాన్యమగునొకయంగడిని బెట్టుకొని దానిమూలమున దినము గడపుకొనుచుండెను.

"రాజాబాయికిఁ బండ్రెండేడ్లవయసు వచ్చినప్పు డాయింటికి సమీపమునందున్న యొకజమీందారునికొడుకు హారేకజీ యనువాఁడామెను బ్రేమించెను. ధనాఢ్యుఁ డగునాతఁడు తనతనయ నెట్లయినఁ బెండ్లియాడునను నుద్దేశముతోఁ దండ్రియగుదోసాభాయి యందుల కెట్టిప్రతిబంధకమును గల్పింపలేదు. ఎట్లయిన నేమి హారేకజీ తుదకు రాజాబాయిని బెండ్లియాడనే లేదు. తండ్రియగుజమ్సేటుజీ మరణించినతరువాత హారేకజీయే సర్వాధికారి యయ్యెను. ఆహారేకజీని రాజాబాయితండ్రి యనేకవిధములఁ దిట్టుచుండెడివాఁ డనియు, బహిరంగముగ నాతని బాషండుఁ డనియు, రాక్షసుఁడనియు నిందించుచుండెడివాఁడనియుఁ దెలియవచ్చినది. అందుచేతనే కాఁబోలు హారేకజీ తనసకలరాజ్యభారమును దమ్ముఁడగుబర్జరజీపై నుంచి తాను కలకత్తాకుఁ

బోయియుండెను. మఱియెన్నఁడు నాతఁడు సూరతునగరమునకు రాలేదు.

"తరువాత నొకసంవత్సరమునకు హారమసజీ రాజాబాయిని పెండ్లియుండెను. అప్పటికి హారమసజీ బొంబాయిలో వ్యవహారముచేసి కొంచెము ధనమును సంపాదించి యుండెను; స్వదేశమున వివాహము చేసికొనఁ దలఁచి సూరతు వచ్చి యామెను పెండ్లియాడి యట నుండి రాజాబాయిని వెంటబెట్టుకొని బొంబాయికిఁ దీసికొనిపోయెను. మరల నెన్నఁడు నాతఁడును సూరతునకు రాలేదు.

"మఱియొకసంవత్సరమునకుఁ దరువాత రాజాబాయి చెల్లెలికిఁ బెండ్లియయ్యెను. ఆమెభర్త యామెను దీసికొనివ్యాపారమునకై రంగూను పోయెను గాని కొలఁదికాలములో వారిరువురు నచ్చటనే మరణించిరి. ఆవార్తవిని దుఃఖముచేఁ దండ్రియగు దోసాభాయియు మరణించెను. రాజాబాయిచెల్లెలికి రంగూనునందెట్టిసంతానమైనఁ గలిగినట్లింతవఱకెట్టినిదర్శనమును గానవచ్చుట లేదు.

"ఇచ్చట బర్జరజీ హారేకజీయొప్పగించిన సర్వమును గ్రహించి ధనమంతయును విచ్చలవిడిగ వెచ్చపెట్టఁదొడంగెను. ఇట్లు రెండుమూఁడేండ్లలో నాతఁడు తనభాగమంతయును బోఁగొట్టుకొని పిమ్మట దారుణకృత్యముల కారంభించి పాడయిపోయెను. ఆతనికింకను నెంతఋణమున్నదియో తెలియుటలేదు.

'కొన్నాళ్ళక్రిందటివఱకుఁ బోలీసువారాతనిపైఁ గన్నువైచియుండిరి. నిదర్శనములు లేకుండుటచే నాతని బంధింపలేదు. రెండేండ్లక్రిందటనాతఁ డీనగరమునందిఁక నుండఁజాలక యాకస్మికముగ నెచ్చటికో పోయెను. తరువాత నాతని కెన్నియో వారంట్లు వచ్చినవి! కానియాతఁ డగపడుట లేదు. ఇప్పుడుకూడ నాతనిపై నొకటిరెండు వారంట్లున్నవి."

కీర్తికరుఁ డిట్లు చదివి "ఇప్పుడు బాగుగ బోధపడినదా?" అని ప్రశ్నించెను.

దాదా—ఆతఁడే యీబర్జరజీ యైనట్లు నిదర్శన మేమున్నది?

అప్పుడు కీర్తికరుఁడు డ్రాయరులోనుండి యొకఛాయాపటమును దీసి "చూడుము! ఇది యెవ్వరిపటమో చూడుము!" అనియెను.

దాదా—(చూచి) ఔను. ఇది నిశ్చయముగా బర్జరజీదే—కాని యాతఁ డిప్పుడించుక వేషమును మార్చుకొన్నాఁడు.

కీర్తి—అవును. ఎట్లయినను నీరూపపట మాతనిదే. నేను సందేహము లేకుండుటకై వ్రాయుటచే సూరతుపోలీసువారే దీనిని బంపినారు.

దాదా—మీరింతసూక్ష్మబుద్ధిగలవారు కాకున్నచో నింత గొప్పవారగుట యెట్లు తటస్థించును?

కీర్తి—ఈమాటల కేమి? ఇప్పుడు బర్జరజీసంగతి తెలిసినదా? ఆతఁడు రాజాబాయిని మొదటినుండియు నెఱుంగును.

దాదా—తనయన్న రాజాబాయిని ప్రేమించినసంగతికూడ బర్జరజీకిఁ దెలిసియేయుండును.

కీర్తి—అప్పుడాయిరువురకును ధర్మవిరుద్ధసంపర్కము కలిగి నను గలుగవచ్చును.

దాదా—ఔను! రాజాబాయి బర్జరజీయనిన నేలభయపడుచుండెనో నాకిప్పుడు బోధపడినది. దురాత్ముఁ డగుబర్జరజీ 'నీపూర్వవృత్తాంతమును నీభర్తకుఁ దెలిపి నీకపకీర్తిని గల్పింతు" నని రాజాబాయిని భయపెట్టి యామెయొద్దనుండి ధనమును లాగికొనుచున్నాఁడు.

కీర్తి—తొందరపడకుము. కలకత్తా పోలీసువారు వ్రాసిన దానినిగూడ మీరు వినవలయును.

వాదా— మీరు కలకత్తాకుఁగూడ వ్రాసితిరా? మీరింతవారని యెవ్వరు చెప్పఁగలరు? బుద్ధియున్నచో నింట నుండియే కోటను గెలువవచ్చును. మీయెదుట మేమెంతవారము.

కీర్తికరుఁడు కన్నులెఱ్ఱజేసి "ఈవ్యర్థవాక్యములతో నేమిపని? నీవు నీమాటమాత్రమే చెప్పుకొనుము! నీతోఁగూడ లాలూభాయిని గలిపికొనియెద వేల? ఆతఁడు వయసుచే నాకంటెను బెద్దవాఁడు. ఒకటిరెండువిషయములలోఁ బొరపాటుపడినను నాతఁడు నాకుఁ బూజ్యుఁడు!" అనియెను.

ఆఱవ ప్రకరణము.

హారేకజీ సంబంధము.

కీర్తికరుఁడు కలకత్తాపోలీసువారు వ్రాసిన కాగితములను దీసి యిట్లు చదువఁదొడంగెను:—

జమ్‌సేటుజీకుమారుఁ డగుహారేకజీ యిరువదిసంవత్సరములక్రిందట నిక్కడకు వచ్చి యప్పటినుండియు నీకలకత్తానగరమునందేవసించి యున్నాఁడు. ఆతనికి విశేషముగ నాడంబర మేమియును లేదు; బంధుమిత్రులును విశేషించి లేరు. ఆతఁడువచ్చి కలకత్తాయందు రెండేండ్లున్నతరువాత నొకయువతి యైదేండ్లబాలకు నొకని దీసికొని వచ్చి యాయింటనే యాతనియొద్ద నుండెను. ఆమె తనకు బందుగురాలనియు నాబాలుఁ డామె కుమారుఁ డనియు, విధవయగుటచే సాహాయ్యము లేక తనయొద్దకు వచ్చెననియు నాతఁడు చెప్పుచుండెడివాఁడు.

"హారేకజీ పెండ్లిచేసికొనలేదు. కేవల మావిధవ యాతనియొద్ద నుండుటచే ననేకు లనేకవిధముల ననుకొనుచుండిరి. హారేకజీ యాబాలుని బ్రేమించుటనుబట్టి చూచిన నాబాలుఁ డాతని యౌరసుఁడే యైయుండునని యనుకొనుచుండిరి. ఎట్లయిన నేమి— హారేకజీ చచ్చువఱకు నాబాలుఁడును విధవయు నతనియింటనేయుండిరి. ఇప్పు డాబాలుఁడు హారేకజీకి దత్తపుత్రరూపమున నాతనియింట వాసము చేయుచున్నాఁడు.

"హారేకజీ సర్వస్వము నాబాలునియధీన మయ్యెను. ఆబాలుఁడు యౌవనుఁడై క్రమముగ దుశ్చరిత్రుఁడైపోయెను. ఆతనికిప్పు డిరువదినాలుగేండ్లవయసుండును. ఆతని పేరు మాంచరజీ— మూఁడేండ్లక్రిందట నొకపార్సీపెద్దమనుష్యుఁడు వచ్చి హారేకజీయింట నుండెను. ఆతఁడు మాంచరజీకి విద్య చెప్పుటకు వచ్చియుండెనని హారేకజీ చెప్పుచుండెడివాఁడు.

"ఆగురువు వచ్చిన నెలలోపలనే హారేకజీ మృతినొందెను. ఆతనిమృత్యువు స్వాభావికమైనది కాదనియు, విషప్రయోగముచే మరణించెననియు నప్పుడు చాలమంది చెప్పుకొనిరి. కాని నిదర్శన మేదియు నగపడకపోవుటచే పోలీసువా రేమియుఁ జేయఁజాలకపోయిరి.

"హారేకజీ మరణించినతరువాత మాంచరజీయును, గురువును నాయువతియుమాత్రమే యాయింట నుండిరి. కాని హారేకజీ యున్నప్పటికంటె వేయిరెట్లు ధనవ్యయ మగుచుండెను. మాంచరజీవ్యయమునకుఁ బరిమితి లేకుండెను.

"అట్లు మాంచరజీ రెండేండ్లలో సర్వస్వమును బోగొట్టుకొనియెను. ఋణముచేసెను. ఆతనిపై నిప్పటికిని వారంట్లున్నవి. బాగుగ విచారింపఁగా మాంచరజీగురువు మంచివాఁడు కాఁడని తెలిసినది. సంవత్సరముక్రిందట మాంచరజీయును, గురువును గలసి యీనగరమును విడిచి పోయిరి. వారు బొంబాయి పోయినట్లు తెలినది. ప్రయత్నించినచో నక్కడ మీకు వారిసంగతి తెలియవచ్చును.

"ఆయువతి యింకను నిచ్చట హారేకజీయింటనే యున్నది. ఆమె యేసంగతియును జెప్పుటలేదు. ఆమె మాంచరజీని కృతఘ్నుఁడనియు, దుర్మార్గుఁడనియుఁ దిట్టిపోయుచుండును. ఆగురువునుగూర్చి యామెనడుగఁగా "గురువా? గురువా? గురువెవరునాయనా?—" అని యన్నది.

మాకింకను నీవిషయమునఁ దెలిసికొనవలసినసంగతు లున్నయెడలఁ దగినపత్త్రదారును బంపించిన బాగుగనుండును—"

కీర్తికరుఁ డిట్లు చదివి "మనబర్జరజీనిగుఱించి మఱికొన్ని సంగతులు తెలిసినవి కావా?" అనియెను.

దాదా—అది యెట్లు? మాంచరజీ వృత్తాంతము తెలిసినది!

లాలూ—ఆమాత్రపుబుద్ధి నీకెక్కడనున్నది? ఆగురువే బర్జరజీయనుసంగతి గ్రహింపఁజాలవైతివి.

దాదా—ఆ! వాఁడే వీఁడా?

కీర్తి—హారేకజీ విషప్రయోగమువలననే మరణించి యుండును. బర్జరజీ తనయున్నయింటఁ గాలుపెట్టిన నెలలోనే సోదరుఁడు మరణించెను—

దాదా—ఎంతదారుణకృత్యము? అన్ననే చంపివైచెనా?

కీర్తి—అట్లు చేయకున్నచో నాతని ధనమంతయుఁ గరగతమగుట యెట్లు?

దాదా—పోలీసువారు పట్టుకొందురనుభయముచే మారుపేరుపెట్టి యింట నుంచుకొన్నయన్నకుఁ దమ్ముఁడు తగినయుపకారమే చేసినాఁడు. ఈదురాత్ముని నూఱుసారు లురితీయించినను బాపము లేదు.

కీర్తి—కాని నిదర్శనము లేదు.

దాదా—ఆహత్యలో లేకున్ననేమి? ఈహత్యలోఁ గావలసినన్ని నిదర్శనములు దొరకవచ్చును.

కీర్తి—దాదా! నిదర్శనము లేకుండ నూరక యెవ్వరిపేరు నెత్తవలదని చెప్పితిని గాదా? ఇదివఱకు జరిగించినపనులకు సిగ్గు లేదా?

అని చెప్పి మఱియొక కాగితపుఁగట్టను దీసి "ఇది పేస్టనజీపూర్వవృత్తాంతమును దెలుపు రిపోర్టు!" అనియెను.

లాలూ—అట్లయినచో దీనినిబట్టి హత్యచేసినవా రెవ్వరై యుందురో సులభముగా గ్రహింపవచ్చును.

కీర్తి—అవును. అందువలననే రంగూనుపోలీసువారికి వ్రాసి యీకాగితములను దెప్పించితిని. పేస్టనజీ రంగూనునుండి హారమసజీయొద్ద కుత్తరమును దీసికొని వచ్చియున్నాఁడు.

దాదా—ఆసంగతి నాకును దెలిసినది!

ఏడవప్రకరణము.

పేస్టనజీసంబంధము.

కీర్తికరుఁడు రంగూనుపోలీసువారిరిపోర్టు నిట్లు చదువఁదొడంగెను:—

"పేస్టనజీకి రంగూనులోఁ జిరకాలమునుండి "పేస్టనజీఅండ్ కో" అనుకంపెనీ యున్నది. ఇందనేకవ్యాపారములు జరగుచుండును. పేస్టనజీతండ్రి యేఁడాదిక్రిందట మరణించెను. అప్పటినుండియు నీతఁడే యెల్లపనులను నిర్వహించుకొనుచుండెను.

"రహస్యముగఁ దెలిసికొనఁగా నాతనికి రక్షితయువతి యొక తె యున్నట్లు తెలిసినది. ఆమె మరాటీస్త్రీవలె నుండెను, కాని యాస్త్రీ పార్సీయువతి యనియు, వేషముమాత్రము మరాటీవలె నగపడు

నని యు సంవత్సరముక్రిందటఁ బేస్టనజీయొద్దకు వచ్చి యాతనిచేఁ బోషింపఁబడుచుండె ననియు నామెదాసివలనఁ దెలియవచ్చినది. పేస్టనజీ గుఱ్ఱపుఁబందెములలోఁ జాలధనము నష్టపోయినట్లు తెలిసినది.

"సంవత్సరమునుండి యాతఁ డిట్లే నష్టపడుచుండుటచేఁ గంపెనీవ్యవహారమంతయుఁ జెడిపోయెను. త్వరలో మరల నెట్లయినధనము సంపాదింపకున్నచో నాతనియవస్థ దుస్సహముగాఁ బరిణమించును.

"అందుచే నాతఁడు హారమసజీకుమార్తె నెట్లయినఁ బెండ్లియాడవలయునని కొన్ని నెలలక్రిందట బొంబాయికిఁ బోయెను. అట్లు పెండ్లియాడఁగలిగినచో ధనమునకుఁ గొదవ యుండ దని యెంచి యాతఁ డచ్చటికిఁ బోయెను. మూడు నెలలనుండి యాతనియుంపుడుకత్తెయు నగపడుట లేదు. పేస్టనజీ బొంబాయికిఁ బోయిన యొకటిరెండు నెలలకే యామెయుఁ బోయినది. మీరు వ్రాసినప్రశ్నలకుఁ బ్రత్యుత్తరమిచ్చితిమి. ఇంకను మీ రేమైనఁ దెలిసికొనఁగోరి వ్రాసినచోఁ బరమానందమునఁ బ్రయత్నించి తెలిసికొని వ్రాయుదుము"—

కీర్తికరుఁ డిట్లు చదివి "దాదా! ఏమైన బోధపడినదా?" అనియెను.

దాదా—ఆతఁడు కమలను బెండ్లియాడుటకై యిటకు వచ్చియుండెను.

కీర్తి—ఎంతపండితుఁడవు! ఆసంగతి రిపోర్టులోనే యున్నది.

లాలూ—ఆలోచించుట కవకాశముండవలయును. నేను చెప్పుదునా? పేస్టనజీయుంపుడుకత్తెయే యారాత్రి మరణాపన్నయై రుస్తుమజీకి జీటివ్రాసినయువతి. ఆరాత్రి రుస్తుమజీ యచ్చటికే పోయియుండెను.

కీర్తి—ఆపెట్టెయు, నుత్తరమును నీవు చూడకపోయినను నిట్లు చెప్పఁగలిగితివి.

లాలూ—తెలిసినది. ఆమె మరాఠీకాదు. పార్సీ—హారమసజీప్రథమభార్య!

కీర్తి—ఈసంగతి యిదివఱకుఁ దెలిసినదే. ఇప్పుడు క్రొత్తగ నేమైన బోధపడినదా?

లాలూ—హారమసజీ కమలాబాయిని దన కీయకున్నచో నాతనిప్రథమవివాహవృత్తాంతమును బ్రకటించి శిక్షింపఁజేయుదు నని భయపెట్టి యెట్లయినఁ గమలను బెండ్లియాడుటకై పేస్టనజీ వచ్చియుండెను.

దాదా—ఇట్టివిషమావస్థకలుగుటచేతనే హారమసజీ యాస్టిఫికెటుల నెట్లయిన సంపాదింపవలయు నని దృఢప్రయత్నము చేసెను. దానిఫలమే క్లోరోఫారముకొనుటయు, హత్యయగుటయును!—

కీర్తి—దాదా! పేస్టనజీతో బర్జరజీని బోల్చిచూడుము! ఇరువురు సర్వస్వమును బోఁగొట్టుకొని ధనసంపాదనమునకై హారమసజీయొద్దకు వచ్చిరి. ఆబర్జరజీ మాంచరజీని వెంటఁబెట్టుకొని వచ్చెను. ఆయుంపుడుకత్తె పేస్టనజీకొఱకు వచ్చెను. ఇందు పేస్టనజీ ప్రాణములను బోఁగొట్టుకొనియెను. బర్జరజీ కావలసినంతధనము సంపాదించుకొనియెను. గణేశమల్లునియొద్దఁ దాకట్టుపెట్టిన రాజాబాయివస్తువులను జూచినచో నిది యంతయు స్పష్టపడఁగలదు.

దాదా—హారమసజీ హత్య చేసియుండు నని మీకు నమ్మకము లేదా?

కీర్తి—అతఁడు తనసొమ్మునుగూడఁ దానే యపహరించియుండునా?

దాదా—లేదు. ఆతనిభార్య—

కీర్తి—మంచిది. ఈవిషయము తరువాత నాలోచించుకొందము. మఱియొకరిపోర్టు వినుఁడు!

ఎనిమిదవప్రకరణము.

రత్నాబాయిసంబంధము.

కీర్తికరుఁడు మఱికొన్ని కాగితములను దీసి "ఇది రత్నాబాయి చరిత్రము!" అనియెను.

దాదా—ఆమె యిప్పు డెచ్చట నున్నది? నాకన్నులలో దుమ్ముగొట్టి మీరే యామెను దాఁటించివైచితిరి. ఆమె నాచేతిలో నున్నచో నెన్నిపనులైనఁ జేసి యుండును.

కీర్తి—ఆమె నాకుఁ జాల సాయము చేసినది.

దాదా—చేయదా? అట్టియామెను నాకడనుండి తప్పించివైచి నన్ను మూఢుఁడని నిందించుచుండుట న్యాయము కాదు. సాధనము చేత లేనప్పుడు నేనేమిచేయఁగలుగుదును?

కీర్తి—నీయొద్ద నున్నను నీవేమియుఁ జేయఁజాలవు.

లాలూ—ఆమెవలన మీకన్ని సంగతులును దెలిసినవి. మాకట్లు తెలియును.

కీర్తి—మీరుమాత్రము తెలిసికొనుటకుఁ బ్రయత్నింపఁ గూడదా?

దాదా—ఎట్లు? ఆమెను మీరెక్కడ దాఁచితిరో యెవ్వరికిని దెలియుట లేదు.

కీర్తి—తరువాత నంతయుఁ దెలియును. ఆమెచరిత్రము చదివెదను. వినుఁడు!

దాదా—ఆమెసంగతి వినుటవలన నేమిలాభమున్నది? చదువుఁడు! వినియెదము!

కీర్తికరుఁ డిట్లు చదువఁదొడంగెను.

"రత్నాబాయికిఁ బదిపదునొకండేండ్లవయసుగలయప్పు డొక మరాటీ యువతి యామెను బొంబాయినగరమున గంగాబాయి యను నొకగుజరాతిస్త్రీకొప్పగించి వెడలిపోయెను. ఆబిడ్డను బెంచుటకుఁ గొంతధనముకూడ నామె గంగాబాయి కిచ్చెను. కాని యొక్కపైసయైనను గంగాబాయి యామెకొఱ కుపయోగింపలేదు. ఆమె రత్నాబాయిని భిక్షమునకుఁ బంపుచు నామె తెచ్చినదానివలనఁ దాను నామెయునుగూడ బ్రదుకుచుండిరి.

"రత్నాబాయి సుందరి. మఱియు నామెకంఠస్వరము మధురమైనది. ఆమె తనయంతనే నేర్చికొన్నపాటల నమృతరస ముట్టిపడునట్లు పాడుచు భిక్షమెత్తుకొని కొలఁదియో గొప్పయో దినదినమును సంపాదించుచుండెను. అదృష్టవశమున రస్తుమజీ యొకనాఁడామెను జూచి, యామెకష్టచరిత్రము నాలకించి దయార్ద్రహృదయుఁడై గంగాబాయియొద్దకుఁ బోయి యీమె నిఁకభిక్షమునకుఁ బంపవలదని నిషేధించెను. అప్పటినుండి యాతఁడు ప్రతిమాసము నామెకుఁ గొంతధనమును బంపుచుండెను. కాని గంగాబాయి యాధనమంతయును మూటఁ గట్టుకొనుటయే కాని రత్నాబాయిని బాగుగఁబోషింపకుండెను. ఇట్లుండ మఱియైదాఱేండ్లకు రత్నాబాయి సర్వాంగసుందరీమణి యగుయువతి యయ్యెను. అప్పుడు పాపాత్మురాలగుగంగాబాయి ధనలోభముచే నామెను దుష్పథమునఁ బ్రవేశింపఁజేయఁదలంచి యట్టిప్రయత్నములో నుండెను.

ఈసంగతి యెన్నఁడును రత్నాబాయి రస్తుమజీకిఁ దెలిపియుండ లేదు. ఆమె నాతఁడె సోదరివలెఁ బ్రేమించుచుండెను. ఆమెయు యాతని దేవునివలె భావించుచుండెను. ఇట్లుండ రత్నాబాయి యొకనాఁ డాకస్మికముగ నంతర్హితయైపోయెను. ఎంత వెదకిన నగపడ లేదు. అప్పటి రస్తుమజీవిచారమునకు మేర లేకుండెను.

"ఇట్లుండ నొకవత్సరముక్రిందట రస్తుమజీకి వైద్యశాలనుండి యొకయుత్తరము వచ్చెను. అది మరణించుచున్న యొకస్త్రీ తన్నుఁ జూడఁగోరి వ్రాసినయుత్తరము. తోడనే యాతఁడు వైద్యశాలకుఁ బోయి బాధపడుచున్న రత్నాబాయిని దర్శించెను. ఆ తేండ్లకుఁ దరువాతఁ బునర్దర్శనము! రస్తుమజీ యేమియు మాటాడఁజాలకపోయెను. ఆతనిఁ గాంచినంతనే రత్నాబాయి కన్నీరుమున్నీరయ్యెను. రస్తుమజీకన్నులును బాష్పపూర్ణములైపోయెను. తోడనే యాతఁ డామెను దీసికొనిపోయి యొకయద్దెయింటనుంచి కాపాడుచు నావశ్యకమైనప్పుడు వైద్యశాలకుఁ దీసికొనిపోవుచుండెను. క్రమక్రమముగా రత్నాబాయి కారోగ్యలాభము కలిగెను. క్రమముగా నామెపూర్వసౌందర్య మామె కోమలాంగకముల ద్విగుణితతేజముతో నలంకరించెను.

ఆదినములలోనే సరిగా రస్తుమజీని హారమసజీ మఱియొక యిల్లుచూచుకొని యుండు మని చెప్పి తనయింటినుండి తప్పించెను. అందుచేతనే యాతఁ డప్పటినుండియు రత్నాబాయికొఱకు కేర్పఱచుకొన్నగృహమునందే యుండి కాలక్షేపము చేయుచుండెను. ఆతఁడు రత్నాబాయికి సంపూర్ణారోగ్యము కలుగుటకుఁ దగినప్రయత్నములను జేయుచుండెను. మంచిమంచివిలువగలవస్తువులచే నాయిల్లలకరింపఁబడియెను. క్రమముగా నాతఁ డామెకు నతిరమణీయములగునగల నెన్నిటినో చేయించెను. నిరంతరము రత్నాబాయిమందిర మానందమందిరముంబోలి యుండెను. రత్నాబాయి రస్తుమజీకి రక్షితయువతి యని యందఱు ననుకొనఁ దొడంగిరి."

అని చదివి కీర్తికరుఁడు "దాదా! తరువాత నీ వామెను నేర్పుగా నీయింటికిఁ దీసికొనిపోయితివి. తరువాత నేమిజరిగినదో నీకుఁ దెలిసియేయున్నది" అనియెను.

దాదా—తెలియ కేమి? నన్ను మూర్ఖునిఁ జేసి మీ రామెను దీసికొనిపోయి చేతిలోఁ బెట్టుకొంటిరి.

కీర్తి—ఆమె యిప్పుడు నాయొద్దను లేదు. హారమసజీయింటఁ గమలాబాయి దాసియైయున్నది.

దాదాభాస్కరుఁడు విస్మయావిష్టుఁడై తలయెత్తి నోటమాట లేక కీర్తికరునివంకఁ జూచుచు నివ్వెఱపడిపోయెను.

తొమ్మిదవప్రకరణము.

కీర్తికరుని యుక్తి.

అట్లున్న దాదాభాస్కరునిం గాంచి కీర్తికరుఁడు పకపక నవ్వెను. లాలూభాయియు నవ్వు నాపుకొనఁజాలకపోయెను. కీర్తికరుఁ డట్లే నవ్వుచు "దాదా! అట్లు తెల్లపోయెద వేమి?" అనియెను.

దాదా—అటువంటియామెను జేతనుంచుకొన్నచో నేనును బ్రగల్భములు కొట్టుదును.

కీర్తి—నీచేతికే దొరకినది కాదా?

దాదా—ఏమిలాభము?

కీర్తి—సరే. దానికేమి? ఇప్పుడు హంతకుఁ డెవ్వరో, చోరుఁ డెవ్వరో యాలోచింపవలయును. మీకుఁ దోఁచినసంగతులు చెప్పుఁడు. తర్కమువలన లాభమున్నది. రస్తుమజీ [illegible]

గాఁడని తేలినది గదా! ఇఁకనున్నవారు? హారమసజీ, ప్రేమజీ, మాంచరజీ, బర్జరజీ—ఈనలుగురిలో నెవ్వరో హంతకులై యుండవలయును.

లాలూ—ఇప్పుడు హారమసజీయెడలనే విశేషముగ ననుమానమున్నది.

కీర్తి—హారమసజీ బుద్ధిమంతుఁడు; గొప్పవాఁడు; ఆతఁడు స్వయముగా నిట్టిపనిచేసి యుండఁడు. ఒకవేళఁ జేయించినచోఁ బ్రేమజీచేఁ జేయించి యుండును.

దాదా—ప్రేమజీయెడల సంశయించుటకు నిదర్శనములున్నవి.

కీర్తి—మఱియీవిషయమున నొకటిరెండుమాటలు జ్ఞప్తియందుంచుకొనవలయును. హారమసజీ ప్రేమజీయింటినుండి యాతనికోటును దొంగిలించెనని యనుమానించుచున్నారు. అది సత్యము కాదు. ఎవ్వఁడో యాకోటు నెత్తికొనిపోవుచుండఁగాఁ జూచితినని యింటిగుమ్మముకడ నున్నయంగడివాఁడు చెప్పుచున్నాఁడు. ఆతఁ డసత్యముఁ జెప్పుటకుఁ గారణము లేదు. అది గాక ప్రేమజీని బిలిచి నీకోటు నిమ్మని యడిగిన నాతఁ డీయఁడా? హారమసజీ యాతనియింట దొంగతన మేలచేయవలయును?

దాదా—అట్లయినచో నాకోటు నెత్తికొనిపోయినవాఁ డితరుఁ డై యుండును.

కీర్తి—అవును. హంతకుఁడుకూడ నాతఁడే. మఱియు నారాత్రి మరణోన్ముఖయైయున్న హారమసజీప్రథమభార్య యుత్తరము వ్రాయునప్పటికి సర్టిఫికెటులమాట పేస్టనజీ హారమసజీయొద్దఁ జెప్పియుండలేదు; వాఁడు కమలాబాయినిఁ బెండ్లియాడు ప్రయత్నము దాఁగ

యుండెను. హారమసజీ యందుల కడ్డుచెప్పినచో నాబ్రహ్మాస్త్రములను బ్రయోగింపవలయునని యాతఁడు వానిని రహస్యముగా నుంచుకొనియెను. అందుచే హారమసజీకంతవఱ కాసర్టిఫికెటులమాటయే తెలియదు. దీనినిబట్టిచూడఁగా హారమసజీ హత్యచేసె ననుట కవకాశము లేదు. ప్రేమజీయెడలఁ గూడ సంశయించుటకుఁ గారణము లగపడుటలేదు. ఆసర్టిఫికెటులను సంపాదించి కమలను బెండ్లియాడుటకును హారమసజీ ద్రవ్యమున కధికారి యగుటకును నాశపడి మఱియొకఁ డెవ్వఁడో పేస్టనజీని జంపియుండవలయును.

దాదా—అట్లయినచో నిఁక బర్జరజీకంటె నితరు లెవ్వరున్నారు?

కీర్తి—అంచులకు నిదర్శనము లేమున్నవి? పేస్టనజీయొద్ద సర్టిఫికెటు లున్నవని బర్జరజీకిఁ దెలిసినట్లు నిదర్శన మేదైన దొరకినచో మనమాతని ననుమానింపవచ్చును. లాలూభాయీ! నీవీవిషయమునఁ బరీక్షించుచుండుము!

లాలూ—ఇప్పటివ్యవహారమునుబట్టి మనము బర్జరజీ ననుమానింపవచ్చును.

కీర్తి—తొందరపడి ముందుగనే సిద్ధాంతములు చేయవలదు పత్తేదారుఁ డట్లు చేయుట కేవలమును దప్పుపని. ప్రయత్నించి వివేచనము చేసి స్వయముగఁ దెలిసికొన్న సంగతులుమాత్రమే సత్యములని యాతఁడు నమ్మవలయును.

పదియవ ప్రకరణము.

తర్కవితర్కములు.

కీర్తి—హత్యవిషయమున మనము కొంతవఱ కాలోచించితిమి. ఇఁకఁ జౌర్యమునుగురించికూడ నాలోచింపవలసియున్నది.

దాదా—ఇది నావ్యవహారము! దీనినిగూర్చి నన్నడుగవలయును. బర్జరజీయన్నగారికిని, రాజాబాయికిని జిన్నతనమునం దేదియో గుప్తసంబంధమున్నట్లు రిపోర్టునుబట్టి తెలియవచ్చుచున్నది. బర్జరజీ తనధనమును బోఁగొట్టుకొని, యున్న సంపత్తినిగూడ నాశనము చేసి మఱియు ధనాశచే బొంబాయికి వచ్చి రాజాబాయిని జూచి యామె పూర్వచరిత్రమును వెల్లడింతు నని భయపెట్టి యామెను దనవశము చేసికొన్నాఁడు. ఆమెయును, మూంచరజీ తనచెల్లెలికొడుకనియు, బర్జరజీ తనయాత్మీయుఁడనియుఁ జెప్పుకొనుచు భయముచేఁ దనసర్వాభరణములను వారిపాలు చేసివైచినది. ఈనడుమఁ బాషండుఁ డగుబర్జరజీ మూంచరజీని రాజాబాయి కుపపతిగాఁ జేసి తానెటులైనఁ గమలను బెండ్లియాడుటకుఁగూడఁ బ్రయత్నించుచున్నాఁడు. నిరంతరమును ధనముకొఱకే పీడించుచున్నవారిపోరు పడలేక రాజాబాయియే బ్యాంకి పెట్టెతాళమును దెఱచి యాద్రవ్యము నపహరించి యుండును.

కీర్తి—సరే. ఆపెట్టె తెఱచుట కొకగుప్తసంకేత మున్నదిగదా! అది యామె కెట్లు తెలియును? హరమసజీ యామెకట్టిరహస్యమును జెప్పువాఁడు కాఁడు. ఒకవేళ రస్తుమజీ త్రాగిమత్తెక్కియున్నప్పు డీరహస్యము నెవ్వరియొద్దనైన వెల్లడించియుండవచ్చును.

దాదా—అవును.

కీర్తి—అట్లయినచో నాతఁడు బర్జరజీకో మూంచరజీకో చెప్పియుండవలయును.

దాదా—ఎందుచేత?

కీర్తి—ఎందుచేతనా? దొంగ లోపలినుండి గదిలోఁ బ్రవేశించినట్లు మనము నిశ్చయించుకొంటిమిగదా. మూంచరజీ బర్జరజీలుగాక మఱియెవ్వరు హరమసజీలోపలికి రాఁగలరు? రాజాబాయికిఁగూడ నీసంగతి తెలిసియుండవచ్చును. ఆయిరువురిలో నొకరీధనము నపహరించి

యుందురు. అప్పుడు భయముచే రాజాబాయి యాతని నడ్డగించియుండును. ఇప్పుడు మనమిదివఱ కాలోచించుకొన్నసంగతు లన్నియు సరిపడినవి.

దాదా—ఇప్పుడట్లే తోఁచుచున్నది. అట్లే జరగియుండును.

కీర్తి—అయినచో నీవనినట్లు రాజాబాయి దొంగయెట్లగును?

దాదా—కాకపోవచ్చును!

కీర్తి—ఇప్పుడు మనము ముఖ్యముగా రస్తుమజీ యెవ్వరియొద్ద నాగుప్తసంకేతమును వెల్లడించెనో తెలిసికొనవలసియున్నది.

దాదా—అట్లయినచో దొంగ యప్పుడే దొరకిపోవును.

కీర్తి—కావున నాయిరువురిలో నెవ్వరికి రస్తుమజీతో విశేషసంబంధమున్నదో ప్రయత్నించి తెలిసికొనవలయు.

దాదా—అవును. కాని యీపని మీరుచేయవలసినదే గాని నేనెట్లు చేయఁగలను? ఆసాధనము మీచేతిలోఁ బడియున్నదిగాదా!

కీర్తి—ఏది?

దాదా—రత్నాబాయి!

కీర్తి—ఈసంగతి యామె కెట్లు తెలియును?

దాదా—అందఱును గలసి త్రాగుటయు, జూదమాడుటయు, నాయింటనేగదా! ఆతఁ డెవ్వరితో నేరహస్యము చెప్పినను నచ్చటనే చెప్పవలయును.


కీర్తి—అవును. నేనీసంగతి నిన్నాళ్ళవఱకు నడుగుటయే మఱచితిని!

దాదా—గురుదేవునకుఁగూడ బొరపాటనుమాట యున్నదా?

కీర్తి—పొరపాటు లేనివాఁ డెవ్వఁడు? కానిమ్ము! ఇప్పుడు రెండు వ్యవహారములనుగూర్చియుఁ జాలవఱకుఁ దర్కించుకొంటిమిగదా! ఇఁక వారముదినములలో నపరాధులిరువురనుగూడఁ బట్టుకొనవలయును.

దాదా—గురుదేవుని యాశీర్వాదము.

అనంతరము సభ చాలించి ముప్వురు నెవరిత్రోవను వారు పోయిరి.



రహస్యవిప్లవము.

చతుర్థఖండము—అభినవరహస్యము.

మొదటి ప్రకరణము.

రమణీహృదయము.

న్యాయస్థానమునుండి విడుదలయైనతోడనే రస్తుమజీ చిత్రప్రతిమవలె నేరమణీమణితోఁ గలసి బండిపై నెక్కెనో, నిజముగా నప్పుడాతని కారమణీమణి యెవ్వతెయో తెలిసికొనుటకుఁ దగినగ్రహణశక్తికూడ లేకయుండెను. బండికదలినచప్పుడువలన నాకస్మికముగ నాతనికి స్మృతి కలుగుటయు, స్తంభితహృదయముతో నప్పుడాతఁ డాసుందరివంకఁ దిలకించెను. అప్పు డాసుందరి మేలిముసుఁ గొకింత చెదరి యుండెను. రస్తుమజీ యట్లుచూచినంతనే యులికిపడి "నీవా?" అనియెను.

రమ—అవును. నేనే. కాని నేనిప్పుడారత్నాబాయిని గాను. కమలాబాయి దాసిని.

రస్త—(ఆశ్చర్యముతో) కమలాబాయి దాసివి!

రత్నా—అవును. కమలాబాయి దాసినే.

రస్త—ఎందుచేత?

రత్నా—ఎందుచేతనా? నీవు విపన్నిమగ్నుఁడవై యుండఁగా నేనూరక చూచుచుండవలసినదా? అట్లయినచో నిఁక నాబ్రదుకు కెందులకు? కమలాబాయిదాసినే గాకున్నచో నీకష్టములకు విడుదలయును

లేదు—నీయపకీర్తికి నివృత్తియును లేదు—అపరాధికిఁ దగినదండనమును లేదు—అందుచేతనే నేను కమలాబాయికి దాసినైతిని.

రస్తు—నాకేమియు బోధపడుట లేదు. బోధపఱచుకొనుటకు శక్తియును లేదు.

రత్నా—ఆవశ్యక మైనప్పు డంతయును జెప్పెదను. ఇఁక నీవు పొమ్ము!—ఇష్టమున్నచో మనయింటికిఁ బోయి యుండుము.

రస్తు—నీవెక్కడకుఁ బోయెదవు?

రత్నా—ఎక్కడనుండివచ్చితినో యక్కడకే—కమలయొద్దకు.

రస్తు—ఏల? నాకు విడుదల యైనది గదా! ఇంకను నీకక్కడకుఁ బోవలసినపని యేమున్నది? నేను నిన్నుఁ బోనీయను.

రత్నా—ఇంకను బాపాత్ములకుఁ దగినశిక్ష కాలేదు. అది యగునంతవఱకును నీకు నిరపాయస్థితి లేదు. ఆదురాత్ములు నీకింకను గష్టములఁ గల్పింపవలయు నని ప్రాణపణంబుగఁ బ్రయత్నించుచున్నారు—లోలోపల గూఢదుస్తంత్రములు జరగుచున్నవి.

రస్తు—ఎవ్వరువారు? నేనెవ్వరికి నెట్టియపకారమును జేసి యెఱుంగనే!

రత్నా—నీవపకారివి కానంతమాత్రమున నీకు శత్రువులుండఁ గూడదా?

రస్తు—వారెవ్వరు?

రత్నా—బగ్గరజీమ్యాంచరజీలు—నీవంతవింతపడనక్కఱలేదు.

రస్తు—వారికి నేనెట్టినష్టమును గలిగింపలేదే!

రత్నా—కలిగించితివి—నీవు కమలనుబెండ్లియాడఁ గోరితివి.

రస్తు—అందువలన వారికేమినష్టము?

రత్నా—వారికోరికయు నదియే—హారమసజీసర్వస్వమునకు నధీశ్వరులు కావలెనని—

రస్తు—ఆలాగా?

రత్నా—భయము లేదు. నేను బ్రదికియుండగా నీవుతక్కఁ గమలాబాయి నెవ్వరును బడయఁజాలరు.

రస్తు—ఏమిరత్నా! నీవే యిట్లనుచున్నావా?

రత్నా—నిశ్చయముగా—నీవాశ్చర్యపడవలదు. నేనును కమలాబాయి నిదివఱకు రెండుకన్నులను విచ్చి చూచి యుండలేదు. ఆమె పేరువిన్న నాసర్వాంగకములును మండిపోయెడివి. ఇప్పుడు నేనామె సహవాసము చేసి యాదేవి సాధుస్వభావమును బాగుగ గ్రహించితిని. ఆమెయెడల నాకిప్పు డెట్టియసూయయును లేదు. నేనామెను బ్రాణముకంటె నధికముగఁ బ్రేమించుచున్నాను. ఆమెపాదధూళిని గ్రహించుటకైనను నేను యోగ్యురాలను గాను.

రస్తు—రత్నా! ఎందులకీపరిహాసము! నామనసు దెలిసికొనవలయునని ప్రయత్నించుచుంటివా?

రత్నాబాయి యామాటకుఁ బదులు చెప్పక గద్గదస్వరముతో "నీవు నన్ను—వీథులవెంట బిచ్చమెత్తుకొనుచున్ననన్ను—పాపాత్మురాలనగునన్ను—నీసోదరివలెఁ బ్రేమించితివి. నాసహస్రాపరాధములను క్షమించితివి—నన్ను మృత్యుముఖమునుండి యుద్ధరించితివి—మహారాజ్ఞిం బోలి పోషించితివి. పాపాత్మురాల నగునేను నిన్ను మఱియొకభావముతోఁ బ్రేమించితిని—హృదయేశ్వరునిగా నిన్నుఁ బూజించితిని—కాని యిప్పుడు నేనారత్నాబాయిని గాను. ఆరత్న మరణించినది. రస్తమ్! ఇప్పుడు నేను నీసోదరినగుటకుఁ దగినదాన నగుదునోకానో చూడుము! నేనట్టిదాననై నిన్ను సేవింపఁజాలనా? చూడుము! రస్తమ్! రస్తమ్! నన్నుక్షమింపుము! నానేరమును సహింపుము!" అని ప్రార్థించుచు ధైర్యము నింక వహింపఁజాలక యేడువఁదొడంగెను.

రస్తమజీ ప్రేమార్ద్రహృదయముతో నామెకన్నీటిని యుడుచుచుండెను. తుడిచినకొలందియుఁ గన్నీరు మున్నీరగుచుండెను. అంతలో నాకస్మికముగ రత్నాబాయి తెలివితెచ్చుకొని యులికిపడి సత్వరముగఁ బయ్యెదచెఱంగుతో నశ్రువులఁ దుడిచికొని "బండి నాపుమనుము! నేనిక్కడనే దిగవలయును" అనియెను.

రస్త—బండియెక్కి యింటికిఁ బోవుదము.

రత్నా—వలదు—ఆవశ్యకమైనప్పుడు పోవచ్చును. బండినాపుమనుము.

రస్త—ఇంటికిఁబోవుదము. తరువాత నాలోచించుకొనవచ్చును

రత్నా—వలదు. ఇక్కడనే నేను దిగియెదను.

రస్త—రత్నా! ఇప్పుడు వలదు.

రత్నాబాయి యంగీకరింపలేదు. గత్యంతరములేక రస్తమజీ బండి నాపించెను. రత్నాబాయి బండినుండి దిగుచు "అమరాటివృద్ధుఁడు చెప్పినట్లు చేయుచుండుము! నిన్ను రక్షించినవాఁ డాతఁడే—ఆతని యాజ్ఞననుసరించియే నేను పని చేసితిని. ఆతఁడే మనకిప్పుడు పరమమిత్రుఁడు—ఆతఁడే నీశత్రువులకుఁ బ్రతిక్రియ చేయఁగలసమర్థుఁడు!" అని ప్రబోధించి యామెయటనుండి యొకసందుత్రోవను వెడలిపోయెను. రస్తమజీకొయ్యబొమ్మవలె బండిలోఁ గూలఁబడియెను. ఆతనితల తిరిగిపోవుచుండెను. హృదయ మతితీవ్రముగఁ గొట్టుకొనుచుండెను. అప్పటి యాతనియవస్థయంతయును యథారూపమున వర్ణించుట కష్టసాధ్యమైయుండెను.

రెండవ ప్రకరణము.

కృతార్థుఁడగు వృద్ధుఁడు.

క్రమముగా బండి రస్తమజీ యింటియొద్దకు వచ్చెను. ఆతఁడు కంపితపదములతో బండినుండి దిగి స్పందితహృదయముతో గృహద్వారమునొద్దకుఁబోయి నిలువఁబడియెను. అంతలో నాతనికిఁ బూర్వవృత్తాంతము స్మృతికి వచ్చెను. ఒకసారి పూర్వమాతని కిట్లే విడుదలయయ్యెను. కాని యింటికిఁ జేరకుండగనే మరల నాతని బంధించి తీసికొనిపోయిరి. ఆభయముచే నిప్పు డాతనిదృష్టి తనయంతఁ దానే రాజవీథివైపునకుఁ బ్రసరించెను. వీథిలోఁ బోలీసువా రెవ్వరును లేరు. అప్పు డాతఁ డొక్కనిట్టూర్పు విడిచి బండివానింజూచి "అద్దె నిచ్చెద నించుకసే పాఁగుము" అనియెను.

బండి—అద్దె నాకిదివఱకే ముట్టినది. అని యాతఁ డొక్కపరుగున బండిఁదోలుకొని పోయెను. తనయొద్ద ధనముండదుగదాయని భావించి రత్నాబాయియద్దెనిచ్చివైచినదని తెలిసికొని రస్తమజీ చాల నొచ్చుకొనియెను. ఆతఁడు లోనికి బోవునప్పటికిఁ భృత్యుఁడు నగుమొగముతో నెదురు వచ్చి యానందపారవశ్యముచే నేమియు మాటాడఁజాలక పోయెను. రస్తమజీకన్నుల నీరు నిండిపోయెను. ఆతఁడు నేమియు మాటాడఁజాలక మొగముత్రిప్పుకొని యొకగదిలోనికిఁ బోయెను.

ఆగదిలో నొకవ్యక్తి కూర్చుండియుండెను. ఆతఁడు రస్తమజీని జూచి "రమ్ము! కూర్చుండుము!" అనియెను. రస్తమజీ విస్మితుఁడైపోయెను. ఆవ్యక్తి యెవ్వరు? అమరాటివృద్ధుఁడే! అప్పుడాతఁడొక పత్రికను జదువుచుఁ దనసొంతయింటిలోఁ గూర్చున్నట్లే స్వేచ్ఛతో నుండెను. ఆతఁడట్లే చదువుకొనుచు రస్తమజీవంకఁ జూడకుండఁగనే "రమ్ము; నేను నీకొఱకే వేచి యుంటిని" అనియెను.

రస్తమజీ యేమనుటకును దోఁపక మౌనముతో నిలిచియుండెను. వృద్ధకాశీనాథనాయకుఁడు "వత్సా! కూరుచుండుము! ఇంచుక విశ్రమింపుము. ఇట్టికష్టములను నీవు సహింపఁగలిగితివి గాని మఱియొకఁడైనచో నీసరికిఁ బిచ్చివాఁడై పోయి యుండును.

ఈసారి రస్తమజీ యతికష్టముతో హృదయమునుబదిలపఱుచుకొని "మీయనుగ్రహమున విపద్విముక్తుఁడనైతిని!" అనియెను.

కాశీ—అట్లనుట పొరపాటు! అందఱును దేవునిచేతియందున్నారు. ఆతఁడెన్నటికిని నిరపరాధులను శిక్షింపఁడు.

రస్త—ఆభగవానుఁడే నాకు దిక్కుఁగా మిమ్ములను జూపియున్నాఁడు.

కాశీ—ఇందిరువురు నాకుఁ జాలవిధములఁదోడుపడి పని చేసిరి. వారు లేకున్నచో నేనేమిచేయఁగలిగియుండును?

రస్త.—ఆదయామయు లెవ్వరో తెలిపెదరా?

కాశీ—వారు నీమిత్రులే—ఒకఁడు ప్రేమజీ—

రస్త—అవును. ప్రేమజీ నన్నుఁ బ్రాణముంబోలె ప్రేమించుచుండును. రెండవవారు?

కాశీ—ఆమెయొక స్త్రీరత్నము.

రస్త—ఆస్త్రీ యెవ్వరు?

కాశీ—ఆమెను నీవెఱుఁగవా? ఆమెసాయమువలననే నేనికార్యమును నిర్వహింపఁగలిగితిని. నేనామెను మొట్టమొదటఁ బతితురాలని యనుకొంటిని. అది నాపొరపాటు! నిజముగా నామె దేవీమూర్తి. ఆమె యెవ్వరో యెఱుఁగవా! రత్నాబాయి!

రస్తమజీకన్నుల నీరు నిండిపోయెను. ఆతఁ డతికష్టముతో ధైర్యము తెచ్చుకొని "నేనీసంగతి యెఱుఁగుదును. ఇప్పు డామెయే న్యాయస్థానమునుండి నన్ను బండిపై నెక్కించి తీసికొని వచ్చినది!" అనియెను.

కాశీ—ఆసంగతి నాకుఁ దెలియును

రస్త—మీరన్నియు నెఱుంగుదురు! కాని యిప్పుడైనను మీరెవ్వరో సత్యము చెప్పరాదా?

కాశీ—ఎన్నిసారులు చెప్పుదును? నీజనకునకు బాల్యసఖుఁడను. నాకర్తవ్యమును నిర్వహింపవచ్చితిని.

రస్త—మీరు లేకున్నచో నాగతి యేమగునో!

కాశీ—సాధుపులకు సర్వేశ్వరుఁడే సాయము చేయుచుండును.

రస్త—నేను నిర్దోషిగ నిర్ధారింపఁబడి విముక్తుఁడనైతిని గాని నాకు లోకముకనులఁ బడుటకు మొగము చెల్లకున్నది.

కాశీ—నీహృదయావస్థ నాకు బోధపడినది. నిజముగ నేరము చేసినవాఁడు పట్టువడినచో నప్పుడు నీకీర్తి వేయిమడుంగులు కాఁగలదు. నేనందుకొఱకే యల్లాడుచున్నాను. భయములేదు బాబూ! ఎప్పటికైన నేనీకుతంత్రమును భేదించి తీరెదను. కాని యీవిషయమున నిన్నొకటి రెండుమాట లడుగవలసి యున్నది. ఆలస్యము చేసినచోఁ గార్యము చెడిపోవును. అందుకొఱకే నీయొద్దకు వచ్చితిని. నీతో రహస్యముగ మాటలాడవలయు ననియే నీకొఱకు వచ్చినప్రేమజీని గూడఁ బంపివైచితిని.

రస్త—ప్రేమజీ వచ్చెనా?

కాశీ—అవును. ఆతఁడు నిన్నెప్పుడు చూతునా యని యాత్రపడుచున్నను నాకార్యభారమును బట్టి సాయంకాలము చూడవచ్చునని చెప్పి యాతని బంపించితిని.

రస్త—సరే—కాని—నాహృదయము నాతని జూడవలయు నని వ్యాకులపడుచున్నది.

కాశీ—కార్యభంగశంక చే నట్లు చేసితిని. సాయంకాలము చూడవచ్చును.

రుస్తు—మంచిది మీరడుగునదేమి ?

కాశీ—ఇదివఱ కడిగినసంగతినే మరల నడుగుచున్నాను. ఆరాత్రి నీవాస్త్రీని దర్శించి యేమిమాటలాడితివి ?

రుస్తు—మీరు నాకుపకారము చేసి నన్ను రక్షించి యున్నారు. నన్ను క్షమింపఁగోరెదను. ఇఁక మీరు నన్నామాట యడుగవలదు.

కాశీ—మంచిది. నీకుఁ బదినిమిషములు గడు విచ్చితిని. బాగుగ నాలోచించుకొని ప్రత్యుత్తరము చెప్పుము.

అని కాశీనాథుఁడు కన్నులు మూసికొని కుర్చీపైఁ జేరగిలఁబడియెను.

మూఁడవప్రకరణము.

ఈతఁడు సర్వజ్ఞుఁడాయేమి?

సరిగఁ బదినిమిషములైనతోడనే కాశీనాథుఁడు రుస్తుమజీవంకఁ దిలకించెను. అతని గన్నెత్తి చూడఁజాలక రుస్తుమజీ తలవంచుకొనియెను. కాశీనాథుఁడు మృదుస్వరముతో "ఒకప్పుడు నీవామెయున్నచోటైనను జెప్పక యాత్మహత్యచేసికొనుటకు సిద్ధపడితివి. నేను తెలిసికొనకుండ నూరకుంటినా ?" అనియెను.

రుస్తు—అవును మీరు తెలిసికొనఁజాలరని నేను చెప్పకపోలేదు.

కాశీ—కొంచెము కొంచెముగఁ దెలిసినది. నీవు చెప్పకుండుటకుఁ గారణ మేమోకూడఁ దెలిసినది. హత్యచేసినవాఁడెవ్వఁడో హంతకుఁ డెవ్వడని నీవనుమానించుచుంటివో యాసంగతి నేనెఱుంగుదును.

రుస్తుమజీ విస్మయముతో "మీ కెట్లు తెలిసినది ? నేనెవ్వని ననుమానించుచుంటినో చెప్పఁగలరా ?" అనియెను.

కాశీ—కుమారా ! ఈముసలివానికిఁ జాలసంగతులు తెలియును. హంతకుఁడు హారమసజీ యని నీవనుమానించుట లేదా ?

రుస్తుమజీ పరమాశ్చర్యనిమగ్నుఁడై కాశీనాథునివంకఁ దదేకదృష్టితోఁ జూచుచుండెను.

కాశీ—నేను ప్రయత్నించి చాలరహస్యములను గ్రహించితిని. ఇంకను దెలిసికొనఁగలను. మఱియొకసంగతి — ఆరాత్రి నీవు చూడఁబోయిదస్త్రీ హారమసజీ మొదటిభార్య కాదా ?

రుస్తుమజీ విస్మయమునకు మేర లేదు!

అతనినోట మాట లేకుండఁబోయెను. అతఁడు వ్యాకులహృదయముతో మీరు సర్వజ్ఞులు" అనియెను.

కాశీ—వినుము—వినుము—ఆమె పేస్టనజీపోషణమం దుండెను. ఆపేస్టనజీ హారమసజీయొద్ద ధనము లాగవలయునను నాశతో నామెయొద్దనుండి వివాహపు సర్టిఫికెటు నపహరించెను.

రుస్తు—అట్లయినచో మీ కన్ని సంగతులును దెలిసిపోయినవి. ఇఁకఁ దెలియనిదేమున్నది ?

కాశీ—ఇప్పుడు నీవు నామాటకుఁ ప్రత్యుత్తరము చెప్పెదవా! నీమనసులోని సంగతి నాకుఁ దెలియనిది కాదు. హారమసజీయే హత్య చేసెనని నీనమ్మకము ! అందుచేతనే — నీవాతనితనయను బ్రేమించుటచేత—నాతనియపరాధమును నీనెత్తిని బెట్టుకొని యాత్మహత్య చేసికొనుటకు సిద్ధపడి యుంటివి ! ఎంతమూఢుఁడవు !

రుస్తు—మీరు సత్యము చెప్పితిరి. ఆ సర్టిఫికెటుకొఱకు పేస్టనజీని హారమసజీ చంపెననియే నాయనుమానము. కాకున్నచో నాతని జంపుట కితరుల కెట్టిప్రయోజనమున్నది ? ఆసర్టిఫికెటు మఱియొక

రెవ్వరికిఁ గావలయును ? దానిసంగతి యెవ్వరికిఁ దెలియును ?

కాశీ—అదియే తెలిసికొనవలసిన సంగతి. అది యాతనియొద్ద నున్నట్లు తెలిసికొన్నవా రెవ్వరో యాతనిని జంపినవా రెవ్వరో తెలిసికొనవలయును.

రస్తు—ఆసంగతి యాస్త్రీ యితరు లెవ్వరితోడను జెప్పలేదని నాతోఁ జెప్పినది.

కాశీ—ఆమె చెప్పకున్నను పేస్తనజీ చెప్పియుండును, చూడుము ? ఆబ్యాంకిపెట్టెను దెఱచు సంకేతము నీకును హారమసజీకినిదప్ప నితరులకుఁ దెలియదుగదా ? ఆసొమ్ము నితరు లెట్లపహరింపఁగల్గిరి ?

రస్తు—అవును ఆసంగతి నాకింకను వింతగానే యున్నది.

కాశీ—సరే, ఆమాట తరువాతఁ జూచుకొందము. నేనడిగిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము చెప్పుము. అట్లయినచో హంతకుఁడును జోరుఁడునుగూడ దొరకుట కవకాశముగా నుండును.

రస్తు—అన్ని సంగతులు మీకే తెలిసినప్పుడు నేను చెప్పుట కభ్యంతరమేమి ? అంతయును జెప్పెద నాలకింపుఁడు !

కాశీనాథుఁడు సావధానియై వినుచుండె రస్తుమజీ సర్వవృత్తాంతమును జెప్పందొడంగెను.

నాలుగవ ప్రకరణము

పాపఫలము.

రస్తు—మహాశయా ! నేనాచీటిని జదువుకొని యాస్త్రీ మరణోన్ముఖురాలై యున్నదని తెలిసికొని యికనాలస్యముచేయఁగూడదనియెంచి యతిత్వరితముగ నామెను జూడఁబోవుచుంటిని. అంతలో

నాస్మికముగఁ దోవలోఁ దాగి మత్తెక్కి పడిపోయియున్న పేస్తనజీ నాకగపడియెను. తోడనే నేనాతని నొకబండిపై నెక్కించి పంపివైచి తిరిగిచూడకుండ ముందఱికిఁ బోయి కొంతసేపటి కామెనివాసమును జేరితిని. అప్పటికామె చచ్చుటకు సిద్ధముగానుండియు నన్నుఁ జూచి ద్వారమును మూయుమని సంజ్ఞచేసెను. నేనట్లు చేసితిని. పిమ్మట నామె నన్నుఁ దనసమీపమునకు వచ్చికూర్చుండు మనియెను. కాని నేనట్లు చేయఁజాలక సంశయించుచుండుటచే నామె విషణ్ణహాసము చేయుచు నస్పష్టస్వరముతో "పూర్వము నేనింతటిహీనస్థితియందున్నదానను గాను—కూరుచుండుము" అనియెను. నిజముగా నప్పటియామెయవస్థ కడువిచారకరముగనే యుండెను. ఆమె యొకగొంగళిపైఁ బడియుండెను. ఆయింటఁ బగిలిపోయిన పెట్టెమాత్రమున్నది. ఒకమూల కిరాసెన్ నూనెదీపము మినుకు మినుకు మని వెలుఁగుచుండెను నేనును గూర్చుంటిని. అప్పటి మాయిరువురి సంభాషణము వలనను దెలిసిన కొన్నిసంగతులను సంక్షేపముగఁ జెప్పెదను. హారమసజీ యామెభర్త. ఆమెకుఁ బండ్రెండేండ్లవయసుకలయప్పుడే యీయిరువురకును బరిచయమయ్యెను. ఆయిరువురకును బరస్పరానురాగము కుదిరెను. కాని యామెతల్లి నడవడి మంచిదికాకపోవుటచే హారమసజీ యాయువతిని బెండ్లియాడుట కించుక సంకోచించుచుండెను. కాని యాకాంతనిర్బంధముచే హారమసజీ యామెను రహస్యముగఁ బెండ్లియాడెను. అప్పటికి హారమసజీ భాగ్యవంతుఁడు కాఁడు. మంచిస్థితి కలిగినచో నీవివాహము వెల్లడింతు నని హారమసజీ యామెకుఁ జెప్పియుండెను. తరువాత నాతఁడు ధనసంపాదనమునకై బొంబాయికి వచ్చియుండెను. ఆమె సూరతునందే యుండెను. కొంతకాలమున కామె కొకకొమారైకలిగెను. ఆసమాచారము విని హారమసజీ మరింత భయపడియెను. కాని యామెను జూచుటకు వచ్చియుండలేదు. ఇంతలో నామెకు

విధివశమున నొకపురుషునితోఁ బరిచయముకలిగెను. తోడనే యామె తనబిడ్డతోఁగూడ గృహత్యాగముచేసిపోయెను. ఆమె యిఁక నెన్నఁడును హారమసజీ కెట్టియుత్తరమును వ్రాయలేదు. ఆమె యట్లే నానాదేశములు తిరిగితిరిగి బొంబాయికివచ్చి యిచ్చటనొకస్త్రీయొద్దఁ దనబిడ్డనుంచి మఱియొకపురుషునివెంటఁబడి కలకత్తాకుఁబోయెను.

కాశీ—ఆమె యప్పుడు తనబిడ్డ నెవ్వరియొద్దనుంచెనో యాస్త్రీ పేరు చెప్పినదా?

రస్త—తుట్టతుద కామె యొకకాగితమును నాచేతికిచ్చి "ఇందు నాకొమార్తెనొప్పగించినయామె పేరును నివాసమును లిఖియింపఁబడి యున్నవి. కాని యిప్పుడు నేనన్వేషింపఁగా నామె యాస్థానమునందు లేదు. ఎంతప్రయత్నించినను నీపట్టణమున నేనామెను గనుపెట్టఁజాలకపోయితిని. హా దైవమా! నాబిడ్డకును నాకుఁగలిగినయవస్థయే కలిగినదేమో! ఓదయామయా! దయయుంచి నీవెట్లయిన నాతనయను వెదకి కనుంగొనవలయును. అట్లు చేసెద నని శపథము చేయవలయును. అదృష్టవశమున నాబిడ్డ నీకు దొరకినచో నుదారహృదయుఁడవగు నీవామె కాశ్రయమొసంగవలయును" అని యనేకవిధములఁ బ్రార్థించినది.

కాశీ—ఆకాగిత మెచ్చటనున్నది?

రస్తమజీ లేచి యొకడ్రాయరునుండి యాకాగితమును వెదకితీసి యాతని కిచ్చెను. కాశీనాథుఁడు దానిని జదివెను. అందిట్లున్నది.

"పార్వతీశాయి—డర్ కాన్ రోడ్డు నె 7 రు; నాకుమార్తె పేరు-వేలాబాయి"

కాశీనాథుఁడా కాగితమును ద్రిప్పిత్రిప్పి పరిశీలించుచు "కొమార్తెనుగూర్చి యామె యింకను నేమైనఁ జెప్పినదా?" అని యడిగెను.

రస్త—నీకొమార్తె యని తెలిసికొనుటకుపాయమేమున్నదని నేనే యడిగితిని. అందుపై నామె "నాకొమార్తె మిగులఁ జక్కనిది—అంతటిసుందరీమణు లరుదుగానుందురు. మఱియు నామె నానవాలుపట్టుటకొకయుపాయముకూడ నున్నది. మహాశయా! నేను రాక్షసిని—నారీరూపపిశాచిని! ఒకనాఁడు నేను దురాత్మురాలనై కోపముతో మండుచున్నకొఱవిఁ గైకొని యాముద్దుబిడ్డవెన్నుపైఁ గాల్చితిని. ఆకాలినమచ్చ యిప్పటికినిగూడ నుండును" అని చెప్పినది.

కాశీ—రస్తమజీ? చూచితివా! మానవజాతి యెంతటిఘాతుకకృత్యములనైనను జేయఁగలదు!

రస్త—ఆపాపమున కామెకుఁ దగినప్రాయశ్చిత్తమే యైనది. అప్పటి యామెదుర్దశను నేను కన్నులారఁ గాంచితినిగాదా! కుక్కకైనను, నక్కకైననుగూడఁ గలుగనిదురవస్థలో నామె మరణించినది.

కాశీనాథుఁడు నిట్టూర్పు విడిచి "పాపమునకుఁ బ్రతిఫల మీయిహలోకమునందే యున్నది" అనియెను.

అప్పు డనేకభావములచే నాయిరువురిహృదయములును నిండిపోయెను. అందుచేఁ జాలసేపటివఱకు నుభయులును మౌనముతో నట్లే కూర్చుండి యుండిరి.

అయిదవప్రకరణము.

ఇది సత్యమేనా?

కాశీ—ఆమె పేస్తనజీనిగూర్చి యేమైనఁ జెప్పినదా?

రస్త—కట్టకడపట నామె యాతనియొద్దనే యున్నది. అందుచేతనే యాతనికావివాహవృత్తాంతము తెలిసినది. పేస్తనజీ తనసర్వ

స్యమును బోఁగొట్టుకొని హారమసజీయొద్దధనసంపాదనము చేయుటకై బొంబాయివచ్చెను. ఆతని వెదకికొనుచుఁ గొన్నాళ్లకామెయును వచ్చెను. కాని పేస్తనజీ యామె కగపడియు నొకపైసయైన నాకు కీయకుండఁ దప్పించుకొనిపోయెను. అందువేనామె కాసునకు గతిలేక పేస్తనజీతంత్రమంతయునొక్కసారిగ హారమసజీకిఁ దెలియపఱుపవలెయునని తలంచెను. కాని సాహసించి చెప్పఁజాలకపోయెను. అంతలో నామెకు జబ్బు చేసెను. ఆమె యెట్లో నాసంగతి తెలిసికొనియెను. నేను కమలను బెండ్లియాడఁగోరియుంటినని కూడ నామె తెలిసికొనియెను. ఇఁక జీవించుట దుర్లభమని తెలిసికొని యామె యొకస్త్రీమూలమున నా కాసమాచారమును బంపించెను. తరువాతసంగతి మీకుఁ దెలిసినదే.

కాశీ—పేస్తనజీ కిచ్చుట బర్జరజీకిఁ గలిగినపరిచయమునుగూర్చియు, సంభాషణమునుగూర్చియు నేమైనఁ జెప్పినదా?

రస్తు—ఆమె చెప్పలేదు. వారేమేమిమాటాడుకొనుచుండిరో తెలియదుగాని వారిపరిచయమునుగూర్చి నాకుఁ దెలియును. వారు తఱచుగ హారమసజీయింటికి వచ్చుచుందురట నేనెఱుంగుదును.

కాశీ—ఆయిరువురకును స్నేహమున్నదా?

రస్తు—లేదు. బర్జరజీపరోక్షమునందు, పేస్తనజీ యాతని నిందించుటకూడఁగలదు.

కాశీ—పేస్తనజీ యప్పుడప్పుడు త్రాగుచుండును గాదా?

రస్తు—ఆ—తఱచుగా—

కాశీ—బర్జరజీ యెందుకొఱకు బొంబాయి వచ్చెనో నీకుఁ దెలియునా?

రస్తు—నాకెట్లు తెలియును?

కాశీ—నాకుఁ దెలియును. అతనియన్నకును రాజాబాయికిని జిన్నతనమున గుప్తప్రణయసంబంధ మున్నది.

రస్తు—(అదరిపడి) కేవల మసత్యము!! ఆమెవంటియుత్తమురాలీబొంబాయినగరముననే లేదు!

కాశీ—అవును. పెండ్లియైనతరువాతనామె యట్లే యున్నది. ఇప్పు డామెవంటిపతివ్రతలు స్వల్పసంఖ్యలో నుందురు.

రస్తు—నేనామెను బాగుగ నెఱుఁగుదును.

కాశీ—చిన్నతనమునఁ బొరపాటు పడువా రెందఱో యున్నారు. ఏమైన నేమి? అంతమాత్రమున నిప్పు డామె కులట యని యెవ్వరనఁగలరు?

రస్తు—మీరు నాపితృసఖులుగావున సహించితిని గాని మఱి యొకరెవ్వరైన నిట్లన్నచోఁ దత్క్షణము వారికిఁ దగినశాస్తి చేసియుందును.

కాశీ—సత్యము చెప్పుటకూడ నీకుఁ గష్టముగా నున్నచోఁ బోనిమ్ము! ఇఁక జెప్పను. కాని యంతయును నీవు వినఁదగిన విషయము! సరే! నేను పోయెదను!

రస్తు—కోపపడవలదు. మీరు చెప్పినమాటయందుమాత్రము నాకు నమ్మకము కలుగుటలేదు.

కాశీ—నీవు నమ్మినను సరే—నమ్మకున్నను సరే. నిన్ను విడుదల చేయించుటకై నేను చేసినప్రయత్నమునం దిట్టిరహస్యము లనేకములు నాకుఁ దెలిసినవి. మాంచరజీని వెంటఁబెట్టుకొని బర్జరజీ బొంబాయి వచ్చుటకుఁ గారణము, పూర్వరహస్యమును బయటఁ బెట్టెదనని రామాబాయిని బెదరించి యామెయొద్ద ధనము లాగుటకే—అట్లే యాతఁ డామెయొద్దఁ జాలవఱకు డబ్బు లాగినాఁడు—ఇంకను లాగుచున్నాఁడు. ఈవిషయమునం దింకను ననేకనిగూఢ రహస్యవిషయము

లున్నవి. వారిరువురు నామెయొద్ద ననేకామూల్యభూషణములఁ గైకొని గణేశమల్లునియొద్దఁ దాకట్టుపెట్టియున్నారు. అచ్చటఁ దీసికొన్న సొమ్మునే హారమసజీబ్యాంకిలో జమకట్టించినారు. ఈముసలితనమునందు నాతలలోనించుకబుద్ధి యున్నదని నమ్మకమేయున్నచో నప్పుడా పెట్టెలోనున్న లక్షరూపాయల నపహరించినవారుకూడ వారే యైయుందు రని నేను చెప్పఁగలను.

రస్తుమజీ యాశ్చర్యావిష్టహృదయముతో "ఏమనుచున్నారు!" అనియెను.

కాశీ—అట్లే జరిగి యుండును. రాజాబాయినగ లన్నియు నైపోవుటచే నిప్పుడు వారు హారమసజీని వలలోవైచుటకుఁ బ్రయత్నించుచున్నారు.

రస్తు—ఆదురాత్ము లింకను నెట్టిఘోరకృత్యములు చేయుదురో!

కాశీ—కమలాబాయినిగూడఁ బెండ్లియాడవలయునని ప్రయత్నము! కావుననే యతిత్వరితముగఁ బ్రయత్నించి వారి నపరాధులనుగా నిరూపించి వారికిఁ దగినశిక్ష చేయింపవలయును.

అని చెప్పి మెల్లమెల్లగా నావృద్ధుఁడు వెడలిపోయెను. రస్తుమజీ హతాశుఁడై తల తిరిగిపోవుచుండఁ గుర్చీపైఁ గూలఁబడి యుండెను.

ఆఱవప్రకరణము.

అయ్యో! పిశాచీ! నీవేనా?

మఱి రెండుదినములు గడచెను. రాత్రి రెండుజాములవేళ రస్తుమజీ తనశయనమందిరమున నిద్రించుచుండగా వెలుపలనుండి యెవ్వరో తలుపు గొట్టుచున్నట్టు వినవయ్యెను. రస్తుమజీ యదరిపడి మేల్కాంచి నిద్రామందస్వరముతో "ఎవరువారు!" అనియెను.

వెలుపలనుండి "నేను కాశీనాథుఁడను. తలుపుతీయుము!" అను మాటలు వినవచ్చెను.

రస్తుమజీ తత్తరముతో లేచి తలుపు తీయుచుఁ దీయుచు "ఇంతరాత్రివేళ వచ్చితి రేమి?" అనియెను.

కాశీనాథుఁడు గదిలో నడుగువెట్టుచు "పనియున్నది. శీఘ్రముగ దుస్తులను దొడిగికొనుము! ఒకచోటికిఁ బోవలయును!" అనియెను.

రస్తు—ఏమిది! ఇంతరాత్రివేళనే? ఏమిపని? ఎక్కడకుఁ బోవలయును?

కాశీనాథుఁడు విసుఁగుతో "నేను చెప్పినట్లు చేయుము! త్రోవలో నంతయును జెప్పెదను. ఇఁక నొకనిమిషమైనను వ్యర్థము చేయఁగూడదు" అనియెను.

రస్తుమజీ యతిత్వరితముగ దుస్తులను దొడిగికొనియెను. కాశీనాథుఁ డాతనిచేయి పట్టుకొని యతివేగముగ వెలుపలికిఁ దీసికొనివచ్చి యొకబండిపై నెక్కించెను. ఇరువురు నెక్కినతోడనే బండి శరవేగమునఁ బరుగెత్తిపోయి నిర్దిష్టస్థానమున నిలిచెను. తోడనే యాయిరువురును బండినుండి క్రిందికి దిగిరి. అప్పుడు కాశీనాథుఁడు బండివానికద్దె నిచ్చి "ఓరీ! మే మొకయరగంటలోఁ దిరిగివచ్చెదము. అంతవఱకు నిట నాఁగి యుండుము. ఈలోపున మేము రాకున్నచో నీవు పోవచ్చును" అనియెను.

అద్దె యధికముగ నిచ్చినందులకు బండివాఁడు సలాములు చేసి యట్లే యుండెద నని చెప్పెను. పిమ్మట నాయిరువురును బయలుదేఱిపోయి యొకసంకీర్ణమార్గమునఁ బ్రవేశించిరి. చలిగాలి రివ్వునవిసరుచుండెను. ఇంతకుముందే వర్షముకురిసినది. బాడిచేఁ ద్రోవ యేమియు బాగుగ లేదు. ఆకాశమింకను నిర్మలముగాలేదు. అందందు మబ్బుగ్రమ్మియుండెను. విశ్వమంతయు నంధకారబంధురమై యుండెను

అప్పుడప్పుడు విద్యుద్దీప్తిచే నయ్యంధకారవిశాలవక్షము విదీర్ణమైపోవుచుండెను. అట్టిసమయమున నయ్యిరువురు నతికష్టముతోఁ గర్దమకలితంబగు నామార్గమును బట్టి పోవుచుండిరి.

అట్లు కొంతదూరము నడచినతరువాత రస్తుమజీ "ఈప్రదేశము నేనెఱిఁగినదియే, ఈయుద్యానమందిరమున మాంచరజీ యుండును" అనియెను.

కాశీనాథుఁ డేమియు మాటాడక నడచుచు నాయుద్యానమందిరద్వారమునొద్దకుఁ బోయి చూచెను. అచ్చట నొకబండి యాఁగియుండెను. అదియు నద్దెబండియే. బండివాఁడు చలిచే వడఁకుచు బండిలోఁ నర్ధశాయియై పడియుండెను. మెఱపువెలుఁగునఁజూచి బండివాఁడప్పుడు నిద్రించుచున్నట్లు కాశీనాథుఁడు తెలిసికొనియెను.

ఇరువురును బండియొద్దకుఁ బోయిరి! బండివాఁ డెంతవఱకు నిద్రించుచుండెనో తెలిసికొనవలయు నని కాశీనాథుఁడు "ఈతోఁటలో నీచలిలో నీకెట్లు నిద్రపట్టుచున్నది?" అనియెను.

అంతమాత్రముననే బండివాఁ డదరిపడి లేచి యెదుటనున్నయపరిచితులగు నిరువురం గాంచి భయముచే జేబులు తడవికొనియెను ఆతనిసొమ్మేమియును బోలేదు. అతఁడు విసుఁగుకొనుచు "మీకీబండి యద్దెకు రాదు. మామనుష్యు లున్నారు" అనియెను.

కాశీ—ఆసంగతి నేనెఱుఁగుదును. నిన్నొకమాటయడిగెదను నీబండిలో నెక్కివచ్చినయామె మధ్యవయస్కయగుయువతి కాదా? నిజము చెప్పినచో నీకైదురూపాయలు బహుమతిగ నిచ్చెదను.

బహుమతిమాటవినుటచే బండివానికి మఱియును భయమయ్యెను, వాఁ డిరువురును దొంగలై యుందు రని యాతఁడు నిశ్చయిం

చుకొని "ఎందులకీగందరగోళము! ఈబండి మీకద్దెకు రాదు. పొండు పోకున్నచోఁ గేకలు వైచి యందఱను బిలిచెదను" అనియదలించెను.

అప్పుడు కాశీనాథుఁడు రస్తుమజీచేయిపట్టుకొని దూరముగఁ దీసికొనిపోయి "వీఁడు మూర్ఖుఁడు! కేకలు వైవఁగలఁడు. మనమిప్పుడు ద్వారమున లోపలఁ బ్రవేశింపఁజాలము. మఱియొకయుపాయ మాలోచింపవలయును" అని చెప్పెను.

ఆయుద్యాన మంతయు నెల్లయెడల గొప్పగొప్పవృక్షములచే నంధకారబంధురమై భయంకరరాక్షసునిఁ బోలి యుండెను. నట్టునడుమ రెండంతస్తులుగల ప్రాఁతమేడయొకటియుండెను. ఆమందిరమున రెండవయంతస్తునందలిగది కిటికీనుండి వెలుతురు ప్రసరించుచుండుటచే నం దెవ్వరో యున్నట్లు ద్యోతకమగుచుండెను.

కాశీ—రస్తుమ్! ఈయింటిసంగతి నీకు బాగుగఁ దెలియును గదా! ఆవెలుతురు వచ్చుచున్నగదిలో నెవ్వరుందురో చెప్పుము!

రస్తు—అది మాంచరజీ శయనమందిరము.

కాశీ—ఆలాగా? క్రిందియంతస్తు గదులలో నెవ్వరుందురు?

రస్తు—వాని వంటకును, భోజనమునకును, స్నానమునకునుపయోగించు చుందురు.

కాశీ—అం దెవ్వరైనఁ బరిచారకులుందురేమో?

రస్తు—ఆతనికిఁ బరిచారకులు విస్తారముగ లేరు. ఒకరిద్దరు మాత్రమే పనిచేసి పోవుచుందురు.

కాశీ—అట్లయినచో మనకనుకూలముగనే యున్నది. మనము లోపల రహస్యముగఁ బ్రవేశించి యీరాత్రి మాంచరజీ చర్యలను గూఢముగాఁ బరీక్షింపవచ్చును.

రస్తు—మన మిట్టినింద్యమగుకార్యము చేయవచ్చునా?

కాశీ—సంశయ మేల? ఎంతవెఱ్ఱివాఁడవు! నీవేమరు

చున్నావు? మన మీమధురమోహనరజనీసమయమునఁ మధురపరిమళవాయుసేవనమునకై వచ్చితిమనుకొంటివా? ఒకటిరెండునీచపుఁబనులుకూడఁ జేయవలసియే యున్నది!

రస్తు—కాని యెవ్వరైన మనలను జూచుట తటస్థించినచో నేమగును?

కాశీ—చూడవచ్చును—నష్టమేమి? మాంచరజీ నీమిత్రుఁడే కాదా? ఆతనిజూడవచ్చితి మనుకొందురు!

ఇరువురును ద్వారమునొద్దకు వచ్చిరి. ద్వారము లోపలగొళ్ళెము వేయఁబడియుండెను. గవాక్షములుకూడ నట్లే బంధింపఁబడియుండెను. ఆసమయమున మరల వర్షారంభ మయ్యెను. కాశీనాథుఁడు విసుగుతో రస్తుమజీని వెంటబెట్టుకొని యీవలకు వచ్చెను; వెలుతురు ప్రసరించుచున్నగవాక్షమువంకఁ జూడఁగా నప్పుడప్పు డొకరిద్దఱి మనుష్యులఛాయలుగూడఁ గానవచ్చుచుండెను. దానినిబట్టి మాంచరజీ మేల్కొనియే యున్నట్లు పొడకట్టెను. అప్పుడు కాశీనాథునియానందమునకు మేర లేదు. ఆతఁడు తనలో "గదిలోనేమి జరుగుచున్నదో చూడఁగలిగినచో రహస్యము బయల్పడగలదు. కాని చాల నెత్తుగనున్నది. ఉపాయ మేమున్నది?" అని యనుకొనుచుఁ గాశీనాథుఁ డుద్యానమునఁ దిరుగ నారంభించెను. రస్తుమజీ యప్పటియాతనిచర్య యంతయు నూరకచూచుచుండెను. కాశీనాథుఁ డప్పుడు తనసొంతయింటఁ దిరుగుచున్నట్లే యుండెను గాని పరగృహమునం దున్నట్లెంతమాత్రము నగపడుట లేదు! ఒకవంకఁ బ్రబలవాయువులతో వర్షారంభమై కన్నులం గప్పివైచుచున్నను గాశీనాథుఁడు లక్ష్యముచేయక నలుదెసల సంచరించుచుండెను. వ్యాకులహృదయముతో రస్తుమజీయు నాతని ననుసరించుచుండెను. అప్పుడు కాశీనాథుఁడు "ఎట్లయిన నీగవాక్షమున కెక్కవలయును. ఎక్కితీరవలయును." అనియెను.

ఆకస్మికముగ రస్తుమజీకొకసంగతి జ్ఞప్తికి వచ్చుటయు నాతఁడు "మహాశయా! ఈయుద్యానమునందొక్కచో నిచ్చెనయొకటి పడియున్నది" అనియెను.

కాశీ—ఏమిది! ఇంతవఱకు నీసంగతి చెప్పలేదేమి? ఎక్కడనున్నది?

రస్తు—ఈతోఁటకుత్తరమునం దొకపొదలో నున్నది.

ఇరువురు నచ్చటకుఁబోయి యానిచ్చెనను దెచ్చి యాగవాక్షమునొద్ద గోడకు వైచిరి. కాని యానిచ్చెన గవాక్షమునకు నాలుగు మూరలు క్రిందుగా నుండెను, అప్పుడు రస్తుమజీ "లాభము లేదు. నిచ్చెన చిన్నదైపోయినది." అనియెను.

"లాభము లేకేమి? ఉన్నది" అని చెప్పుచుఁ గాశీనాథుఁ డానిచ్చెనను దనభుజముపైఁ బెట్టుకొని "ఈసారి సరిపోయినదా? ఎక్కుము!" అనియెను.

రస్తుమజీ మాఱుమాటాడకుండ నెక్క దొడంగెను. ఆతనికిని నుత్సాహముగనే యుండెను. కాని యాతఁడట్లు పైకెక్కి గవాక్షమునుండి లోనికిఁదొంగిచూచినతోడనే యాతనిమతి చెదరిపోయెను—నాళములనుండి యుష్ణరక్తము ప్రబలవేగముతోఁ బ్రవహింపఁజొచ్చెను.—గుండెలు దడదడఁ గొట్టుకొనఁ దొడంగెను. అప్పు డాతఁడు మందగద్గదస్వరముతో "అయ్యో! పిశాచీ! నీవేనా?" అనియెను. ఆకంఠస్వర మప్పుడు వర్షాపాతనిస్వనమున విలీనమైపోయెను. తోడనే యాతఁడు కంపించుచుఁ గంపించుచు వృక్షవిచ్యుతశాఖంబోలి క్రిందఁ బడిపోయెను.

కాశీనాథుఁడు తత్తరముతో నిచ్చెనను గ్రిందికి దించివైచి యతిత్వరితముగ రస్తుమజీని లేవఁదీసి చేయిపట్టుకొని "ఏమి? ఏమిజరిగినది? ఏమి చూచితివి? దెబ్బతగులలేదుగద!" అనియెను.

రస్తమజీ లేచి నిలువఁబడియెను ఆతఁ డత్యున్నతస్థానమునుండియే పడియుండెను. కాని యాతని కెట్టియాఘాతమును గలుగలేదు. ఆదెబ్బ కాతఁడు భ్రూక్షేపమైనను జేయలేదు. మనస్సు దుర్భరశోచనీయావస్థయందున్నప్పుడు శారీరకబాధ నెవ్వఁడు లక్ష్యము చేయును? అప్పుడు రస్తమజీ భగ్నకంఠస్వరముతో "మహాశయా! ఏమిచూచితినా? దేనిని గలనైన భావింపఁజాలనైతినో యట్టిదానినే చూచితిని— కమలాబాయిని జూచితిని! తెలిసినది—కమలాబాయి—పిశాచిమాంచరజీశయనమందిరమున—ఈరాత్రివేళ—విలాసవంతుఁడగు మాంచరజీతో—" అని యిఁకఁ జెప్పఁజాలకపోయెను. ఆతనికంఠము రుద్ధమైపోయెను.

ఏడవ ప్రకరణము

సత్యమా? స్వప్నమా?

కాశీనాథునిమనసు చెదరిపోయెను. ఆతఁడు తనలో "అట్లయినచో నేనే పొరపాటు పడితినా? రాజాబాయి యనియే నేను నమ్మియుంటిని. కమల యిప్పు డిచ్చట నెందులకున్నది?" అని యనుకొనుచుఁ బ్రకాశముగా "రస్తమజీ! నీవు పొరఁబడితివి!" అనియెను.

రస్త—లేదు. మహాశయా! లేదు. అనేకవిషయములయందు నేను పొరపాటుపడినను బడవచ్చును గాని యితరులనుజూచి కమలాబాయి యనుకొనునంతటిపొరపాటు నాకెన్నఁడును గలుగదు. మీరొకప్పుడు కమల నెంతయో ప్రశంసించితిరి. ఇప్పుడేమందురు? రాక్షసియేనా? అయ్యో! ఒకనిమిషముక్రిందటివఱకు నేనీకమలను సరళహృదయ యనియుఁ బవిత్రచరిత్రయనియు స్వర్గమునందలి దేవీమూర్తికంటెను నధికురాలనియు నమ్మియుంటిని—ఆమెయే యింతపని చేసినది—ఆమెయే మద్యపానలంపటుఁ డగు నొకనీచున కుపభోగ్యయైనది! ఓ కామినులారా! మిమ్ములను విశ్వసించువారు కేవలమును మూఢులు! పిశాచము లనిన మీరే! ఈజగంబున మీకసాధ్యకార్యమేదియును లేదు—అయ్యో! నేనొకరక్కసిని నమ్మి యాకసమున మేడలు కట్టితిని—ఒక్కపూత్కారముతో నవి యిప్పుడు కూలిపోయినవి—మాంచరజీ! నిన్ను నేనంతరంగమిత్రునిగా విశ్వసించితిని. అట్టినీవిప్పుడు కమలాజారుఁడవైతివి—ఇప్పుడు నీవును గమలయును గలసి నాగుడ్డినమ్మకమును గూర్చియు, దురదృష్టమునుగూర్చియు నవ్వుకొనుచున్నారా? అయ్యో! నేనెంతబుద్ధిహీనుఁడను! ఈజగంబునం దెవ్వరిని విశ్వసింపరాదు. ఆవిశ్వాసహాలాహలము విశ్వమంతటను వ్యాపించి యున్నది—ఓ దురాత్ములారా! నేనింతవరకు సహించి యుంటిని. ఇఁక సహింపఁజాలను! ఈక్రింద దీనునివలె నిలువఁబడి యదృష్టమును నిందించుకొనుచుండుట చేతగానివానిపని! ఇప్పుడే మీయిరువురను శాపఫల మనుభవింపఁజేసెదను.

అని పలుకుచు రస్తమజీ యున్మత్తునింబోలి గృహద్వారమునొద్దకుఁ బరుగెత్తుచుండెను. కాశీనాథుఁ డాతనిచేయి పట్టుకొని "నీవిప్పు డేమిచేయఁ దలఁచితివి?" అనియెను.

రస్తమజీ దృఢస్వరముతో "ఈపాపాత్ములరక్తదర్శనము చేసెదను. ఈద్వారమును బగులఁగొట్టి లోపలఁ బ్రవేశించెదను. నిందగలుగునని గాని యల్లరియగునని గాని నాకెంతమాత్రమును భయము లేదు. చేతగానివానివలెఁ జాటుగఁ బనిచేయుట నాకిష్టము లేదు. కళంకమును దుడిచివైచుటకై చేయఁదగినపని బహిరంగముగనే చేసెదను" అనియెను.

కాశీ—నీవనుకొన్నట్లు పని చేయఁజాలవు.

రస్తు—నన్నడ్డగించువారెవ్వరు?

కాశీ—నేను!

రస్తు—మీరా? కలనైన నట్లు తలంపవలదు. ఇప్పుడు నన్నెవ్వరును నిర్బంధింపఁ జాలరు. నేనిప్పుడే పోయి యారక్షకులయెదుటఁ బడియెదను. తమకృతఘ్నతకొఱకు వారెంతవఱకు సిగ్గుపడియెదరో చూచెదఁగాక! తరువాత నయ్యిరువుర నొక్కవేటున యమాలయమునకుఁ బంపి నాదుస్సహజీవితమున కవసానముగ నాత్మహత్య చేసికొందును. మీరు నన్నడ్డగింపఁ జాలరు!

అని యాతఁడు బలవంతముగఁ దనచేతిని వదలించుకొనఁబోయెను. కాశీనాథునిముష్టిబంధము వజ్రకఠినమైనది గాని యట్లుగాకున్నచో రస్తుమజీ యీపాటికిఁ జెప్పినంతపనియును జేసియే యుండును.

కాశీ—వత్సా, నీవిట్లు చేసినచోఁ గార్యము చెడిపోవును. ఉన్న యొక్కింతయును లేకుండఁబోవును.

రస్తు—మీరిఁక నాకాశను గల్పింపవలదు. నాయాశాలత భగ్నమై పోయినది.

కాశీ—ఇప్పుడు నీవు తొందరపడినచో మాంచరజీ తప్పించుకొని పాఱిపోవును. అందుచే నపరాధులను బట్టుకొనునవకాశము లేకుండఁబోవును. ఆకారణమున నీయపకీర్తి జగంబునఁ గలకాలమును నిలిచిపోవును.

రస్తు—ఇఁక నాకు భయము లేదు.

కాశీ—నీకు లేకున్నను నాకున్నది. నీవు నిరపరాధి వని నిరూపించుటకు నేను ప్రతిజ్ఞ చేసితిని. ఈసంగతి నీవు నెఱుంగుదువు. కమలయే యనుమాటయేమి! తరుణసుందరమూర్తివగు నీకుఁ గావలసినచో నెందఱో సుందరీమణు లున్నారు. కాని యిప్పటి నీకళంకమును దొలఁగించుట కింతకంటె నుపాయము లేదు.

మనస్సు వికలావస్థయందున్నప్పుడు బహిఃప్రపంచముపై లక్ష్య ముండదు. అప్పుడాయిరువురి పాదములును గర్దమనిమగ్నములై యుండెను. ధారాపాతవర్షము వారియుత్తమాంగముల ముంచివైచుచుండెను. ఝంఝామారుతము వర్షావేగముతోఁ గలసి బ్రహ్మాండమును గంపింపఁజేయుచుండెను. అప్పు డాయిరువురు నాభీకరావస్థను లక్ష్యము చేయుటయే లేదు. అప్పుడు రస్తుమజీ దృఢసంకల్పముతో “అయ్యా! నేను మీమాట వినఁజాలను. నాయవమానమునకు నేనే ప్రతీకారము చేసికొందును. ఇందు మీసాహాయ్యము నాకక్కఱ లేదు.” అనియెను.

కాశీ—మంచిది బాబూ! నాసాయము నీకక్కఱ లేదు. కాని నామాట యొక్కటి వినవలయును. నీవే స్వయముగ నీపగ తీర్చుకొనుము. కాని బాలకునివలెఁ బనిచేయకుము! పురుషునివలెఁ జేయుము! నీవు కేవలమును బసివాఁడవు. బాలుని కున్నంతజ్ఞానమైనను నీకు లేదు. నీవిప్పుడీమందిరమునఁ బ్రవేశించి యేమి చేయఁగలవు? నీవే యాలోచించుకొనుము! నీయొద్ద నాయుధమేదైన నున్నదా? నీవు బలవంతముగ లోనికిఁ బోయినచో మాంచరజీ నిన్నడ్డగించును. అప్పుడు మీయిరువురకును బోట్లాట జరుగును. ఆసందడిలో గమల తప్పించుకొని బండిపై నెక్కి హాయిగాఁ దనయింటికిఁ బరుగెత్తుకొనిపోవును. ఇఁక మీరిరువురును మాత్రము మాగదిలోఁ గొట్టుకొనుచుందురు. ఎవ్వరిది పైచేయి యగునో తుదకేమగునో యెవ్వరు నిశ్చయింపఁగలరు?

కాశీనాథునిమాటలచే రస్తుమజీ కించుకఁ దెలివి కలిగి యాతనిశరీరావస్థయును స్మృతికి వచ్చెను. ఈనడుమఁ గలిగినకష్టములచే నాతని మనశ్శరీరములు కడుదుర్బలములై యుండెను.

కాశీ—రస్తుమ్! ఒకవేళ నాయుధములున్నను లాభము లేదు. కొలఁదిదినములలో నురిశిక్ష కానున్న యాతనిని జంపఁబూని ప్రాణములమీఁదికిఁ దెచ్చుకొనుట యెందులకు?

రస్త—అట్లయినచో నిప్పుడు నన్నేమి చేయు మనియెదరు?

కాశీ—సమయము నిరీక్షించుచుండుము—ధైర్యము విచిత్రమైనవస్తువు—ధైర్యము కలవాఁడు యథాసమయమున నుపయుక్తఫలము ననుభవింపఁగలఁడు. సందేహము లేదు. నీవిప్పుడు కమలాబాయిని జూచితివి. ఆమె యిచ్చటి కెందులకు వచ్చినదో నీ కెంతమాత్రమును దెలియదు. ఆమెను జూచినమాత్రముననే నీవు కోపముచే మండిపోవుచున్నావు. యోచించుటకు నీకోర్పులేదు. అవివేచకుఁ డనుభవించుటకే పశ్చాత్తాపము సృష్టింపఁబడినది. ఏదియో మహోద్దేశముతోనే కమల యిచ్చటికి వచ్చియుండు నని నానమ్మకము. ఆసంగతి మనకిప్పుడు బోధపడుటలేదు.

స్రోతునీట మునిఁగిపోవుచున్నవాఁడు తృణమునుగూడ నవలంబనముగఁ జూచుకొనునట్లే కాశీనాథుని శీతలవచనములకు రస్తమజీ యించుక తేరుకొని యుత్సాహముం దెచ్చుకొని "ఈరహస్యమును దెలిసికొనుట కుపాయమేమున్నది?" అని యడిగెను.

కాశీ—ఇప్పుడు నేనుకూడ నొకసారి చూచెదను. కమలముఖలక్షణములను బట్టి యామె యిచ్చటి కేలవచ్చినదో నేను గ్రహింపఁగలను.

రస్త—మంచిది. మీరచ్చటఁ జూచినదియు, వినినదియు సత్యముగ నాతోఁ జెప్పెదనని శపథము చేయుఁడు!

కాశీ—అట్లే చేసెదను.

తత్క్షణమే రస్తమజీ యానిచ్చెనను దనభుజముపై నిలుపుకొని యామేడగోడకుఁ జేరవైచెను. తనకంతబలమున్న దని యిదివఱ కాతఁ డెఱుంగఁడు. అప్పుడు రస్తమజీ తొందరతో "ఎక్కుఁడు! శీఘ్రముగ నెక్కుఁడు!" అనియెను.

ఎనిమిదవ ప్రకరణము

రహస్యము మఱింతదృఢమయ్యెను.

కాశీనాథుఁడు పైకెక్కి గవాక్షమున కడ్డముగనున్న పట్టుతెర చాటునుండి చూచెను. రస్తమజీ పొరబడలేదు. ఆమె నిజముగాఁ గమలాబాయియే! గదిలో మాంచరజీకూడ నుండెను. ఒక విలాసపురుషునిగదిలో నిర్జననిశీథసమయమున నొకయువతి యొంటరిగావచ్చియుండుట నిజముగా ననుమానాస్పదమైనపనియే! నిందనీయమైనకార్యమే. కాని కమలాబాయి కళంకినియా? కాశీనాథున కేమియుఁ దోఁచుటలేదు. కమలాబాయి గదిలోనిలువఁబడియుండెను. ఆమెకోమలరూపకాంతులచే మందిరమంతయుఁ బ్రకాశమానమైయుండెను. ఆమె సరిగపనిచేసిన నల్లని సేలువను గప్పుకొనియుండెను. అప్పుడు కమల మాంచరజీనుద్దేశించి యుత్తేజితస్వరముతో నేమేమియో యనుచుండెను. కాని వర్షావేగముచేఁ గాశీనాథున కొక్కయక్షరమైనను వినఁబడుటలేదు. అప్పటియామెముఖమునందుమాత్రము కోపలక్షణము లగపడుచుండెను. మాంచరజీ పఱుపుపై నర్ధశాయియై యుండెను. ఆతఁడు విశేషముగ మాటలాడుటలేదు. ఒక్కొకసారి యాతఁడు క్రోధముతో బిగ్గరగా "నావలనఁ గాఁదగినదేదియు లేదు." అనుచుండెను.

కాశీనాథున కేమియును బోధపడుటలేదు. అప్పుడు కమల మరలఁ దీవ్రస్వరముతో నేమో యనుచుండెను. ఆమెకన్నులప్పుడు విద్యుత్కళికలవలె దీప్తిమంతములై యుండెను. మాటలు వినఁబడకుండుటచే ముఖలక్షణములవలననే సంగతులు తెలిసికొనవలసియుండెను. కాశీనాథుఁ డించుకవంగి మాంచరజీవంకఁ జూచెను. ఇప్పుడుమాంచరజీ యుదాసీనుఁడై యుండలేదు. ఆతఁడు కోపముతోఁ జేతులను పొంర

గమును ద్రిప్పుచుఁ బలుపుపైఁ గ్రుద్దుచుఁ గఠినస్వరముతో మాటాడుచుండెను.

ఆకస్మికముగఁ గమల మొగమున విలక్షణభావ మగపడియెను నల్లగలువలనుండి మంచుబిందువులవలె నామె కన్నులనుండి యశ్రుబిందువులు జాలువారుచుండెను. ఆమె యట్లేడ్చుచు మోకరించి కూరుచుండి యంజలివట్టి కరుణాస్వరముతో నెన్నియో మాటలు చెప్పుచుండెను. ఆమెసుందరవదన మశ్రుధారలచేఁ బ్లావితమైపోయెను.

మాంచరజీ తిరస్కారభావముతో నవ్వలికి మొగము త్రిప్పికొనియెను; ఆమెమాటలను మన్నించుటగాని యాలకించుటగాని లేదు; ఎట్టిప్రత్యుత్తరము నిచ్చుట లేదు. అప్పుడు కమలాబాయి హతాశయై లేచి మెల్లమెల్లగ గదివెలుపలకుఁ బోయి మరల నంతలో వచ్చి యాతని మొగమువంకఁ జూచి మరల వెడలిపోయెను. ఇట్లు కొన్నిసారులైన తరువాత నిఁక నామె వెడలిపోఁజాలక తుట్టతుద కేమి చెప్పెనో కాని మాంచరజీ తత్క్షణమే తత్తరముతో లేచి డ్రాయరులోనున్న కాగితములను బైకిఁ దీసి గదిలోనున్న యొకబల్లపైఁ బడవైచెను.

కాశీనాథునిముఖము ప్రసన్నమయ్యెను. అతఁడు తనలో "ఈవ్యాపారము బాగుగ బోధపడుట లేదు. నిశ్చయముగా నీకాగితములు ప్రేమలేఖలైయుండును. కమలబాయి వీనిని గరగతము చేసికొనుటకే యిచ్చటికి వచ్చి యుండునా?" అని యనుకొనెను.

కమలాబాయి యాకాగితములను గైకొని దీపపువెలుఁగునఁ జూచుచుండెను. అప్పటియామొగమున సంతోషలక్షణము లగపడుచుండెను. తరువాత నామె యేమనియో యాతని బ్రతిమాలుకొనియెను. మాంచరజీ తలయూచి యంగీకరించెను. తరువాత నాతఁడనేకవర్ణములుగల మఱికొన్నికాగితములను బైకిఁ దీసెనుఁ కమలయందు గొన్నికాగితములను దీసికొని తక్కినవానిని నసహ్యభావముతో బల్ల

పైఁ బాఱవైచి వెడలిపోవుట కుద్యమించుచు మరల నేమేమో మాటాడెను. మాంచరజీ దీపము చేతఁ బట్టుకొని యామె ననుసరించెను. ఆ గదియంతయు నంధకారమైపోయెను.

కాశీనాథుఁడు నిచ్చెననుండి దిగుచు "నేను గ్రుడ్డిమాపు మాచితిని. ఆకాగితములు మోహలేఖలు కావు. అవి నిశ్చయముగా తాకట్టుపద్దులకు రసీదులైయుండును." అని యనుకొనుచుఁ గ్రిందికి దిగి నిచ్చెనను మరల నొకపొదలోనుంచెను వారిరువురును సమీపమునందొక పువ్వుఁదీఁగచాటున నిలిచి చూచుచుండిరి. అచ్చటి కాయుద్యానద్వారము స్పష్టముగ నగపడుచుండెను.

ఇంతలో మందిరద్వారము తెఱవఁబడియెను; అంధకారమయోద్యానమున దీపకాంతులు ప్రసరించెను; ముందుగఁ గమలయుఁ దరువాత మాంచరజీయును వెలుపలకు వచ్చిరి. ఇరువురు నేవంకను జూడకుండఁ దిన్నగా నుపవనద్వారముకడకుఁ బోయిరి. తోడనే కమలాబాయి కంపితపదములతో బండిపై నెక్కెను. బండి యతిత్వరితముగఁ గదలిపోయెను. మాంచరజీ దీపహస్తుఁడై తలయూచుచు వెనుదిరిగి వచ్చి లోపలఁ బ్రవేశించి సశబ్దముగఁ దలుపు మూసికొనియెను.

అప్పుడు కాశీనాథుఁడును రుస్తమజీయును వెలుపలకు వచ్చిరి. రుస్తమజీ యాతనిం గాంచి "మహాశయా! మీశపథము ననుసరించి మీరుచూచినది చూచినట్లు వినినది వినినట్లు నాకుఁ దెలియఁజేయవలయును. నాకుఁ గష్టముగా నుండు నని సంశయింపవలదు. ఒక్కింతయైనను దాఁపవలదు'' అనియెను.

కాశీ—ఇప్పు డిచ్చట జరిగినసంగతినిబట్టి చూడఁగా నీవొకప్పుడు సర్వోత్కృష్టసౌభాగ్యవంతుఁడ వయ్యెదవని తోఁచుచున్నది. ఇప్పుడు సంశయించినందులకు నీవిప్పుడు మిగులఁ బశ్చాత్తాపపడియెదవు.

రుస్త—మీమాటలయర్థమేమో నాకు బోధపడుట లేదు.

కాశీ—ఇప్పుడు తెలిసికొనవలసినపనియును లేదు. మనకింకను జాలపనులున్నవి. మాంచరజీ లోపలికిఁ బోయి తలుపు మూసికొన్నాఁడు. మనమిఁక వచ్చినత్రోవనే పోవుదము.

రస్త—నిచ్చెన యక్కడనే పడియున్నది.

కాశీ—దానిమాట కేమి? మనయడుగులజాడలో? ఏమైనను మనకేమి భయము. ప్రొద్దుననే మాంచరజీ యంతయును జూచి యెవ్వరో దొంగలు దయచేసి యుందురని యనుకొనును.

తరువాత నిరువురును గోడదాటి వెడలిపోయిరి. పోవుచుండఁగా దూరమునం దొకశబ్దము వినఁబడుటయు వారు తిరిగి చూచిరి. ఒకవ్యక్తి యాయుద్యానద్వారమును దెఱచుకొని యతివేగముగ వెలుపలికిఁ బోవుచుండెను. ఆతఁడు మాంచరజీయే!

రస్త—ఈతనిహృదయము దురాలోచనలతో నిండి యున్నది. ఇంతరాత్రియైనను నిద్ర మానుకొని పోవుచున్నాఁడు!

కాశీ—మంచియాలోచనలచే మనకెట్లు నిద్రలేదో దురాలోచనలచే నాతనికి నట్లే నిద్రలేదు!

రస్త—ఇంతరాత్రివేళ నాతఁడెక్కడకుఁ బోవును?

కాశీ—ఆతఁడు హీనచరిత్రుఁడు. ఎక్కడకైనను పోవును. ఈప్రశ్నమునఁ బ్రయోజన మేమున్నది? పద!

వారిరువురును బయలుదేరిపోవుచుండిరి. వారిదివఱ కెక్కివచ్చిన బండి యింకను వారికొఱకు నిరీక్షించుచు యథాస్థానమునందే యుండెను. ఆయిరువురిబట్టలును బూర్ణముగఁ దడిసియుండుటయును విశేషించి రస్తమజీ దుస్తులు బురదచేనిండి యుండుటయును గాంచి వారు మంచియుద్దేశముతో బయలుదేరినవారు కారని బండివాఁడు శంకించెను. ఎట్లయినను కట్టింపుగ నద్దె యిచ్చెదరని యాశయున్నది. కాఁబట్టి వారిని దనబండిపై నెక్కించుకొని తీసికొనిపోయెను. బండిలో

నున్నంతసేపును రస్తమజీ కాశీనాథు నేమేమో ప్రశ్నించుచునే యుండెను. కాశీనాథుఁడు "ఔను—కాదు" అని సంక్షేపముగ నుత్తరమిచ్చుచుండుటచే నాతనికిఁ దృప్తికలుగక "ఈతఁడు నాపితృసఖుఁడే యైనను నాయెడల నింతటియధికారము చూపుట యుచితము కాదు. నేను పసివాఁడనా? ఈతఁడు నన్ను బాలునికంటె నధమముగఁ జూచుచున్నాఁడు" అని యనుకొనియెను.

ఇట్లే యాతనిహృదయమును, శరీరమునుగూడ దుస్స్థితియందే యుండెను. ధారాపాతవర్షమున బట్టబయట నిలిచియుండుట. రెండంతస్తులమేడనుండి బాడిలోఁ బడుట, దుస్తులన్నియును దడిసి బురదయై యుండుట దానిపైఁ గురుపుచు బండి యతివేగముగ నడచుచుండుట, ఆవేగముచేఁ జలిగాలి మఱింత రివ్వునఁ గొట్టుచుండుట—ఇవి యన్నియు నాతనికి దుస్సహములుగనే యుండెను.

కాశీనాథునకు రస్తమజీమాటలు వినకుండ నుండవలయునను నుద్దేశము లేదు. ఆతఁడిప్పుడాలోచనానిమగ్నుఁడై యుండెను. రహస్యములపైరహస్యములు తోఁచుచుండుటచే నాతనికద్భుతముగానుండెను. ఈనూతనరహస్యనాటకమునకు బర్జరజీ, మాంచరజీలు నాయకులును, గమలాబాయియు, రాజాబాయియు, నాయికలునుగా నుండిరి. ఆనలువురి చరిత్రములును వేర్వేఱ నిరూపించి తెలిసికొనుటలో నాతనిదివ్యాతమబుద్ధిశక్తియంతయు వినియోగపడుచుండెను. అందుచేతనే యాతఁడు రస్తమజీమాటలను వినఁజాలకపోయెను. ఆయాలోచనలలోనే యాతనికిఁ గునుకుపట్టెను.

క్రమముగా బండి రస్తమజీయింటియొద్దకు వచ్చెను. కాశీనాథుఁడు తనయంతఁ దానే మేల్కాంచెను. రస్తమజీబండి దిగునప్పటికి సమీపమునందున్న యింటియందలి గడియారము రెండుగంటలు కొట్టెను. అప్పుడు కాశీనాథుఁడు "చాలరాత్రియైనది నేనింకను భోజనము చేయలేదు" అనియెను.

రస్త—ఇంకను భోజనము చేయలేదా?

కాశీ—అందుకొఱకు నీవు తొందరపడవలదు నేను చెప్పిన మాట మనసుంచి వినుము! నాకింకను నెన్నియో పనులున్నవి. అయిదాఱుదినములవఱకును నీకు నేనగపడను. కాని నీవు నేను లేనప్పుడు మిగుల జాగ్రత్తగ నుండవలయును. ఊరక యిల్లువిడిచి యెక్కడకును బోవలదు.

రస్తమజీ ప్రత్యుత్తరము చెప్పఁబోవుచుండఁగనే కాశీనాథుఁడతిత్వరితముగ బండి తోలించుకొని వెడలిపోయెను. రస్తమజీమాట నాలుకతుదియందే నిలిచిపోయెను.

తొమ్మిదవ ప్రకరణము.

గుప్తసంవాదము.

బర్జరజీమాంచరజీలు తమయింటఁ గూర్చుండి సంభాషించుకొనుచుండిరి.

మాంచ—ఇప్పుడేమిచేయుదును. దినము గడచుట లేదు తప్పక సొమ్ము కావలసి యున్నది.

బర్జ—సరే. శీఘ్రముగనే దొరకును.

మాంచ—ఈమాటలవలన లాభము లేదు. నేను రాజాబాయియొద్దనుండి లాగినసొమ్ములోఁ జాలవఱకు నీవేతీసికొంటివి. నీవు నన్ను పకీరునిగాఁ జేయఁదలఁచితివా?

బర్జ—నీవిట్లు రేయుంబవలు నాతోజగడమాడుచు నీవు చెడిపోవుటయేకాక నాకొంపకూడ ముంచుచున్నావు.

మాంచ—నాకదియంతయును దెలియదు. హరేకజీసర్వస్వమునుగూడ నీవే పాడుచేసితివి. అది యున్నచో నాకింతదారిద్ర్యమేమి?

బర్జ—నీవుమాత్ర మాధనమును రెండుచేతులతోడను వెచ్చపెట్టలేదా?

మాంచ—ఆమాట నాకెందులకు? నాకిప్పుడు సొమ్మిచ్చి తీరవలయును. ఇచ్చెదనని చెప్పి నన్ను మఱపించుటవలన లాభము లేదు. స్పష్టముగాఁ జెప్పుము! లేకున్నచో సర్వమును రాజాబాయికిఁ జెప్పివైచెదను.

బర్జరజీ భయకంపితుఁడై యించుకధైర్యము తెచ్చుకొని "అట్లయినచో వినుము! హరమసజీద్రవ్య మంతయు మనదియే కాఁగలదు" అనియెను.

మాంచ—ఎట్లు? వివరించి చెప్పుము!

బర్జ—నేను త్వరలోనే కమలను బెండ్లియాడెదను.

మాంచరజీ పకపక నవ్వదొడంగెను. బర్జరజీ క్రోధభీకరుఁడయ్యెను నిమిషములో హృదయావేగము నడంచుకొని "ఇందు నవ్వుటకుఁ గారణ మేమున్నది? నేను కమలను బెండ్లియాడెదను. హరమసజీధనమంతయును నాదే యగును!" అనియెను.

మాంచ—ఇఁక నేనో? సేవకుఁడనై నీగుఱ్ఱములకు గడ్డిని సంగ్రహింపవలయును గాఁబోలును!

బర్జ—అక్కఱలేదు. నీకు ద్రవ్యలోపము లేకుండఁ జేసెదను గాదా!

మాంచ—ఓహో! మహానుభావులగు మీరు నన్నుఁ బశువుకంటెను మూఢునిగాఁ దలఁచుచున్నట్లున్నది!

బర్జ—ఏమి?

మాంచ — తెలియుట లేదా? చెప్పవలయునా? నీవయసంతయును గడచిపోయినది. నిన్నెవరు పెండ్లియాడుదురు? నేను చిన్నవాఁడను. కమలను నేనే పెండ్లియాడెదను. నేనే నీకుఁ గావలసినంతధనమిచ్చుచుండెదను. అట్లు చేయఁగూడదా?

బర్జ — కమలను నీకిచ్చుటను హరమసజీ యొప్పుకొనవలదా?

మాంచ — గుణవంతులును సత్పురుషులును నగుమీకిచ్చుట కాతఁ డెట్లుసమ్మతించెనో యించుక చెప్పెదరా?

బర్జ — మాంచరజీ! ఈవిధముగా నాతో జగడమాడుచు నన్నపనులను జెడఁగొట్టెదవా?

మాంచ — చెడఁగొట్టవలె నని కోరిక యెవరికున్నది? పెద్దమనుష్యునివలెఁ బని యంతయును నాచేఁ జేయించి పదియాఱణాలభాగము మీరు తీసికొనుచుందురు. సుందరీమణిని బెండ్లియాడెదరు! నేనూరక చూచుచుండవలయును! ఆహాహా! నేనేమి పసిబాలుఁడ ననుకొంటివా? ఈమాత్రము నాకుఁ దెలియకపోలేదు. కమలను నేనే పెండ్లియాడెదను.

బర్జ — హరమసజీ కమలను నీకీయఁడు. నాకిచ్చుటకుఁ గారణమున్నది.

మాంచ — ఆ కారణ మేమో చెప్పఁగూడదా?

బర్జ — ఇప్పుడు చెప్పను తరువాతఁ జెప్పెదను.

మాంచ — చెప్పితీరవలయును. లేకున్నచో నాత్రోవ నేనే చూచుకొందును.

బర్జ — నేను లేకున్నచో నీకీపాటికెట్టిగతి కలుగునో యాలోచించి చూచుకొనుము! నీవు కృతఘ్నుఁడవు. అయినను నేను నిన్నుఁ గనికరించుచునే యున్నాను.

మాంచరజీ మరల నధిక్షేపసూచకముగ నవ్వ నారంభించెను. బర్జరజీ యిఁకఁ గోపము నడంచుకొనఁజాలక "ఆలాగా? నేను తలఁచు

కొన్నచో నిన్నీపాటికిఁ గారాగృహమునఁ ద్రోయించి యుందును" అనియెను.

మాంచరజీ మాఱుమాట చెప్పక దెసలు మాఱుమ్రోగునట్లు వికటహాసము చేయుచుండెను.

ఆకస్మికముగ బర్జరజీ యొక్కయెదుటున లేచి నిలువఁబడి మాంచరజీని దిట్టుచుఁ జటాలునఁ బోయి తలుపు దెఱచెను. ద్వారము కడనుండి సేవకుఁ డప్పుడు మెల్లమెల్లగ జరిగిపోవుచుండెను. బర్జరజీ సింహవిక్రమముతో లంఘించి యాతనిజుట్టుపట్టుకొనియెను. సేవకుఁడు రోదనము చేయుచు "మహాప్రభూ! నేనేమి చేసితిని" అని విలపింపఁ దొడంగెను.

పదియవ ప్రకరణము.

విఘ్నము.

సేవకుఁడు గోలుగోలున నేడ్చుచుండెను. బర్జరజీ యాతని దిట్టుచు "పోకిరీ! నీగొంతు కోసెదను" అని యదలించెను.

సేవ — బాబూ! నేనేమితప్పు చేసితిని?

బర్జ — గాడిదా! నీవు మామాటలు వినుచుండుట లేదా?

సేవ — లేదు బాబూ!

బర్జ — లేకున్నచో ద్వారమునొద్ద నేమి చేయుచుంటివి?

సేవ — ప్రభూ! నేనీత్రోవనే పోవుచుంటిని.

బర్జ — మామాటలు నీకు వినఁబడలేదా? నిజము చెప్పుము!

సేవ — నిజముగా నాకు వినఁబడలేదు.

మాంచ—మనమాటలతో వానికేమిపని యున్నది. పాపము వానిని బోనిమ్ము!

బర్జరజీ సేవకుని వదలివైచెను. పిమ్మట నెప్పటివలె వారిరువురును గదిలోఁ గూరుచుండిరి.

బర్జ—ఇఁక మనము జాగ్రత్తగా నుండవలయును.

మాంచ—ఏమి? మనల నెవ్వరు శంకింతురు?

బర్జ—రస్తమజీకి శిక్షయే యైయున్నచో మనమంతగా భయపడవలసినపనియే లేక యుండును.

మాంచ—ఆతనిపక్షమున శ్రమపడి యందఱుసాక్షులను గూర్చినవా రెవ్వరో?

బర్జ—నేను నీవలెఁ గన్నులు మూసికొనియుండలేదు. ఆతనికిఁ బితృసఖుఁడగు నొకమరాటీవృద్ధుఁడు సాయము చేసినాఁడు.

మాంచ—సరే. దానికేమి? ఇప్పుడు నాడబ్బుమాట యేమనెదవు?

బర్జ—ఒకటిరెండుదినము లోపిక పట్టుము!

మాంచ—ఆసొమ్మంతయు నేమిచేసితివి? ఒక్కదినమున రెండులక్షలు!

బర్జ—ఊరకుండుము! ఎప్పటికైన నీమూలముననే మనకుఁ గారాగృహమునఁ బడవలసివచ్చును!

మాంచ—నాకేమి? నీవుపడుదువు.

బర్జ—ఆలాగా?

మాంచ—కాకేమి? నేనేమి చేసితిని? నిన్నే నమ్మియున్నాను.

బర్జ—అట్లయినచో నెప్పుడును నాతో నీజగడ మేల?

ఇంతలో ద్వారమునొద్ద మరలఁ జప్పు డయ్యెను. బర్జరజీ తలుపు తెఱచి చూచెను. అప్పుడు పోస్టువాఁ డాతనికొకయుత్తరము

నిచ్చెను. బర్జరజీ యాయుత్తరమును విచ్చి యొక్కసారిమాత్రము చదివి తలుపు మూసికొని వచ్చి యాలేఖను మాంచరజీ కిచ్చెను. మాంచరజీ చదువుకొని తెల్లపోయి వ్యాకులహృదయముతో "ఇది యేమి? ఇఁక మన మేమి చేయుదుము!" అనియెను.

ఆయుత్తరమునందిట్లున్నది:—

ప్రియమైనమాంచరజీ!

నీవు పంపిన మనుష్యునివలన నెల్లసంగతులను దెలిసికొంటిని. ఇంతవఱకును నీసమాచారమే తెలియకుండుటచే నేను చాలవిచారించితిని. బొంబాయినగరమున నుత్సాహనిమగ్నుఁడవై నన్ను మఱచిపోయితి వనుకొంటిని. అట్లు నన్ను మఱవఁగలవా? నన్ను బొంబాయికిఁ దీసికొని రమ్మని నీవుపంపినయాతఁడు చాల మంచివాఁడు! నేనాతనితోఁ గలసి నేటిరాత్రిబండిపై బయలుదేరి బొంబాయి వచ్చెదను. నిన్నుఁ జూచువఱకును నాప్రాణము తల్లడిల్లుచున్నది. నాలుగుదినములలో బొంబాయికిఁ జేరెదను—స్టేషనునొద్దకు రమ్ము—

ప్రేమమయియగునీతల్లి"

బర్జరజీ యేమియు మాటలాడకుండుటం గాంచి మాంచరజీ "ఆమె నిచ్చటకుఁ దీసికొనివచ్చుటకై యిటనుండి యెవ్వరో పోయియున్నారు! ఎంతకొంప మునిఁగినది!" అనియెను.

బర్జ—ఓరిమూఢుఁడా! నీకుఁ దెలిసిన దింతయేనా? మనసంగతి పోలీసువారికిఁగూడఁ దెలిసిపోయినదని యీయుత్తరమునుబట్టి నీకు బోధపడుటలేదా? ఆమనుష్యుని పోలీసువారే పంపియుందురు.

మాంచ—వారికెట్లు తెలియును?

బర్జ—వారిపనియే యది! ఎన్నియోసంగతు లిట్లే వారు తెలిసికొనఁగలరు. మనమిఁక నొకనిమిషమైన నాలస్యము చేయరాదు.

మాంచ—ఇప్పు డేమి చేయుదము?

బర్జ—బ్రదుకునం దాశయున్నచో నేను మరల వచ్చువఱకు నీవెక్కడకును గదలవలదు. ఎవ్వరికి నగపడవలదు.

మాంచ—నీవెక్కడకుఁ బోయెదవు?

బర్జ—తరువాతఁ జెప్పెదను.

మాంచ—సొమ్ము చేతఁబట్టుకొని నన్ను పోలీసువారిచేతి కొప్పగించి పాఱిపోవుగద?

బర్జ—మూర్ఖుఁడా! నీమూలముననే యిన్నిచిక్కులు కలుగుచున్నవి.

అని బర్జరజీ వెడలిపోయెను. మాంచరజీకూడ నాతని ననుసరింపఁదలఁచెనుగాని యేమేమో యోచించుకొని యట్లు చేయక లోపలికి వచ్చి కూరుచుండెను.

దూరమున నిలువఁబడి వారియవస్థఁ గాంచుచున్న సేవకుఁడు తనలో "ఈపోగరుబోతులవిలాసఖేలనములకు శేషకాలము వచ్చినది!" అని యనుకొనియెను.

పదునొకండవప్రకరణము.

విపత్సాగరము.

అచ్చటనుండి బర్జరజీ తిన్నగా హారమసజీయింటికిఁ బోయెను. ఇన్స్పెక్టరు లాలూభాయి తెలియకుండ నాతని ననుసరించెను. అప్పుడు హారమసజీకి గ్రిందఁగచేరిలో నున్నందున బర్జరజీరహస్యముగా రాజాబాయియొద్దకుఁ బోయెను. నిర్భాగ్యురాలగు రాజాబాయి యాతనిఁ జూచినతోడనే గుండెలు చెదరిపోయెను. అప్పుడామె భయకంపిత యగుచు సగౌరవముగ నాతని గూర్చుండఁజేసెను. బర్జరజీ కిప్పుడు వృథాకాలక్షేపము చేయుట కవకాశము లేదు. అప్పుడాతం డామెం గాంచి "నేనొకయావశ్యకకార్యమునకై నీయొద్దకు వచ్చితిని" అనియెను.

రాజా—చెప్పుము!

బర్జ—మీమాంచరజీమూలమున నాకుఁ జాలగష్టముగా నున్నది. నీవిచ్చినసొమ్మంతయుఁ దగులఁబెట్టినాఁడు.—ఒక్కదమ్మిడియైనను మిగులలేదు.

రాజా—అంతసొమ్మింతలో నెట్లు చెల్లిపోయినది?

బర్జ—ఒడలు తెలియకుండఁ గర్చుపెట్టుచున్నచో నెన్నాళ్లుండును? మరలనిప్పుడు డబ్బు కావలయును!

రాజా—నాచేతిలో నొక్కపైసయైనను లేదు.

బర్జ—ఇల్లెంతకాలము గడచును? డబ్బుకొఱకాతఁడు నన్నుఁ బీడించుచున్నాఁడు! నాకు మతిపోవుచున్నది. హారమసజీ కంతయును జెప్పి యాతనినే సాయముచేయవలయు నని కోరఁదలంచితిని.

వేఁటగాఁడు వింటెనిగూర్చిన బాణముం గాంచినహరిణిం బోలి యామాటకు రాజాబాయి భయపరికంపితయై పయ్యెదచెఱంగున మొగము కప్పుకొని నిశ్శబ్దముగ నేడువఁదొడంగెను. ఆమెహృదయము పగిలిపోవుచుండెను. పాషాణహృదయుఁడగుబర్జరజీ యొంతమాత్రమును జాలినొందక "ఇఁక నొక్కటియే యుపాయ మున్నది!" అనియెను.

రాజాబాయి యించుక తేరుకొని "అది యేమో చెప్పుము!" అనియెను,

బర్జ—కమలను నాకిచ్చి పెండ్లి చేయుట!

ఎట్టయెదుట నాకస్మికముగఁ బిడుగుపడినట్లుగా రాజాబాయి యదరిపడి "వలదు! అట్లుచేయఁజాలను. నేను నాచేసినపాపమునకు

నరకబాధ ననుభవించుచునేయున్నాను. దానికిం గూడ నట్టిదారుణ యాతనను గల్పింపంజాలను" అనియెను.

బర్జ—నన్నుం బెండ్లియాడినచోం గమలకు నరకబాధ యేమున్నది? నేనామెను బ్రేమించియే యుంటిని గాదా?

రాజా—చాలును! ఇంకం జాలును! నేనీబాధ పడంజాలను. నీవంటి దుష్టరాక్షసునిచేతులలోంబడి నేను వేగిపోవుచున్నాను. ఇది యెట్లు తప్పిపోవునో యని వేయిదేవతలకు మ్రొక్కుకొనుచున్నాను.

బర్జరజీ మొగము చిట్లించుకొనుచు "నీయిష్టము! మొదటినుండియు నీవు నామాట కడ్డము చెప్పుచునేయున్నావు. తుదకుం జేయుచునే యున్నావు" అనియెను.

రాజా—ఇంక నట్లు జరుగదు.

బర్జ—అట్లయినచో నీక నీచిత్తము! నీయభిరుచి! నేనుమాత్రము కమలను బెండ్లియాడుటకు స్థిరపఱచుకొంటిని. ఆదరముతోం దండ్రి కన్యాదానము చేయు

రాజా—నాబిడ్డకు నేను విషమైనను బెట్టి చంపుకొందును గాని నీచేతికిమాత్రము మారత్నము నొప్పగింపంజాలను.

బర్జ—నీవు పొరంబడుచున్నావు. నేను నీభర్త నంగీకరింపంజేయుదును.

రాజా—ఈపెండ్లి నాకుమాత్ర మిష్టము లేదు.

బర్జ—ఇదియును నవివేకమే—కమలను నేను పెండ్లియాడినచో మనకు ధనలోప ముండదు. నాకొఱకుం జెప్పుటలేదు! అందువలన మీమాంచరజీకి మఱియెట్టియభావమును లేకుండంబోవును.

రాజా—ప్రాణముండంగా నేను నీవంటిరాక్షసునకు నాకమల నీయంజాలను.

బర్జ—ముందుగా నేను కమల నంగీకరింపంజేసి హారమసజీ నొప్పించి వారియిష్టముమీఁదనే పెండ్లియాడెదను.

రాజా—అట్లెన్నటికిని జరుగనీయను! ఈవిషయమునమాత్రము నేను నీకు భయపడుదానను గాను.

బర్జ—ఆపైని నీచిత్తము. అట్లయినచో నేనింక హారమసజీయొద్దకుం బోయి గుణవతివగు నీగుప్తప్రణయమునుగూర్చి మనవిచేయవలసివచ్చును.

రాజాబాయి నిలువునం గంపించిపోవుచుండెను క్రమముగా నామెకుం జైతన్యము తప్పిపోవుచుండెను! ఆమెతల తిరిగిపోవుచుండెను. ఆకస్మికముగ నామె యున్మాదినింబోలి బర్జరజీపాదములపైం బడి "రక్షింపుము! రక్షింపుము! నీహృదయాంతరాళమున నించుకంతయైనను జాలియనుమాట లేదా? రక్షింపుము! నాగౌరవమును గాపాడుము!" అని వేడుకొనియెను.

బర్జ—నామాట నీవు బాగుగ నాలోచించుకొనుము! నీవొప్పుకొన్నను, మానినను నేనుమాత్రము తప్పక కమలను బెండ్లియాడి తీరెదను. ఇంక నేను పోయెదను. రేపు మరల వచ్చి చూచెదను. రేపు తప్పకుండ నీవును నామాటకు సమ్మతించి తీరెదవు.

అని బర్జరజీ వెడలిపోయెను. రాజాబాయి గడగడ వడంకుచు నిలువునం గూలంబడుటకు సిద్ధమై యించుక సులువు చేసికొని సమీపమునందలి యొకసోఫాపైం బడిపోయెను.

అప్పుడు జరగినసంగతి యంతయును బ్రక్కగదియందుండి యిరువురు చూచుచుండిరి. అందొకవ్యక్తి మెల్లమెల్లంగా రాజాబాయిని సమీపించెను.

పండ్రెండవప్రకరణము.

రత్నాబాయి.

అట్లు వచ్చినవ్యక్తి మఱియెవ్వరును గాదు—కమలాబాయియే. నిర్భాగ్యురా లగురాజాబాయి యప్పుడు మిగులఁ గష్టముతో శరీరమనోవికారముల నించుక మఱుఁగుపఱచుకొని లేచి కూర్చుండెను. కమల మెల్లమెల్లగ వచ్చి తల్లిపాదములచెంతఁ గూరుచుండి కన్నీరు విడుచుచు "అమ్మా! నేనంతయును వింటిని—అంతయుఁ దెలిసికొంటిని నాకీసంగతి మొదటినుండియును దెలియును!" అనియెను.

రాజాబాయి యిఁక హృదయపరితాపమును దాఁచుకొనఁజాలక మొగమునఁ బయ్యెదచెఱఁగుచేర్చుకొని వెక్కి వెక్కి యేడువఁదొడంగెను. అప్పుడు కమలాబాయి "అమ్మా! నెలదినములనుండి నీవుపడుచున్నబాధ యంతయును నేను చూచుచునేయున్నాను. మనసులోని యగ్నిజ్వాలను మఱుఁగుపఱచుటకై నీవు దినదినమును వేగిపోవుచున్నావు. తల్లి యింతబాధ పడుచుండఁగా నేబిడ్డ చూచి సహింపఁగలదు? నీకష్టమును దీర్పజాలకున్నచో నేను బ్రదికియున్నలాభమేమున్నది? అమ్మా! సంశయింపకుము! నన్ను బర్లరజీ కిచ్చి పెండ్లి చేయుము!" అనియెను.

రాజాబాయి యున్మాదినివలెఁ దనయమొగమువంకఁ జూచుచు వ్యాకులహృదయముతో "వలదు—వలదు—వలదు—నీవారాక్షసు నెఱుంగవు!" అనియెను.

కమ—బాగుగ నెఱుంగుదును. అయినను నీకొఱకు నేనాతని బెండ్లియాడెదను.

రాజా—వలదు—ఎంతమాత్రమును వలదు.

కమ—అట్లు చేయకున్నచో లోకము నెదుట—సంఘము నెదుట—మొగ మెత్తుకొని తిరుగుట కుపాయమేమున్నది? ఈదారుణవార్త వెల్లడియైనచోఁ దండ్రికిఁ దలవంపు గాదా? మనలను జూచి లోకులు నవ్వరా? మనచరిత్రమునకుఁ గళంకము కాదా? అప్పుడు మన బ్రదుకువలన లాభ మేమున్నది?

రాజా—వలదు—ఆపాషాణహృదయుని నీవెఱుఁగవు—నేను చచ్చిపోయెదను. అంతియకాని నామేనఁ బ్రాణముండఁగా నిన్నాతని కీయఁజాలను.

కమ—నాకెట్టికష్టమును లేదు. నాకులాభిమానమును రక్షించుకొనుట కర్తవ్యము కాదా? అట్లు రక్షించుకొనఁజాలకున్నచో నేను చచ్చుటయే మంచిది.

రాజా—కమలా! నేనింతవఱకుఁ బడరానిబాధలుపడి దుఃఖముచేఁ దూలిపోవుచున్నాను. ఇంకను నీవుకూడ నన్ను బాధింపకుము.

కమ—అమ్మా! నీ కెట్టిబాధయు లేకుండఁ జేయవలయుననియే నాప్రయత్నము!

రాజా—ఆనీచుఁడు కేవలము ధనాశచే నిన్నుఁ బెండ్లియాడఁదలఁచినాఁడు!

కమ—అవును. ఆసంగతియు నేనెఱుంగుదును.

రాజా—వత్సా! నేను నిన్నా దురాత్మున కెట్లీయగలను?

కమ—ఈయకున్నచో మనము తలయెత్తుకొనుట కుపాయము లేదు. లోకులు నిన్ను దుశ్చరిత్ర యనుచుండఁగా వినుచు నేనెట్లు బ్రదుకఁగలను? ఆత్మహత్య చేసికొనవలయును గాదా? నాయన యీమాట విని యెంతబాధపడునో యేమేమి చేయునో యెవ్వరుఁ జెప్పగలరు? ఆతనికి నన్నిచ్చినచో మనమరియాద దక్కును. అట్లుచేయుట యిట్టిసందర్భమున నుచితము కాదా?

అని పలుకుచుఁ గమలాబాయి తనవస్త్రాభ్యంతరమునుండి కొన్నినగలను బైకిఁ దీసి తల్లి యెదుటనుంచెను. పడగలెత్తి బుస్సుమనుచున్న పాములం గాంచినట్లే రాజాబాయి యావస్తువులం గాంచి భయవిస్మయపరికంపితయై గద్గదస్వరముతో “కమలా! వీనన్నిటి నెట్లు సంపాదించితివి?” అనియెను.

కమ — నేనంతయు నెఱుంగుదును! నీమెడలపై నొక్కనగయైనను లేకుండుట తండ్రిగారు చూచినచోఁ గోపముసేయుదురని భయపడి రహస్యముగ మాంచరజీయొద్దకుఁబోయి బ్రతిమాలి యాతనికడనున్న తాకట్టుపద్దులను గైకొని గణేశనుల్లునిదర్శించి యాతనికి నానగలను దాకట్టుగనిచ్చిన నీవు నిత్యముధరించు నీనగలను దీసికొనివచ్చితిని.

రాజాబాయి గోలుగోలున నేడువఁదొడఁగెను. కమలాబాయి తల్లివంకఁజూడకుండఁగనే “ఇఁక నాబ్రదు కెందులకు? నాపరాశలు — నాగౌరవము — నాసుఖము — అయ్యో! తుట్టతుదకు నాకేమియు లేకుండఁబోయినవి! ఈయపకీర్తి ననుభవించుటకంటె మరణించుటయే మేలు!” అని యిఁక దుఃఖము నడఁచుకొనజాలక కమలయు నేడువఁదొడంగెను.

అంతలో రత్నాబాయి వచ్చి కమలచేయిపట్టుకొనియెను. కమలకు మరల నెప్పటిధైర్యము కలిగెను. అప్పుడు కమల కన్నీటిని దుడుచుకొనుచు “అమ్మా! నేనిఁక నెవ్వరిమాటను వినఁదలఁచుకొనలేదు. బర్జరజీని బెండ్లియాడెదను. ఆతనికి నేనే యుత్తరము వ్రాయుదును” అనియెను.

రాజాబాయి “వలదు — అట్లయినచో నేనాత్మహత్య చేసికొందును” అని చెప్పుచుఁ దలయెత్తి కమలపార్శ్వమునందున్న రత్నాబాయిం గాంచి యదరిపడి విస్మితయు స్తంభితయు నైపోయెను. అప్పుడామె రక్తనాళములయందలి రక్తప్రవాహము నిరుద్ధమైపోయెను. ఆమెనోట మాటరాకుండఁబోయెను.

కమ — అమ్మా! ఈరత్నాబాయిని సంశయింపవలదు. ఈమె కంతయును దెలియును; భయపడవలదు. ఇప్పటినుండి యీమె నాసోదరి. ఈమెమూలమున రహస్యమున కెట్టిభంగమును లేదు.

అప్పుడు రత్నాబాయి రాజాబాయి రెండుచేతులను బట్టుకొని “అమ్మా! ఆదురాత్మునకుఁ దగినశిక్ష చేయవలదా? కమల యాతని బెండ్లియాడనక్కఱలేదు. ఈలోపుననే యాదుష్టునకుఁ దగినశాస్తియగును. నామాట నమ్ముము! నీవు భయపడవలదు. కమల రుస్తుమజీనె బెండ్లియాడగలదు,” అని ప్రబోధించెను.

రాజాబాయి కన్నీరు మున్నీరుగా నేడ్చుచుండెను. రత్నాబాయికడపటిమాటకుఁ గమల యులికిపడియెను. రాజాబాయి తత్తరముతో “అమ్మా! రత్నా! ఏమో కాని నీమాటలవలన నాప్రాణము తేరుకొన్నది! తల్లీ! నీవు దాసివి కావు! ఎవ్వతెవో చెప్పవా?” అనియెను.

రత్నా — సమయము వచ్చినప్పుడు చెప్పెదను.

అని యామె యటనుండి వెడలిపోయెను. పిమ్మటఁ దల్లియు, బిడ్డయు నొండొరులఁ గౌఁగిలించుకొని వ్యాకులహృదయములతో నేడువఁదొడంగిరి. చాలసేపటికిఁ గన్నీటిధారలచే వారిహృదయానలజ్వాల లించుక చల్లనయ్యెను!

పదుమూఁడవ ప్రకరణము.

దురభిసంధి.

బర్జరజీ క్రిందికిఁ బోయి హారమసజీని దర్శించి చాలసేపు మాటలాడి యింటికిఁ బోయెను. అప్పటికింకను మాంచరజీ యింటను గుర్చీపైఁ గూర్చుండి నిద్రించుచుండెను. బర్జరజీ తిరస్కారసూచకముగ

నాతనివంకఁ జూచుచు "ఇంతచేఁతగానివానితోఁ గలసి పనిచేయవలసి వచ్చినది! తలఁచుకొన్నచో నిప్పుడే యీతని వెడలఁగొట్టఁగలను! రాజాబాయి గోలపెట్టునేమోయని సంశయించుచున్నాను. ఇంకను గొన్నాళ్ళుండనిమ్ము!" అనియనుకొనుచు మాంచరజీని బలవంతముగఁ గొట్టి లేపెను. మాంచగజీయదరిపడి లేచెను.

బర్జ—అవును. ఇది హాయిగ నిద్రింపవలసిన సమయమే!

మాంచ—ఏమిచేయవలయునో చెప్పుము!

బర్జ—మాట వినుపించుకొనునవస్థలోనే యున్నావా?

మాంచ—ఏమి?

బర్జ—అట్లయినచో వినుము! పోలీసువారు మనలను వెంబడించుచున్నారు. ఏమాత్రము ప్రమాదము కలిగినను నీకును నాకును జావుతప్పదు.

మాంచ—మనలనుగూడఁ బట్టుకొనునంతటిపోలీసువాఁ డింకను బుట్టియుండలేదు. నీవుండఁగా నేమిభయము!

బర్జ—నేను చెప్పినట్లు చేసెదవా? ఎన్నఁడును నాతో జగడమాడవలదు. మనము బ్రదుకుట కొక్కటే యుపాయమున్నది. నేను కమలను బెండ్లియాడవలయును. అట్లయినచో హరమసజీయే మనలను రక్షింపఁగలఁడు. ఆతని ధనగౌరవములు మనచేతులలో నుండును—కాని మీయమ్మ—ఆముసలిది ప్రస్తుతము పోలీసువారి చేతులలో నున్నది. ఆమె నెట్లయినఁ దప్పింపవలయును.

మాంచ—ఆమె బయలుదేరినది; వచ్చును. మనయింటికిఁ దీసికొని రాఁగూడదా?

బర్జ—అట్లయినచోఁ గొంపమునుఁగును! త్రోవలోనే యామెను దప్పించివేయవలెను.

మాంచ—అట్లయినచో నీవిప్పుడే బయలుదేరి పొమ్ము—సరే కాని డబ్బంతయును దీసికొని పోయి నన్ను పోలీసువారి కొప్పగింపకుమా?

బర్జరజీ క్రోధముతో నోట్లకట్టను జేబులోనుండి తీసి మాంచరజీ ముందరఁ బడవైచి "ఇది యంతయు నీయొద్దనే యుంచుకొనుము! ఇఁక జచ్చినట్లు నేను చెప్పినపని చేయుము!" అనియెను.

మాంచ—కోపపడవలదు. ఆపద యిరువురకును సమానమైనప్పుడు ధనముకూడ నట్లే యిరువురమును సమానముగఁ దీసికొన్నచో నొకరినొక రేమియు ననుమానింపవలసి యుండదు.

బర్జ—నాకు డబ్బు కావలసినంతయున్నది. ఈసొమ్మంతయు నీయొద్దనేయుంచుకొనుము.

మాంచ—మంచిది. ఇఁక నీవు చెప్పినట్లు చేసెదను.

బర్జ—నేను పోయి యెట్లయిన మీయమ్మను పోలీసువారి చేతులనుండి తప్పించివైచెదను.

మాంచ—సరే, కాని యామె యిదివఱకే యంతయును వారికిఁ జెప్పియుండదుగద?

బర్జ—చెప్పనిమ్ము! ఆమె మరలఁ బోలీసువారికి దొరకినప్పుడుగద! అప్పటిమాట చూచుకొందము!

మాంచ—ఆమెను దప్పించుటయెట్లు?

బర్జ—చూచెదవుగాదా! నీవు జాగ్రత్తగా నుండుము! ఎవ్వరికి నగపడవలదు. వీలైనచో రాజాబాయినొకసారి చూడుము! కాని తెలివి తక్కువగ నేమియు మాటాడకుము! నేను పోయెదను.

అని చెప్పి బర్జరజీ వెడలిపోయెను.

పదునాలుగవ ప్రకరణము.

రహస్యవేశము.

ఒకనాఁడు దాదాభాస్కరుఁడు ఖిన్నహృదయముతోఁ గీర్తికరునియొద్దకు వచ్చి “గురుదేవా! మీరేమిచేసినను మాటాడఁగూడదు! మీమూలమున నాకష్టమంతయును నిరర్థక మైపోవుచున్నది” అనియెను.

అక్కడఁగూర్చుండి యున్నలాలూభాయి యామాటకు విస్మితుఁడయ్యెను. అప్పుడు కీర్తికరుఁడు “దాదా! ఏమి యంతకోపముగా నున్నావు?” అనియెను.

దాదా—ఏమిచెప్పుదును! నా మొగము! మీరూరక జాలము చేయుచున్నారు. ఇట్టిపని చేసినచో నెన్నాళ్ళు బ్రదుకుదుము!

కీర్తి—నీవేమో చాలశ్రమపడినట్లగపడుచున్నావే!

దాదా—అబ్బ! నాకిన్నియేండ్లు వచ్చినవి గాని యంతటి దొంగముండకొడుకులను నేనెన్నఁడును జూడలేదు.

కీర్తి—అప్పుడేమైనదా? నీవయసెంత! అఱువదిడెబ్బదియేండ్లు గడచునప్పటికి వారితాతలవంటివారి నెందఱను జూడవలసి యుండునో!

దాదా—నేనందులకు సిద్ధముగ నేయున్నాను. కాని తత్క్షణమే వారిని బట్టుకొనుటకు నాకు వారంటు నీయవలయును.

కీర్తి—వలదు— ఎవ్వరినిగూడఁ బట్టుకొననక్కఱలేదు!

దాదా—ఏమి?

కీర్తి—నీవ్యవహారమే వదలిపోనది. నీపని దేవుఁడే చేసినాఁడు.

దాదా—మీరెప్పుడును నన్నిట్లే పరిహసించుచుందురు!

కీర్తి—పరిహాసము కాదు. ఇదిగో! ఈకాగితము చదువుకొనుము!

దాదాభాస్కరుఁడాకాగితము నందుకొని చదివెను. అందిట్లున్నది:—

“మహారాజశ్రీ పోలీసుకమీషనరుదొరవారికి—బొంబాయి.

అయ్యా!

పోయినవని మీకు రిపోర్టుచేసిన నాలక్షరూపాయలనోట్లును మరలదొరకినవని వ్రాయుటకు మిగుల నానందించుచున్నాను. రస్తమజీ యానోట్లను బెట్టెలోఁ బెట్టితి ననుకొనియెను గాని యట్లుజరుగలేదు. వానినాతఁడు పెట్టెమీఁదఁ బెట్టెను. తలుపు తెఱచునప్పుడవి వెలుపలఁ బడిపోయినవి. ఆసంగతి రస్తమజీకిఁ దెలియకపోవుటచే నింత పని జరగినది. నేఁడాపెట్టెను రంగువేయించుటకై బయటకుఁ దీసితిమి. అప్పుడు వెనుకబడిపోయిననోట్లకట్ట యగపడినది. ఊరక రస్తమజీని బాధపెట్టినందులకు నేను విచారించుచున్నాను. ఈపొరపాటువలన మీకునువృథాశ్రమకలిగించితిని. ఈతప్పు నేను తెలిసిచేసినది కాదు కావున మీరును మీయుద్యోగులును నన్ను క్షమింపఁగోరెదను. మీరిఁక నీవిషయమున శ్రమపడనక్కఱ లేదు. నాసొమ్ము నాకు దొరకినది.

హారమసజీ—”

కీర్తికరుఁడు నవ్వుచు “చూచితివా దాదా! నేను నిన్నుఁ బరిహసించుట లేదుగద!” అనియెను.

దాదా—నాకేమియు బోధపడుట లేదు.

కీర్తి—నీవిప్పు డెవ్వరిని బట్టుకొన్నను వారి కీకాగితమునుబట్టి విడుదల యైపోవును. పైగాఁ దప్పుకేసు చేసినందులకు నీతలమీఁదికి వచ్చును.

దాదా—సర్కారుసేవ కత్తిమీఁదిసాము!

కీర్తి—హాయిగా నింటియొద్దఁ గూర్చుండి నెలనెలకు జీతము జేబులో వైచుకొనుచుండిన బాగుగ నుండును గాఁబోలును!

దాదా—సరే. ఆమాటకేమి? హరమసజీ సత్యమునే వ్రాసినట్లు మీకు నమ్మకమున్నదా?

కీర్తి—నేనంతపిచ్చివాఁడను గాను!

దాదా—అట్లయినచో హరమసజీ యూరక యీకాగిత మేల వ్రాయును? డబ్బు నిజముగా దొరకియే యుండును!

కీర్తి—ఒకదమ్మిడియైనను దొరకలేదు.

దాదా—ఆలాగా?

కీర్తి—ఇంకను సందేహమా?

లాలూ—నేను ముప్పదియేండ్లనుండి పత్తేదారీపని చేయుచుంటిని. కాని యింతయద్భుతవ్యాపారము నెన్నఁడును జూడలేదు. నిజముగా దొంగతనము జరుగకపోవుటచే నిప్పుడు మాదాదాపని తీరిపోయినది. ఇఁక హత్యావ్యవహారమున నే నెన్ని పాపకార్యములు చేయవలసియుండునో దేవుని కెఱుక.

కీర్తి—భయములేదు. హంతకుఁడు శీఘ్రముగ నే దొరకఁగలఁడు. కూరుచుండుఁడు. మనము పూర్వమునుశ్రమపడి యీవిషయమునఁ బ్రయత్నింపవలయును. హరమసజీ తనకుమార్తెను బర్జరజీ కిచ్చునని వినియున్నాను. ఇందేదియో రహస్యముండి తీరవలయును. ఆసంగతి తెలిసికొనవలయును. రహస్యము మఱింతగంభీర మగుచున్నది.

లాలూ—అట్లనచో మాయనుమానము సరియైనదే!

పదునేనవ ప్రకరణము.

గూఢలేఖ.

మఱి వారముదినములతరువాత నొకనాఁడు కాశీనాథుఁడు రస్తమజీయొద్దకు వచ్చి "వత్సా! ఈనడుమ నీవేమి చేయుచున్నావు? ఇంగ్లానఁ గ్రొత్తవిశేషములు తెలిసినవా?" అని ప్రశ్నించెను.

రస్తమజీ బెదరి బెదరి చూచుచు "మహాశయా. నేనొకతప్పుపని చేసితిని. బుద్ధిహీనునివలెఁ బ్రవర్తించితిని" అనియెను.

కీర్తి—తెల్లమొగము వేయకోయి! ఏమిచేసితివో చెప్పుము!

రస్త—బర్జరజీ కమలను బెండ్లియాడుటకు స్థిరపడియెనని వార్తాపత్రికలోఁ జదివి కోపముతో హరమసజీకి నే నొకపేరులేని యుత్తరమును వ్రాసితిని—అందు—మాంచరజీతో రాజాబాయికి—

అని యిఁకఁ జెప్పఁజాలకపోయెను. ఆసమయమునం దేసరిగఁ గాశీనాథుని దృఢముష్టి సశబ్దముగ బల్లపై సంఘట్టిత మయ్యెను. అప్పుడు కాశీనాథుని ప్రఫుల్లవదనము వర్షాకాల ప్రదోషమేఘమువలె గంభీర మయ్యెను.

కాశీ—ఎంతబుద్ధిహీనత! ఒక్కసారిగా సర్వప్రయత్నములు మంటఁ గలసిపోయినవి.

అనియాతఁడు చటాలున లేచి యేమియుఁ దోఁచక యటునిటుఁ దిరుగఁజొచ్చెను. ఆతని బదవిక్షేపముచే నిల్లంతయు నదరిపోవుచుండెను. అంతలో నాకస్మికముగ నొక్కచో నాఁగి కాశీనాథుఁడు క్రోధముతో రస్తమజీవంకఁ జూచి కఠినస్వరముతో "నీవు బాలునివలె, మత్తునివలె, మూర్ఖునివలె, నింతటినీచపుఁబని నేలచేసితివి? నీవు పరమమూర్ఖుఁడవు—లోతునీట సుడిగుండములలోఁ బడికొట్టుకొనుచు మునిఁగిపోవనున్న నిన్ను నేనెట్లో కష్టపడి యొడ్డునకుఁ దెచ్చుచుంటిని. ఇట్టి సమయమున బుద్ధిహీనుఁడవై నీవు నాకాళ్లను గట్టిగ బంధించి నన్నీఁదుటకుఁ జేతగానివానిగాఁ జేసివైచితివి! నేను పోవునప్పుడు నీ కెంతయో బోధించితిని. జ్ఞప్తియందున్నదా? మఱికూడఁబోయినదా?" అని దూషించెను.

రస్త—అవును "ఏపనియుం జేయకుండ నూరక యింటఁ గూర్చుండుమని నాకు బోధించితిరి.

కాశీ—జ్ఞప్తి యున్నదా? అట్లయినచో నీపాడుపని నేల చేసితివి?

అయ్యవారి యొద్ద బడిపిల్లకాయవలె రస్తమజీ కంపితస్వరముతో "మొన్నటిరాత్రి విశేషముగ జ్వరమువచ్చినది. చాల బాధపడితిని; ఇంటనుండలేక వీధిలోనికిఁ బోయి యొకవార్తాపత్రికను జదివితిని. అందుఁ గమలాబర్జరజీల వివాహవృత్తాంతమున్నది—"అనియెను.

కీర్తి—అన్నిటికిని నాపై భారమువైచి యుండుమని నీకిదివఱకే చెప్పితిని గాదా?

రస్త—సహింపఁజాలకపోయితిని. అట్టిసమయమున మీరైనను జలింపకమానరు!

కీర్తి—చాలును! ఈయుక్తులవలనఁ బ్రయోజనము లేదు. బుద్ధిహీనులిట్లే తమయజ్ఞానమును సమర్థించుకొనుచుందురు. ఇప్పుడు నీవు నన్నుఁగూడ బుద్ధిహీనునిగాఁ జేసివైచితివి. తెలిసినదా ? నీవ్యవహారవిషయమున నేనెందఱితోడనో మాటాడి వారికి విశ్వాసమును గల్పించితిని. వారిప్పుడు నన్ను మోసగాఁడనుకొనరా? సరే! ఇఁక నీవ్యర్థప్రసంగమువలన నేమి లాభము? ముందు ముఖ్యముగా నీవు చేసినతప్పు నేను దిద్దుకొనవలయును. ఆయుత్తరమును నీవెప్పుడు పోస్టులో వైచితివి?

రస్త—రాత్రిపదిగంటలకు—తరువాత వెంటనే పశ్చాత్తాపపడితిని.

కాశీ—అది పోస్టులోఁ బడకముందే నీకాబుద్ధియున్నచో బాగుగ నుండును. సరే—అట్లయినచో నీచల్లసియుత్తరము నేఁటియుదయము టపాలోనే హారమసజీకిఁ జేరియుండును. ఉదయము టపా యాతఁడు తనగదిలో స్వయముగనే చూచుకొనును గాదా?

రస్త—అవును. మధ్యాహ్నము టపామాత్రము కచేరికి వచ్చి తీసికొనును.

కీర్తి—నీవాయుత్తరమున నేమివ్రాసితివో పూర్తిగాఁ జెప్పుము.

రస్తమజీ జ్ఞప్తికిఁ దెచ్చుకొని యన్నిసంగతులను దెలియఁజేసెను. కాశీనాథుఁడు విని కోపముతో "ఎంతనీచముగవ్రాసితివి! పాపము ముట్టితివే! చండాలుఁడు చేయఁదగినపని చేసితివి! నీవిట్టిపనులలో సిద్ధహస్తుఁడవని నేనిదివఱకెఱుంగను! నీయుత్తరమువలన నెన్నియో కార్యములు చెడిపోవును. హారమసజీ హృదయ మెంతబాధపడిపోవును. ఆతనిమాట మనకెందులకు? దానిమూలమున నాతఁడు చేయుపనులను బట్టి మనప్రయత్నము లన్నియును. నిష్ప్రయోజనములైపోవును ఎంతపని చేసితివి!" అని యెన్నియోవిధముల దూషింపదొడంగెను.

రస్తమజీ యేమియు మాటాడఁజాలక తెల్లఁబోయి చూచుచుండెను, ఇంతలో వాతనిదృష్టి ద్వారమువంకఁ బ్రసరించెను. ఎట్టయెదుట రత్నాబాయి! రత్నాబాయి మెల్లమెల్లగ గృహమధ్యమునఁ బ్రవేశించెను.

పదునాఱవ ప్రకరణము.

దౌత్యము.

కాశీ—ఇదిగో! రత్నాబాయి! నీముఖలక్షణములనుబట్టి చూడఁగా నేదియో క్రొత్తసమాచారము తెచ్చినట్లగపడుచున్నావు!

రత్నా—ఏదియో దారుణసంఘటనము తటస్థించునట్టి సూచనలగపడుచున్నవి. ఇల్లంతయును జాల గొడవగా నున్నది. కమలాబాయి మిమ్ములనొకసారి తీసికొని రమ్మని నన్నుఁ బంపినది.

కాశీ—ఆలాగా? మంచిది. కమల మిగులబుద్ధిమతి. అవశ్యమట్లే వచ్చెదను. మీయింటికి బర్జరజీ యప్పటివలె వచ్చుచున్నాఁడా?

రత్నా—పెండ్లి కుదిరినతరువాత మఱియు దఱచుగా వచ్చుచున్నాఁడు.

రస్తుమజీ క్రోధకంపితస్వరముతో "ఏమి! ఆహంతకుఁడు, ఆ తుంటరి, ఆదాంగ యింకను హారమసజీయింటికి వచ్చుచుఁ గమలతో సంభాషించుచున్నాఁడా? (కాశీనాథునిం గాంచి) అయ్యా! ఇదియేనా మీప్రతిజ్ఞాపాలనము! అఱచేతిలో వైకుంఠముఁ జూపుచు నాశపెట్టి నన్నలయించుచున్నారు!

కాశీ—లేదు. నేను కార్యమంతయును జేసితిని. ఏమియు లోపముఁ జేయలేదు. నిన్ను నీవే పాడుచేసికొనుచున్నావు. నీకుపకారము చేయువారి కడ్డము వచ్చుచున్నావు. ఇంకను బూకరించెద వేమి? ఒక్కయుత్తరముతో నాపనియంతయును బాడైపోయినది—అమ్మా! రత్నా! మీయింటఁ బుట్టినగొడవసంగతి నీకేమైనఁ దెలిసినదా?

రత్నా—సరిగాఁ దెలియలేదు. కాని సూచనలనుబట్టి యేదియో భయంకరకృత్యము జరుగునని తోఁచుచున్నది. రాజాబాయి యన్యమనస్కయైయున్నది. ఆమెతో మాటాడుటకే భయమగుచున్నది.

కాశీ—హారమసజీ యెట్లున్నాఁడు?

రత్నా—ఆతఁడును వ్యాకులహృదయముతో నేయున్నాఁడు నేఁటియుదయమునుండి యాతనిమనసు మనసులో లేదు; కంఠస్వరమే మారిపోయినది! వెఱ్ఱిచూపు పడినది! రాజాబాయిని దర్శించునప్పు డా చూపు మఱింత వికృతముగాఁ దోఁచుచున్నది.

కాశీ—సరే. నేననుకొన్నట్లైనది. సరే—రాజాబాయియు గమలయు నేఁడు వాయుసేవనమునకుఁ బోయిరా?

రత్నా—పోయిరి.

కాశీ—వారు పోయినతరువాత నింటియొద్ద హారమసజీ యెట్లుండెనో నీవు చూచితివా?

రత్నా—నేనుగూడ వారితోడనే పోయితిని. నాకెట్లు తెలియును? నేఁటిసాయంకాలమున నాతఁడు ద్వారరక్షకునితో నుత్తరములు వచ్చినచో నవియన్నియు నాకే యిచ్చుచుండు మనియు నితరుల కీయవద్దనియుఁ జెప్పియున్నాఁడు!

కాశీ—సరే. అతఁడు మంచిత్రోవనే పట్టెనాఁడు. క్రమముగా నంతయు గాలించి తెలిసికొని తగినప్రతిక్రియ చేయకమానఁడు. రత్నా! ఇఁక నూరక చూచుటవలన లాభము లేదు. నీవు జాగరూకతతో నుండి యెప్పటిసంగతుల నప్పుడు నాకుఁ దెలియఁజేయుచుండుము! ఆతఁడు నిన్నుఁగూడ ననుమానింపఁగలఁడు! నీవు జాగ్రత్తగ నుండవలయును. ఆయింటజరిగిన యెంతటిస్వల్పవిషయమైనను నాకుఁ దెలుపకుండ మానవలదు.

"సరే! అని రత్నాబాయి వెడలిపోయెను. అంతలో గడియారము పండ్రెండుగంటలు కొట్టెను. కాశీనాథుఁ డదరిపడి "పండ్రెండైనది! ఇంకను భోజనమే లేదు!" అనుకొనియెను.

ఆతనితల్లడపాటంతయును జూచి రస్తుమజీ సంక్షుభితహృదయముతో "మహాశయా! నేను మీకుఁ జాలఁగష్టమును గల్పించుచున్నాను" అనియెను.

కాశీ—ఔను బాబూ! సామాన్యకష్టమా? చూడుము! నీవు వ్రాసిన దొక్క చిన్నయుత్తరమే కాని దానిమూలమున నేనెన్నియో బాధలు పడవలసివచ్చుచున్నది!

పదునేడవ ప్రకరణము.

ఉత్తరములకు ఫలము.

కాశీనాథుఁ డూహించినట్లే యంతయును జరిగెను. సరిగాఁ దొమ్మిదిగంటలవేళకే యాయుత్తరము హారమసజీకిఁ జేరెను. అందు

వేఱువేఱురకములవ్రాఁత లగపడియెను. వ్రాసినవారిపేరు లేదు. హారమసజీ హృదయావేగముతో నాయుత్తరమును జదువుకొనియెను. అందిట్లున్నది:—

"మహాశయా! సద్వివేచకుఁడ వగునీవు నీకోశాధ్యక్షుఁడగు రస్తుమజీపై దొంగతనము నారోపించి కారాగృహమునకుఁ బంపించి గొప్పపని చేసితివి. అతనియెడల సంశయించియే యట్లుచేసితివి. కాని నీయినుపపెట్టెలోనిలక్షరూపాయల నపహరించినదొంగయే నీభార్యయగురాజాబాయినగలనన్నిటిని నపహరించి బజారులోఁ దాకట్టుపెట్టె ననుసంగతిమాత్రము నీవింకను గ్రహింపఁజాలవైతివి.

నీస్వభావమేమో నాకుఁ దెలియదు. ఇట్టిస్థితిలో నేనే యైనచో లోకులచే నిందింపఁబడుచు నేమియు నెఱుంగనియట్టూరక యుండఁజాలను; సత్వరముగ దీనికిఁ బ్రతీకారముగా చేసియే యుందును; నిరంతరమును నాభార్యపై నొకకన్నుంచియే యుందును; ఆమెపురుషబంధువులనుగాని, మిత్రులనుగాని యెంతమాత్రమును విశ్వసింపకయే యుందును.

ఇట్లుమిత్రుఁడు,
ఒకానొక హితవాది—"

ఉత్తరము చదివినంతనే హారమసజీకి మతిపోయెను. ఆతనిసుఖసౌధముపైఁ బిడుగుపడినది! అతీతసుఖచ్ఛాయ యాతని హృదయక్షేత్రమున నుదితమై వర్తమానమును మఱింతభీషణముగఁ జేసివైచెను. ప్రాణప్రియ యగునాతనికాంతయే యాతని వంచించుచున్నది! హారమసజీ యాకస్మికముగ నున్మత్తుఁడైపోయెను. ఆతనికరచరణాద్యవయవములును మనంబునుగూడ నవశములైపోయెను. ఆతఁడు స్తంభితుఁడై శూన్యదృష్టితో నాయుత్తరమునే చూచుచుండెను. ఆకస్మికముగ నాతఁడు క్రోధావేశముతో లేచి పండ్లుపటపటఁగొరుకుచు

"నేనెంతటిమూఢుఁడను! ఎవ్వఁడో పేరులేనివాఁడు వ్రాసినయుత్తరమును నమ్మి, సాధ్వీమణియు, నుత్తమచరిత్రయు నగుకులకాంతస్వభావమునుగూర్చి శంకించుచున్నాను!" అని యనుకొనుచు నాయుత్తరమును జుట్టఁబెట్టి దూరముగఁ బాఱవైచి "నేనీయుత్తరముమాట నిఁక మఱచిపోవలయును. పతివ్రతలస్వభావమును శంకించుటవలనఁగూడఁ బాపమున్నది!" అని నిశ్చయించుకొనియెను.

కాని యాతఁడిఁక నితరములగునుత్తరములను విచ్చుటకుఁగూడఁ సాహసింపఁజాలకపోయెను. ఆతఁడెంతమఱచిపోవుదమనుకొన్నను నాయుత్తరములోనిప్రత్యక్షరము నాతనికన్నులఁగట్టినట్లగపడుచుండుటచే మనస్సును మఱలించుకొనుటకుపాయముం గానక నిశ్చేష్టుఁడైపోయెను. క్రమముగా నాతనియనుమానము ప్రబలి కాలసర్పముంబోలి కఱచివైచుచుండుటచే సర్వాంగకములును మండిపోవుచుండెను. ఆవిషదంశనమున నాతనిహృదయము జర్జరితమైపోవుచుండెను. మందభాగ్యుఁడగు హారమసజీ యెంతప్రయత్నించినను దన్నుదాను సమాళించుకొనఁజాలకపోయెను. అప్పుడాతఁడు ఖల్లపై బోరగిలఁబడి చేతులపై మొగముంచుకొని తనకులసతిచరిత్రముంగూర్చి భావించుకొనఁదొడఁగెను. ప్రత్యేకముగ భావించినకొలఁదియు నాతనియనుమానము వర్ధిల్లుచుండెను. హృదయక్షేత్రమున ననుమానబీజముపడినంతనే మొలకెత్తి శాఖోపశాఖలతో వ్యాపించి చిత్తవృత్తులనన్నిటి నాక్రమించివైచును. దానిమూలము హృదయాంతఃప్రదేశము మొదలుగ నంతస్తమఃప్రదేశమువఱకును వ్యాపించిపోవును. మందభాగ్యుఁడగు హారమసజీ యిప్పుడు కింకర్తవ్యతావిమూఢుఁడై కాతరకంఠస్వరముతో హా! ఈశ్వరా! దయామయా! నన్నీవిపత్తునుండి రక్షింపుము! ఒక్కనిమిషములో నాసర్వస్వమును నాశనమైపోయినది సుఖము, సౌభాగ్యము ఐశ్వర్యము, గౌరవము, ధర్మము, కర్మము, అ

న్నియును బోయినవి, ప్రభూ! నీవు రక్షింపకున్నచో నిఁక నాకు దిక్కెవ్వరున్నారు? తండ్రీ! ఈదుర్ఘటనాదుస్స్వప్నమునుండి నన్ను మేల్కొలుపుము!" అని ప్రార్థించుచు నంతలో నాతఁడు చటాలున లేచి గృహమధ్యమునకుఁబోయి మరలి వచ్చి తనభార్యయందలి దోషసంశయమును మఱలించుకొనుటకై యుద్దేశించి యాయుత్తరము వ్రాసిన వాసిని నిందించుచు నుత్తరమును మఱలఁ దెచ్చి బల్లపైనుంచి పరిశీలించెను. అందలిప్రత్యక్షరమును దీక్ష్ణాగ్రకంటకముంబోలి యాతనిచేతులను గ్రుచ్చుకొనుచుండెను. ఆతఁడు దానిం జూచుచు ఎవ్వఁడో నాయుద్యోగియే యీయుత్తరము వ్రాసి యుండును; సందేహము లేదు. కోపపడి తిననియో, జీతము హెచ్చింపలేదనియో నాయందలి విద్వేషముచే నీవిధముగాఁ దనమనఃపరితాపము తీర్చుకొని యుండును. అట్టిదుష్టుఁడు వ్రాసిన యీనీచపువ్రాఁతలను విశ్వసించుటయుచితము కాదు. ఎదుటఁబడి మాటాడఁ జాలని పిఱికిపందయగుతుంటరివ్రాసిన వ్రాఁత నింతగా చాటించుటకంటె మూర్ఖత యేమున్నది! ఈయుత్తరము కాల్చివేయవలసినది! "అని భావించుకొనియెను.

కాని మనసునఁ దలఁచుకొన్నంతవఱకుఁ గార్యరూపమునఁ బరిణమింపఁజేయుట దుస్తరమని హారమసజీ యాలోచింపలేదు. ఆయుత్తరము నగ్నిజ్వాలలో వైచి భస్మము చేసినను భస్మమునందలిప్రత్యణువునందునుగల యనుమానవిషము హృదయమధ్యమునఁ బ్రవేశించి తలకెక్కి యనంతమగువిశ్వాసమును బవిత్రమగుశాంతినిగూడ నిమిషములో నాశనము చేయకమానదు. విసపుగోరలత్రోఁ గఱచినతరువాతఁ బాము మరణించిన నేమిలాభము? విషము తలకెక్కక మానునా?

ఈవిధముగా హారమసజీ తనమనసుతో మహారణము చేసి యాయాసపడిపోయెను. ఆయుత్తరము నొకసారి తనభార్యకుఁ జూపఁద

లంచెను. చూచి యామె యేమైపోవునో యని భయపడియెను. ఒకవేళ నామె దుశ్చరిత్రయే యైనచో బాగుగఁ దెలిసికొనకుండ ముందుగ నీయుత్తరము నామెకుఁజూపి హెచ్చరించుటవలన నేమిలాభము? ఈయుత్తరమునందెంతవఱకు సత్యమున్నదో ప్రయత్నించి తెలిసికొనవలయును." అని భావించుకొనియెను.

ఆతనివంటియుదారహృదయునకు, సహృదయునకు, ధర్మపరాయణునకుఁ దనయింటిగుట్టు తెలిసికొనుటకై పత్తేదారుపని చేయవలసివచ్చునని యాతఁడు కలనైనఁ దలంచియుండలేదు. కాని యిది సాధారణవిషయమా? ఎంతకష్టమైనను, నెంతదుస్సాధ్యమైనను దప్పక ప్రయత్నము చేసియే తీరవలయును. తరువాతఁ గ్రమముగా రహస్యమెంతభయంకరముగ బయల్పడునో? ఎట్లయినను, గ్రోధముగాని యుద్వేగముగాని లేశమైనను బ్రకటింపకుండ నిశ్శబ్దముగఁ బని చేయవలయును!

అంతలో భోజనసమయ మగుటయు సేవకుఁడు వచ్చి యాతని బిలిచెను. వచ్చెద నని చెప్పి యాభృత్యుని బంపివైచి హారమసజీ యద్దమునొద్దకుఁ బోయి తనమొగమును దానే చూచుకొని భయవిస్మితుఁడై "ఏమి! నేనింతదుర్బలుఁడనైపోయితినే! ఇఁక నధైర్యపడుట మంచిది కాదు. సత్యమును గ్రహించువఱకును ధైర్యముతోఁ బ్రయత్నింపవలయును" అనియనుకొని భోజనమునకై లోనికిఁ బోయెను.

ఆతఁడు భోజనమునకుఁ గూర్చుండి లేనిపోనిసంగతులనుగూర్చి మాటలు కల్పించుకొని రాజాబాయితో సంభాషింపఁదొడంగెను. ఆమెకుఁ దనహృదయమునందలిభావాంతరము గోచరింపకుండుటకై యాతఁ డట్లు చేయవలసివచ్చెను. ఆతఁ డీవిధముగాఁ గాలక్షేపము చేయుచుఁ దుట్టతుదకు "మీరీదినమున నెచ్చటికైన షికారు పోయెదరా?" అని ప్రశ్నించెను.

రాజా—ఆ. నేనును గమలయుఁగూడఁ బోయెదము.

హార—ఎప్పుడు?

రాజా—మూడుగంటలకు.

హారమసజీ యప్పుడు తనతలపై బరువు దింపుకొన్నట్లొక నిట్టూర్పు విడిచెను; సాయంకాలమునకు ముందే యన్ని పనులను జక్కఁ బెట్టుకొనవచ్చునని యూఱడిల్లెను. అనుమానజ్వాలచే ననుక్షణమును దహింపఁబడిపోవుటకంటె నెంతటిభయంకరమైనదైనను రహస్యమును శీఘ్రముగ భేదించి తెలిసికొని యేదియో యొకవిధముగ స్థిరపఱచుకొనుటయే క్షేమమని యాతఁడు నిశ్చయించుకొనియెను. ఆతఁడు మనసులో నెంతగాఁ గొట్టుకొనుచున్నను, బైకిమాత్రము తన హృదయభావమును వెల్లడి కాకుండునట్లు ప్రయత్నించుచుండెను.

భోజనమెట్లో కావించి యాతఁడుమరలఁ దనగదిలోనికి వచ్చి కూరుచుండెను.

పదునెనిమిదవ ప్రకరణము.

ఆశాశేషము.

కాలము నెంతటివారు నడ్డగింపఁజాలరు. క్రమముగా సూర్యభగవానుఁ డస్తాద్రివంకకు మఱలెను. చెట్లనీడ లాతనివిపరీతదిశకు మరలి దీర్ఘములై, దీర్ఘతరము లగుచుండెను. వాయుతాప మింకను జల్లార లేదు. ఆసమయమునకుసరిగ బండిచక్రములచప్పుడు వినఁబడియెను. హారమసజీ గవాక్షమునుండి తొంగిచూచెను. రాజాబాయి కమలతోఁగూడ బండినెక్కి బయలుదేరిపోయెను.

ఇఁక నొకముహూర్తమైన నాలస్యముచేయక హారమసజీ తన పడకటింటఁ బ్రవేశించి కంపితకరములతో నినుపపెట్టెను దెఱచెను. తోడనే యాతఁడందలినగలపెట్టెను బైకిఁ దీసెను; ఇంకను బరిశీలించి చూచెను గాని యాయఱలోనుండవలసినకొన్ని చిన్నచిన్ననగలపెట్టెలాతని కగపడలేదు. హారమసజీ తత్తరముతో "అట్లయినచో నాయుత్తరము సత్యమేనా? కాదు—కాదు—అసంభవము!" అని యనుకొనుచు నాతఁడాపెట్టెలోనివాని నన్నిటిని ద్రిప్పిత్రిప్పి చూడనారంభించెను. నగలనన్నిటినొక్కచోఁ జేర్చి రాజాబాయి యెచ్చటనైన దాఁచినదేమో యని యాతనియుద్దేశము! కాని యెంత వెదకినను బెట్టెయందొకయలంకారమైనను నాతని కగపడలేదు; నవరత్నఖచితములగు నెన్నియోనగలు! అవి యన్నియు నేమైపోయినవి?

హారమసజీ కేమియుఁ దోఁచుట లేదు. మణులు కదలిపోవుటచే మరమ్మతుకొఱకుఁ బంపియుండునేమో యని యాతఁడు శంకించెను. కాని నగలన్నియును జాలవఱకుఁ గ్రొత్తగఁ జేయించినవే. ఒకవేళ నట్లు జరిగినను నన్నినగలు నొక్కసారి మరమ్మతునకు వచ్చునా? అని యిట్లు సందేహించి హారమసజీ యధికప్రయత్నముతో మఱల వెదకుట కారంభించెను. ఒకవస్తువైన నాతని కగపడలేదు.

ఇదివఱకొకనాఁడు హారమసజీ తనభార్యంగాంచి "నగలుపెట్టుకొనుట లేదేమి?" అని ప్రశ్నించెను. "నగలు పెట్టుకొనకున్న నేమి? నాకు లక్షలకొలఁది విలువగలనగలున్నవని యిక్కడివా రెవ్వ రెఱుఁగరు?" అని రాజాబాయి ప్రత్యుత్తర మిచ్చెను—ఇప్పుడాసంగతి హారమసజీ కాకస్మికముగా స్మృతికివచ్చెను—అవును, సిగ్గుగాని, భయముగాని, సంశయముగాని, యెంతమాత్రమును లేకుండ రాజాబాయి యాదినమునఁ దడవికొనకుండఁ దత్క్షణమునందే యిట్లు చెప్పిన

మాట నిజమే—కుటిలహృదయము సరళభావాభినయముచే నెట్లు కప్పఁబడిపోయినది! ఇట్లు భావించుకొని హరమసజీ వ్యాకులపడుచుండఁగా నాతని సందేహాంధకారపూరితమగు హృదయాంతరాళమునం దొక యాశాక్షణకిరణ ముదయించి మినుకుమినుకు మనుచుండెను. అలంకారము లన్నియును రాజాబాయి కమలయొద్ద దాఁచియుండు నేమోయని యాతఁడు భావించెను.

తోడనే యాతఁడు కమలశయనమందిరమునకుఁ బోయి యామె నగలపెట్టెను గూడఁ దెఱచి చూచెను. అందువలన నేమిలాభము కలిగినది? రాజాబాయి నగ లగపడలేదు సరిగదా కమలయలంకారములుకూడ నందు లేకపోయెను. "ఎంత దారుణము! కమలకూడ నీపాపనాటకమునఁ జేరినదేనా? ఆమెకూడ నట్టిదుర్వ్యాపారమునకుఁ గడంగినదా?" మూర్ఛావస్థలో నున్న హరమసజీ కీసంశయము ప్రాణములమీఁదికే వచ్చెను.

అప్పుడాతఁడు తల తిరిగిపోవుచుండఁ దూలుచుఁ దూలుచుఁ గమలమంచముపైఁ బడిపోయి కఠినభావముతోఁ గరతలముల నొండొంటి నొఱయించుచు నిశ్చేష్టుఁడై యుండెను. అప్పుడాతనికి వర్తమానము శోచనీయంబును, భవిష్యమంధకారమయంబును నై యతీతస్మృతి యాతని సర్వాంగకములను గశాఘాతము చేయుచున్నట్లుండెను, ఆతనికీర్తిగౌరవము, ప్రసిద్ధనామము, మనశ్శాంతి, సంసారసుఖము, జీవితాశ సర్వము నొక్కగడియలో నొక్కఫూత్కారముతో భస్మములైపోయినవి! ఎన్నియోయేండ్లు శ్రమపడి సంపాదించిన యాతని యైశ్వర్యమంతయు నప్పుడు భస్మరూపమునఁ బరిణమించినది! ఇంతవఱకేదియుఁ బరివర్తనము నందలేదు—అన్నియు నెప్పటియట్లే యుండెను. ఎక్కడనుండవలసిన వక్కడనే యుండెను. ఈయిరువదియేండ్లు నెట్లు గడచినవో కాల మిప్పుడు నట్లే గడచు

చున్నది—ఇదియంతయు బహిఃప్రపంచకార్యము!—కాని యిప్పుడాతనిహృదయమున విషమపరివర్తనము కలిగినది. ఏస్థానమునం దిప్పటివఱకును దయ, మోహము, స్నేహము, ప్రేమ, అనురాగము, శాంతి యను నమృతప్రవాహములు ప్రవహించుచుండెనో యాస్థానమునందే యెక్కడనుండియో వచ్చి యిప్పుడాకస్మికముగ భీషణాగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుచున్నవి!

"ఈసంసార మెంతభయంకరమైనది! ఆలోచించినచో నింతకంటెను నరక మెక్కడ నున్నది? ఇక్కడనే! రమణీహృదయమునందే! ఈయిరువదేండ్లనుండియు రాజాబాయి నన్ను వంచించుచునే యున్నది!—అతిక్రూరమగు దారిద్ర్యపీడనమున హృదయరక్తము శుష్కమైపోయియున్న కాలమున రాజాబాయిని నేను పెండ్లియాడితిని. ఇప్పుడామె కాసంగతి జ్ఞప్తియందు లేదు. నన్ను మఱపించుటకై యామె యెన్నియో ప్రేమాలాపములు పలికినది. ఎన్నియోవిధముల నిజానురాగమును వెల్లడించినది; ఎన్నియోవేళల నెన్నియోరీతుల నన్నుఁ బ్రశంసించినది; నాభార్యయగుటచేతనే తనకట్టిసౌభాగ్యము కలిగిన దని యెన్నియోసారులు కృతజ్ఞతను సూచించినది! అయ్యో? అన్నియు నసత్యములైపోయినవి! అన్నియు నటనములే! అన్నియుఁ గల్పనలే! ఎంతటిపిశాచియైనది! ఇదియా నాయగాధప్రేమకుఁ బ్రతిఫలము? ఎంతటి దారుణకృత్యము! వలపుల మగని భాగినేయునిగాఁ బ్రకటించి నాగృహమునందే యీరాకాసి చతురనాటకము లాడుచున్నదే! నాయంతఃపురమునందే యీదురాత్మునిహాస్యాలాపములా? పంక్తిభోజనములా? ఎంతసాహసము! కృత్రిమప్రేమాభినయముచే నన్నున్మత్తునిగాఁ జేసివైచినదే! ఛీఛీ! నేనెంతమూఢుఁడను! ఇంతకాలమువఱకు నీమోసము నించుకంతయును గ్రహింపఁజాలకపోయితిని! ఆయుత్తరమే రాకయున్నచో నింకను నెంతకాల మిట్లు కన్నులు మూ

సికొని యుండునో? ఉత్తరమును వ్రాసినవాఁ డెట్టివాఁడైన నగుఁగాక! ఆతఁడే నాకుఁ బరమమిత్రుఁడు!” అని హారమసజీ యనేకవిధముల భావించుకొనియెను.

విశ్వాసము వచ్చినప్పుడు దానితో సర్వమును వచ్చును; మరల నదిపోయినప్పుడు సర్వమును దానితోడనే పోవును! ఇప్పుడు హారమసజీకి విశ్వాసమే పోయినది. ఆతఁడు పెట్టె నెప్పటివలె మూసి తన గదిలోనికి వచ్చి ద్వారరక్షకునిం బిలిచి “ఎవ్వరికేయుత్తరము వచ్చినను ముందుగ నాచేతి కిమ్ము!” అని చెప్పి పంపివైచెను.

పరాభవము కలిగినప్పుడు మానవుఁ డెట్లే యున్మత్తుఁడై చావు గోరుకొనుచుండును. హారమసజీ యప్పు డాత్మహత్యచేసికొని తనహృదయజ్వాలను జల్లార్చుకొనఁదలఁచెను గాని యీమోసమునకుఁ దగిన ప్రతిక్రియ గావింపకుండ మరణించుట పౌరుషము కాదని భావించుకొనియెను; ఊరక యిప్పుడు మరణించి పాపాత్ములపాపకృత్యముల కింకను నవకాశము కల్పించుట యుక్తము కాదని యనుకొనియెను.

సాయంకాలమునకు రాజాబాయియుఁ, గమలయు, రత్నాబాయియు నింటికి వచ్చిరి. హారమసజీ తనహృదయభావము నెట్లో యడంచుకొని యుండెను. రాత్రియెనిమిదిగంటలకు మాంచరజీ యంతఃపురమునఁ బ్రవేశించెను. సర్వస్వాపహారి యగు నాదురాత్మునింగాంచి కోపమును బట్టఁజాలనని యెంచి హారమసజీ యతిత్వరితముగ వెలుపలికిఁ బోయెను. చాలరాత్రివఱకును హారమసజీ లోపలికి రానేలేదు!

పందొమ్మిదవ ప్రకరణము.

విపత్సూచన.

మఱునాఁడు మధ్యాహ్నమున నుత్తరము లన్నియును హారమసజీయొద్దకు వచ్చెను. అందు బొంబాయినుండియే వచ్చియున్నయు

త్తరము నొకదాని నాతఁడు తత్తరముతోఁ దీసికొని విచ్చి యిట్లు చదివెను!—

“దొడ్డా! ఏవిధముగానైనను నీవొకసారి నాకు దర్శనమీయవలయును! ముఖ్యముగా నీవీసాయంకాలమున కిచ్చటికి రావలయును నేనచ్చటికి రాఁజాలను. కారణము నీవు వచ్చినచో నీకే తెలియఁగలదు. నేను రాఁగలిగినచో నీకిట్టికష్టమును గల్పింపకయే యుందును. స్థితిగతులనుబట్టిచూడఁగా మనరహస్యమంతయు వెల్లడియైపోవునేమో యని భయము కలుగుచున్నది. తప్పక నీవొకసారి వచ్చి మాటాడవలయును. మాంచరజీ—”

హారమసజీయా పాదమస్తకమును గంపించిపోవుచుండెను. ప్రతిహింసాసాధనమున కవకాశము కలిగినదని యాతఁ డున్మత్తుఁడై యానందావేగముతో “సరే, మంచిపని జరగినది! దేనిని గోరుకొనుచుంటినో యది యిప్పటికిఁ జేతికి దొరకినది!” అని యనుకొనుచు జటాలున లేచి యలమారునందలి రివాల్వరును దీసి బాగుగఁ ద్రిప్పిత్రిప్పి పరిశీలించి గుండ్లను బారుచేసి సిద్ధపఱచెను. అప్పుడు తాను చేయుచున్న పని యెవ్వరును జూచుట లేదనియే యాతఁడు తలంచెను. కాని రత్నాబాయి జాగరూకతతో నంతయుఁ గాంచుచునే యుండెను.

పిమ్మట హారమసజీ యారివాల్వరు నలమారుమీఁద నుంచి వెలుపలికిఁబోయి మాంచరజీవ్రాసినయుత్తరము నెప్పటివలె నంటించి దానిని దాసిచే రాజాబాయికిఁ బంపవలయునని వెడలిపోయెను.

ఆసమయమున రత్నాబాయి హారమసజీగదిలోఁ బ్రవేశించి యంతలోనే మరల వెలుపలికి వచ్చెను. ఇంతలోఁ బాదరక్షలచప్పుడు వినవచ్చుటచే హారమసజీ వచ్చుచుండెనని యెంచి యామె యెప్పటివలె దాఁగికొనియెను. హారమసజీ మరలఁ దనగదిలోనికి వచ్చి యంతయును జూచుకొని మఱియొకవైపునకుఁబోయెను.

అప్పుడు రత్నాబాయి తనలో "నాచేతనైనంతపని చేసితిని. ఇంక నేమి చేయుదును! ఇంకను గావలసినంతపని యున్నది. ఇట్టిదురవస్థలో నామహాత్మునిసాహాయ్యముకంటె గత్యంతరము లేదు!" అని నిశ్చయించుకొనియెను.

సరిగా సంధ్యాసమయమునకు రాజాబాయి సొంతబండిపైనెక్కి షికారునకుఁ బోయెను. హారమసజీ రహస్యముగ రివాల్వరును దీసికొని యద్దెబండినెక్కి తనభార్య ననుసరించుచుఁ బోయెను.

రత్నాబాయి యంతయును జూచుచునేయుండెను. అప్పు డామె వ్యాకులహృదయముతో "అంతయును ముగిసిపోయినది!" అని యనుకొనుచు జరగినసంగతు లన్నియు నొకయుత్తరమున వ్రాసి దాని నొకసేవకునిచేఁ గాశీనాథునకుఁ బంపించెను.

ఇరువదియవప్రకరణము.

భీషణఫలము.

రాజాబాయి పోవునప్పటికి మాంచరజీ శయ్యపైఁ బడి యుండెను. ఆమెం గాంచినతోడనే యాతఁడు తత్తరముతో లేచి కూర్చుండెను. రాజాబాయియు నప్పుడు శయ్యాపార్శ్వమునఁ గూర్చుండెను.

మాంచ—నేను నీకనేకకష్టములఁ గల్పించితిని—ఇప్పుడు నీకష్టమును గలిగించితిని. అందుకొఱకు నేనపరాధినే. కాని నేనిప్పుడు మహావిపత్తునఁ బడియున్నాను!—నేను చేసినదానికొఱకు బ్రదికియున్నంతవఱకును నేను పరితాపపడవలసినదే! నేనిప్పుడు నీతో నేమి చెప్పవలయు......

ఇంకను మాట ముగియనేలేదు! భయంకరశబ్దముతోఁ దలుపులు తెఱవఁబడియెను—మాంచరజీ దిగ్గున లేచి నిలువఁబడియెను—ఆతనియెట్టయెదుట హారమసజీభయంకరమూర్తి! ఆతనిచేతిలో రివాల్వరు—ఆతనిమొగమున వికారాకారము—ఆతనికన్నుల నగ్నిస్ఫులింగములు!—

హారమసజీ యట్టహాసము చేయుచు "అవును. నీవిప్పు డాకస్మికముగ నన్నుఁ జూచి యాశ్చర్యపడుచున్నావు! చిరకాలము నీదుష్కృత్య మిట్లే సాగు నని నీవు నమ్మికొని యున్నావు—" అనియెను.

ఇఁక నప్పు డెవ్వరును మాటాడలేదు. ఒక్కనిమిషము నిశ్శబ్దముగా నుండెను. పిమ్మట మాంచరజీ "మహాశయా! నేను మిమ్ములను—"

ఇఁక మాటాడనీయలేదు. హారమసజీ యాతని నొక్కతన్ను తన్ని "దురాత్మా! నోరు మూయుము! ఇఁకఁ జాలును—ఇఁక నీయసత్యవాక్యములతోఁ బని లేదు—నాకన్నులు తెఱవఁబడినవి—ఇంకను మీకీవృథాప్రయాస మెందులకు?" అని గద్దించి పలికెను.

మాంచరజీ భయముతో "అయ్యా! కోపము వలదు—నేను ప్రమాణము చేసి చెప్పుచున్నాను—"

హారమసజీ క్రోధముతో గర్జించుచు "నీయసత్యప్రమాణము లెవ్వరికిఁ గావలయును? ఇఁక నీవు నన్ను మోసగింపఁజాలవు—నాకంతయును దెలిసిపోయినది! నాభార్యనగలన్నియును గొనిపోయి తాకట్టుపెట్టినవాఁ డెవ్వఁడు? నాయినుపపెట్టెలోని లక్షరూపాయలను దొంగిలించినవాఁ డెవ్వఁడు? నీవే! నిశ్చయముగ నీవే! తుంటరీ! పోకిరీ! నీమూలమున—నీవు చేసిన నేరమునకు—నిరపరాధియగు రస్తమజీని పోలీసువారిచే బాధింపఁజేసితిని! ఇదిగో! ఇఁక నీపాపమునకుఁ దగినప్రాయశ్చిత్తమును జేసెదను!" అని దూషించుచు హారమసజీ తనరివాల్వరును బైకెత్తి మాంచరజీమస్తకమునకు సరిగా గుఱిపెట్టెను.

మాంచరజీ భయభ్రాంతుఁడై యస్ఫుటస్వరమున నార్తనాదము చేయుచుఁ బార్శ్వమున కొత్తిగిలి నిలువఁబడియెను. అప్పుడు రాజాబాయినివర్ణవదనము మఱింతవికృత మయ్యెను. ఆమె వడవడ వడఁకుచు హరమసజీపాదములచెంత మోకరిలఁ బడియెను. రహస్యమంతయును నాథునకుఁ దెలిసిపోయిన దని యామె గ్రహించెను. ఇంతవఱకు నామె యతికష్టముతో నసత్యములపై నసత్యములను జెప్పి పాపమును దాఁపఁగలిగెను; కాని యిప్పటి కామె సర్వప్రయత్నములును నిష్ఫలములై పోయినవి. అప్పు డామె చేతులు జోడించి కన్నుల నీరునించుచు బాష్పరుద్ధకంఠస్వరముతో హరమసజీ నుద్దేశించి "నన్ను క్షమింపుఁడు! నాసర్వాపరాధములను క్షమింపుఁడు! నేనిప్పుడు మిమ్ములను క్షమాభిక్ష వేఁడుకొనుచున్నాను!" అనిప్రార్థించెను.

రాజాబాయికరుణస్వరమును, గాతరప్రార్థనమును, నప్పుడు హరమసజీహృదయమునఁ గడచినయిరువది యేండ్లసుఖసౌభాగ్యములను దలపింపఁ జేసెను. ఆతనియాపాదమస్తకమును బులకించెను. ఎవ్వతె నాతఁడు తనహృదయరాజ్యేశ్వరిగఁ జేసికొనియుండెనో, యెవ్వతెకనుసన్నలయందే యాతనిసుఖదుఃఖములు నియమితములై యుండెనో యెవ్వతెమందహాసలేశమునం దాతఁడుస్వర్గసుఖము ననుభవించుచుండెనో, యెవ్వతెభ్రూముడి నాతఁడు బెదరిబెదరి చూచుచుండెనో—యట్టిరాజాబాయి యిప్పు డిట్టియవస్థలో నున్నది! వర్తమాన మిట్లంధకారబంధురమై పోయినప్పుడే మానవునిహృదయమునం దతీతసుఖస్మృతి జాగరిత మగుచుండును! అప్పుడు హరమసజీ హృదయము కరఁగి నీరైపోయెను. అతఁడు భగ్నకంఠస్వరముతో "నిర్భాగ్యురాలా! నేనేమి చేసితిని? ఎందుకొఱకు నన్ను వంచించితివి? సర్వాంతఃకరణములను నేను నిన్నుఁ బ్రేమించితిని—ఇదియేనా నేనుచేసిన తప్పు? ఒక్కనాఁడైనను నేను నిన్ను మఱచియుండలేదు. ఎన్నఁడును నిన్నుఁగూర్చి పరు

షముగ మాటాడలేదు. నీకేమికష్టము కలిగినది? నీసుఖముకొఱకు నిరంతరమును నేను ప్రాణపణముగఁ బ్రయత్నించుచుండుట లేదా? పండువంటిసంసారమునం దిట్టిసుఖము ననుభవింపఁజాలక మోహాలంపటతచే నున్మత్తవై తుదకీనరకకూపమునఁ బ్రవేశించితివా? అక్కడ నీయం దెల్లవారికి నెంతటిభక్తిశ్రద్ధలు కలవో, యక్కడ నెల్లవారిలోను నీకెట్టిగౌరవలాభములు కలవో యొక్కసారి స్మృతికిఁ దెచ్చుకొని చూడుము! కామలాలసవై సర్వమును మఱచిపోయితివా? దురదృష్టవంతురాలా! ఆత్మదోషముచే నన్నియును బోఁగొట్టుకొంటివి; సర్వమును నాశనము చేసికొంటివి! అయాచిత మగునాయగాధప్రేమము నీకరుచియైన నగుఁగాక! తక్కినవాని నైన నేల చూచుకొనలేదు? కన్నబిడ్డ యగుకమలాబాయిమాట నీకు స్మృతికి రాలేదా? ఆమెమొగము చూచియైన నీదురుద్దేశమును మరల్చుకొనఁజాలకపోయితివా?" అని యిట్లతికష్టముతో హరమసజీ మెల్లమెల్లగ భాషించుచుండెను. మాటమాటకు నాతనిశ్వాసము లాగిపోవుచుండెను.

మాంచరజీ యంతయు నాలకించి "ఈతనికి సర్వవృత్తాంతమును దెలియకపోయినను గొంతవఱకుఁ దెలిసినది. తెలిసికొనవలసినదానికంటెఁ దెలిసికొన్నదియే భయంకరవిషయము! ఈసమయమున నిదిపొరపాటని యీతనికి సప్రమాణముగఁ దెలియఁజేయకున్నచో నాతల యెగిరిపోక మానదు." అని భావించుకొని "మహాశయా! దయయుంచి నావిన్నపము నాలకింపుము! అట్లయినచో—"

మాంచరజీ కంఠస్వరముచే హరమసజీమోహము వదలిపోయెను. ఆతఁడు మాంచరజీ నొక్క తన్ను తన్ని "నోరుమూయుము! తులువా! నోరు మూయుము!" అని యదలించెను. మాంచరజీ యిఁక మాటాడలేదు. ఎవ్వరును మాటాడలేదు. ఆనిశ్శబ్దములో రాజాబాయి యస్పష్టరోదనధ్వనిమాత్రము మెల్లగ వినవచ్చుచుండెను.

హర — నేనిచ్చటి కేల వచ్చితినో తెలిసినదా ? మీయిరువురను బ్రేల్చివేయుటకు ! కాని స్త్రీహత్యచేసి నాహస్తమును గలుషితముగఁ జేసికొనుటకు శంకించుచున్నాను — నిరాయుధు —

అప్పుడు మూంచరజీ యేమియో చెప్పఁబోవుచుండఁగా హరమసజీ యాతని నదలించి "నామాట ముగియనిమ్ము ! నీప్రాణము నాచేతిలో నున్నది! నిరాయుధులను నేను చంపఁజాలను. నీరివాల్వరును గూడఁ దీసికొని యాత్మరక్షణము చేసికొనుటకుఁ బ్రయత్నింపుము!" అనియెను.

మూంచరజీ గడగడ వడఁకుచు "వలదు! నేనేమియుఁ జేయఁజాలను!" అనియెను.

హరమసజీ యశనిపాతభీషణస్వరముతో "తప్పదు—నీవిప్పుడాత్మరక్షణము చేసికొనవలయును. చేసికొనకున్నచో —" అని హరమసజీ తనరివాల్వరుతో నాతనివక్షస్థలమున స్పృశించెను. తత్క్షణమే మూంచరజీ కన్నులలో నలుదెసలనుండియు గాఢాంధకారము క్రమ్ముకొనియెను — తోడనే యాతఁడు పరుగెత్తిపోయి తనరివాల్వరును దీసికొని వచ్చి హరమసజీ కెదురుగా గురిపెట్టి నిలిచెను. ఇరువురు నేకాగ్రదృష్టితో నొకరినొకరు లక్ష్యముచేసి యుండిరి. ఎవ్వరినోటినుండియు మాటలేదు.

ఇఁకనొకనిమిషములో సర్వనాశన మైపోవును ! రాజాబాయి గుండెలు పగిలిపోవుచుండెను. అప్పు డామె యున్మాదినివలె నిరువురినడుమను నిలిచి వ్యాకులహృదయముతో రోదనము చేయుచు "దయయుంచుము! రక్షింపుము! నేనొక్కమాటయైన దాఁపకుండ సర్వమును విన్నవించెదను ! చంపవలసి యున్నచో నన్నుఁ జంపుము !" అని వేఁడుకొనియెను.

రాజాబాయి తనప్రియునికొఱకుఁ దనజీవితమునైన నర్పించుటకు సిద్ధముగానున్నదని యెంచి హరమసజీకోపము పారమును మిట్టెను. అతఁడుగ్రుఁడై మండిపడుచు నామెచేయిపట్టుకొని యొకవంకకామెను ద్రోసివైచి "నీ వాఁడుదానవు ! నాయెదుట నిలువకుము! దూరముగఁ బొమ్ము!" అనియెను. రాజాబాయి యట్లు త్రోసివైవఁబడియును జటాలునఁ బోయి మూంచరజీని గౌఁగిలించుకొని కాతరస్వరముతో "నన్నుఁజంపుము ! కేవలము నేనే—అయ్యో ! కేవలము నేనే పాపాత్మురాలను! నేనే యపరాధము చేసితిని !" అని యేడువఁదొడంగెను.

హరమసజీ మంటలుగురియుకన్నులతో నాదృశ్యమును గనుంగొనియెను. ఆతఁడిఁక సహింపఁజాలక లక్ష్యము సరిచేసి రివాల్వరు నెత్తెను. తోడనే రివాల్వరుమొగమునుండి ధూమము బహిర్గతమయ్యెను; మఱియు రివాల్వరు ప్రేలినశబ్దముచే గది యంతయును గంపించిపోయెను! మూంచరజీ చచ్చితి ననుకొని కొయ్యవడిపోయెను. ఆతనిప్రాణములు కడలంటిపోయెను. ఆతనిచేతిలోనిరివాల్వరు క్రిందికి జారిపోయెను!

రాజాబాయి యట్లే మూంచరజీని గౌఁగిలించుకొని యుండెను. ఆయిరువురిలో నెవ్వరు నింకను జచ్చిపడిపోవలేదు. హరమసజీ కాలాగ్నిరుద్రునివలె మండిపడుచు మరల రివాల్వరును బ్రేల్చెను. ఈసారియు నెవ్వరును బడలేదు! మరలమూఁడవసారి ప్రేల్చెను! రాజాబాయియు, మూంచరజీయును శిలాప్రతిమలవలె నట్లే యుండిరి!

హరమసజీ మరల రివాల్వరు నెత్తుచుండఁగా వెనుకనుండి యెవ్వఁడో వచ్చి యాతనిరివాల్వరును లాగికొని బలవంతముగ హరమసజీ నెత్తికొనిపోయి మంచముపైఁ బడవైచి తత్తరముతో మరల రాజాబాయియొద్దకు వచ్చెను! రాజాబాయి కెట్టియుపాయమును గలుగ

లేదు. అప్పు డాయాగంతుకుఁడు పరమానందముతో "ఆహా! ధర్మమే రక్షించినది!" అనియెను.

పాఠకులారా! ఆయాగంతుకుఁడు మనకుఁ బరిచితుఁడగు కాశీనాథుఁడే! ఆతఁడు రత్నాబాయి పంపిన సమాచారమును విని తత్క్షణమే యిచ్చటికి బయలుదేరి వచ్చెను. ఆతఁడు రివాల్వరు కాల్చిన శబ్దములను విని రాజాబాయి చచ్చిపోయియుండునని యే భావించెను గాని రత్నాబాయి యారివాల్వరులోని గుండ్లను దీసివైచిన సంగతి యాతనికిఁ దెలియలేదు.

అప్పుడు హారమసజీ క్రోధోజ్వలుఁడై లేచి వచ్చి కాశీనాథుని దలించుచు "నీవెవ్వఁడవు? నన్నేల యడ్డగించితివి? నేను వీరియపరాధము నించుకంతయును క్షమింపఁజాలను—ఈక్షణముననే యిరువురను గాల్చివైచెదను!" అనియెను.

కాశీ—ఏమియుఁ జేయఁజాలవు—నేనెవ్వఁడనా? నీమిత్రుఁడను మిత్రుఁడను గాకపోయినను మిత్రుఁడు చేయఁదగిన పని చేసితిని! ఎప్పటికైన నీవు నన్నుఁ బరమమిత్రునిగా భావింపఁగలవు!

అని చెప్పుచుఁ గాశీనాథుఁ డాతని చేయి పట్టుకొని హారమసజీ చెవిచెంత మొగముంచి మెల్ల మెల్లగా "ఇంతవఱకు బాగుగనే జరిగినది. ఈశ్వరుఁడు రక్షించినాఁడు! కాకయున్నచో నిష్కారణముగ ఖూనీనేరమునఁబడి సర్వనాశనముఁ దెచ్చికొని యుందువు! ఆయనామక లేఖయే నీకింతటి విభ్రాంతిని గల్పించినది!" అనియెను.

హారమసజీ యాతని చేతిపట్టు వదలించుకొనఁజాలక హతాశుఁడై నాభార్య "తనతప్పును స్వయముగనే యంగీకరించినది! ఇఁక నీమాట నెట్లు నమ్ముదును?" అనియెను.

కాశీ—అవును నిజమే—కాని యీమె నీవనుమానించిన తప్పు నంగీకరింపలేదు. ఆమె యట్టితప్పు చేయునది కాదు! నీవీతని జంప వచ్చితివి—ఈతఁ డెవ్వఁడనుకొన్నావు?

హార—ఎఱుఁగుదును—వీఁడు నాభార్యకు జారుఁడు!—

కాశీ—కాఁడు-కాఁడు-నీభార్యకుమారుఁడు!

ఇరువదియొకటవ ప్రకరణము.

విస్మయము

హారమసజీ యుద్భ్రాంతనయనములతో నొకసారి మాంచరజీ వంకను, నొకసారి రాజాబాయివంకను, తుదకుఁ గాశీనాథునివంకను జూచి "అసత్యము! నీవు నన్ను వంచించుచున్నావు! నేను నీకపటజాలమునఁ దగుల్కొనువాఁడను గాను!" అనియెను.

కాశీ—కావలసినన్ని నిదర్శనములున్నవి! వానికొఱ కిప్పుడు తొందరపడనక్కఱలేదు. రెండుమూఁడు దినములోపిక పట్టుము. నేనే వచ్చి నీకంతయును దెలిపెదను.

హార—నీమాట లెవ్వరు నమ్ముదురు?

కాశీ—నమ్మకున్నచో నాత్రోవను నేను పోయెదను. నీయిచ్ఛవచ్చినట్లు చేసికొనుము! కాని, తరువాత నీవు బ్రదికి యున్నంత కాలమును బశ్చాత్తాపదుఃఖమునఁ జచ్చిపోవుచుందువు!

హార—నీవెవ్వఁడవు?

కాశీ—నా పేరు కాశీనాథనాయకుఁడు!

హార—అలాగా? రస్తుమజీవ్యవహారమున సాయము చేసినవారు మీరేనా?

కాశీ—ఔను. ఆతనిపక్షమునఁ బనిచేసినప్పుడే నాకనేకరహస్యములు తెలిసినవి. అందువలననే నీసంగతులుకొన్నిటిని దెలిసికొనఁ గలిగితిని. తరువాత నీకంతయును జెప్పెదను. ఇప్పుడు నేను చెప్పిన మాట సత్యమే. ఇఁక నీవెట్టివిచారమును బెట్టుకొనక రాజాబాయి నింటికిఁ బంపించుము! నేను కొలదిదినములలోనే నిన్నుఁగలిసికొందును. రమ్ము! మిమ్మిరువురను బండిపై నెక్కించి నేను పోయెదను!

మాంచరజీకాక తక్కినవారందఱును వెడలిపోయిరి. మాంచరజీ యొక్కఁడును గూర్చుండి యాకాశమునుండిపాతాళమువఱకు నాలోచించుకొనుచు నిదియంతయు నిదాఘయామినియందలి ఘోరతర దుస్స్వప్నముగా భావించుకొని మాటిమాటికి వ్రేలు గఱచికొనుచుఁ జైతన్యమును గలిగించుకొనుటకై ప్రయత్నించుచుండెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

పట్టువడుట

అందఱును వెడలిపోయినతరువాత మాంచరజీ సామానంతయును సరుదుకొని తెల్లవారినతోడనే యటనుండి బయలుదేరిపోవలయునని నిశ్చయించుకొని శేషరాత్రియంతయును ఘోరనిద్రామగ్నుఁడయ్యెను. తెల్లవారి యెనిమిదిగంట లయ్యెను—ఇంకను నిద్రయే!

అప్పుడెవ్వరో తలుపు గొట్టుటచే నాతనికి నిద్రాభంగ మయ్యెను. ఆతఁడు భయముతోఁ జటాలున లేచెను. పాపాత్మునిహృదయమునకు శాంతి యెట్లుండును? ఆతఁడు పాఱిపోవలయునని కిటికీ యొద్దకుఁ బరుగెత్తెను. అక్కడనుండి క్రిందికి దుమికినచోఁ బ్రాణమే పోవును!

ఇంతలో నాతనికి సేవకునికంఠస్వరమువినఁబడియెను. మాంచరజీ యించుక యూరట నొంది ద్వారమునొద్దకు వచ్చి తలుపుసందుల నుండి వెలుపలకుఁ జూచెను. అచ్చటఁ దనసేవకునికంటె మఱియెవ్వరును లేరని తెలిసికొని యాతఁడు తలుపులను మెల్లగాఁ దెఱచి "ఓరి మూర్ఖుఁడా! నిద్రాభంగము చేసితివేమి?" అని యదలించెను.

సేవ—ఆవశ్యకము కలిగినది—ఏలినవారిపేర వారంటువచ్చినది!

మాంచ—తులువా! నాతోఁ బరిహాసమా?

అనియొక్కయుదుటున నాతనిపైఁబడి కొట్టఁబోయెను.

సేవకుఁడు పార్శ్వమున కొదిగి "ఏమిది! సంకెలలు చేతులకుఁ దగిలింపవలయునా?" అనియెను.

మాంచరజీ కోపము నడఁచుకొనఁజాలక సేవకు నాక్రమించి దురాత్మా! నీవెవ్వరో చెప్పుము!" అనియెను.

సేవకుఁడు నవ్వుచు "నేనా? స్వామివారి దాసానుదాసుఁడను! నాపేరు దాదాభాస్కరుఁడు"—

ఇంతలో నెవ్వఁడో వెనుకనుండి వచ్చి మాంచరజీమెడఁ బట్టుకొని దూరముగ నీడ్చుకొని పోయి "మాంచరజీ హరమసజీబ్యాంకిలోనిసొమ్ము దొంగిలించిన నేరమునకై నిన్నుఁ బట్టుకొన్నాము" అనియెను.

మాంచరజీ శరాహతసింహమువలె వెనుకకుఁ దిరిగి చూచెను; ఎదుట నొకదొరగారును, నలువురురక్షకభటులును నిలిచి యుండిరి. చూచినతోడనే యాతని మొగము వివర్ణమైపోయెను; సర్వాంగములును గంపించి పోవుచుండెను. అప్పుడాతఁ డస్పష్టస్వరముతో "నేను దొంగతనము చేయలేదు—ప్రమాణము చేసి చెప్పుచున్నాను!" అనియెను.

దొర—అట్లయినచో నీకు విడుదలయే యగును రమ్ము!

మాంచ—ఎట్లు వత్తును? ఇంట నీక నెవ్వరును లేరు.

దొర—అందుకొఱకు నీవు శంకింపనక్కఱలేదు. ఇక్కడ మా మనుష్యులు కావలియుందురు——రమ్ము! అల్లరిచేసినచో నరదండాలు వైచి తీసికొనిపోవుదుము!

మాంచరజీగొం తెండిపోయెను—నోటినుండి మాట వెడలుట లేదు—యంత్రప్రతిమవలె నాతఁడు పోలీసువారితో బయలుదేరి పోయెను.

తరువాత దాదాభాస్కరుఁ డాయింటఁ బ్రవేశించి యంతటను బరికించి యెక్కడివస్తువుల నక్కడనే యుంచి వెలుపలికి వచ్చి ద్వారమునకు బీగము వైచి తాళము నాపార్శ్వద్వారమునఁ దగిలించెను. అచ్చట నింకొకపత్తేదారుఁడు నిరీక్షించి యుండెను. దాదాభాస్కరుఁ డాతనిం గాంచి 'ఇచ్చటఁ గాచికొని యుండుము! ఒక్కనిమిషమైన. నేమరియుండవలదు" అని చెప్పెను.

పత్తే—నేనిచ్చట నుండఁగా నింకెవ్వరేమి చేయఁగలరు?

దాదా—చాలజాగ్రత్తగ నుండవలయును. లేకయున్నచోఁ బైయధికారి వలన మాటరాఁగలదు!

పత్తే—ఆమాట చెప్పవలయునా?

తోడనే దాదాభాస్కరుఁ డటనుండి వెడలిపోవుచుండఁగాఁ ద్రోవలో లాలూభాయి యాతని కగపడెను.

లాలూ—దాదా! ఎంతవఱకుఁ బని జరిగినది?

దాదా—పని పూర్తియైపోయినది. ఇంతకాలమునకు దొంగ దొరకినాఁడు

లాలూ—ఆలాగా? దొంగయెవ్వఁడు?

దాదా—మాంచరజీ.—నీకాశ్చర్యముగా నున్నదా యేమి?

లాలూ—లేదు! కీర్తికరుఁ డేమని చెప్పినాఁడు?

దాదా—మాంచరజీని బట్టి తీసికొనిరమ్మని యాతఁడే చెప్పినాఁడు!

లాలూ—ఆలాగా? ఏదియో యొకవిధముగా నీకష్టము గట్టెక్కినది—ఇఁక నాపాటులున్నవి! నేనెన్ని నిదర్శనములు చూపినను నాతని బట్టుకొనుటకుఁ గీర్తికరుఁడు సమ్మతించుట లేదు.

దాదా—ఎవ్వరిని బట్టుకొనవలయును?

లాలూ—హారమసజీని—అతనిగుఱించి నేను తెలిసికొన్న సంగతులను దెలుపుటకే నేనిప్పుడు కీర్తికరునియొద్దకుఁ బోవుచుంటిని.

దాదా—నేను నక్కడకే బయలుదేరితిని. ఇరువురమును గలసియేపోవుదము!

తరువాత నాయుభయులు మాటలాడుకొనుచుఁ గీర్తికరునియింటికిఁ బోయిరి.

మరునాఁడు బర్జరజీ వచ్చి తనయింటికిఁ దాళమువైవఁబడి యుండుటం గాంచి స్తంభితుఁడై నిలువఁబడిపోయెను. ఆకస్మికముగ నాతనిదృష్టి పార్శ్వమునందున్న తాళముపైఁ బ్రసరించెను. తోడనే బర్జరజీ యాతాళముతో ద్వారమును దెఱచి లోపలికిఁ బోయి యంతటను బరిశీలించెను. ఎక్కడివస్తువు లక్కడనే యెప్పటివలె నుండెను. ఆతఁడు తోడనే వెలుపలికి వచ్చి యెప్పటివలెఁ దాళము వైచి యటనుండి వెడలిపోయెను—ఆతని కగపడకుండ దూరముగనుండి యంతయును జూచుచున్న పత్తేదారు నిశ్శబ్దముగా నాతని ననుసరించి పోయెను:

రహస్యవిప్లవము

పంచమఖండము—భయానకపరిణామము.

మొదటిప్రకరణము.

బంధితుఁడు.

కీర్తికరునియొద్దకు మాంచరజీ కొనిరాఁబడియెను; అప్పటికి దాదాభాస్కరుఁడును లాలూబాయియుఁ గూడ వచ్చిరి. కీర్తికరుఁ డప్పుడు మాంచరజీని గూర్చుండ నియోగించి "నీవీదొంగతనమును గూర్చి సత్యముగ సర్వమును దెలిపినచో నిన్ను దొరతనమువారిపక్షమున సాక్షిగా గ్రహింతుము; అట్లయినచో నీకెట్టిభయము నుండదు. నీకైదు నిమిషములు గడువిచ్చితిని. బాగుగ నాలోచించుకొని చెప్పుము!" అనియెను.

మాంచరజీ మాటాడక కూరుచుండెను. అయిదునిమిషములు నూరక జరిగిపోయెను. కీర్తికరుఁడు కొంతసేపటివఱకు నాతని మొగమువంక జూచి "దొంగతనము చేసినవా రెవ్వరు?" అని రెండుసారులు ప్రశ్నించెను.

మాంచరజీ మాటాటలేదు.

కీర్తి—నేనెఱుఁగుదును! నీవు నెఱుఁగుదువు—చెప్పుము!

మాంచ—నేను దొంగతనము చేయలేదు.

కీర్తి—ఇదిగో! చూడుము! నీబాగుకొఱకే చెప్పుచున్నాను. దొంగతనము చేసినవా రెవ్వరో స్పష్టముగాఁ జెప్పుము; చెప్పకున్నచో నీకు ద్వీపాంతరగమనమే!

అప్పటికిని మాంచరజీ మాటాడలేదు.

కీర్తి—ఆపెట్టెను దెఱచుకిటుకు నీకుఁ దెలియును—ఇంతవఱకైన నంగీకరింతువా!

మాంచరజీ పెడమొగము పెట్టుకొని "నాకేమియును దెలియదు" అనియెను.

కీర్తి—(క్రుద్ధస్వరముతో) తెలియును! ఏల దాఁచెదవు? ముందుగా నీకొంప మునిఁగిపోవును! నేను నిన్నెట్లైనఁ గాపాడ దలఁచి యడుగుచున్నాను.

ఎంతయడిగినను మాంచరజీ చెప్పకుండుటచేఁ గీర్తికరుఁ డామెను దనచెంతకుఁ దీసికొని రమ్మని దాదాభాస్కరునితోఁ జెప్పెను. దాదాభాస్కరుఁడు వెడలిపోయెను. అప్పుడు కీర్తికరుఁడు మాంచరజీనిగాంచి "నీసంగతి యంతయు నేనెఱుఁగుదును. మీముసలియవ్వ నాయొద్దనే యున్నది—బర్జరజీ తానే బుద్ధిమంతుఁడననియు, పోలీసువారు మూఢు లనియు భావించి యామెను మాచేతులనుండి తప్పింపవలె నని ప్రయత్నించెను గాని యట్లు చేయఁజాలకపోయెను. ఆమెవలన నేను సర్వమును వినియుంటిని. బర్జరజీ వెడలిపోవునప్పుడు సొమ్మంతయు నీయొద్దనే యుంచి పోయెను గాదా? ఇదియైన నీవొప్పుకొందువా?" అనియెను.

మాంచ—ఎట్టిసొమ్మును నాయొద్ద లేదు.

కీర్తి—సత్యము చెప్పుము! ఆసొమ్ము మాకక్కఱ లేదు. నీవు మంచిదారికి వచ్చినచో నాసొమ్మంతయును నీకే లభించును. అప్పుడు నీవు భాగ్యవంతుఁడవై సుఖముగ జీవింపవచ్చును. నీవేమియుఁ

జెప్పకున్నచో సొమ్మంతయును లాగికొని నిన్ను జైలునకుఁ బంపుదుము! ఇంకొక యైదునిమిషములు! బాగుగ నాలోచించుకొని చెప్పుము!

అయిదు నిమిషములయ్యెను. కీర్తికరుఁడు మాంచరజీవంకఁ దీక్ష్ణముగఁ జూచెను. మాంచరజీ యేమియును మాటాడకుండుటచేఁ గీర్తికరుఁడు బల్లపైనున్నగంటను మ్రోగించెను. తోడనే యిరువురరక్షకభటులు లాగదిలోఁ బ్రవేశించిరి.

కీర్తికరుఁడు వారింగాంచి "ఈమూఢునిచేతులకు సంకెలలఁ దగిలింపుఁడు! ఈతనివస్త్రములను విడిపించి పరీక్షింపుఁడు!" అని యాజ్ఞాపించెను.

రక్షకభటులొక్కసారిగ మాంచరజీ నాక్రమించుటయు నాతఁడదరిపడి "అయ్యా! నన్నూరక యవమానింపవలదు! నేను సొమ్మునిచ్చివైచెదను" అనియెను.

కీర్తి—మంచిది—అట్లయినచోఁ దెమ్ము!

రెండవప్రకరణము.

చౌర్యరహస్య భేదనము.

మాంచరజీ కంపితకరములతో వస్త్రాభ్యంతరమునందలి నోట్లకట్టను బైకిఁ దీసి బల్లపైనుంచెను. కీర్తికరుఁ డొక్కొక్కటిగ లెక్కించుచు వాని నెంబరుల నొక కాగితముపై వ్రాసికొని "చూడుము! మఱియొకసారి చెప్పుచున్నాను. నీవుసర్వవిషయములను వెల్లడించినచో నీకీనోట్లన్నిటిని దిరిగి యిచ్చివైచెదము. ఇప్పుడు నీవు నీబ్రదుకుతెరువు చూచుకొనుము!" అనియెను.

మాంచ—అంతయును జెప్పినతరువాత మీరు నన్ను విడుతురని నమ్ముట కవకాశ మేమున్నది?

కీర్తి—మామాటనే నమ్మవలయును.

అంతలో దాదాభాస్కరుఁ డొకవృద్ధురాలిని వెంటఁబెట్టుకొని యాగదిలోఁ బ్రవేశించెను. ఆముసలిది మాంచరజీని జూచి యేడ్చుచు నాయనా! ఆరాక్షసుఁడు మనకొంప ముంచినాఁడు! నీవిఁక వాని మాట వినవలదు. వీరికంతయును జెప్పుము—వీరు నిన్ను రక్షింపఁగలరు!" అనియెను.

కీర్తి—ఏడువవలదు. ఇక్కడఁ గూరుచుండుము!

వృద్ధురాలు కన్నులు తుడిచికొనుచుఁ గూర్చుండెను. పిల్లవాఁడైనప్పుడీమాంచరజీని వెంటఁబెట్టుకొని కలకత్తాలో హాకేకజీయింటికి వచ్చినది యీవృద్ధురాలే—కీర్తికరుఁ డీసమాచారమును దెలిసికొని యీమెను బొంబాయికిఁ దీసికొనివచ్చుటకై మనుష్యులను బంపించెను. ఎవ్వరైన నీమెను దప్పించుకొని పోయెదరేమోయని యాపోలీసువారు కీర్తికరుని యానతిమీఁదనే యీమెను జబ్బలుపురమార్గమునఁ దీసికొనిరాక డిల్లీనుండి బి, బి, సి. ఐ. రైలుమార్గమునఁగొని వచ్చిరి. అందుచేతనే బర్జరజీయీమెను గనుపెట్టఁజాలకపోయెను. ఈమె పోలీసువారికెల్ల సంగతులను దెలుపుటయే గాక మాంచరజీచేఁగూడఁ జెప్పించెద నని మాట యిచ్చినది. జైలుభయము—ఉరిభయము—చాలఁ బెద్దభయము!

కీర్తికరుఁ డావృద్ధురాలింగాంచి "నీకుమారునకుఁ జాలవఱకు బోధించితిమి. కాని యాతని కించుకంతయును బోధపడలేదు!" అనియెను.

వృద్ధు—మాంచరజీ! వాఁడు ఘోరరాక్షసుఁడు! వానిమూలముననే మనకిట్టిగతి గలిగినది. వాఁడే మనహాకేకజీయింటివానికి విష

ప్రయోగము చేసినాఁడు. నీవు సత్యముగా నంతయును జెప్పుము! వీరు మనలను రక్షించెదరు.

మాంచరజీ యొకవిధముగా స్థిరపఱచుకొనియెను. తనకిఁక జీవితాశ లేదనుకొనియెను. తన్ను రక్షించుటకు బర్జరజీప్రయత్నించునను నమ్మకము కూడ నాతనికి లేదు. అతఁడు తనలో "ఆదురాత్ముఁడు నేను జైలునకుఁ బోయినచో నిర్విఘ్నముగఁ గమలను బెండ్లియాడఁ దలఁచినాఁడు. అతనికొఱకు నేనేల చావవలయును? తప్పించుకొనుట కుపాయముండఁగా నేల శిక్షింపఁబడవలయును? బర్జరజీనాకెవ్వఁడు? నేనాతని కెవ్వఁడను? అతనికై నేనేలభయపడవలయు? జైలున కాతఁడే పోవుఁగాక! యావజ్జీవద్వీపాంతరవాసశిక్ష నాతఁడే యనుభవించుఁగాక!" అని యెన్నియోవిధముల నాలోచించుకొని ప్రకాశముగాఁ "అయ్యా నేనంతయును దెలిపినచో నన్ను మీరు రక్షింతురా?" అని ప్రశ్నించెను.

కీర్తి—ఆ. రక్షించెదను.

మాంచ—నాకు నమ్మక మెట్లు?

కీర్తి—మామాట యసత్యము కాదు.

మాంచ—చెప్పినతరువాత మీరు నన్నుఁ గొట్టి బాధింతురేమో?

కీర్తి—భయము లేదు.

మాంచ—వినుఁడు, ఆపెట్టెను దెఱచుగుప్తాక్షరములను నేనే దెలిసికొనఁగలిగితిని. ఒకనాఁడు నేనురత్నాబాయియింటికిఁ బోయి రస్తమజీకి నీయందుఁ బ్రేమలేదని చెప్పితిని. రస్తమజీ వచ్చినతోడనే యామె యీవిషయముంగూర్చి యాతనితో నెంతయోసేపు వాదించెను. అప్పుడు రస్తమజీ "రత్నా! నేను నిన్నెంతగాఁ బ్రేమించుచుంటినో నీకెట్లు తెలియును. నేనిప్పటికిని హారమసజీబ్యాంకిపెట్టెను నీపేరిమీఁ

దనే తెఱచుచున్నాను" అనియామె ననునయించెను. నేనీసంగతివిని బర్జరజీకి యథారూపమునఁ దెలిపితిని. అప్పుడాతఁడుపరమానందముతో మంచిది. అట్లయినచో నిఁక మనకేమిలోపము! హారమసజీపెట్టెలోని ధనమంతయు మనము తీసికొనవచ్చును. కాని యిప్పుడాతనిబ్యాంకిలో నెంతయో సొమ్ము లేదని వినియున్నాను. మనము జమకట్టిన లక్షరూపాయలును రేపుకావలయు నని కోరుదము. ఈరాత్రికే తెచ్చి వారు పెట్టెలోనుంతురు. అప్పుడు మన మీరాత్రియే యాసొమ్మంతయును దీసికొనవచ్చును" అని నాకు బోధించెను.

కీర్తి—ఆలక్షరూపాయలును మీకెట్లు లభించినవి?

మాంచ—రాజాబాయివస్తువులను దాకట్టుపెట్టి తెచ్చితిమి.

కీర్తి—సరే—తరువాత?

మాంచ—తరువాత రాజాబాయియొద్దనుండి తాళపుఁజేతిని దీసికొని యాపెట్టెలోని సొమ్ము నపహరించుటకు స్థిరపఱచుకొంటిమి. ఆపని నన్నుఁజేయుమని బర్జరజీ చెప్పెను. నేనంగీకరింపలేదు. అతఁడు నన్నుఁ దిట్టి భయపడి యెట్లో యొప్పించెను. ఆనాఁడు హారమసజీయింటనుండఁడని తెలిసికొంటిమి. సాయంకాల మగునప్పటికి మరలనామనసుతిరిగిపోవుటచే నేనురానని చెప్పివైచితిని.

కీర్తి—అప్పుడు బర్జరజీ యొక్కఁడే పోయెనా?

మాంచ—లేదు. అతఁడు నన్ననేకవిధముల దూషించి నాచే బాగుగ మద్యమును ద్రాగించెను—తరువాత మేమిరువురమును గలసి పోయితిమి. హారమసజీ యింటికడకుఁ బోవునప్పటికి నాకుగుండెదిగులు పుట్టెను. నేనప్పు డొకయడుగైనను ముందఱికి వైవఁజాలనైతిని బర్జరజీ నన్ను బండబూతులు తిట్టుచు, నాచేయి పట్టుకొని యీడ్చుకొనిపోయెను. నేను సాహసముతో నాతనిపట్టువదలించుకొని పారిపోయితిని.

కీర్తి—తరువాత బర్జరజీ యేమి చేసెను.

మాంచ—అది నాకుఁ దెలియదు. నేనుతిరిగితిరిగి చాలసేపటి కింటికిఁ జేరుకొంటిని. అప్పటికిని బజ్జరజీ రాలేదు. రాత్రి పదునొకం డుగంటలైనతరువాత నాతఁ డింటికి వచ్చి యొడనే నామీఁదఁబడినన్ను గొట్టఁబోయెను. నేనొక్కయుదుటున లేచి యాతనిపై లంఘించితిని. ఆతఁడు నాబలమెఱింగినవాఁడు కావున నొకమూలకుఁబోయి కూర్చుం డి "మూర్ఖుఁడా నీవుకూడ నున్నచో నీపనియంతయు నైదునిమిషముల లోఁ గావలసినది! నేను చేయువలసివచ్చుటచే మూఁడుగంటలు పట్టినది. ఆనిర్భాగ్యురా లెంతవేడినను నాకు దాళము నిచ్చినది కాదు. అప్పుడు నాకేమియుం దోఁచక "ఈరాత్రి నీవుసొమ్మీయకున్నచో మాంచరజీ యాత్మహత్య చేసికొనును" అని భయపెట్టితిని అప్పుడిచ్చినది. కానియా పెట్టెలో నింతసొమ్మున్నదని యామెయెఱుంగదు! నేనాతాళముం దీసి కొని పెట్టెయొద్దకుఁ బోయితిని. తాళము తెఱచుట యెట్లు? చటాలు నవచ్చి యామె నాచేయి పట్టుకొన్నది ఎట్లో కష్టపడి బలవంతముగఁ బెట్టెను దెఱచి యందలిధనమును దీసికొనివచ్చితిని" అని చెప్పి యా తఁడు నోట్లకట్టను నాచెంతఁ బడవైచెను!

మూఁడవ ప్రకరణము.

హత్యను గూర్చి.

కీర్తి—నీకింకను నేమి తెలియును?

మాంచ—ఇఁక నేమియుఁ దెలియదు. తెలిసినంతవఱ కంత యును జెప్పివైచితిని.

కీర్తి—నీవు చెప్పినదంతయు సత్యమే యనుటకు నిదర్శన మేము న్నది?

మాంచ—రాజాబాయి నడుగవచ్చును.

కీర్తి—న్యాయస్థానమున నీవిదియంతయును జెప్పెదవా?

మాంచ—నన్ను సాక్షిగాఁ దీసికొన్నచోఁ దప్పక చెప్పె దను.

కీర్తి—మామాట విని బ్రదుకఁ దలఁచినచో మేము చెప్పి నట్లు చేయుచుండుము! అట్లయినచో నీసొమ్మంతయు నీకిచ్చివైచెదము. అంతవఱకు నీనోట్లు మాయొద్దనే యుండును. ఈవ్యవహారము పూర్తి యగువఱకును నీవు మేము చెప్పినచోట నుండవలయును.

మాంచ—ఆలాగే. మీరు చెప్పినట్లే చేసెదను.

కీర్తి—నీవును మీయమ్మయు నొక్కచోటనే యుండవచ్చును.

మాంచ—సరే.

అప్పుడు కీర్తికరుఁడు దాదాభాస్కరునిం బిలిచి "ఈయిరువు రను నిరువురుశకభటుల కొప్పగించి యాచోటికిఁ బంపివేయుము! రాత్రివలె బండితలుపులు మూసివేయవలయును! జాగ్రత్త!" అని చెప్పెను.

వెంటనే దాదాభాస్కరుఁడు పోయి యొకబండిని దీసికొని మరల వచ్చి వారిని వెంటఁబెట్టుకొనిపోవుటకు సిద్ధమయ్యెను. అప్పుడు కీర్తికరుఁడు "ఆఁగుము!" అని చెప్పి మాంచరజీనుద్దేశించి "హత్యను గూర్చి నీకేమైనఁ దెలియునా?" అనియెను.

మాంచ—తెలియదు.

కీర్తి—సరిగాఁ జెప్పుము! నీవు పేస్తనజీతోఁగలసి యప్పుడప్పు డు మాటలాడుట కలదా?

మాంచ—కలదు.

కీర్తి—పేస్తనజీయొద్ద రెండు సర్టిఫికెట్లున్నసంగతి నీకుఁ దెలి యునా?

మాంచ—తెలియదు.

కీర్తి—ఎప్పుడైన నీతోఁగాని, బర్జరజీతోఁగాని పేస్టనజీ యీ సంగతినిగూర్చి చెప్పి యుండెనా?

మాంచ—నాతోఁ జెప్పలేదు. బర్జరజీతోఁ జెప్పెనేమో నాకుఁ దెలియదు.

కీర్తి—ఎప్పుడైన హత్యనుగూర్చి బర్జరజీ నీతోఁ జెప్పి యుండెనా?

మాంచ—లేదు.

కీర్తి—నిజమే చెప్పుచున్నావా?

మాంచ—అసత్య మేల చెప్పవలయును?

కీర్తి—ఇఁకఁ బోవచ్చును.

వెంటనే దాదాభాస్కరుఁడు వారినిదీసికొనిపోయెను. తరువాతఁ గీర్తికరునిం గాంచి లాలూభాయి "హత్యను గుఱించి యీ మాంచరజీ కించుకంతయును దెలియదనియే తోఁచుచున్నది!" అనియెను.

కీర్తి—అవును.

లాలూ—బర్జరజీయే హంతకుఁడైనచో నీసంగతి యీతనికి గొంచెమైనఁ దెలియవలసినదే!

కీర్తి—బర్జరజీ సామాన్యుఁడు కాఁడు! ఆత డెవ్వరినిగూడ నమ్మఁడు!

లాలూ—అహోరాత్రము లొక్కచోటనే యుండువారైనప్పుడు బర్జరజీ యెంతవాఁడైనను నాతనిసంగతికొంచెమైనను మాంచరజీకిఁ దెలియకపోదు. తెలిసియుండియు నీతఁడు చెప్పుట లేదేమో?

కీర్తి—ఆవిషయమై యిఁక నాలోచింపనక్కఱలేదు. హంతకుఁడు శీఘ్రకాలముననే దొరకఁగలఁడు!

లాలూ—నాకీహత్యవిషయమున మఱి యెట్టివిశేషములును దెలియుటలేదు. తెలిసినంతవఱకుఁ జూడఁగా హంతకుఁడు హారమసజీయే కాని మఱియొకఁడు కాఁడని తోఁచుచున్నది. ఎంతవఱకుఁ బని చేసితి వని మీరు నన్నుఁ బ్రతిదినము నడుగుచున్నారు; ఎల్లప్పుడు నొక్క టేప్రత్యుత్తరము చెప్పఁజాలకున్నాను. నాపద్ధతియే వేఱుగానున్నది—హంతకుఁ డెవ్వఁడని మీయభిప్రాయము?

కీర్తి—అభిప్రాయము కాదు—సత్యము! రేపంతయును జెప్పెదను. నేఁటికింతవఱకే చాలును!

నాలుగవ ప్రకరణము.

హత్యాభియోగము.

మఱునాఁడు కీర్తికరుఁడు హారమసజీదర్శనము చేసెను. హారమసజీ యాతని నెఱుంగఁడు; కాని యాతని దన కచేరిలో సగౌరవముగఁ గూర్చుండఁజేసి "మహాశయా! తాము దయచేసినపని యేమి?" అని ప్రశ్నించెను.

కీర్తి—నేనెన్నఁడును మీతో మాటలాడి యుండలేదు. కాని మీరు నాపేరెప్పుడైన విని యుందురు. నాపేరు కృష్ణజీబలవంతకీర్తికరుఁడు—నేను పోలీసుశాఖలోఁ బనిచేయుచుందును.

హారమసజీ విస్మితుఁడై "డిటెక్టివుసూపరింటెండెంటుమీరేనా?" అనియెను.

కీర్తి—అవును.

హార—నేను మీదర్శన మిదివఱకుఁ జేయలేదు. నేఁటికి ధన్యుఁడనైతిని.

కీర్తి—ఒకవిశేషవిషయముంగూర్చి మీతో మాటలాడవలసి యున్నది. రహస్యవిషయము. ఇచ్చట మనము మాటాడుకొనవచ్చునా?

హార—అట్లే చేయవచ్చును.

కీర్తి—మీరు నేనడిగినప్రశ్నల కన్నిటికిని సరిగాఁ బ్రత్యుత్తర మిచ్చెద రని నమ్ముచున్నాను.

హార—మీరట్లనుచున్నా రేమి? నాకు రహస్యము లేమున్నవి?

కీర్తి—సరే.—బర్జరజీ నిర్బంధించుటచేతనో, భయపెట్టుటచేతనో మీరు మీసొమ్ము దొరకిన దని కమీషనరుదొరవారికి వ్రాసితిరి. కాని మీరువ్రాసినసంగతి యసత్యము! ఇది నిజమేనా?

హారమసజీ క్రుద్ధస్వరముతో "అయ్యా! మీరీవిధముగ మాటలాడఁదలఁచినచో నిప్పుడే యిటనుండి వెడలిపోవలసియుండును!" అనియెను.

కీర్తి—పోవుట కింకను వేళయున్నది. నేను మీక్షేమముకొఱకే చెప్పుచున్నాను. అంతయును స్పష్టముగాఁ దెలిపినచో మీకే మంచిది!

హార—చెప్పకున్న నేమిచేసెదరు?

కీర్తి—ఏమని చెప్పుదును? మీరు సత్యము చెప్పకున్నచో మిమ్ములను నిర్బంధింపవలసివచ్చును!

హార—నన్నా? ఏమి? ఎందుకొఱకు?

కీర్తి—పేస్టనజీని జంపినందులకు!

హారమసజీ యదరిపడి "పేస్టనజీని జంపినందులకా? ఆసంగతి నాకించుకంతయును దెలియదే!— నేనిఁక మీతో మాటలాడఁదలఁచుకొనలేదు. ఇఁక మీరు దయచేయవచ్చును!" అనియెను.

కీర్తికరుఁ డప్పుడు మెల్లమెల్లగా జేబులోనుండి యొకయీలగొట్టమును బైకిఁ దీసి చేతఁబట్టుకొని సవిలాసముగ దాని నెగురవైచి పట్టుకొనుచు "చూచితిరా! నేను దీని నొక్కసారి యూదినంతనే పదిపండ్రెండుమందిపోలీసువారు వచ్చి మిమ్ములను బట్టుకొని మీచేతులకు సంకెలలు వైచి రాజమార్గమునఁ దీసికొని పోవుదురు. ఇట్టి పరాభవము నూరక కోరి యేల తెచ్చుకొందురు? స్వయముగాఁ గంఠమున కురిపోసికొనుట యెందులకు?" అనియెను.

హారమసజీ గుండెగుభిల్లుమనియెను. ఆతఁ డదరిపడి లేచి మెల్లమెల్లగఁ గూలఁబడి భగ్నకంఠస్వరముతో "నేనీహత్యనుగూర్చి యేమియు నెఱుఁగను—నాకు విరుద్ధముగ నిదర్శనము లేమైననున్నవా?" అని యడిగెను.

కీర్తి—కావలసినన్ని యున్నవి. లేకున్నచో మీవంటిగొప్పవారిని బట్టుకొనుటకు పోలీసువారికి సాహస మున్నదా?

హార—ఎట్టినిదర్శనము లున్నవి?

కీర్తి—ఇతరు లిట్లడిగినచోఁ జెప్పము! మీరుగావునఁ జెప్పెదను. పేస్టనజీజేబులో రెండుసర్టిఫికెటులున్నవి. వానిని దీసికొనుటకే యెవ్వఁడో యాతని జంపియుండెను. ఆకాగితము లాతనియొద్ద నున్నట్లు చంపినవానికి నిశ్చయముగాఁ దెలియును—

హారమసజీ మూర్ఛిల్లుటకు సిద్ధమైనట్లుండెను. ఆతని మొగమునఁ గత్తివైచినను రక్తము లేనట్లుండెను. ఆతఁడప్పుడు కీర్తికరునివంక వెఱ్ఱివానివలెఁ జూచుచుండెను.

కీర్తి—విచారింపఁగా మాకింకను గొన్నిసంగతులు తెలిసినవి. ఆసర్టిఫికెట్లలో నొకటి దేవరవారి గుప్తవివాహమునుగూర్చి!—మఱియొకటి మీప్రథమభార్యసంతానమునుగూర్చి—

హారమసజీ యదరిపడి "మీకెవ్వరు చెప్పినారు?" అనియెను.

కీర్తి—మీమనసు పదిలపఱచుకొనుఁడు! తొందఱపడవలదు. మీప్రథమభార్యయే చెప్పినది! ఇదిగో! చూడుఁడు! ఈహస్తాక్షరము లెవ్వరివో మీరానవాలు పట్టఁగలరా?

అని తన జేబులోనున్నయొకలేఖను దీసి యాతనికిఁ జూపెను. హారమసజీ యాకాగితముం గాంచి వంశపత్రముంబోలి నిలువునఁ గంపించిపోయెను. అది యాతనిభార్య మరణశయ్యయం దుండి వ్రాసినలేఖ! లాలూభాయి దానిని సంపాదించెను! హారమసజీ దానిం జదివి బాష్పరుద్ధస్వరముతో "అయ్యా! ఇఁక మీరు నన్ను రక్షింపవలయును!" అని దీనుఁడై వేఁడుకొనియెను.

కీర్తి—దీనినిబట్టిచూడఁగా నీరెండుసర్టిఫికెట్లును మీకే యావశ్యకములై యున్నవి. అందుచే మీరే పేస్టనజీని జంపి యీకాగితములను దీసికొని యుండవలయు నని నిశ్చయముగఁ దోఁచుచున్నది—కేవలమును—

హారమసజీ మఱియెట్టిమాటను జెవిని బెట్టకుండ "నన్ను రక్షింపవలయును—ఎంతసొమ్ము కావలసినను—

కీర్తికరుఁ డామాట కడ్డము వచ్చి "సొమ్ముమాట యెత్తవలదు: నిన్ను రక్షింపవలయును! కాని నీవు సర్వమును స్పష్టముగాఁ దెలుపవలయును. అట్లు చేసినచో నీయీగుప్తవివాహమును గూర్చి యిఁక నీలోకమునం దెవ్వరికిని దెలియకుండ నుండును!" అనియెను.

హార—నేనిఁక మీరు చెప్పినట్లుచేయుదును. నన్ను రక్షింపవలయును. తప్పదు.

అయిదవ ప్రకరణము.

సమన్వయము.

కీర్తి—మీరు హంతకులైన ట్లనేకనిదర్శనము లున్నవి కాని. మీరు హత్యచేయలేదని నేనెఱుఁగుదును. ఆకాగితములు పేస్టనజీయొద్దనున్నట్లు మీకుఁ దెలియదు.

హార—మీరు సత్యము చెప్పితిరి. నాకిప్పటివఱకు నాసంగతి తెలియదు.

కీర్తి—మీకు బ్రదుకునం దాశయేయున్నచో, గౌరవభంగమునకు భయమే యున్నచో నేవిషయమును దాఁపకుండ నంతయు జెప్పవలయును.

హార—నాకుఁ దెలిసినంతవఱకంతయుఁ జెప్పెదను.

కీర్తి—మీరొకటిరెండుదినములక్రిందటనే యీసర్టిఫికెటులను గూర్చి బర్జరజీవలన వినియుందురు.

హార—అవును.

కీర్తి—మీపూర్వవివాహమునుగూర్చి ప్రకటించెదనని యాతఁడు నిన్ను భయపెట్టియున్నాఁడు. ఆగూఢవివాహపుసంగతి బయల్పడినచో శాసనపద్ధతి ననుసరించి నీకు శిక్షయగును; అప్పుడు నీరెండవభార్య రక్షితయువతిగాఁ బరిగణింపఁబడును—అది కారణముగా నీతనయ కమలాభాయి జారజ యగును! అందుచేతనే నీవు వానికి భయపడితివి.

హార—అవును. అందుచేతనే నేనాతఁడు చెప్పినట్లు చేసితిని. చేయకున్నచో నాకు సర్వనాశనము కాదా?

కీర్తి—ఆతనిమాట విని నీవు కమీషనరునకు నీసొమ్ము పోలేదని వ్రాసితివి. ఇంకను నేమి చేయుటకు సమ్మతించితివి? ఏమియు దాఁపవలదు.

హార—కమలనుగూడ నాతని కిచ్చుట కంగీకరించితిని. నాభార్యయు నన్ను బ్రోత్సహించినది; కమలయు సమ్మతించినది.

కీర్తి—అయ్యో! కర్తవ్యానురోధముచే నతికష్టముతో నీకొక్కసంగతి చెప్పక తప్పుట లేదు. ఆబర్జరజీ నిన్ను భయపెట్టి కమలను దనకిచ్చుట కంగీకరింపఁజేసినాఁడు! ఆఱుమాసములనుండి యాతఁడిట్లే నీభార్యను భయపెట్టుచున్నాఁడు!

హార—ఎట్లు?

కీర్తి—చిన్నతనమునందు నీవెట్లు దూరదృష్టిలేక పెండ్లి చేసికొంటివో యట్లే నీభార్యయును నెఱుఁగనితనమునం దొక్కని బ్రేమించి యుండెను. దానికి ఫలముగా నొకపుత్రసంతానముకూడ నైనది!

హారమసజీ త్రొక్కినత్రాచువలెఁ జటాలున లేచి తీవ్రస్వరముతో "ఇఁక మీరు పోవచ్చును! నాయింటఁగూరుచుండి నాతో నిట్లు సంభాషించుచున్నమీదురుద్దేశము నాకు బోధపడినది!" అనియెను.

కీర్తి—నాయుద్దేశము మహత్తరమైనది. ఆసంగతి తరువాత వినియెదరుగాక! చిన్నతనమునం దెవ్వరైనఁ బొరపాటున నేదేనొకచిన్నతప్పు చేసినంతమాత్రమున వారిజీవితమంతయును నీచమైనది కాఁజాలదు! నిన్నుఁ బెండ్లియాడినతరువాతనున్న రాజాబాయివంటిపతివ్రతారత్న మింతవఱకు జన్మించియే యుండలేదు!

అని చెప్పుచు నాతఁడు తనవస్త్రాభ్యంతరమునుండి యొకపెట్టె నాతని యెదుటనుంచి యందలినగలను దీసి చూపుచు "వీనిని నీవానవాలుపట్టితివా?" అని ప్రశ్నించెను.

హారమసజీ విస్మితుఁడై "ఇవి నాభార్య నగలు! మీకెట్లు లభించినవి?" అనియెను.

కీర్తి—ఆమాటయే చెప్పుచున్నాను. బర్జరజీ యన్నయగుహారేకజీతో రాజాబాయికి బాల్యప్రణయ మున్నది. కాని యేకారణముననో వారికి వివాహము జరుగలేదు. నవయౌవనలాలసత మిగుల దుర్దమనీయమైనది. దానిఫలితమునుగూర్చి యిదివఱకే చెప్పితినిగదా! బర్జరజీ కీసంగతి యంతయును దెలియును. ఆ దురాత్ముఁడు తనసర్వస్వమును బోఁగొట్టుకొని కలకత్తాకుఁ బోయి యచ్చటఁ దనయన్నయగుహారేకజీకి విషముపెట్టి చంపి యాతనిధనమంతయుఁగైకొని డబ్బులేకపోవుటచేఁ బూర్వవృత్తాంతమును వెల్లడించెదనని భయపెట్టి నీభార్యయొద్ద ధనము లాగవలయుననునుద్దేశముతో నీబొంబాయికి వచ్చియున్నాఁడు. ఇక్కడకు వచ్చి యాతఁ డెంతపని చేసినదియు నీవస్తువులనుబట్టియే తెలియుచున్నదిగదా! ఈవస్తువులను గణేశమల్లునొద్దఁ దాకట్టుపెట్టి తెచ్చిన లక్షరూపాయలనే యాతఁడు నీబ్యాంకిలో జమకట్టించినాఁడు!

హారమసజీ స్తంభితుఁడై విస్మితుఁడై యేమియు మాటడక కూర్చుండెను. అప్పుడు కీర్తికరుఁడు మరల "తరువాత నాతఁడే నిపెట్టెలోనున్నరూపాయల నపహరించెను; నీభార్య నెప్పటివలె భయపెట్టి దానితాళమును సంపాదించెను. ఈసంగతియంతయును మాంచరజీ చెప్పివైచినాఁడు!" అనిచెప్పెను.

హారమసజీ యేమియు మాటాడలేదు. ఆతనికంఠము రుద్ధమైపోయినది. అప్పుడు కీర్తికరుఁడు దొంగతనమునుగూర్చి సర్వవిషయములఁ జెప్పి "సంశయింపనక్కఱలేదు. రాజాబాయి నడిగినచో నంతయును దెలియును!" అనియెను.

అప్పుడు హారమసజీ హీనస్వరముతో "అయ్యో! అయ్యో! నాకులగౌరవమును, ప్రతిష్ఠయు, సర్వమును నాశనమైపోయినదే! ఇట్టి యవస్థలో నేను చచ్చుటయే మంచిదని తోఁచుచున్నది!" అనియెను.

కీర్తి—నీవు సువివేచకుఁడవు! బాలకునివలె నిట్లధైర్యపడియెద వేల! నీభార్యమీఁదఁ గోపింపవలదు! ఆమె యీపాషండుని చేతులలోఁ బడి యెన్ని బాధ లనుభవించినది! ఆదురాత్మునకుఁ దగినశాస్తి చేయుటయే యిప్పటికర్తవ్యము. మీరు నేఁజెప్పినట్లు చేసినచో మీపూర్వకళంకములు రెండవకంటివారికిఁ దెలియకుండఁ బోవును. మీమాట యేమైనను బవిత్రచరిత్రయగు మీపుత్రిక కమలాబాయి కొఱకైన నట్లుచేయుట కర్తవ్యము. కాకున్నచో నేమిజరుగునో మీరె యాలోచించుకొనుఁడు.

హరమసజీ గద్గదస్వరముతో "అట్లే చేసెదను—చెప్పుఁడు!" అనియెను.

కీర్తి—తరువాతఁ జెప్పెదను—మీవివాహపు సర్టిఫికెటు తనకెట్లు లభించినదో బర్జరజీ యాసంగతి మీకేమైనఁ జెప్పెనా?

హర—పేస్తనజీ త్రాగిమత్తెక్కి యున్నప్పుడా కాగితమునుగుఱించి బర్జరజీతోఁ జెప్పెనఁట! అప్పుడు ప్రేమజీకూడనచ్చట నుండెను. ప్రేమజీకప్పుడు ధనలోపముకలిగియుండెను. ఆకాగితముమూలమున హరమసజీయొద్ద ధనములాగవచ్చుననియు, నెట్లయిన దానిని నేను సంపాదింతుననియుఁ బ్రేమజీ యప్పుడు బర్జరజీతోఁ జెప్పెనఁట! ఆతఁడే బండిలో క్లోరోఫారము నిచ్చి పేస్తనజీనిజంపి యాసర్టిఫికెట్లను లాగికొని తనయొద్దనున్నచో పోలీసువారు పట్టుకొందురని వానిని బర్జరజీకిచ్చెనఁట!

కీర్తి—అట్లయినచో మీానమ్మకము హంతకుఁడు ప్రేమజీయనియేనా?

హర—క్లోరోఫారముకొనుటయు శవముకడ నాతనిరుమాలు దొరకుటయు మొదలగు కారణములచే నట్లే తోఁచుచున్నది.

ఆఱవ ప్రకరణము.

ఆత్మపరి[illegible]ము.

కీర్తి—హత్యమాట తరువాతఁ జూడవచ్చును! దొంగతన మాతఁడుచేసె ననుటకు సంశయము లేదు. కాని—ఈనేరమునకై యాతని బట్టుకొన్నచో నీభార్యసాక్ష్యము కావలసి యుండును. అట్లయినచో మీపూర్వవృత్తాంతము వెల్లడికాక తప్పదు.

హర—నన్నెట్లు రక్షింపవలయునో మీరే యూహించుకొనవలయును.

కీర్తి—ఆలాగే! మీరువ్రాసిన యుత్తరమువలన దొంగతనపు వ్యవహారమే పోయినదిగాదా! పోవుటయే మంచిది. బర్జరజీని ఖూనీనేరము క్రిందనే పట్టుకొనవలయును.

హర—హత్యచేసినవాఁ డాతఁడేనా?

కీర్తి—అవును. కాని యాతఁ డంగీకరింపవలయును. లేకున్నచో సంతయును గదలును.

హర—అప్పు డంతయును వెల్లడికాదా? ఇప్పుడు మీరు నన్ను రక్షింపవలయును. వానికి శిక్ష దేవుఁడే చేయును.

కీర్తి—దేవుఁడు స్వయముగ నేపనియుఁ జేయఁడు; మనము భగవంతునిచే సృజింపఁబడితిమి. అనేకవిషయములయందు మనచేతనే పాపాత్ములు శిక్షింపఁబడుచుందురు.

హర—మీరెట్లూహించుకొన్నను సరియే—నాగౌరవమును గాపాడవలయును. నేను కమలకొఱ కాత్మహత్య చేసికొనకుండ నున్నాను. నాగౌరవము పోవుచున్నప్పు డిక బ్రదుకేల?

కీర్తి—భయము లేదు. సర్వశ్రేయమగుపద్ధతినే పనిచేసెదను.

హర—దయయుంచి యట్లే చేయుఁడు!

కీర్తి—ఇందు దయ చూపవలసిన దేదియును లేదు. ఇది నాకుఁ గర్తవ్యము! ఆదురాత్ముని వదలినచో మీకు సర్వనాశము కాఁగలదు.

హర—ఏమి చేయవలయునో మీరే చేయుఁడు. నాకేమియు నాలోచన తోఁచుట లేదు.

కీర్తి—ముందుగా నీభార్య కీసంగతు లన్నియును స్పష్టముగాఁ జెప్పవలయును.

హర—నేనట్లు చేయఁ జాలను.

కీర్తి—ఏమి? నేను చెప్పుటంత బాగుగా నుండదు! నేనేమి చేసినను నీమేలుకొఱకే యని నమ్ముము!

హర—మీయిష్టము వచ్చినట్లు చేయుఁడు! ఏమి చెప్పుటకును నాకిప్పుడు మతి లేదు.

కీర్తి—నీవధైర్యపడవలదు. భారమంతయు నాపై నుంచుము! రమ్ము! ఒకసారి నీభార్యయొద్దకుఁ బోవుదము!

అని చెప్పి కీర్తికరుఁడు లేచెను. కంపితపదములతో స్పందితహృదయముతో హరమసజీ యాతని వెనువెంటనే పోయెను. వారిరువురును మేడమీఁదికిఁ బోయి కూర్చుండిరి. కీర్తికరునినిర్బంధముచే నప్పుడతికష్టముతో హరమసజీ రాజాబాయిని బిలిచెను.

రాజాబాయి వచ్చి సన్నిధి నొకయపరిచితుఁ డుండుటచే నివ్వెఱపడి వెలుపల నిలువఁబడియెను. అప్పుడు కీర్తికరుఁడు లేచి "అమ్మా! నేను పోలీసునౌకరును. నిన్నొకటిరెండుమాటలడుగఁదలఁచి వచ్చితిని." అనియెను.

రాజాబాయిసర్వాంగములును బరికంపితములైపోయెను. ఆమెవదనమండలము సంపూర్ణముగ వివర్ణమైపోయెను. అది యంత

యుం గాంచి కీర్తికరుఁడు "అమ్మా! కూరుచుండుము!" అనియెను. రాజాబాయి కంపించుచు నతికష్టముతో నొకకుర్చీపైఁ గూర్చుండెను.

కీర్తి—అమ్మా! ఎంతో విచారముతోఁ దప్పనిసరి యగుటచే నిన్ను రెండుమాట లడుగుచున్నాను.

రాజాబాయి యేమో చెప్పుటకుఁ బ్రయాసపడియెను గాని యామె గొంతెండుకొనిపోవుటచే మాట రాలేదు.

కీర్తి—అమ్మా! బర్జరజీ నిన్ను భయపెట్టి నీచే నేమేమి చేయించెనో నాకిప్పుడు స్పష్టముగాఁ దెలుపవలయును.

రాజాబాయి వ్యాకులభావముతో గోలుగోలున నేడువఁదొడంగెను.

కీర్తి—చిన్నతనమునందలిపొరపాటెవ్వరికిని బ్రదికియున్నంత కాలము నుండదు. సర్వమును నీనాథునకుఁ దెలిసినది. నేనే చెప్పితిని. అందుకొఱకు నీవు సంశయింపనక్కఱలేదు. మీకిట్టి యపకారముం గావించిన యాదురాత్మునికిఁ దగినశిక్ష చేయించుటయే కర్తవ్యము. నీవలెనే నీనాథుఁడును జిన్నతనమునం దించుక తప్పుచేసినవాఁడే!

హరమసజీ చేతులతో మొగము కప్పుకొనియెను. కీర్తికరుఁ డాతనిగూఢవివాహముంగూర్చి యంతయును జెప్పుచుండెను. రాజాబాయియు హరమసజీయును బల్లపైఁ గరపుటాంతరముల వదనము లుంచుకొని కన్నీరు విడుచుచుండిరి.

కీర్తికరుఁడు బర్జరజీసర్వవృత్తాంతమును జెప్పి "ఆతఁడు దొంగతన మెట్లు చేసెనో నాకుఁ దెలియును. ఆపెట్టెను దెఱవకుండ నీవడ్డగించిన సంగతియు నేనెఱుంగుదును. మాంచరజీ నీకుమారుఁడు కాఁడు. బర్జరజీ తనయభీష్టసిద్ధి కుపాయముగా నాతని నీకొడుకుగాఁ బ్రదర్శించినాఁడు! ఆతనిమూలమున నీనగల నన్నిటి నపహరించినాఁడు. హరమసజీ! నీవుకూడ నీవిషయమునఁ జాలవిభ్రాంతుఁడవైపోయితివి.

నీభార్యయగురాజాబాయి నీయెడల విశ్వాసఘాతుకురాలు కాలేదు ఈమె మాంచరజీని దనకుమారుఁడనుకొని గారవించినది.

అప్పుడుహారమసజీగాని, రాజాబాయిగాని యేమియు మాటాడలేదు. మొగమెత్తక యేడువఁదొడంగిరి. కీర్తికరుఁడు కొంతసేపటివఱకును మాటాడ కూరకుండి "మీరిట్లధైర్యపడుచుండినచో లాభము లేదు. ఆపాపాత్మునకుఁ దగినశాస్తి చేయవలయును. శిక్ష చేయింపకున్నచో నాతఁ డింకను నెన్నియో ఘోరకృత్యములు చేయును!"

హారమసజీ వ్యాకులస్వరముతో "మేము మీశరణమును గోరియున్నాము. మమ్మీవిపత్తునుండి యుద్ధరించి రక్షింపవలయును" అనియెను. కీర్తికరుఁడు నవ్వుచు "నాకోరిక కూడ నదియే—ఆదినమున నేను నీపవిత్రహస్తమును నరనారీహత్యలచేఁ గళంకితము కాకుండఁ జేసినసంగతి జ్ఞప్తియందున్నదా?" అనియెను.

హారమసజీ యులికిపడి లేచి విస్మయముతో "మీరు! మీరు! మీరేనా?" అనియెను.

కీర్తి—ఔను—ఆకాశీనాథనాయకుఁడను నేనే! అది నాఛద్మవేషము—జాలమూర్తి—

హారమసజీయును, రాజాబాయియు మాటాడకుండ విస్మయవిస్ఫారితనయనములతోఁ గీర్తికరునివదనమువంకఁ జూచుచు నిలువఁబడిపోయిరి.

ఏడవ ప్రకరణము.

సోదరీద్వయము.

ఆసమయమున మెల్లమెల్లగాఁ గమల యచ్చటికి వచ్చెను. చాటుననుండి యింతవఱకు నామె యన్నిసంగతులను వినియే యుండెను.

ఆమెను జూచి కీర్తికరుఁడు "అమ్మా! నీతోఁగూడ నాకుఁ బని యున్నది!" అనియెను.

కమల మృదుస్వరముతో "సెలవిండు" అనియెను.

కమలాబాయిని జూచి చకితుఁడై హారమసజీ చటాలున లేచి "కమలా! నీవిచ్చటి కేల వచ్చితివి? మాకుఁ దొందరపను లున్నవి. నీవు పొమ్ము!" అనియెను.

కమల నిట్టూర్పు విడిచి "బాబూ! నాకంతయును దెలియును!" అనియెను.

హారమసజీ విస్మయముతోఁ దనయవంకఁ జూచుచుఁ గొంతసేపుండి హతాశుఁడై తలవంచుకొని "హా, పరమేశ్వరా! నాకింతటిదుఃఖము నేల కల్పించితివి?" అని చింతింపఁదొడంగెను.

కమల మెల్లమెల్లగాఁ దండ్రియొద్దకు వచ్చి యాదరముతో నాతనిచేయి పట్టుకొని "తండ్రీ! ఇప్పుడు మీరు మాయమ్మమొగము చూడవలయును. నాకిదివఱకే యెల్లసంగతులును దెలియును. హృదయవేదన భరింపఁజాలక మాయమ్మ యెట్లు వాఁడిపోయినదో చూడుఁడు! ఈయాఱుమాసములనుండియు నీమె పడరానిబాధలఁ బడుచున్నది! మీభయముచే నేనేసంగతియు వెల్లడింపఁజాలకపోయితిని!" అనియెను.

కీర్తి—అయ్యా! నీతనయ నిజముగా దేవీమూర్తి! కులగౌరవమునకు భంగముకలుగునను భయముచే నెఱిఁగియుండియుఁ బామండుఁడగుబర్జరజీని బెండ్లియాడుట కంగీకరించినది! అయ్యా! మీరిట్లధైర్యపడుట బాగుగ లేదు.

హారమసజీ దిగ్గునలేచి "ఆదురాత్ముని పాపరక్తమును గనులఁ జూడకుండ జలస్పర్శము చేయును!" అనియెను.

కీర్తి—ఆపాపాత్మునిరక్తముచే మీహస్తము కళంకితము కావలదు. ఆపని న్యాయస్థానమువారిది!

కమ—తండ్రీ! నాకంతయును దెలియును. ఈమహాపురుషుఁడు మనకుఁ బరమమిత్రుఁడు!

కీర్తి—ఈరహస్యములు కమలకును మాలోఁ గొంతమందికిని మాత్రమే తెలియును. వెల్లడి యగునను భయము లేదు.

కమల—నాయనా! ఈతఁడే మనరస్తమజీని రెండుసారులును రక్షించెను. ఈతఁడే మనలను రక్షించును. పాపాత్ముని శిక్షించును. మాయమ్మను జూడుఁడు! ఎట్లున్నదో!

హారమసజీ మెల్లమెల్లగ లేచెను. ఆతనికన్నులనుండి యొడతెగకుండఁ గన్నీరు ప్రవహించుచుండెను. ఆతఁడు రుమాలుతోఁ గన్నులనొత్తికొని భార్యపార్శ్వమునఁ గూరుచుండి యాదరముతో నామెకన్నీటిని దుడుచుచు "రాజా! అంతయును వింటిమిగదా! చిన్నతనమునఁ జేసినయపచారములకుఁ దగినశిక్షలనుభవించితిమి! ఈతఁడిక మనలను రక్షించును. ఆస్త్రీ యిఁక లేదు—హారేకజీయును లేఁడు! నీసంతానమును శైశవావస్థయందే పరమేశ్వరుఁడు తీసికొనిపోయినాఁడు—నాకన్యనుగూడఁ బాపపథమునఁ బడిపోవకుండునట్లుగా భగవంతుఁడు తనసన్నిధికిఁ దీసికొనిపోయెను"

అనుచుండఁగాఁ గీర్తికరుఁ డామాట కడ్డము వచ్చి "లేదు! ఇంకను నీతనయ బ్రదికి యున్నది!" అనియెను.

హార—బ్రదికియే యున్నదా? ఎక్కడ? మీకా సంగతి తెలిసినదా? హా! పరమేశ్వరా!

కీర్తి—తొందరపడియెదరేల? ఆమె యిప్పుడు క్షేమముగా నున్నది.

హార—అట్లయినచో నామె కిప్పటికిరువది యేండ్లవయసుండును! ఆమె నిశ్చయముగాఁ దల్లిపోలికనుండును. ఆమె యెప్పటికైనఁ దండ్రీ యని నాయొద్దకు రాఁగలదా? ఆమెకు నాసంగతి యెట్లు తెలియును?

కీర్తి—తెలియదు!

హార—అట్లయినచో మీకాబిడ్డసంగతి యెట్లు తెలిసినది?

కీర్తికరుఁ డప్పుడొక కాగితమును జేబులోనుండి తీసి హారమసజీచేతికిచ్చి "ఇది నీప్రథమభార్య మరణించుచు రస్తమజీ కిచ్చియుండెను. ఇందామె తనబిడ్డ నుంచినచోటునుగూర్చి వ్రాసియుండెను." అని చెప్పెను.

హార—మీరు వెదకి తెలిసికొంటిరా?

కీర్తి—ఆమెయే యాబిడ్డను వెదకి తీసికొనిపోయి పోషింపవలయునని కోరి రస్తమజీచేఁ బ్రతిజ్ఞ చేయించుకొని మఱి మరణించినది?

హార—దొరకినదా బిడ్డ?

కీర్తి—ఆ. ఎంతయో విశ్వప్రయత్నముమీఁద—నీతనయ పరమసుందరి—అందుచేతనే నీభార్య యామెను బాపధనలోపముచే నొకస్త్రీకి విక్రయించిపోయినది. నీతనయ యాస్త్రీయొద్ద నున్నది. అన్నిసంగతులును దరువాతఁ జెప్పెదను.

హార—ఇఁక వినవలయు ననిలేదు. హా పరమేశ్వరా! నాకెంతటిదుఃఖమును దెచ్చిపెట్టితివి?

కీర్తి—నీకు నీతనయను జూడవలయుననుకోరిక లేదా?

హార—లేదు. లేదు. చిన్నతనమునందే యది యేల మరణింపలేదు?

అని హారమసజీ మరల రెండుచేతులతోడను మొగము మూసికొనియెను. అప్పుడు కమల కీర్తికరునిసమీపించి "అయ్యా! ఆమె నాసోదరి—ప్రస్తుతశాసనానుసారముగ నామెయే తండ్రిగారిసర్వస్వమునకు నుత్తరాధికారిణి—ఆమెను మఱియొకచోఁ విడిచియుంచుట మాకుచితము కాదు. ఆమె యెచ్చటనున్నదో చెప్పుము. నేనిప్పుడే పోయి తీసికొని వచ్చెదను" అనియెను.

కీర్తి—అమ్మా! నీదాసిని బిలువుము! ఆచో టామెకుఁ దెలియును!

కమల యాత్రిముతో రత్నాబాయిని బిలిచెను. రత్న తత్క్షణమే వచ్చి కమలపార్శ్వమున నిలువఁబడియెను. కీర్తికరుఁ డప్పుడు మెల్లమెల్లగ లేచి మెల్లగఁ బోయి రత్నాబాయి చేయిపట్టుకొని "కమలాబాయీ! నీవు నీసోదరిని జూడఁగోరి యుంటివిగదా! చూడుము! ఇదిగో! నీసహోదరి!" అని చెప్పుచు హారమసజీవంకకుఁ దిరిగి "అయ్యా! ఆ నీబిడ్డ యీమెయే!" అనియెను.

ఆమాట విని హారమసజీయును రాజాబాయియును నిస్తబ్ధభావముతో, వ్యాకులనయనములతో రత్నాబాయివంకఁ జూచుచుండిరి. అదియంతయు వారికి స్వప్నముగాఁ దోఁచుచుండెను.

కమలయు రత్నాబాయియు విస్మయముతో నొకరివంక నొకరు చూచుకొనుచుండిరి. ఈవిధమున నిశ్శబ్దముగాఁ బదినిమిషములు గడచి పోయెను. పిమ్మట రత్నాబాయి యొక్కనవ్వు నవ్వి చటాలునఁబోయి కమలను గాఁగిలించుకొని నవ్వుచు నామెను ముద్దుపెట్టుకొనియెను!

ఎనిమిదవప్రకరణము.

అపూర్వసమ్మేళనము.

రత్నాబాయికి నవ్వువచ్చెను! చిరకాలమునుండి యామె దీనురాలనే యనుకొనుచున్నది! ఈస్థితిలో నామె తన్నుఁ దానే మఱచిపోయెను. ఆకస్మికముగ నెందుచేతనో యీమెకు నవ్వువచ్చెను. ఆమె మొట్టమొదటఁ గీర్తికరునిమాటలను నమ్మఁజాలకుండుటయే కాక

యాతఁడు పరిహాసించుచున్నాఁడనికూడ భావించుకొనియెను. కీర్తికరుఁడు పరిహాసస్వభావము కలవాఁడు కాఁడనియు, నిట్టివిషయమునందాతఁ డెన్నఁడును బరిహాసము చేయునంతటిమోటువాఁడు కాఁడనియు నామె నిశ్చయించుకొనియెను. హారమసజీ తనతండ్రియనియుఁ గమలతనసోదరి యనియు విన్నంతనే యామెను నవ్వువచ్చెను. అందుచే నామెనవ్వెను! తాను సుఖితురాలయ్యెనో యానందితురాలయ్యెనో, యేడ్వవలయునో, నవ్వవలయునో యామెకించుకైనఁ దెలియలేదు. మొట్టమొదట నామె కెట్టిభావము కలిగెనో యట్లే చేసెను.

అప్పుడామె చటాలునఁ బోయి కమలను గాఁగిలించుకొని ప్రేమభరముతో నామెను ముద్దుపెట్టుకొనియెను. ఆమె యెన్నఁడును గమలకు దాసియై యుండలేదు! ఆమెకుఁ బ్రియసఖివలెనే యుండెను. రత్నాబాయి తనవృత్తాంతమంతయు నిదివఱకే కమలకుఁ జెప్పి యుండెను. రత్నాబాయి తనమనోహరుఁడగు రస్తుమజీని హృదయపూర్వకముగఁ బ్రేమించుచుండెనని తెలిసికొనియును గమల యామెయెడలఁ గోపగింపకుండుటయే కాక మిక్కిలి సంతుష్టురాలై యుండెను. వారిరువురును దమకుఁగలసంబంధమును దెలిసికొనఁజాలనియప్పుడుగూడ సోదరీభావముననే మెలఁగుచుఁ బరస్పరమును బ్రేమించుకొనుచుండిరి. ఇరువురిహృదయములును గష్టసుఖములయందేకసూత్రముచేతనే బంధింపఁబడి యుండెను. వారిలో వారికి రహస్యమనుమాటయే లేదు.

రత్నాబాయి ప్రేమముతోఁ దన్ను ముద్దుపెట్టుకొనుటను గాంచి కమల యులికిపడి యామెవంకఁ జూచెను. అప్పుడు కీర్తికరునిమాట యామెహృదయాంతరాళమున మెఱపు మెఱసినట్లయ్యెను. అప్పుడు కమలయొకచేతితో రత్నచిబుకమును బట్టుకొని రెండవచేతితో నామెను గాఁగిలించుకొని యామెచెక్కులపై ముద్దులు ముద్రించెను. అప్పుడు వారిలో నెవ్వరు ముందుగా నెవ్వరిని దండ్రియొద్దకుఁ దీసికొనిపో

వలయునో యిరువురు నెఱుఁగరైరి. ఆయుభయులు నప్పుడా ండోరుల చేతులుపట్టుకొని మెల్లమెల్లగ హారమసజీపార్శ్వమునకు వచ్చి మోకరిలఁబడి యిద్దరును దండ్రిక్రోడతలమున మస్తకములనుంచి ప్రేమయుండగుతండ్రిచరణకమలముల నశ్రుజలంబులం దేల్చివైచిరి.

హారమసజీ దుఃఖము నాపుకొనఁజాలక యశ్రుసిక్తనయనములతో నిరువురు ల నిరుజేతుల నెత్తి వారిమస్తకముల ముద్దిడుకొని యించుక ప్రకృతిస్థుఁడై లేచి బిడ్డలచేతులను బట్టుకొని రాజాబాయిపార్శ్వమునకుఁ దీసికొనిపోయి బాష్పరుద్ధకంఠస్వరముతో "రాజా! నీవొక్కకూఁతురే యనుకొనుచున్నావు—ఇప్పు డిరువురైనారు!" అనియెను.

రాజాబాయి యిరువురితనయలను గౌఁగిలించుకొని యేడువసాగెను. అప్పుడందఱికన్నులను నిరంతరబాష్పధారలు గురియుచుండెను. ఆదృశ్యము నెవ్వరుచూచినను గన్నీటి నాఁచికొనఁజాలరు. కాని, ధీరోదాత్తుఁడగుకీర్తికరుఁడుమాత్రము కన్నులు మూసికొని నిశ్చలభావముతోఁ గూర్చుండి యించుకసేపైనతరువాత "ఎట్లయిన నాదురాత్ముని శిక్షించుటకై మనమందఱము నెల్లవిధములఁ బ్రయత్నింపవలయును" అనియెను.

హార— మేమందఱమును మీరుచెప్పినట్లు చేసెదము.

కీర్తి—ఈసంగతులేవియును బర్జరజీ కెంతమాత్రమును దెలియఁగూడదు. తెలిసినచో దొరకకుండఁ బారిపోవును.

హార—ఆతని కేమియును దెలియుట కవకాశము లేదు.

కీర్తి—వాఁడు తప్పక నీయొద్దకు రాఁగలఁడు. వాఁడు సాధారణముగాఁ గమలమీఁదియాశను విడువఁజాలఁడు.

హార—అవును. నాబిడ్డకు విషమిచ్చి చంపనైనఁ జంపెదను గాని యాపాపండునిచేతుల కొప్పగింపఁజాలను.

కీర్తి—నీవేమియుఁ జేయఁజాలవు. వాఁడు వచ్చినచో నేను చెప్పినట్లు చేయవలయును. మును పేమి చేసితివో యిప్పుడు నట్లే చేయవలయును. సమయముచూచి మేమాతనిని బట్టుకొందుము!

హార—వాఁడు మరల వచ్చునా?

కీర్తి—రావచ్చును—ఇప్పుడాతఁ డెక్కడనుండెనో యెఱుఁగుదువా?

హార—ఎఱుఁగ కేమి! నారిదివల కున్న యింటనే యుండును.

కీర్తి—లేఁడు. ఎక్కడకో పోయినాఁడు.

హార—ఆసంగతి నాకాతఁడేమియుఁ జెప్పలేదు.

కీర్తి—ఈసారి యాతఁడు వచ్చినచో నాతనినివాసము నడిగి తెలిసికొనుము! మఱచిపోవలదు!

హార—అట్లే చేసెదను.

కీర్తి—ఇఁక నేను పోయెదను.

హార—నేను మీఋణము తీర్చుకొనఁజాలను—మరల నెప్పుడు దర్శనమొసంగెదరు?

కీర్తి—ఆవశ్యకమైనప్పుడు మరలవచ్చెదను.

కీర్తికరుఁడు లేచెను. ఆతనితో నందఱును లేచి నిలువఁబడిరి. అప్పుడు కీర్తికరుఁడు హారమసజీని జూచి "రత్నాబాయిసంగతి యంతయును గమలకుఁ దెలియును. ఆమె యాకంతయును జెప్పఁగలదు. ఈరత్నసాయముచేయకున్నచో నేను రస్తమజీని రక్షింపఁజాలకయే యుందును. అపరాధియును శిక్షింపఁబడకయే యుండును. రత్న నామాటమీఁద మీయింట దాసియై యుండెను." అని చెప్పెను.

హార—అట్లయినచో మీ రామెమూ నే మాయింటిసంగతు లన్నియును దెలిసికొని యుందురు. పోలీ రట్లు తెలిసికొను ట్లు నాకుఁ దెలియనేలేదు. నేను హత్యచేసితినని మీరు భావించి టి! ఎంతదారుణోద్దేశము!

కీర్తికరుఁడు నవ్వుచు "అట్లే తలంచినచో మిమ్ముల నిదివఱకే పట్టుకొనియుందుము—కాని మాలాలూభాయిమాత్రము తొందరపడియెను" అనియెను.

హార—మీరు నన్నెల్లవిధములను రక్షించితిరి.

కీర్తికరుఁడు పోవుచు "నీపోయినసొమ్మునందుఁ జాలవఱకు మేము మూంచరజీకడనుండి లాగికొంటిమి!" అని పోవుచుండెను.

రాజాభాయియుఁ, గమలయు, రత్నయు నాతనిసాగనంపుటకై కొంతదూరము పోయిరి. కీర్తికరుఁ డాకస్మికముగ వెనుకకుఁ దిరిగి కమలం గాంచి నవ్వుచు "అమ్మా! బొంబాయిపోలీసువారు నీపెండ్లికి సొమ్మంతయును గట్నముగా నిచ్చెదరు—కాని యీసమయమునకే సరిగా మేము రస్తమజీపెండ్లికిఁ బోవలసి వచ్చునేమో" అని రాజాభాయివంకఁ జూచి "అమ్మా! రస్తమజీ దొంగనేరమునఁ బట్టుపడినప్పుడాతనివిడుదలకై యుత్తరముతో నైదువేలరూపాయలును బ్రేమజీకిఁ బంపినదానవు నీవేనా?" అని ప్రశ్నించెను;

రాజాభాయి తలవంచుకొని యూరకుండెను. అప్పుడు కీర్తికరుఁడు "నాయనుమానము సత్యమే యైనది. మంచిది. నీవుదారహృదయముతో ఘనకార్యమే చేసితివి. రస్తమజీ నిర్దోషి యని నీవెఱుంగుదువు, నిరపరాధియగు నాతని కష్టావస్థలో మంచిసాహాయ్యము చేసితివి!" అని పలికి నవ్వుచుఁ గీర్తికరుఁడు వెడలిపోయెను.

అప్పుడు రాజాభాయి నాథునిచేయిపట్టుకొని "మనకు భగవానుఁడే రక్షకుఁడు!" అనియెను.

* * * *

అప్పుడొకవ్యక్తి తెలియకుండఁ గీర్తికరు ననుసరించి పోవుచుండెను. మఱియొకఁడా నూతనవ్యక్తిని వెంబడించి పోవుచుండెను!

తొమ్మిదవ ప్రకరణము

పాతకునిగూర్చి

కీర్తికరుఁడు రస్తమజీయింటికిఁ బోవుచుండెను. ఆతఁడిదివఱకే ప్రేమజీతో మాటలాడవలసి యున్నదని రస్తమజీకి వ్రాసియుండెను. వారిరువురును గీర్తికరునికొఱకుఁ బ్రతీక్షించుచుండిరి. వృద్ధమహారాష్ట్రుఁడను దానే యని కీర్తికరుఁ డిదివఱకే రస్తమజీకిఁ దెలిపియుండెను. కావున నాతని కిప్పుడు వేషముమార్చవలసిన యావశ్యకము లేకపోయెను. మఱియును బర్జరజీమూంచరజీలవృత్తాంతముకూడఁ గీర్తికరుఁడు రస్తమజీకిఁ దెలిపియుండెను. హారమసజీ ప్రథమభార్యకుమార్తె బేలాభాయియే రత్నాబాయి యని విశేషప్రయత్నముచేఁ దెలిసికొని కీర్తికరుఁడిదివఱకే రస్తమజీకెఱిఁగించెను. రత్నాబాయిని సోదరివలెఁ జూచుకొనుచున్న రస్తమజీ యీమాట విని పరమానందభరితుఁడయ్యెను.

కీర్తికరుఁడు లోపలఁ బ్రవేశించినతోడనే ప్రేమజీ రస్తమజీలు సగౌరవముగ లేచి యాతని గూర్చుండఁజేసిరి. అప్పుడు కీర్తికరుఁడు నవ్వుచు "ప్రేమజీ! నీవు పేస్టనజీని జంపినట్లు బర్జరజీ నిరూపింపఁదలఁచి యున్నాఁడు!" అనియెను.

ప్రేమజీ విస్మయముతో "నేనా?" అనియెను.

కీర్తి—అవును! నీవే!

ప్రేమ—నేనారాత్రి బొంబాయినగరమునందే లేను! అందులకు నిదర్శనముచూపింపఁగలను నాసోదరికి జబ్బుగానుండుటచే నేనారాత్రి యెనిమిదిగంటలకు బండియెక్కి బెందోరా పోయితిని. అక్కడి పెద్దడాక్టరు లిరువురు నీసంగతి మీకును దాదాభాస్కరునకును దెలిపియే యున్నారు.

కీర్తికరుఁడు నవ్వుచు 'ప్రేమజీ! భయము లేదు. నేనిప్పుడు నిన్నుఁ బట్టుకొనుటకై రాలేదు. పెద్దమనుష్యుఁడగు బర్జరజీ హంతకుఁడవు నీవేయైనట్లు చెప్పి హారమసజీని నమ్మించి యున్నాఁడు!

ప్రేమ— అతఁడు నమ్మెనా?

కీర్తి—ఆ. అతఁడు నమ్మించెను. కాని యిప్పుడా నమ్మకము పోయినది.

రస్తు—మీరెల్లసంగతులు నాతనికిఁ జెప్పితిరా?

కీర్తి—ఆ—అతనికే కాదు! అందఱకును జెప్పితిని!

రస్తు—రత్నాబాయి యెవ్వరో వారందఱకునుగూడఁ దెలిసినదా?

కీర్తి—తెలిసినది!

రస్తు—హారమసజీ గుప్తవివాహచరిత్రముకూడఁ జెప్పితిరా?

కీర్తి—చెప్పకేమి?

రస్తు—విని వారందఱు నేమనిరి?

కీర్తి—ఏమియు ననలేదు.

రస్తు—ఔను. ఏమిచేయుదురు? అప్పటివారిస్థితి యెట్లుండెనో?

కీర్తి—నేను చూడలేదు. కన్నులుమూసికొని కూరుచుంటిని.

రస్తు—అట్లయినచో మీయుద్దేశము హంతకుఁడు బర్జరజీ యనియేనా?

కీర్తి—నిశ్చయముగా—

రస్తు—అయినచో నాతని నేల పట్టుకొనలేదు?

ప్రేమ—అతని కిదియంతయుఁ దెలిసినచోఁ బారిపోవును—పట్టుకొనియే తీరవలయును!

కీర్తి—నిదర్శనము దొరకనక్కఱలేదా?

ప్రేమ—అట్లయినచో నిప్పుడేమి చేసెదరు? హారమసజీ కులగౌరవముకొఱకు దయచూపి దొంగతనపునేరమునకై యాదురాత్మని బట్టుకొనుట మానివైచితిరి! ఇఁక నాపాపాత్ముఁ డీహత్యాపరాధమునుండికూడఁ దప్పించుకొని పోవలసినదేనా?

కీర్తి—అట్లయినచో నీవొక్కసంగతి చెప్పవలయును! ఆసర్టిఫికెట్లనుగురించి యెప్పుడైన బర్జరజీ నీతోఁ జెప్పియుండెనా?

ప్రేమ—లేదు; చెప్పినచో జ్ఞప్తియందే యుండును.

కీర్తి—నీవు పేస్టనజీబర్జరజీలయిండ్లకుఁ దఱచుగాఁ బోవుచుండుట కలదా?

ప్రేమ—తఱచుగాఁ గాదు—అప్పుడప్పుడు.

కీర్తి—వారిలో వారి కెప్పుడైనఁ గలహముగాని వివాదముగాని జరిగెనా?

ప్రేమ—లేదు. కాని నేనొకనాఁడు బర్జరజీయింటికిఁ బోయితిని. అతఁడప్పు డింట లేఁడు. సేవకుఁడు నవ్వుచు వచ్చి "మీకు దర్శనము దొరకదు—ఇంతకుముందే పేస్టనజీ యిచ్చటికి వచ్చినాఁడు—ఇరువురును గడుపునిండఁ దాగినారు. పేస్టనజీ రెండుసీసాలమద్యమును దాగెను. అప్పటివారిసొగసు చూచితీరవలయును! అప్పుడు మాయధికారి పేస్టనజీగుండెలపైఁ జేయివైచి యేదియో తీసికొనఁబోయెను. కాని యాతఁడు తీయనీయలేదు. వారిరువురు నట్లు కొంతసేపు క్రిందను మీఁదను బడి తుదకింటినుండి వెలుపలికిఁ బోయిరి. మరలవారే సారాయపుఁగొట్టునొద్దకైన దయచేసిరేమో! త్రోవలో మీకగపడలేదా?" అని నాతోఁ జెప్పియున్నాఁడు.

కీర్తి—ప్రేమజీ! ఈసంగతి నీవు నాకిదివఱకేల చెప్పలేదు.

ప్రేమ—ఇది యంతటి యావశ్యకమైనసంగతిగా నాకుఁ దోచలేదు.

కీర్తి— మనకా విషయమునుగూర్చియే సాక్ష్యము కావలయును నీకు బోధపడలేదా?

ప్రేమ—ఇప్పుడు తెలిసినది.

కీర్తి—ఆసేవకుఁడు నిరంతరమును బర్జరజీయొద్దనే యుండునా?

ప్రేమ—మఱునాఁడు పోయినప్పుడాతఁడు మరల నాకగపడలేదు.

కీర్తి—అవును. ఇంకను బర్జరజీ యాతని దనయొద్దనుంచుకొనునా? బర్జరజీ యిప్పుడాతనిని దన యింటినుండియే కాదు—ఈబొంబాయినగరమునుండియే యావలకుఁ బంపి యుండును!

ప్రేమ—తరువాత నాతని నూతనసేవకుఁడు మీనాదాభాస్కరుఁడే—

కీర్తి—ఎట్లయిన నిప్పుడాసేవకుని వెదకి పట్టుకొనవలయును. మాంచరజీవలన హత్యనుగూర్చి మనకుఁ గొన్నిసంగతులు తెలిసినవి. నీకోటునపహరించి బర్జరజీ కిచ్చినవాఁడు మాంచరజీయే! ఆకోటులోనే నీజేబురుమాలున్నది. ఈహత్యాపరాధము మీయిరువురి నెత్తిమీఁదను బెట్టవలయు ననుదురుద్దేశముతోనే దురాత్ముఁడగుబర్జరజీ నీకోటును సంపాదించెను. హత్యజరగిననాఁటిరాత్రి పేస్తనజీ బర్జరజీలు త్రాగి షికారు పోయిరి. త్రోవలో బర్జరజీ యాతని కగపడకుండఁ దప్పించుకొని తెలియకుండ నాతనివెన్నంటియే పోవుచుండెను. పేస్తనజీ మత్తుచేఁ దూలిపోవుచుండగాఁ జూచి రస్తుమజీ యాతని బండిపై నెక్కించి పంపివైచినసమయమున సరిగా నాదురాత్ముఁడు బండిపై కెక్కి ప్రేమజీరుమాలునకు క్లోరోఫారమంటించి పేస్తనజీ మొగమును దానితోఁగప్పి యుండెను!

రస్తు—ఆహా! లోకములో నింతటివాఁడు మఱియొకఁడుండునా?

కీర్తి—ఒకఁడుకాదు—అనేకు లున్నారు.

అని చెప్పి కీర్తికరుఁడు వెడలిపోయెను. తరువాత రస్తుమజీయును, ప్రేమజీయును ననేకవిషయములనుగూర్చి యాలోచించుకొనుచుఁ గూరుచుండిరి.

పదియవప్రకరణము.

ఆక్రమణము.

సాయంకాలమైనతరువాతఁ గీర్తికరుఁడు రస్తుమజీయింటినుండి బయలుదేరెను. అప్పుడే వీథిలో గ్యాసుదీపము లొక్కటొక్కటిగా వెలుఁగుచుండెను. కీర్తికరుఁ డాలోచనాపరతంత్రుఁడై పోవుచుండెను. తమపనులను ముగించుకొని యనేకులు గృహాభిముఖులై యావీథినిబడి పోవుచుండిరి. ఆమార్గమునం దొకచో విశేషముగఁ జెట్లుండుటచే నట నంధకారముగా నుండెను. అచ్చట జనసంచారముకూడఁ దక్కువగా నుండెను. కీర్తికరుఁ డక్కడకుఁ బోవునప్పటికి శీఘ్రగమనపదశబ్దమాతని చెవులఁ బడియెను. తోడనే యాతఁడదరిపడి వెనుకకుఁ దిరిగి చూచెను. అప్పుడెవ్వఁడో కాని ఖడ్గమును బైకెత్తి యాతని నరకుటకు సిద్ధముగా నుండెను. అది చూచి కీర్తికరుఁడించుక ప్రక్కకు జరగి యాదురాత్ముని బట్టుకొనుటకు లంఘించెను. అప్పుడావ్యక్తి యాతని పృష్ఠభాగమును గుఱిచూచి కత్తినివిసరెను. కీర్తికరుఁ డాదెబ్బను దప్పించుకొనుటలోఁ గత్తి యతితీవ్రముగ నాతనిమణిబంధముపైఁ బడియెను. ఆదెబ్బబలముగఁ దగులుటచే రక్తము వేగముగఁ బ్రవహించుచుండెను.

కీర్తికరుఁ డా యాఘాతమును లక్ష్యము చేయక యావ్యక్తిని బట్టుకొనుటకై ప్రయత్నించెను గాని నిమిషములో నాతఁ డదృశ్యుఁడై పోయెను. కీర్తికరుఁ డేమి జేయునది లేక నిలువఁబడిపోయెను. అప్పు డాయిరుప్రక్కను వెనుకనుండి వచ్చుచున్నవ్యక్తి కీర్తికరుని సమీపించి "అయ్యా! ఆదుష్టుఁడు దొరకలేదా?" అనియెను.

కీర్తికరుఁ డాతనివంకఁ జూచి "మూఢుఁడా! తత్క్షణ మాతని ననుసరించి పొమ్ము!—నాసంగతి చూడనక్కఱలేదు" అనియెను. నిమిషములో నాతఁడాయంధకారపథమున నంతర్హితుఁడై పోయెను. కీర్తికరునిగాయమునుండి నిరర్గళముగ రక్తము ప్రవహించుచుండెను. అప్పుడాతఁ డొకవీథిదీపస్తంభముకడ కేగి జేబురుమాలుతో గాయము పైఁగట్టు కట్టుకొని సందుత్రోవనుబట్టి మెల్ల మెల్లగఁబోవుచుండెను. ఇంతలో నొకవ్యక్తి యాతని యెదుటకు వచ్చి నిలువఁబడియెను.

కీర్తి—ఏమిజరగినది?

వ్యక్తి—ఇఁక నాతఁడు నాకగపడలేదు—చీఁకటిలో నెట్లో తప్పించుకొనిపోయి యిల్లు చేరియుండును.

కీర్తి—ఇఁక నిన్ను మూఢుఁడనుట కేమైనసంశయ మున్నదా?

వ్య—అయ్యా! నేను మూఁడుదినములనుండి నీడవలె నాతని ననుసరించుచునే యుంటిని.

కీర్తి—ఏమిలాభము?

వ్య—ఆపాపాత్ముఁడు మిమ్ముఁ జంపఁదలఁచి యుండె నని కెట్లు తెలియును? నే నాతని వెన్నంటియే వచ్చుచుంటిని.

కీర్తి—నన్నుఁ గొట్టినప్పుడుకూడ నీవు సమీపమునందే యుంటివి కాదా?

వ్య—ఏమిచేయుదును?

కీర్తి—సరే. నీవు తత్క్షణము పోయి యీసంగతి లాలూభాయికిని దాదాభాస్కరునకును జెప్పుము.

వ్య—చిత్తము.

అని యాతఁడు వెడలిపోయెను. కీర్తికరుఁడు కొంచెముసేపచ్చట నిలువఁబడి యేమో యాలోచించెను. తరువాత వీథిలోనికి వచ్చి యొక బండిపై నెక్కి గృహాభిముఖుఁడై పోవుచుండెను. బాధ యెక్కువగుచుండుటచే మందు వైచికొనవలయునని యాతఁ డింటికిఁ బోయెను. అతని యింట నెట్టియో మందులున్నవి.

ఆతఁ డింటికి వచ్చునప్పటికి బర్జరజీ ఖడ్గహస్తుఁడై యొకయింటి ద్వారపార్శ్వమున నొదిగి యుండెను. అతఁడు వేషము మార్చి యుండుటచే దన్నెవ్వరు నానవాలు పట్టఁజాలరని యనుకొనియెను. ఒకవ్యక్తి తన్ననుసరించి వచ్చుచున్నసంగతి యాతనికిఁ దెలియనే తెలియదు! మాంచరజీ యింటియొద్ద లేకపోవుటచే నాతఁడు పట్టుపడి యఖిలరహస్యములను వెల్లడించివైచియుండునని యాతఁడు నిశ్చయించుకొనియెను. అప్పటినుండియు నాతనికి, బోలీసువారిపైఁ బట్టరానియాగ్రహము కలిగెను పోలీసువారు మాంచరజీ నెచ్చటనుంచిరో యాతఁడతిప్రయత్నము చేసి తెలిసికొనియెను. ఆతఁ డిప్పు డెటులైన నతిత్వరితముగఁ గములను బెండ్లియాడవలయునని తల్లడిల్లిపోవుచుండెను. కోటీశ్వరుఁడగు హోరముసజీమూలమునఁ గాని తనకిఁక రక్షణోపాయము లేదని యాతఁడు నిశ్చయించుకొనియెను.

అందుచేతనే నేఁడాతఁడు హోరముసజీని దర్శింపవలయునని వచ్చెను. అప్పుడు కీర్తికరుఁడు లోపల నుండుట విని విస్మితుఁడైపోయెను. కీర్తికరుఁ డెట్లయినఁ దనుఁ బంధించుటకుఁ బ్రయత్నించుచుండెననియు నాతఁడు తనకుఁ బరమశత్రువై యుండెననియు బర్జరజీ యెఱుంగును. ఇఁకఁ దనకు రక్షణోపాయము లేదని స్థిరపఱచుకొని బర్జరజీ యప్పుడు కీర్తికరుని రాకకొఱకు వేచియుండి యాతఁడు బయలుదేరినతోడనే యాతని ననుసరించిపోయి యింతపని చేసెను. కాని దైవయోగమునఁ

గీర్తికరుఁడు బ్రదుకఁగలిగెను. అప్పుడు బజ్జరజీ విఫలమనోరథుఁడై యంధకారమున డాఁగిపోయెను.

బజ్జరజీ రాత్రి రెండుజాములవఱకు నంధకారమున వీథులవెంటఁ దిరిగి తిరిగి యొంటిగంటవేళకు పోలీసువారు మూంచరజీని దాఁచి యుంచినయింటిలోఁ బ్రవేశించెను!

పదునొకండవ ప్రకరణము.

బంధితుని పలాయనము.

మఱునాఁటి యుదయమునందే తత్తరముతో దాదాభాస్కరుఁడు కీర్తికరునియింటికి వచ్చెను. కీర్తికరుఁడంతకుముందే లేచి కాగితములను జూచుకొనుచుండెను. ఆతఁడప్పుడు దాదాభాస్కరుని తల్లడపాటుఁ జూచి "ఏమిజరగినది?" అని ప్రశ్నించెను.

దాదా—చాలనద్భుతముగా నున్నది—మాకన్నులలో దుమ్ముపడినది!

కీర్తి—అంతయద్భుతమేమున్నది? మీకన్నులలోదుమ్ముగొట్టుట యంతకష్టసాధ్యము కాదు. ఇప్పుడట్టిపని జరిగినందులకు వింతలేదు! ఇంతకాలమువఱకు జరుగకున్నందులకే యాశ్చర్యపడవలసినది!

దాదా—అయ్యా! మీరట్లు తృణీకరించుట న్యాయముకాదు.

కీర్తి—ఏమి చేయవలయునో చెప్పుము! ఏమిజరిగినది?

దాదా—మూంచరజీ పలాయితుఁడైనాఁడు!

కీర్తి—ఏమి?

దాదా—వారిరువురునుగూడఁ దప్పించుకొనిపోయిరని కావలియున్న రక్షకభటునివలనఁ దెలియవచ్చినది.

కీర్తి—ఎట్లు తప్పించుకొనిరి?

దాదా—మూంచరజీయు, నాతనితల్లియు నింటనిద్రించుచుండఁగా రాత్రియొంటిగంటవేళ నెవ్వఁడో వచ్చి ద్వారరక్షకభటుని బలవంతముగఁ బట్టుకొని మాటాడకుండ నోరుమూసి యాతని కాలుసేతులు బంధించివైచెనఁట!

కీర్తి—వాఁడు నీకంటెను మూఢుఁడు! నేను కష్టపడి పనిచేయుచుందును. మీరనాయాసముగఁ బాడు చేయుచుందురు.

దాదా—మీరేమన్నను సరియే—తెలిసినసంగతి చెప్పుచున్నాను.

కీర్తి—చెప్పుము.

దాదా—ఆద్వారరక్షకుఁడట్లు పడియుండెను. ఆతనికన్నులు కూడ మూసివైచుటచే నాతని కేమియు నగపడుట లేదు. మూంచరజీయు నాతనితల్లియుఁ దప్పించుకొని పోవుచున్నట్లాతఁడు శబ్దమును బట్టియే గ్రహియించెను.

కీర్తి—తరువాత?

దాదా—రెండుగంటలకుసరిగా నాతనికి బదిలీవాఁగా వాఁడు వచ్చెను వాఁడే యాతనికట్లను విప్పి సర్వమును దెలిసికొనియెను. పిమ్మట వారిరువురును నాకడకు వచ్చి యంతయును దెలిపిరి.

కీర్తి—చూడుదాదా! ఇది నీవనుకొన్నంతసాధారణకార్యము కాదు!

దాదా—నేనట్లంటినా? ఇన్నాళ్ళనుండి పనిచేయుచుంటినిగాని యింతటిగజదొంగను నేను చూడలేదు.

కీర్తి—పోలీసుపనిలో నేనుండి బ్రదికియే యున్నచో నీవింకను నిట్టియాశ్చర్యముల నెందఱినో చూడఁగలవు!

దాదా.—ఇప్పు డేమి చేయవలయును?

కీర్తి—దాదా! నేను నీవలె మందమతినిగాను!

దాదా.—మీమాట నాకు బోధపడుట లేదు.

కీర్తి—ఎన్నట్టిపనియం దైనను నొక్కనిపై భారముంచి యూరక కుండువాఁడను గాను. మాంచరజీపైఁ గన్నువైచియుండు మని నేనిం వఱకే మఱియొకని నియమించియుంటిని!

దాదా.—అంతపని చేయుట యావశ్యకము కాదని నే ననుకొన్నాను.

కీర్తి—నీవిట్లే దూరదృష్టి లేక తుదకన్నిపనులను జెడఁగొట్టుచున్నావు. నేను నియమించినవాఁ డింకను రాకపోవుటచే వారివెనువెంటనే యున్నాఁడని యనుకొనుచున్నాను. వార్త రావలయును.

ఆసమయమున నొకఁడు వచ్చి కీర్తికరునకు సలాము చేసి యొకయుత్తరము నిచ్చెను. దానిని గైకొని దాదాభాస్కరుఁ డిట్లు చదివెను.

"అయ్యా!

నేను మీయానతి ననుసరించి మాంచరజీయింటి కెదుటనున్న యొకయింటిగుమ్మముకడనుండి కనుపెట్టుకొని యుంటిని. రాత్రి యొంటిగంటకు మాంచరజీయు, నాతనితల్లియు, గడ్డమున్న యొకమనుష్యుఁడును ముప్పురును నిల్లువెడలి వచ్చిరి. అప్పుడు నేనువారి ననుసరించి పోయితిని. వారు బుడీబందరునకుఁ బోవు నొకపడవ నెక్కిరి. ఆగడ్డపువాఁడుమాత్రము మఱియొకదిక్కునకుఁ బోయెను. మాంచరజీని గనుపెట్టియుండుటయే నాపని గావున నేనిక నాగడ్డపువాని ననుసరింపఁజాలక పోయితిని. నేనుకూడ మఱియొకపడవ నెక్కి వారితోఁగూడఁ

బోవుచున్నాను. ఈపని చారిని నీభటునిమూలమున మీకంపితిని. మరల నేమిజరిగినదియు జాబు వ్రాసెదను.

విధేయుఁడు సేవకుఁడు,

గంగారావు.

దాదాభాస్కరుఁ డాయుత్తరము చదివి కీర్తికరునిం గాంచి "అయ్యా! నాకు మీయంతటిసామర్థ్య మేయున్న యెడల నేనిపాటికి సూపరింటెండెంటు నే నగుదును!" అనియెను.

కీర్తి—అట్లు యైతివనుకొనుము; ఇట్టిస్థితిలో నేమి చేసెదవు?

దాదా.—తక్షణము మాంచరజీని బట్టుకొనుటకై పోయెదను. మీ రేమిచేయఁ దలఁచితిరో!

కీర్తి—మనకు ముఖ్యముగాఁ బట్టుకొనవలసినవాఁడు మాంచరజీయా! బర్జరజీయా?

దాదా.—బర్జరజీని బట్టుకొనుట కష్టము.

కీర్తి—అందుచేతనే పట్టుకొనవలయును. నీవిప్పుడే బయలుదేరి రివాల్వరులు విక్రయించెడు షాపులన్నిటికిని బోయి యీనోటీసు వారికిఁ జూపుము!

దాదాభాస్కరుఁ డానోటీసు నందుకొని చదివెను. అం దిట్లున్నది.

"ఎఱుఁగనివాని కెవ్వనికిని బ్రేలెడుగుండ్లను రివాల్వరులను విక్రయింపవలదు. అంతగాఁ గోరినచో నపాయములేనితూటాల నీయవచ్చును.

కె. బి. కీర్తికర్,—
డిటెక్టివుసూపరింటెండెంటు.

కీర్తి—నీకేమైన బోధపడినదా?

దాదా.—ఏమియుఁ దెలియలేదు.

కీర్తి.—బర్జరజీ మారువేషముతోనింకను నీనగరమునందే యున్నాఁడు. మాంచరజీని బడవ నెక్కించి పంపివైచినాఁడు. వాఁడు సాధారణుఁడు కాఁడు; పట్టినపట్టువదలకుండఁ దుదివఱకును బని చేయును. అయినను నాకు భయము లేదు. బర్జరజీయొద్ద రివాల్వరు లేదని తలఁచెదను. ఉన్నచోఁ గత్తినుపయోగింపఁడు. కత్తివలన నుపయోగము లేకపోవుటచే నిప్పుడాతఁడు తప్పక రివాల్వరును దీసికొనుటకుఁ బ్రయత్నించును. అందుచేతనే యుపాయముగ లేనితూటాలను విక్రయింపవలెనని నేను నోటీసు చేసితిని.

దాదా.—మీయంతటిబుద్ధిశక్తి మాకెప్పటికి వచ్చును. కాశీనాథవేషముతో మీరే స్వయముగా సర్వరహస్యములను భేదించితిరి. మేమూరక తిరిగితిరిగి చచ్చితిమి.

కీర్తి.—ఆగొడవ లన్నియును జెప్పికొనుటకిది సమయము కాదు. ఇప్పుడు నేను చెప్పినపని చేసి రమ్ము! నేను బర్జరజీని వెదకుటకుఁ బోయెదను. ఆతని సేవకుని వెదకుటకై లాలూభాయిని నియోగించితిని.

అప్పుడు కీర్తికరుఁడును దాదాభాస్కరుఁడును సత్వరముగ నిల్లువిడిచి పోయిరి.

పండ్రెండవ ప్రకరణము.

నూతనసమాచారము.

తరువాత నొకనాఁటిరాత్రివేళ రత్నాభాయి నిలువున ముసుఁగు వైచుకొని కీర్తికరునియింటఁ బ్రవేశించెను. అప్పటికిఁ జాలరాత్రియైనది. దినమంతయును బరిశ్రమచేయుటచే నలసి కీర్తికరుఁడిఁక శయ

నింపవలయునని పోవుచు రత్నాభాయిని జూచి వెనుకకుఁ దిరిగెను. రత్నాభాయి పరుగెత్తుకొని వచ్చుటచే వగర్చుచు నొకకుర్చీపైఁ గూలఁబడియెను. కొంతసేపటి కామె యాయాసము తీర్చుకొని కీర్తికరునకొక యుత్తరము నిచ్చెను. ఆయుత్తరమునందిట్లున్నది:—

"ఘూననీయుఁడగుహరమసజీకి—కీర్తికరుఁడు నీతో నాకువిరుద్ధముగ నెన్నియోసంగతులు మాటలాడినట్లు నేనెఱుంగుదును. ఆతఁడెన్నియసత్యములు చెప్పినను నాకులక్ష్యము లేదు. నీతనయను నాకిచ్చెద నని యంగీకరించితివి. నేనామెను దప్పక పెండ్లియాడెద నని తెలిసికొనుము! నీవట్లు చేయకున్నచో నిన్నూరక వదలువాఁడను గాను. నీరహస్యముల నన్నిటిని బొంబాయినగరమునఁ జాటించితీరెదనుసుమా! అప్పుడు నీయపకీర్తి యీపట్టణమంతయును మ్రోఁగిపోవును. రాజాభాయి కులటయనియుఁ, గమలజారజయనియు నప్పుడందఱకును దెలిసిపోవును. నీయపకీర్తిచరిత్రమును వెల్లడించుటకు నేనెంతమాత్రమును జంకువాఁడను గాను. ఇంతేకాదు; పతితురాలగునీతనయరత్నాభాయిని బెండ్లియాడి నేను నీయైశ్వర్యమునంతను నపహరించివైచెదను. ఎట్లయినను బ్రయత్నించి నీజీవితమునుగూడఁ దుదముట్టించి తీరెదను. పోలీసువారు నన్నేమిచేయఁగలరు? కీర్తికరునివంటిమూఢనిర్భాగ్యశిరోమణు లగుపత్తేదారుపెద్దల నిదివఱకు నేనెందఱనో చూచియున్నాను—"

అని చదివి కీర్తికరుఁడు తలపంకించుచు "ఆలాగా?" అని మరలనుత్తరమును జదువఁదొడంగెను.

"మూఁడుదినములలో నాకుఁ గమల నిచ్చి పెండ్లిచేయవలయును!—కాకున్నచో నీకిఁక నిష్కృతి లేదు. బాగుగ నాలోచించుకొని నీవు రేపురాత్రి యొంటిగంటకేకాకివై వచ్చి గిరిగామునొద్ద నన్నుఁ గలిసికొనుము! ఈసంగతి పోలీసువారికిఁ దెలియఁజేసినను

పోలీసువారిని వెంటఁబెట్టుకొని వచ్చినను నీకు నాసందర్శనము దొరకదని తెలిసికొనుము! మన మేమిచేయవలయునో యప్పుడు నీకుఁ జెప్పెదను. నీవు వచ్చునప్పుడైదువేలరూప్యములను దీసికొనిరమ్ము. ముఖ్యముగా నాకు సొమ్ము కావలసియున్నది—

బర్జరజీ”

కీర్తికరుఁ డాయుత్తరమును జదివి యప్పుడొక్కయుత్తరమును వ్రాసి రత్నాబాయిని జూచి “భయములేదు. వెళ్ళుము! ఈయుత్తరమునం దంతయును వ్రాసితిని” అనియెను. రత్న యేమియు మాటాడకుండ లేచెను. అప్పుడు కీర్తికరుఁ డించుక సంశయించి నీవొంటిగాఁ బోవుట మంచిది కాదు” అని చెప్పి యామె నొకబండిపై నెక్కించి హారమసజీయింటివఱకును దీసికొనిపోయి విడిచి వచ్చెను.

మఱునాఁటియుదయమున లాలూభాయి వచ్చి కీర్తికరుని దర్శించి “అయ్యా! నేను బర్జరజీసేవకుని వెదకి తెలిసికొంటిని. ఆతఁడిప్పుడు కలకత్తాలోనున్నాఁడు. బర్జరజీకొంతసొమ్మిచ్చి యాతనిని కలకత్తాకుఁ బంపివైచినాఁడు.” అని చెప్పెను.

కీర్తి—అవును. పేస్టనజీయొద్దనుండి యాసర్టిఫికెట్లు లాగికొన్న సంగతి యాతనికిఁ దెలియును. అందుచేతనే బర్జరజీ యాతని నొరులకగపడకుండులాగునఁ బంపియున్నాఁడు! వాఁడు మనకు మంచి సాక్షి—మనకీయొక్కసాక్షియే చాలును.

లాలూ—వాఁడు కలకత్తాలోనేయున్నాఁడు. వాని నిచ్చటికిఁ దీసికొనిరావచ్చును—బర్జరజీసంగతియేమైనఁ దెలిసినదా?

కీర్తి—లేదు. వాఁడిచ్చటనే దాఁగియుండును. దాదాభాస్కరుఁడు వానికొఱకుఁ బ్రయత్నించుచున్నాఁడు.

లాలూ—మఱియొకసంగతి—ఇప్పుడు మాంచరజీ తల్లితోఁ గూడ సాలసటీద్వీపమునకుఁ బోయి యచ్చటనొక స్త్రీయింటియం

దున్నాఁడు. బర్జరజీమాంచరజీ లాస్త్రీనిదివఱకే యెఱుఁగుదురు. బర్జరజీ చంపెదనని భయపెట్టి బలవంతముగ మాంచరజీ నచ్చటికిఁ బంపివైచినాఁడు. మాంచరజీ యిప్పుడటనుండి బర్జరజీకొఱ కెదురు చూచుచున్నాఁడు!

కీర్తి—ఆతఁడు నీకేమైనఁ జెప్పెనా?

లాలూ—బర్జరజీభయముచేతనే యాతఁ డచ్చట నున్నాఁడు. కాని మన మెట్లు చెప్పిన నట్లు చేయుటకు సిద్ధముగా నున్నాఁడు. మీ యుపదేశమునను సరించి బర్జరజీ చెప్పినట్లుచేయుమని నేనాతనికిఁ జెప్పివచ్చితిని.

కీర్తి—అక్కడ నెవ్వరినైన నుంచితివా?

లాలూ—నలువురనుంచితిని. మాంచరజీ వారికన్నులఁగప్పి పోఁజాలఁడు. మఱియు బర్జరజీ యచ్చటకుఁ బోయినచో వారాతని బట్టుకొనఁగలరు.

ఇంతలో దాదాభాస్కరుఁ డచ్చటికి వచ్చి “మీరు చెప్పినట్లే జరిగినది!” అనియెను.

కీర్తి—ఏమిజరిగినది?

దాదా—నిన్న నెవ్వఁడో యొకయపరిచితుఁడగుదొర “లక్ అండుకంపెనీలో నొకరివాల్వరును, బండ్రెండుతూటాలను గొనియెను.

కీర్తి—ఆతనికిఁ బెద్దగడ్డమున్నదా?

దాదా—ఉన్నది.

కీర్తి—సరే—ఆతఁడే మనచుట్టము! వట్టితూటాలే యిచ్చినాఁడుగద?

దాదా—ఆ.

కీర్తి—బర్జరజీయున్నచోటు తెలిసినదా?

దాదా—ఇంకను దెలియలేదు. ఈబొంబాయిలోనే యున్నచో నాచేతిలోఁబడకమానఁడు. అన్నిచోటులను దగినవారిని గాపుంచియున్నాను.

కీర్తి—రేపు తెల్లవారుజామున నాలుగుగంటలకు మీరిరువురు నిచ్చటకు రావలయును. అత్యావశ్యకమగుపని యున్నది. ఇఁకఁ బోవచ్చును.

పదుమూడవ ప్రకరణము.

పాపాత్మునిపాపచర్య.

ఆరాత్రి పండ్రెండుగంటలకు సరిగా హారమసజీ గిరిగాము పోయి నలుదెసలఁ బరికించెను. ఎచ్చట నెవ్వరును లేరు. అప్పటి యాతనిహృదయావస్థవర్ణనాతీతమైయుండెను. ఆతఁడు పిఱికివాఁడు కాఁడు—కాని యంతరాత్రివేళ నొంటిగా బర్జరజీతో మాటాడ వచ్చినందుల కాతనిగుండెలు కొట్టుకొనుచుండెను. కాని తనకట్టివిపత్తు కలిగినను రక్షించెదనని రత్నాబాయిచే నుత్తరము పంపిన కీర్తికరునిప్రతిజ్ఞయే యాతని కప్పుడు ధైర్యము కలిగించుచుండెను.

అతని కెవ్వరు నగపడుట లేదు. దూరమునందున్నగంటస్తంభమప్పుడే పండ్రెండుగంటలు కొట్టెను. ఆతఁడింకను నైదునిమిషములు నిరీక్షించెను. కాని బర్జరజీ రాలేదు. ఇంకను వేచియుండుట వృథాశ్రమ యని యెంచి యాతఁడు తిరిగిపోవుచుండఁగా వెనుకనుండి యొక స్త్రీమూర్తి వచ్చి యాతనివెన్నుపైఁ దట్టెను. హారమసజీ యులికిపడి వెనుదిరిగి చూచెను. అప్పు డాస్త్రీ యస్ఫుటస్వరముతో "రండు! బ

ర్జరజీ మిమ్ములను దీసికొని రమ్మని నన్నుఁ బంపియున్నాఁడు" అనియెను. హారమసజీ మాఱుమాటాడక యామెతోఁగూడఁబోయెను. ఆస్త్రీ యాతని నొకయంధకారబంధురమగుసందుత్రోవను దీసికొనిపోవుచు నాఁగి "అయ్యా! ఇటనుండి మీకన్నులనుగట్టి తీసికొనిపోవలయును అట్లు చేయుట మీకిష్టము లేకున్నచోఁదిరిగి పోవచ్చును" అనియెను.

హారమసజీ విస్మయముతో "నేనాతనితో మాటలాడవలసివచ్చినప్పుడు నీవెట్లుతీసికొనిపోయినను సంగీకరింపవలసినదే! "అనియెను. ఆస్త్రీ మాఱుమాటాడక యొకరుమాలుతో నాతనికన్నులను గట్టి తీసికొనిపోయి యొకగృహమునఁ బ్రవేశపెట్టి కన్నులకట్టు విప్పి వెడలిపోయెను. అదియొకచిన్నయిల్లు! గదిలో నొకబల్లయు రెండుకుర్చీలు నుండెను. ఆబల్లపై నొకదీపము వెలుఁగుచుండెను.

ఆయింటికొక్క—ద్వారము గవాక్షమున్నది గాని బంధింపఁబడియుండెను. ఆయింట నీఁక నెవ్వరును లేరు. ఆస్త్రీ యాతని లోనికిఁ దెచ్చినంతనే ద్వారమును బంధించివైచెను. తరువాత నామె యాతనికడకు వచ్చి "ఇఁక మనము మాటాడుకొనవచ్చును" అనితనమొగముపైనున్న రబ్బరుమొగమును దీసివైచెను. హారమసజీ పరమాద్భుతరసనిమగ్నుఁడయ్యెను. స్త్రీ కాదు—ఆతఁడు బర్జరజీయే—

అప్పుడు బర్జరజీ నవ్వుచు "శత్రువులు నలుదెసలఁ గాచుకొనియుండుటచే నిట్లుచేయవలసివచ్చినది! లోకులు పరులశ్రేయమునుగాంచిసహింపఁజాలరు! అట్టియసూయాపరులే నాశత్రువులు!" అనియెను.

హారమసజీ యతికష్టముతోఁ దనహృదయభావమును మరుగుపఱచుకొని "నీవు నాకట్లు జాబువ్రాయుట నేను నీకుఁ బెండ్లి చేయననియేనా?" అనియెను. బర్జరజీయామాటకుఁ బ్రత్యుత్తరము చెప్పక "కీర్తికరుఁడు నీయొద్దకు వచ్చినాఁడా?" అని ప్రశ్నించెను.

హర— ఆ. చాలవఱకు మాటలాడినాఁడు. ఆతనిమాట యొక్కటియును నేను నమ్మలేదు—పోలీసువారిని నే నెఱుఁగనివాఁడనా?

బర్జ—సొమ్ము తెచ్చితివా?

హర— తెచ్చితిని. నాబిడ్డను నీకిచ్చి పెండ్లి చేయఁదలఁచి యున్నప్పుడు నేను నిన్ను నమ్మక యెవ్వరిని నమ్మెదను!

అని చెప్పి యైదు వేలరూపాయలనోట్లను లెక్కించి బర్జరజీ కిచ్చెను. బర్జరజీ వానిని జేబునం దుంచుకొని "కీర్తికరుఁడు నిన్ను వశపఱచుకొనలేకపోయెనని నేనిప్పటికిఁ దెలిసికొంటిని. ఏమో కాని యాతఁడ కారణముగ నాతో శత్రుత్వము పెట్టుకొన్నాఁడు" అనియెను.

హర—కోటీశ్వరుఁడ నగునాయల్లుఁడవైన నీతో విరోధపడుట కెవ్వరు సాహసింపఁగలరు?

బర్జ—కావున రేపే రహస్యముగా వివాహకార్యము పూర్తి కావలయును.

హర—నాయభ్యంతర మేమియు లేదు. నామర్యాదయంతయు నీచేతిలో నున్నది.

బర్జ—ఈపెండ్లి చాల రహస్యముగా జరుగవలయును. లేకున్నఁ గీర్తికరుఁ డల్లరి చేయఁగలఁడు. పెండ్లియైనచో నిఁక నాతఁ డేమియుఁ జేయఁజాలఁడు.

హర—అట్లే. రేపు రహస్యముగనే పెండ్లి చేసెదను. నీవు మాయింటికి వచ్చునప్పటి కన్నియును సిద్ధముచేసి యుంచెదను.

బర్జ—మీయింటియొద్ద వివాహము చేయవలదు. పెండ్లియగువఱకును నేనున్నచోటు కీర్తికరునకుఁ దెలియఁగూడదు.

హర—ఆతని కెట్లు తెలియును?

బర్జ—నీ వాతనికిఁ జెప్పవు! కాని నీయింటమాత్రము వివాహము జరుగరాదు. నేనొకయిల్లు స్థిరపఱచితిని. ఆయింటనే జరుగవలయును.

హర.—నీవు చెప్పినట్లే చేసెదను. మే మాయింటికే వచ్చెదము.

బర్జ—కమలనుదక్క మఱి యెవ్వరిని దీసికొని రావలదు.

హర—నాభార్యయు, రత్నయు రాకుండ నుండఁగలరా?

బర్జ—సరే. వారిని మాత్రము తీసికొని రమ్ము!

హర—సాక్షు లక్కఱలేదా?

బర్జ—ఇరువురు సాక్షులుగూడఁ గావలయును—ఒకఁడు మావాఁడు—ఇంకొకఁడు మీవాఁడు! నేను మాంచరజీని దీసికొని వచ్చెదను. నీవొక నమ్మకమైన వానిని దీసికొని రమ్ము! వృద్ధుఁడైన మంచిది!

హర—అట్లయినచో మా బ్యాంకిషరాబును దీసికొని వచ్చెదను. ఆతఁడు వృద్ధుఁడు! విశ్వాసి.

బర్జ—సరే యాతని దీసికొని రమ్ము—

హర—పురోహితుఁడో?

బర్జ—నమ్మకమైన పురోహితుని నీవే తీసికొని రావలయును. నాకుఁ జాలఁగఁ బనులున్నవి.

హర—రిజస్టరుచేయువా రెవ్వరు?

బర్జ—నీవే—ఆపని నీవే చేయవచ్చును.

హర—సరే.

బర్జ—రేపు సాయంకాలమైన తరువాత గిరిగామ్ పలుపునొద్ద రెండు బండ్లు నిలిచియుండును. అక్కడకు మీరందఱును వచ్చి యాబండ్ల నెక్కి యేమియు మాటాడకుండవలయును. బండివాఁడె పెండ్లియింటికి మిమ్ములను దీసికొని వచ్చును.

హర—మంచిది. ఇఁకఁ బోవుదము. చాల రాత్రియైనది.

బర్జ—ఇప్పుడు మీరు మఱియొకలా గనుకొనవలదు. వివాహమైనతరువాత నిట్లుండనక్కఱలేదు.

అని చెప్పి బర్జరజీ మరల హరమసజీకన్నులను గట్టివైచి యె

ప్పటివలెఁ జేయివట్టుకొని తీసికొనిపోయి కట్లను విప్పివైచి "ఇఁక మీరు పోవచ్చును" అనియెను. హరమసజీ శీఘ్రగమనముతో గృహాభిముఖుఁడై పోయెను.

పదునాల్గవ ప్రకరణము.

విచిత్ర వివాహము.

మఱునాఁటిసాయంకాలమునకు ముందే హరమసజీ యింటినుండి యేడ్గురుజనులు నిశ్శబ్దముగ బయలు దేరిరి. అందుమువ్వురుపురుషులు- మువ్వురుస్త్రీలు- మొదట బయలు దేరినవాఁడు హరమసజీ! నేఁడాతఁడు బాగుగ నలంకరించుకొని యుండెను. ఆతనివెనుక నొకవృద్ధపార్సీపురోహితుఁడు నడచుచుండెను. ఆతఁడు తెల్లనియంగరకాను దొడిగికొని యుండెను. ఆతనివెనుక బ్యాంకిషరాబు మారోయాన్‌జీ బయలు దేరెను. వారివెనుకఁ గమలాబాయియు రాజాబాయియు రత్నాబాయియు బయలు దేరిరి. కమల యిప్పుడు సర్వాభరణభూషితయైయుండెను. బంగారుసరిగ పనిచేసిన యామెపట్టుచీర యామెసౌందర్యమును శతగుణములుగాఁ జేయుచుండెను. వీధిలోనివారందఱును ముగ్ధులై యామెవంకనే చూచుచుండిరి. రాజాబాయియు రత్నాబాయియు మేలిముసుఁగులు వైచుకొని మెల్లమెల్లగ నడచుచుండిరి. వారిమొగము లెవ్వరికిని గాన్పించుట లేదు.

వారీవిధముగా బాదచారులై క్రమముగాగిరిగామమలుపుకడకు వచ్చిరి. ఎలిఫిన్‌స్టనుసర్కిలునుండియాప్రదేశమంత సమీపములో లేదు. వారక్కడకుఁ జేరునప్పటికి రాత్రి యెనిమిదిగంటలయ్యెను. ఆసమయమునకు సరిగాఁ జెట్లగుంపులోనంధకారమున రెండుబండ్లు వారికొఱకునిజముగా నిరీక్షించి యుండెను. బండివాండ్రుబండిపైఁ గూర్చుండి కునుకుపాట్లు పడుచున్నట్లుండిరి. వారందఱును బండ్లయొద్దకుఁ బోవునప్పటికి బండివాండ్రు లేచినిలువఁబడిరి. ఏమియు మాటాడలేదు. హరమసజీయును, భార్యయుఁ గమలాబాయియుఁ బురోహితుఁడు నొకబండిపై నెక్కిరి. రెండవ బండిపై రత్నయు, షరాబును నెక్కిరి.

బండ్లు గంటసేపటివఱకు నడచిపోయెను. పదిగంటలరాత్రి యగునప్పటికి బండ్లురెండును నొకపాడింటియొద్దకు వచ్చెను. అక్కడ బండివాండ్రు ముందు దిగి గుఱ్ఱములను విప్పి వాని నొకచెట్టునకుఁ గట్టిరి. పిమ్మట నొకఁడాయింటితలుపులను దెఱచెను. రెండవవాఁడొక క్రొవ్వత్తిని వెలిఁగించి బండిలోనివారిని దిగుఁడని చెప్పెను. అందఱును దిగిరి. బండివాఁడు వారినందఱను వెంటఁబెట్టుకొని యింటిలోనికిఁ దీసికొనిపోయెను. ఆయిల్లంతయును దుమ్ముతో నిండి చీదరగా నుండెను. అట్టిస్థలమునం దీవిచిత్రవివాహము జరుగనై యుండెను!

అందఱును లోపలఁ బ్రవేశించినతోడనే బండివాండ్రిరువురును భద్రముగా ద్వారమును బంధించి తాళములను బిగించిరి. ఒకఁడు దీపము చేతఁబట్టుకొనివారినిలోనికిఁదీసికొనిపోయెను. వారందఱునుబోయి యొకగదిలోఁబ్రవేశించిరి. అప్పుడు హరమసజీ బండివాండ్రంజూచి "మీరిట్లు తలుపులు మూయుచున్నారేమి? బర్జరజీయెక్కడనున్నాఁడు? ఆతఁడు రాకున్నచో మేమొక్క యడుగైనను ముందఱికిఁ బెట్టము!" అనియెను.

అప్పుడొకబండివాఁడు తన వేషమును మార్చి నవ్వుచు "మామా! మీరుమఱియొకలా గనుకొనవలదు. శత్రుమధ్యమున నున్నమనము జాగ్రత్తగ నుండవలయును. కమలను బెండ్లియాడదలఁచుట చేతనే నాకిందఱుపరమశత్రువులైరి. అందు రస్తుమజీ కీర్తికరులు ప్రబలశత్రువులు. అందుచేతనే యింత సావధానముగా నుండవలసి వచ్చినది. ఇప్పటి కీవివాహము కానిమ్ము! రేపు నీయింటఁ గావలసినంత యుత్సవము చేసికొనవచ్చును" అనియెను.

హర—అవును, నిశ్చయముగా వారిప్పట్టున నపకారముచేయుటకే ప్రయత్నించుచుందురు.

బజ్జ—నన్నిప్పు డత్తగారును, గమలయుఁగూడ క్షమింపవలయును.

హర—అట్లయినచో నిఁక నాలస్యము చేయుట యుచితముకాదు. ఏమి?

బజ్జ—నేను మాంచరజీని సాక్షిగాఁ దీసికొని వచ్చితిని.

హర—వివాహ మెక్కడ?

బజ్జ—రండు! ఇది శిథిలమందిరము! దీని నెవ్వరును గనుఁగొనఁజాలరని యెంచి యీయింటిని స్థిరపఱచితిని. రండు—లోపల నంతయు బాగుచేయించితిని!

హర—దీపములుకూడ బాగుగ లేవు ఈయింటిలో నొకరి మొగ మొకరి కగపడుట లేదు!

బజ్జ—దీపములు విశేషముగా నుంచుట మంచిది కాదనియే యిట్లు చేసితిని. ఈయిల్లు పాడిల్లనియు, నెవ్వరు నిందుఁ గాపురముగ లేరనియు నెల్లవారు నెఱుఁగుదురు. ఇప్పుడు దీపముల వెలుఁగు వెలుపలకుఁ బ్రసరించినచో మనమిందున్న ట్లెవ్వరికైనఁ దెలిసిపోవును.

హర—సరే—అట్లయినచో నడువుము!

బజ్జ—తలుపులను బంధించితినని గాని, దీపములు లేవని గాని మీరు చిన్నపుచ్చుకొనవలదు. ముందుగ జాగ్రత్త పడుట యెందులకైన మంచిదని నేనిట్లు చేసితిని! రండు!

మాంచరజీ దీపముచేతఁ బట్టుకొని దారి చూపుచుండ వారందఱును నొక్కొక్కగదియును దాఁటిపోవుచుండిరి. ఇట్లు వారైదాఱిండ్లను దాఁటి యొకవిశాలమగు హాలుపందుఁ బ్రవేశించిరి. అచ్చట నొక్క పెద్దతివాసి పఱుపఁబడి యుండెను. ఆమధ్యప్రదేశమున వివా

హోపకరణము లన్నియు సమకూర్పఁబడియుండెను. ఒకప్రక్కను గాగితము, కలము, సిరాబుడ్డియు నుండెను. అందఱును గూర్చుండిరి. కమలాబాయి తండ్రిప్రక్కను గూర్చుండెను. ఆమె వెనుక నవకుంతనవతు లగు రాజాబాయియు రత్నయుఁ గూర్చుండిరి. కమల కెదురుగా బజ్జరజీ పెండ్లికొడుకై వచ్చి కూరుచుండెను. ఆతని వెనుక మాంచరజీయును, వృద్ధమరాఠును గూర్చుండిరి. వారియెట్టయెదుటఁ బురోహితుఁ డాసీనుఁడై యుండెను. అచ్చట నొక్కదీపముమాత్రమే మినుకు మినుకు మని వెలుఁగుచుండెను. ఆవెలుఁగులో వధూవరుల మొగములకంటె మఱియెవ్వరి మొగములును స్పష్టముగా నగపడుట లేదు.

అప్పుడు పురోహితుఁ డింకొకదీపము కావలయు ననియెను. బజ్జరజీ వలదని వారించుచు "రేపు మామగారిమందిరమునఁ గావలసినన్ని దీపములను వెలిఁగింపవచ్చును. నేటికి దీనితో" బని జరుగనిండు.' అనియెను.

పురో—మీయిష్టము!

బజ్జ—అయ్యా! మాటలతో నాలస్యము చేయవలదు. తొందరతొందరగాఁ బనిజరిగిపోవలయును!

పురో—ఎంతత్వరఁగాఁ గావలయునన్న నంతతొందరగానే చేయింతును.

హర—చాలరాత్రియైపోయినది!

అప్పుడు పురోహితుఁడు కమలాబాయిను ద్దేశించి "అమ్మా! నేను చెప్పినమాటలను నీవు మరలఁ జెప్పవలయును!" అనియెను.

అటుపిమ్మట వివాహకార్యములు ప్రారంభింపఁబడియెను. బజ్జరజీ యానందోత్ఫుల్లహృదయుఁడైపోయెను—ఆయానందమున నలుదెసల నంధకారమే!

పదునేనవ ప్రకరణము.

పాపఫలము.

వివాహమంత్రపఠనమునకు మఱియొక యఱగంటకాలము పట్టెను. పురోహితుఁడు మంత్రపాఠమును ముగించి హారమసజీవంకఁ దిరిగి "నా పని ముగిసినది. ఇఁక మీరు చేయవలసినపని యున్నది!" అనియెను.

హార—అట్లయినచో నిఁక రిజిస్టరు చేయుపని యున్నది!

బర్జ—అవును! ఇఁక నాలస్యమెందులకు?

హారమసజీ యప్పుడు కాగితమును గలమును దీసికొని సాంప్రదాయానుసారముగా వ్రాయవలసిన సంగతులను వ్రాసి బర్జరజీని జూచి "దీనిపై ముందుగ నీవు వ్రాలు చేయుము! తరువాతఁ గమల చేయును; పిమ్మట సాక్షులు చేయుదురు" అనియెను. బర్జరజీయా కాగితము నందుకొని వ్రాలు చేసెను.

హారమసజీ యా కాగితమును దీసికొని కమలచేతి కిచ్చి వ్రాలు చేయుమనియెను. కమల కంపితకరములతో దాని నందుకొని వ్రాలు చేయుచున్నట్లు నటించుచుండెను.

ఇంతలో నానందమును బట్టఁజాలక బర్జరజీ యున్మత్తునింబోలి లేచి "బుద్ధిహీనుఁ డగు కీర్తికరుఁడిఁక నన్నేమి చేయఁగలఁడో చూతము! ఆతఁ డిఁక నెంతకొట్టుకొని చచ్చినను సరియే!" అని యుత్సాహముతో గంతులు వైవఁదొడంగెను.

అప్పుడా పురోహితుఁడు మెల్లమెల్లగ లేచి తన చొక్కా చేతులను సవరించుకొను నెపంబున మణిబంధమునందలి గాయము నాతనికిఁ జూపించెను. తోడనే బర్జరజీ యదరిపడి తూలిపడి స్తంభితుఁడై యా పురోహితునివంకఁ దదేకదృష్టిం గాంచుచు నిలువఁబడిపోయెను.

పురో—అయ్యా! బర్జరజీ సాహెబా! బుద్ధిహీనుఁడగు కీర్తికరుఁ డెవ్వఁడును లేఁడని యెఱుంగుము. ఇప్పుడు ప్రతిక్రియావిధానదక్షుఁ డగు కీర్తికరుఁడే దేవరవారి సమ్ముఖమున సాక్షాత్కరించి యున్నాఁడు!

"ఏమి!" అని బర్జరజీ యొక్కదాఁటుతోఁ బదియడుగులు వెనుకకుఁ బడి విస్ఫారితనయనములతో మరల నాతనివంకఁ దిలకించెను. ఇప్పుడిఁకఁ బురోహితుని మొగమునఁ బాలవలెఁ దెల్లనగు కేశములుగల గడ్డమును, మీసములును నపసారితములై పోయెను. ఇప్పుడాతఁడు నిజముగాఁ గీర్తికరుఁడే!

బర్జరజీ యప్పుడు చటాలునఁ దన జేబులోనుండి రివాల్వరును దీసి కీర్తికరునితలకు గుఱిపెట్టి ధాన్మని పేల్చెను.

కీర్తికరుఁ డొక్కయుదుటునఁ బ్రక్క కొత్తిగిలెను. బర్జరజీ మరలఁ బేల్చెను. మరలనొకసారి హారమసజీవక్షమునకు గుఱిపెట్టి పేల్చెను! అవి వట్టితూటాలు కాకయున్నచో నానిమిషములో వారిజీవయాత్రలు ముగిసిపోవలసినదే!

ఒక్కనిమిషములో నింతయును జరగిపోయెను. ఇంతలో రాజాబాయియు, రత్నయు నొక్కయుదుటునఁ బోయి బర్జరజీపైఁ బడి యాక్రమించిరి. వారు నిజముగా స్త్రీలు కారు, అందొకరు కమీషనరు దొరగారు! రెండవవాఁడు దాదాభాస్కరుఁడు!

బర్జరజీ సింహాబలముతో వారిని బట్టుకొని క్రిందఁ బడఁద్రోసి పటపటమని నాలుగుసారులు వారిపై రివాల్వరును గాల్చెను; పిమ్మట దాదాతలపై రివాల్వరుతోఁ గొట్టుటకై చేయెత్తెను. అంతలో దాదాభాస్కరుఁడు చటాలున లేచి తప్పించుకొనియెనుగాని లేకున్నచో నాతలబ్రద్దలైపోవలసినదే.

ఇఁక నేమియుం దోఁచక తత్తరములో బర్జరజీ కిటికీయొద్దకుఁ బరుగెత్తెను. కాని యప్పుడు వృద్ధపరాబువేషముతో నున్నలాలూ

భాయి యాతనికాళ్లలోఁ గాలుపెట్టుటచే బర్జరజీ యొక్కసారిగ గుభాలునఁ గ్రిందఁబడిపోయెను !

అప్పుడు దొరగారును, గీర్తికరుఁడును, దాదాభాస్కరుఁడును నాతని బట్టుకొనుటకుఁ బరుగెత్తిరి. కాని వారు సమీపింపకుండఁగనే బర్జరజీ లేచి విద్యుద్వేగముతోఁ గమలయున్నకడకుఁ బరుగెత్తిపోయెను. కమల భయప్రకంపితయై వరాండా వైపునకుఁ బరుగెత్తెను. ఆఁకలిగొన్న సింగమువలె బర్జరజీ యావంకకే పరుగెత్తుచుండఁగా దాదాభాస్కరుఁ డడ్డగించెను. కాని బర్జరజీ యాతని నొక్కత్రోపు త్రోసి క్రిందఁ బడవైచి యొక్కయుదుటునఁ గమలపైఁ బడియెను.

అప్పుడు హరమసజీ తనబిడ్డను రక్షించుటకై నాతనిపైఁ బడి "అయ్యో ! నాబిడ్డ చచ్చిపోవుచున్నది!" అనిగద్గదస్వరముతోఁ గేకలు వైచెను.

అప్పుడొకభయంకరయుద్ధము జరగుచున్నట్లుండెను. నరరూపరాక్షసుఁ డగుబర్జరజీ యాసమయమునఁ గమలను వరాండాకటకటాలపైఁ బడఁద్రోసి బలవంతముగ నామెగొంతుపట్టుకొని నొక్కివైచుచుండెను. పాపము కమల యూపిరి సలుపక కన్నులను డేలవైచుచుండెను! అప్పుడు కీర్తికరుఁడును దాదాభాస్కరుఁడును జటాలునఁ బోయి బర్జరజీ రెండుచేతుల నిరువురును బట్టుకొని విడిపించుటకుఁ బ్రయత్నించిరి కాని యెంత పెనఁగులాడినను పాపాత్ముఁడగు నారాక్షసుఁ డాపట్టువదలలేదు!

ఇఁక నొక్కక్షణకాలములోఁ గమల ప్రాణవాయువు లనంతవాయువీచికలలోఁ దేలిపోవుటకు సిద్ధముగా నుండెను. అప్పుడాకస్మికముగ దెసలఁ బ్రకంపితములుగఁ జేయునొకరివాల్వరు కాల్చినశబ్దమయ్యెను. కమీషనరుదొరగా రిఁక ననన్యోపాయుఁడై తన జేబులోనిరివాల్వరును దీసి బర్జరజీతలకు గుఱిచూచి ప్రేల్చెను. ఆరివాల్వరుగుండుదెబ్బతో

బర్జరజీపాపపుఁదల బ్రద్దలై యందలిదుష్టమస్తిష్కముచే నాప్రదేశమంతయుఁ గలుషితమైపోయెను ! కమలముఖమండలము బర్జరజీరక్తధారలచేఁ బ్లావితమైపోయెను ! అప్పుడు కమలాబాయి వివశయై భూతలమునఁ బడిపోయెను !

నిమిషములోఁ బోయి లాలూభాయి కమలను దన యంకమునఁ జేర్చుకొనియెను. అందఱునప్పుడు కమలకుపచారములను గావించుటకై యామెను మఱియొకగదిలోనికిఁ దీసికొనిపోయిరి. అప్పుడు కమీషనరుదొరగారు బర్జరజీమృతకళేబరమును పాదములతో దూరముగఁ ద్రోసివైచి తివాసిపైఁ గూర్చుండెను.

కీర్తికరుఁడు వైద్యవిద్యయందును గడు నిపుణుఁడు! ఆతనియుపచారములచేఁ గమలాబాయికి శీఘ్రముగనే యూపిరి తిరిగెను. ఆమె కన్నులను విచ్చి దిగులుపాటుతో నలుదెసలను దిలకించెను ! అప్పుడతిత్వరితముగ వచ్చి హరమసజీ యాబిడ్డను దనయొడియందుఁ జేర్చుకొనియెను.

కమల యించుకప్రకృతిస్థయైనతోడనే ముందుగ నామెనింటికిఁ బంపివైచిరి. ఆమెతోఁగూడ హరమసజీయును బోయెను. దాదాభాస్కరుఁడు స్వయముగా నారెక్కినబండిని దోలుకొనిపోయెను.

తరువాత మిగిలినవారు బర్జరజీమృతకళేబరమున్నచోటికిఁ బోయిరి. అప్పుడు కమీషనరు దొరగారు "ఇప్పుడీశవ మిచ్చటనే యుండును. నేను కొందఱురక్షకభటుల నిచ్చటికిఁ బంపెదను !" అనియెను.

లాలూ—అయ్యో ! మేముపడినకష్టము లన్నియు నిప్పుడొక్కసారిగా మంటఁ గలసిపోయినవి !

కమీ—ఏమి ?

లాలూ—కేసు విచారణ జరుగుననియు, హంతకున కురిశిక్ష యగుననియు, మాకుఁ బ్రమోషను దొరకు ననియు నాశపడి యుంటిమి! ఇంకేమున్నది?

కమీ—లాలూభాయీ! నీవు చెప్పిన సంగతి నిజమే—ఈతని నురిశిక్ష చేయించు వఱకు నూరక చూచుచున్నచో నిష్కారణముగాఁ గమలాబాయినిగూడ నిపాపాత్ముఁడు చంపివైచును గాదా?

కీర్తి—అవును. మేమిరువురము నాతని చేతులను బలవంతముగఁ బట్టుకొని యాఁగితిమి గాని యట్లు చేయకున్నచోఁ గమల యీపాటికే మరణించి యుండును!

లాలూ—ఏమైన నేమి? మా కేసు తనంతనే తీరిపోయినది!

కమీ—భయములేదు! మీ ప్రమోషనుకు భంగము కలుగకుండ నేను దొరతనమువారికి వ్రాసెదను!

కీర్తి—మాంచరజీ యేఁడీ?

మాంచరజీ యచ్చట లేఁడు! అందఱును గలసి కమలను లోపలికిఁ దీసికొనిపోవు సమయమును గనిపెట్టి యాతఁడు కిటికీనుండి వెలుపలికుఱికి పాఱిపోయెను!

ఉపసంహారము

పేస్టనజీహత్యను గూర్చిన వ్యవహార మింతకాలమునకుఁ దీరిపోయినదని మఱునాఁడు బొంబాయిప్రజలందఱకును దెలిసిపోయెను, పోలీసువారు హంతకుని బట్టుకొనవలసినదే. కాని యాదురాత్ముఁడు రివాల్వరుతో నందఱను జంపుటకుఁ బ్రయత్నించుటచే పోలీసువారతనిని రివాల్వరుతోఁ గాల్చిచంపవలసివచ్చినది! స్వయముగాఁ గమీషనరు దొరగారే యాతని జంపివైచిరి." అని కూడ నందఱును జెప్పుకొనఁ దొడంగిరి.

లాలూభాయియు, దాదాభాస్కరుఁడు నీవ్యవహారమున మిగుల శ్రమపడి సామర్థ్యముతోఁ బనిచేసినందులకు సర్కారువారు వారికిఁ దగిన ప్రమోషనులను జేసిరి.

రాజాబాయిహారమసజీల పూర్వచరిత్రము లెంతమాత్రమును వెల్లడికాకుండ నుండెను. అందుచే వారు జీవించియున్నంతకాలమును గీర్తికరుని యెడలఁ గృతజ్ఞులైయుండిరి.

మాంచరజీ సమాచార మింక నేమియును దెలియనేలేదు! ఆతఁడు తనతల్లికైన నింక నగపడకుండఁ బాఱిపోయెను.

హారమసజీ కొంతధనమునిచ్చి మాంచరజీతల్లిని గలకత్తాకుఁ బంపివైచెను. అంతటినుండి యాముసలిదానిసంగతికూడ మఱియేమియుఁ దెలియుట లేదు.

మరల హారమసజీ సుఖసంసారమునఁ బూర్వసుఖ మగపడుచుండెను! ఇన్నికష్టముల ననుభవించి తప్పించుకొనుటచే నిప్పుడాతనిసుఖము పూర్వముకంటె ద్విగుణీకృతమయ్యెననికూడ భావింపవచ్చును!

ఇంకఁ జెప్పవలసిన దేమున్నది? కమలారస్తమజీలకుఁ గన్నుల పండువుగాఁ గల్యాణమహోత్సవము జరిగెను. ఇప్పుడు హారమసజీ బ్యాంకి "హారమసజీఅండురస్తమజీ" అనుపేరితో వ్యవహరింపఁబడుచున్నది. రస్తమజీ కాబ్యాంకిలో నర్ధభాగము లభించెను!

ఇంక దుఃఖినియగు రత్నాబాయిమాటయా?—ఆమె యెక్కడకుఁ బోవుటకును గమల యంగీకరింపలేదు. రత్నాబాయి కమలబిడ్డలను లాలించుచుఁ బాలించుచుఁ బరమానందానుభవముం గాంచుచుండెను! కమలాబాయిబిడ్డలు రత్నాబాయినే "అమ్మా!" యని పిలుచుచుండిరి.

లాలూభాయియు, దాదాభాస్కరుఁడు నీవ్యవహారమున మిగుల శ్రమపడి సామర్థ్యముతోఁ బనిచేసినందులకు సర్కారువారు వారికిఁ దగిన ప్రమోషనులను జేసిరి.

రాజాబాయిహారమసజీల పూర్వచరిత్రము లెంతమాత్రమును వెల్లడికాకుండ నుండెను. అందుచే వారు జీవించియున్నంతకాలమును గీర్తికరుని యెడలఁ గృతజ్ఞులై యుండిరి.

మాంచరజీసమాచాగ మింక నేమియును దెలియనే లేదు! ఆతఁడు తనతల్లికైన నింక నగపడకుండఁ బాఱిపోయెను.

హారమసజీ కొంతధనమునిచ్చి మాంచరజీతల్లిని గలకత్తాకుఁ బంపివైచెను. అంతటినుండి యీముసలిదానిసంగతికూడ మఱియేమియుఁ దెలియుట లేదు.

మరల హారమసజీసుఖసంసారమునఁ బూర్వసుఖ మగపడుచుండెను! ఇన్నికష్టముల ననుభవించి తప్పించుకొనుటచే నిప్పు డాతనిసుఖము పూర్వముకంటె ద్విగుణీకృతమయ్యెననికూడ భావింపవచ్చును!

ఇఁకఁ జెప్పవలసిన దేమున్నది? కమలారత్నమజీలకుఁ గన్నుల పండువుగాఁ గల్యాణమహోత్సవము జరిగెను. ఇప్పుడు హారమసజీ బ్యాంకి "హారమసజీఅండురత్నమజీ" అనుపేరితో వ్యవహరింపఁబడుచున్నది. రత్నమజీ కా బ్యాంకిలో నర్థభాగము లభించెను!

ఇఁక దుఃఖినియగు రత్నాబాయిమాటయో?—ఆమె యెక్కడకుఁ బోవుటకును గమల యంగీకరింపలేదు. రత్నాబాయి కమలబిడ్డలను లాలించుచుఁ బాలించుచుఁ బరమానందానుభవముం గాంచుచుండెను! కమలాబాయిబిడ్డలు రత్నాబాయినే "అమ్మా!" యని పిలుచుచుండిరి.

హారమసజీ తన సర్వస్వమునందును నర్ధభాగము రత్నాబాయి కిచ్చివైచెను.

రత్నాబాయి యాధనముతో ననాథబాలికలకొఱ కొక యనాథశరణాలయమును బ్రతిష్ఠించెను.

సమాప్తము.

కాకినాడ, స్కేప్ అండ్ కో., ముద్రాక్షరశాలయందు ముద్రితము. 1923.

END OF TITLE